www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

వెల (Price): Rs. 6.50

విజయవాడ సిటీ**

సంపుటి (Volume) : 64
సంచిక (Issue) : 281

గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు

పేజీలు: 14

శుక్రవారం | 26-1-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: పౌర్ణమి రా. 1.21 తదుపరి విదియ; నక్షత్రం: పుష్యమి ఉ. 10.29 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: రా. 12.38-2.24; దుర్ముహూర్తం: ఉ. 9.07-9.32, మ. 12.51-1.35; అమృతఘడియలు: లేవు; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.53; సూర్యాస్తమయం: 6.04



వికసించిన పద్మాలు

వెంకయ్య, చిరంజీవికి పద్మవిభూషణ్

తెలుగు రాష్ట్రాల నుంచి ఎనిమిది మందికి పద్మాలు

ఏపీకి చెందిన హరికథా కళాకారిణి ఉమామహేశ్వరికి పద్మశ్రీ

తెలంగాణ నుంచి కేతావత్ సోమ్‌లాల్, కూరెళ్ల విఠలాచార్య, దాసరి కొండప్ప, గడ్డం సమ్మయ్య, వేలు ఆనందాచారికి కూడా

పద్మ విభూషణ్ 5
పద్మభూషణ్ 17
పద్మశ్రీ 110



వైజయంతి మాల, పద్మా సుబ్రహ్మణ్యం, 'సులభ్' పాఠక్‌కూ పద్మవిభూషణ్

మిథున్ చక్రవర్తి, ఉషా ఉతప్, సీతారామ్ జిందాల్‌కు పద్మభూషణ్.. తమిళ నటుడు విజయ్‌కాంత్‌కు మరణానంతరం ఆ పురస్కారం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాజకీయాల్లో.. సినిమాల్లో.. ఇలా రెండు వేర్వేరు రంగాల్లో ఎలాంటి నేపథ్యమూ లేకుండా అతి సామాన్యులుగా ప్రస్థానాన్ని ప్రారంభించి, స్వయంకృషితో, అద్భుత ప్రతిభతో అత్యున్నత స్థానాలకు ఎదిగిన ఇద్దరు అసామాన్యులైన తెలుగు

మిగతా 2వ పేజీలో...



ఉమామహేశ్వరి



వ్యక్తిగతంగా నాకు అన్యాయం చేసినా ఫర్వాలేదనుకున్నాను

మంచి సీఎం అయి వైఎస్ పేరు నిలబెడితే చాలనుకున్నాను

కానీ రాష్ట్రాన్ని ముంచేశాడు.. బీజేపీకి బానిసైపోయాడు

పెద్ద పెద్ద కోటలు కట్టుకుని బయటకే రావడం లేదు

వైఎస్ ప్రజల మనిషి.. వారిని జగన్ దగ్గరకే రానివ్వడం లేదు

ఇద్దరి పాలనకు.. భూమికి, ఆకాశానికి ఉన్నంత తేడా

వారసులమంటే సరిపోదు.. పనితీరులో కనిపించాలి: షర్మిల

కుటుంబం చీలింది జగనన్న వల్లే

మా అమ్మే సాక్షి.. దేవుడే సాక్షి: షర్మిల

సీఎం అయ్యాక పూర్తిగా మారిపోయాడు.. నియంతలా తయారయ్యాడు

కాకినాడ/ఏలూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): 'వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబం చీలిపోవడం చేతులారా జగన్ చేసుకున్నదే. ఆయన వల్లే చీలిపోయింది.. దీనికి సాక్ష్యం ఆ దేవుడు. దీనికి సాక్ష్యం నా తల్లి విజయమ్మ. నా యావత్ కుటుంబమే' అని పీసీసీ అధ్యక్షురాలు, సీఎం జగన్ చెల్లెలు వైఎస్ షర్మిల స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి అయ్యాక ఆయన పూర్తిగా మారిపోయాడని చెప్పారు. గురువారం కాకినాడ,

మిగతా 11వ పేజీలో...

బెరైటీస్.. బడా స్కామ్

మంగంపేటలో కోటి టన్నుల సీ, డీ గ్రేడ్ బెరైటీస్ రెడీ

మార్కెట్‌లో కనీస ధర టన్నుకు రూ.1650

రిజర్వు ప్రైస్ రూ.1200లే పెట్టిన 'బంగారు కొండ'

మంత్రి పెద్దిరెడ్డి అభ్యంతరం.. ధర పెంచాలని సూచన

అది పట్టించుకోకుండా సీఎంవో ఆమోదంతో ముందుకు

ఎన్నికల్లోపు మొత్తం అమ్ముకునేలా స్కీమ్

జెట్ స్పీడ్‌లో 15 రోజుల్లోనే టెండర్ల ప్రక్రియ పూర్తి

ఇసుక దారిలో ఎంఎస్‌టీసీకే ఇదీ అప్పగింత

కోల్‌కతా కేంద్రంగా గుట్టుగా వేలం ప్రక్రియ

టెండరు డాక్యుమెంట్, వివరాలన్నీ రహస్యమే

కంపెనీలు, వాటాలు అన్నీ ముందే 'ఫిక్స్'

ఇతర సంస్థలు పోటీకి రాకుండా పక్కా ప్లాన్

డాక్యుమెంట్ ఫీజే 29 లక్షల రూపాయలు

భారీ కుంభకోణానికి 'టెండర్ల' ఆహ్వానం

పేదలకు ఇళ్ల స్థలాల పేరుతో స్కామ్!
ప్రభుత్వ మద్యం దుకాణాలతో స్కామ్!
ఇసుక టెండర్లలో కళ్లు తిరిగే స్కామ్!
ఇంకా రకరకాల స్కీముల పేర్లతో స్కాములు...
ఇవన్నీ ఒక ఎత్తు.... ఇప్పుడు జరగబోయేది ఒక్కటే ఒక ఎత్తు! అదే... బెరైటీస్ స్కామ్! ఇది... 'బాప్ ఆఫ్ ఆల్ స్కామ్స్'! అంటే, అన్ని స్కామ్‌లనూ మించిన స్కామ్!

ఆంధ్రజ్యోతి ప్రత్యేకం

మంగంపేట బెరైటీస్‌ను గనుల శాఖ గజదొంగలు దొరికినట్లల్లా అడ్డగోలుగా దోచేస్తున్నారు. సీ గ్రేడ్ పేరిట అక్రమంగా ఏ గ్రేడ్ బెరైటీస్‌ను తరలించి 650 కోట్లు కొల్లగొట్టారు. ఆర్‌ఎఫ్‌ఐడీ, కంప్యూటర్ రికార్డులు ఏమార్చి మరో 420 కోట్ల విలువైన బెరైటీస్‌ను అమ్ముకున్నారు. ఈ మొత్తం దోపిడీ 1000 కోట్లకు పైమాటే. 'బంగారుకొండ'తో పాటు కొందరు అధికారులు ఈ వ్యవహారం నడిపించారు. ఈ దోపిడీపై 'ఆంధ్రజ్యోతి' ఇప్పటికే పలు కథనాలు ప్రచురించింది. ఇప్పుడు మరో భారీ కుంభకోణానికి స్కెచ్ వేశారు. ఎన్నికలు ముగిసే లోపు మొత్తం బెరైటీస్‌ను దోచేందుకు 'టెండర్' పెట్టారు.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

మంగంపేటలో కోటి టన్నుల బెరైటీస్! సరుకు సిద్ధంగా ఉంది! తవ్వుకోవాల్సిన అవసరం కూడా లేదు! పొక్లెయిన్లను రంగంలోకి దించి.. టిప్పర్లలోకి ఎత్తి పోసుకోవడమే! ఇంకేముంది.. మొత్తం బెరైటీస్‌ను 'అస్మదీయు'లకు కట్టబెట్టేందుకు సర్వం సిద్ధమైంది. చకచకా టెండర్ల ప్రక్రియను

మిగతా 12వ పేజీలో...

'మంగంపేట'ను ముంచేశారు

బెరైటీస్ దోపిడీలో మరో 'చీకటి' కోణం

ఆర్‌ఎఫ్‌ఐడీ, కంప్యూటర్ రికార్డులు ఏమార్చి రూ.420 కోట్ల విలువైన ఖనిజం మళ్లింపు

అంతా ఏ గ్రేడ్.. బంగారుకొండ వాటా 80%

మూడో కంటికి తెలియకుండా చీకట్లో దందా

కంప్యూటర్ నుంచి డేటా ఎంట్రీ తొలగింపు

మొత్తం దోపిడీ రూ.1000 కోట్ల పైమాటే

అక్షరాలా అబద్ధాల 'చదువు'!

ముందస్తు స్క్రిప్ట్ ప్రకారమే ప్రశ్నలు

ఇరుకున పెట్టకుండా సాగిన చర్చ

బడులను ఉద్ధరించినట్టు పొగడ్తలు

మరి.. పిల్లలు ఎందుకు వెళ్లిపోయారు?

'నాడు-నేడు' ఎందుకు పూర్తిచేయలేదు?

ఐబీ సిలబస్‌తో ఉపయోగముందా?

ల్యాప్‌ట్యాప్‌లు ఇస్తామన్న మాటేమైంది?

ఒక్క టీచర్‌నైనా నియమించారా?

అయినా సీఎంపై పొగడ్తల వర్షం

విద్యా సదస్సు పేరుతో సొంత సినిమా



(అమరావతి - ఆంధ్రజ్యోతి)

హీరో గారి సొంత సినిమా అంటే ఎలా ఉంటుంది? ఆయన ఏం కోరుకుంటే అదే తెరపై కనిపిస్తుంది. హీరోను బాగా 'ఎలివేట్' చేసేలా సీన్స్ పడతాయి. పొరపాటున కూడా హీరో ఇరకాటంలో పడడు, పడకూడదు! విద్యారంగంపై తిరుపతిలో జరిగిన 'ఇండియా టుడే' సదస్సు కూడా అచ్చం అలాగే సాగింది. ఎందుకంటే ఆ సదస్సును స్పాన్సర్ చేసింది స్వయంగా పాఠశాల విద్యాశాఖే. అక్షరాలా రూ.3.5 కోట్లు పెట్టి మరీ 'నిర్మించిన' సదస్సు అది. అందుకే... సీఎం జగన్‌ను ఇరకాటంలో పెట్టని విధంగా 'స్క్రిప్టు' ప్రకారం ప్రశ్నలు అడిగారు. ఎన్ని అబద్ధాలు, అర్ధసత్యాలు చెప్పినా

మిగతా 11వ పేజీలో...

జ్ఞానవాపి మసీదు కింద

ఆలయ శిథిలాలు!

ఔరంగజేబు హయాంలో మందిరం ధ్వంసం 2

దానిపైనే మసీదు నిర్మాణం

ఆలయ స్తంభాలు, రాళ్లు వాడారు

కొన్నిగోడల్నియథాతథంగా కలిపారు

దేవనగరి, గ్రంథ, తెలుగు, కన్నడ లిపులలో 34 శిలా శాసనాలు

వాటిలో దేవతల పేర్లు

కళాకృతులు, ప్రవేశద్వారాలు, శిల్పరీతి ఆలయమేనని రుజువు చేస్తున్నాయి: స్పష్టం చేసిన ఏఎస్‌ఐ

కక్షిదారులకు నివేదిక ప్రతులు

వైద్య బీమా ఉంటే చాలు.. ఏ ఆస్పత్రిలోనైనా 2

నగదు రహిత చికిత్స!



'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురించిన వజ్రాలు పొదిగిన బంగారు వాచ్ కథనం

'వాచ్'పై వేమిరెడ్డి తూచ్

తనకు సంబంధం లేదని ఖండన

ఒకరోజు తర్వాత ముక్తసరి స్పందన

'తాడేపల్లి' శిబిరం ఆదేశాల మేరకే!?

కథనం నిజం.. ఆయన ఖండనే అబద్ధం

'ఆంధ్రజ్యోతి' కథనం అక్షర సత్యం

సుప్రీంకోర్టుకు జడ్జి ఫిర్యాదూ నిజం

విచారణ జరిగితే గుట్టు రట్టు!

ఇరుక్కుపోయేది వేమిరెడ్డి, ధర్మారెడ్డే

అమరావతి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): 'వజ్రాలు పొదిగిన బంగారు వాచ్'ను కీలక న్యాయమూర్తికి 'కానుక'గా ఇవ్వబోయారంటూ 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనాన్ని వైసీపీ రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఖండించారు. అసత్య కథనాన్ని ప్రచురించి తనప్రతిష్ఠకు భంగం కలిగించారని, ఆ అంశంతో తనకు సంబంధం లేదని చెప్పారు. తనను వైఎస్ జగన్ లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలోనే ఇలాంటి అసత్య, నిరాధార కథనాలు వెలువడుతున్నాయన్నారు. 'అందరు మీడియా మిత్రులకు' అంటూ

మిగతా 11వ పేజీలో...

'ఫేక్' ముఖాలు!

వైసీపీ మూకల దిగజారుడు ప్రచారం

'వాచ్' కథను అబద్ధం చేసేందుకు తిప్పలు

'వే2న్యూస్' పేరుతో ఫేక్ స్టోరీ సృష్టి

అమెరికాలో లోకేశ్ అరెస్టు అంటూ మరో ఫేక్ ప్రచారం 11

దానికి 'ఏబీఎన్' లోగోతో మరిన్ని అల్లికలు

జనాన్ని వెర్రివెంగళప్పలను చేసేందుకే

మీ వాళ్లనే వదల్లేదు..

ఇక మమ్మల్ని వదిలేస్తారా?



చంపుతారేమో.. చంపండి!

అధికార బలంతో అందరినీ మాపైకి ఉసిగొల్పుతున్నారు

బెయిలొచ్చినా దస్తగిరి ఇంటికి రాలేని స్థితి

మీ రాక్షసత్వాన్ని మీ వాళ్లపై చూపండి

మాపై వద్దు: దస్తగిరి భార్య షబానా 12

1,132 మందికి పోలీసు పతకాలు

న్యూఢిల్లీ, జనవరి 25: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పోలీసు, ఫైర్, జైళ్లు, హోంగార్డులు, సివిల్ డిఫెన్స్‌కు చెందిన 1,132 మంది శౌర్య, సేవాపతకాలకు ఎంపికయ్యారు. గతంలో 16 కేటగిరీల్లో ఉన్న శౌర్య పతకాలను నాలుగింటికి కుదించారు. వాటిల్లో రాష్ట్రపతి శౌర్య పతకం(పీఎంజీ), శౌర్య పతకం(జీఎం), రాష్ట్రపతి విశిష్ట సేవాపతకం(పీఎస్ఎం), విశిష్ట సేవాపతకం(ఎంఎస్ఎం) ఉన్నాయి. ఐక్య రాజ్య సమితి శాంతి దళంలో భాగంగా కాంగోలో సేవలందిస్తూ.. కాల్పుల్లో మృతిచెందిన ఇద్దరు బీఎస్ఎఫ్ జవాన్లకు రాష్ట్రపతి శౌర్య పతకాలు, 275 మందికి పోలీసు శౌర్య పతకాలు, 102 మందికి రాష్ట్రపతి విశిష్ట సేవాపతకాలు, 753 మందికి పోలీసు విశిష్ట సేవాపతకాలను కేంద్ర హోంశాఖ ప్రకటించింది. ఇక, ఏపీ పోలీసు విభాగంలో పని చేస్తున్న వెంకట ప్రేమ్‌జిత్(కమాండెంట్), చెన్నయ్య ఆవుల(ఆర్ఎస్ఐ), రమణరెడ్డి.ఆర్(ఏఎస్ఐ), అద్దంకి వెంకటేశ్వర్లు(ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు), బి.ప్రకాశ రావు(ఏఎస్ఐ), మస్తాన్‌రావు(ఏఎస్ఐ), దుర్గా ప్రసాదరావు(అసిస్టెంట్ కమాండెంట్), హరిరావు అక్కిశెట్టి(ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు), కోటిరెడ్డి(డీఎస్పీ, ఏఆర్) పతకాలకు ఎంపికయ్యారు.

అత్యున్నత పతకం సాధించిన అగ్నిమాపక డైరెక్టర్ రమణ



అమరావతి, ఢిల్లీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్రం ప్రకటించే అత్యున్నత పతకాల్లో రాష్ట్ర పోలీసులకు తొమ్మిది పతకాలు దక్కగా.. అవన్నీ అన్నింటికన్నా చివరిదైన ఎంఎస్ఎం పతకాలే కావడం చర్చనీయాంశమైంది. రాష్ట్రపతి మెడల్‌కు, మహోన్నత సేవకు రాష్ట్ర పోలీసుల్లో అర్హులే లేరా? అనే చర్చ వినిపిస్తోంది. పతకాలు సాధించడంలో పెద్ద రాష్ట్రాలతో పోటీపడలేని ఆంధ్రప్రదేశ్.. మేఘాలయ, సిక్కిం లాంటి చిన్న రాష్ట్రాల సరసన నిలిచింది. కాగా, అగ్నిమాపక శాఖలో అత్యుత్తమ సేవలందించిన డైరెక్టర్ పెనికలపాటి వెంకటరమణకు పతకం దక్కింది. సత్యసాయి జిల్లా తాడిమర్రి మండలం మోదుగులకుంట గ్రామానికి చెందిన వెంకటరమణ అగ్నిమాపక శాఖలో ప్రకృతి విపత్తుల నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తాడని పేరు. కర్నూలుకు వరదలొచ్చినా.. హైదరాబాద్‌ను వర్షం ముంచెత్తినా.. గోదావరి, కృష్ణ నదుల్లో బోట్లు తిరగబడినా బాధితుల ప్రాణాలను రక్షించడంలో ఆయన ముందుంటారనే పేరుంది. ఇదే ఆయన ఈ స్థాయి పతకం అందుకోవడానికి దోహద పడిందని ఆ శాఖ సిబ్బంది, అధికారులు చెబుతున్నారు. కాగా, రాష్ట్రానికి చెందిన డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ జాస్తి రమణయ్య, లీడింగ్ ఫైర్ మెన్ షేక్ గనీకి సైతం అత్యుత్తమ సేవా పతకాలు అందాయి.

సుప్రీంకోర్టు జడ్జిగా జస్టిస్ వరాలే ప్రమాణ స్వీకారం

న్యూఢిల్లీ, జనవరి 25: సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ పి.బి.వరాలే గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన చేత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై. చంద్రచూడ్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఇంతవరకు కర్ణాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ వరాలేను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం బుధవారమే నోటిఫికేషన్ జారీ చేసింది. ఆయన పదవీ స్వీకారంతో సుప్రీంకోర్టు పూర్తి సామర్థ్యం మేరకు మొత్తం 34 మంది జడ్జీలతో పని చేస్తున్నట్టయింది. సర్వోన్నత న్యాయస్థానంలో తొలిసారిగా ముగ్గురు దళిత న్యాయమూర్తులు ఉన్నటయింది. ఆయనతో పాటు జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ సి.టి.రవి కుమార్‌లు ఎస్సీ వర్గానికి చెందిన వారు కావడం గమనార్హం. ప్రస్తుతం ఉన్న హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల్లో సీనియర్ మోస్ట్ కావడం, ఎస్సీ వర్గానికి చెందిన ఒకే ఒక్క చీఫ్ జస్టిస్ కావడంతో సుప్రీంకోర్టు జడ్జి పదవికి కొలీజియం ఆయనను ఎంపిక చేసింది. ఆయన మాతృ న్యాయస్థానం బాంబే హైకోర్టు. ఆ హైకోర్టులో పనిచేసిన నలుగురు జడ్జీలు ప్రస్తుతం సుప్రీంకోర్టులో ఉన్నట్టయింది. జస్టిస్ వరాలేతో పాటు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ అభయ్ ఎస్ ఓకా బాంబే హైకోర్టులో పనిచేసిన వారే.

మళ్లీ బీజేపీ గూటికి శెట్టర్

బెంగళూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేరిన మాజీ సీఎం, లింగాయత్ ప్రముఖుడు, జగదీశ్ శెట్టర్ తిరిగి బీజేపీ గూటికి చేరుకున్నారు. ఢిల్లీలో గురువారం కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కలిసిన కాసేపటికే.. ఆయన బీజేపీ కేంద్ర కార్యాలయానికి చేరుకున్నారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం శెట్టర్ మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కొన్ని కారణాలతో బీజేపీని వీడానని, మళ్లీ పార్టీలోకి రావాలని సీనియర్ నేతలు ఆహ్వానించారని తెలిపారు. బేషరతుగా పార్టీలో చేరానని.. నరేంద్ర మోదీని మరోసారి ప్రధానిని చేయాలన్నదే తన ఆశయమన్నారు.

వైద్య బీమా తీసుకుంటే చాలు

ఏ ఆస్పత్రిలోనైనా నగదు రహిత చికిత్స!



న్యూఢిల్లీ, జనవరి 25: మీరు ఆరోగ్య బీమా తీసుకున్నారా? చికిత్స కోసం సదరు బీమా కంపెనీ నెట్‌వర్క్ ఆస్పత్రికే వెళ్లాల్సిన పని లేదు. జాబితాలో లేని ఆస్పత్రికి వెళితే ఇన్సూరెన్స్ వర్తించదేమోనన్న కంగారూ అక్కర్లేదు. అది ఏ కంపెనీ అయినా సరే, మీరు ఆరోగ్య బీమా తీసుకుంటే చాలు.. నెట్‌వర్క్ జాబితాలో పొందుపర్చిన ఆస్పత్రులు సహా ఏ ప్రైవేటు ఆస్పత్రిలోనైనా 'క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్' (నగదు రహిత చికిత్స) సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. ఈ మేరకు దేశవ్యాప్తంగా ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్సకు సంబంధించి మెడికల్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీల సౌజన్యంతో 'ది జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్' కీలక నిర్ణయం వెలువరించింది. ఇక నుంచి అన్ని ఆస్పత్రుల్లోనూ 'క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్' సదుపాయం లభిస్తుందని, ఇది గురువారం (జనవరి 25) నుంచే అమల్లోకి వచ్చిందని ప్రకటించింది. ఇప్పటి దాకా ఏదైనా హెల్త్ పాలసీ తీసుకుంటే.. నెట్‌వర్క్ ఆస్పత్రుల్లోనే 'క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్'కు అనుమతి ఉండేది. నెట్‌వర్క్ యేతర ఆస్పత్రిలోనైతే చికిత్సకు ఎంత ఖర్చయితే అంత రోగి సొంతంగా చెల్లించుకోవాల్సి వచ్చేది. ఆ తర్వాత చికిత్స ఖర్చులను బీమా కంపెనీ నుంచి పొందేందుకు రీయింబర్స్‌మెంట్‌కు దరఖాస్తు చేయాల్సి వచ్చేది. ఈ దరఖాస్తుకు వైద్య చికిత్సకు సంబంధించి పత్రాలు, బిల్లుల రూపంలో పెద్ద ఫైలునే జతచేసి ఇవాల్సి వచ్చేది. ఈ ప్రక్రియంతా కూడా సుదీర్ఘంగానూ.. సంక్లిష్టంగానూ ఉండేది. అయితే ఇక నుంచి ఈ తలనొప్పులు తప్పనున్నాయి. క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్‌పై కీలక నిర్ణయం వెలువడిన అనంతరం బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవో.. జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ ఛైర్మన్ తపన్ సింఘేల్ స్పందించారు. బీమా పాలసీదారులకు చికిత్సను సులభతరం చేసేందుకే అన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు.

బిహార్‌లో రాజకీయ ప్రకంపనలు!

'ఇండియా' కూటమిలో లుకలుకలు.. జేడీయూ నేతలతో నితీశ్ భేటీ

- ఆర్జేడీతో ఎలాంటి సమస్యా లేదు
- జేడీయూ సీనియర్ నేత కేసీ త్యాగి వెల్లడి





పట్నా, జనవరి 25: లోక్‌సభ ఎన్నికల ముంగిట బిహార్ రాజకీయాల్లో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయి. మిత్రపక్షాల మధ్య వాగ్యుద్ధం మొదలవ్వడంతో రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు మొదలయ్యాయి. తాజా పరిణామాలతో ఎన్నికల్లోగా కూటముల్లో మార్పులు తప్పవనే వాదనలు వినిపిస్తున్నాయి. కేంద్రం బిహార్ జననేత కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ప్రకటించినప్పటి నుంచి.. 'మహాగఠ్‌బంధన్'(జేడీయూ,కాంగ్రెస్,ఆర్జేడీ) ప్రభుత్వంలో ముసలం మొదలైందని స్థానిక న్యూస్ చానళ్లు గురువారం కథనాలను ప్రసారం చేశాయి. వాటిని బలపరిచేలా పరిణామాలు మారుతున్నాయి.

మొదలైన వాగ్యుద్ధం

కర్పూరీ ఠాకూర్ శతజయంత్యుత్సవాల సందర్భంగా సీఎం నితీశ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలపై రాజకీయ దుమారం చెలరేగుతోంది. కుటుంబ రాజకీయాలపై ఆయన స్పందిస్తూ.. "కర్పూరీ ఠాకూర్‌లాగే నేను కూడా కుటుంబ రాజకీయాలకు పాల్పడడం లేదు. నా కుటుంబంలో ఎవరినీ రాజకీయాల్లోకి తీసుకురాలేదు" అని చేసిన వ్యాఖ్యలపై లాలూ కుమార్తె రోహిణీ ఆచార్య గురువారం ఎక్స్‌లో తీవ్రంగా స్పందించారు. "జనం తరచూ తమ తప్పులను మరిచిపోయి.. ఇతరుల మీద బురద చల్లుతుంటారు. అర్హత లేని వ్యక్తికి ప్రాధాన్యం ఇచ్చినప్పుడు వచ్చే ఫలితాలు ఎలా ఉంటాయి? వ్యక్తి మనసులోనే కపటత్వం ఉన్నప్పుడు పద్ధతులను ఎవరు ప్రశ్నిస్తారు?" అంటూ నర్మగర్భంగా వ్యాఖ్యానించారు. ఇవి నితీశ్‌ను ఉద్దేశించేనంటూ సోషల్ మీడియాలో చర్చ జరగటంతో, ఆ పోస్టును ఆమె ఎక్స్ నుంచి తొలగించారు. దీనిపై రాష్ట్ర బీజేపీ నేతలు స్పందిస్తూ, నితీశ్‌ను రోహిణి అవమానించారని, దీనిపై ఆమె బహిరంగంగా క్షమాపణ చెప్పారని డిమాండ్ చేశారు. అయితే.. నితీశ్ వ్యాఖ్యలు ఆర్జేడీని ఉద్దేశించినవి కావంటూ జేడీయూ సీనియర్ నేత, అధికార ప్రతినిధి కేసీ త్యాగి చెప్పుకొచ్చారు. "సోషలిస్టు నేతలంతా నాటి ప్రధాని నెహ్రూ, ఆ తర్వాత ఇందిరాగాంధీ కుటుంబ రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడారు. కర్పూరీ ఠాకూర్ కూడా దానిని కొనసాగించారు. దాన్నే నితీశ్ పేర్కొన్నారు. అంతేతప్ప ఆర్జేడీని ఉద్దేశించి వ్యాఖ్యానించలేదు" అని తెలిపారు. బిహార్‌లో జేడీయూ-ఆర్జేడీ మధ్య సీట్ల పంపకాలపై ఎటువంటి సమస్యలు లేవని చెప్పారు. కాగా.. లాలూ గురువారం నితీశ్‌కు ఫోన్ చేసి మాట్లాడారని తెలిసింది.

మళ్లీ ఎన్డీఏ వైపు నితీశ్?

గతంలో బీజేపీతో చెలిమి చేసిన నితీశ్ మరోసారి, ఆర్జేడీని వదిలిపెట్టి బీజేపీని కలుస్తారంటూ బిహార్ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఇండియా కూటమికి ఖర్గేను ఛైర్మన్‌గా ప్రకటించినప్పటి నుంచే.. కాంగ్రెస్‌పై జేడీయూ గుర్రుగా ఉంది. నితీశ్‌కు కూటమి కన్వీనర్ పదవి ఇస్తామన్నా.. ఆయన సున్నితంగా తిరస్కరించారు. ఆ తర్వాత ఆయన కూటమితో అంటీముట్టనట్లు వ్యవహరిస్తూ వచ్చారు. తాజాగా కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ప్రకటించడంతో.. మళ్లీ ఎన్డీయే వైపు చూస్తున్నారని తెలుస్తోంది. అయితే.. బిహార్‌కు చెందిన కేంద్రమంత్రి గిరిరాజ్‌సింగ్ ఈ కథనాలపై తీవ్రంగా స్పందించారు. "లాలూను భయపెట్టాలనుకున్నప్పుడల్లా నితీశ్ బీజేపీ వైపు చూస్తుంటారు. ఇప్పుడు మాత్రం ఆయనకు ఎన్డీఏ తలుపులు తెరిచి లేవు" అని వ్యాఖ్యానించారు.

ఉన్నఫళంగా ఉన్నతస్థాయి భేటీలు

గురువారం సాయంత్రం వరకు పరిస్థితి వాగ్యుద్ధాలు, వివరణలతో వేడిని రగిలించగా.. ఆ తర్వాత ఇరు పార్టీలు వేర్వేరుగా తమ కీలక నాయకులతో భేటీలు ఏర్పాటు చేశాయి. నితీశ్‌కుమార్ అందుబాటులో ఉన్న జేడీయూ కీలక నాయకులతో పట్నా లో భేటీ అయ్యారు. అయితే.. ఎజెండా ఏమిటన్నదాన్ని బయటకు పొక్కనీయలేదు. దీంతో.. తిరిగి ఎన్డీయే గూటికి చేరాలని నితీశ్ నిర్ణయించుకున్నారనే ఊహాగానాలు వెలువడ్డాయి. అదే సమయంలో ఆర్జేడీ చీఫ్ లాలూప్రసాద్ యాదవ్ కూడా కీలక నేతలతో భేటీ అవ్వడం గమనార్హం.! నితీశ్ తమకు మొండి చేయి చూపితే, సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటానికి 8 మంది ఎమ్మెల్యేలు అవసరమని ఆర్జేడీ లెక్కలు వేసుకుంటున్నట్లు కొన్ని ఇంగ్లిష్ న్యూస్ చానళ్లు పేర్కొన్నాయి. మరోవైపు బీజేపీ అధిష్ఠానం కూడా బిహార్ నేతలను ఉన్నఫళంగా ఢిల్లీకి రావాలని ఆదేశాలు జారీ చేసింది.

లోకం తీరు



అయోధ్య రామమందిరం భారతీయుల విశ్వాసానికి ప్రతీక

- కర్పూరి ఠాకూర్ జీవితం స్ఫూర్తిదాయకం
- గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం



న్యూఢిల్లీ, జనవరి 25: అయోధ్య రామమందిరం ప్రజల విశ్వాసానికి, న్యాయవ్యవస్థపై భారతీయులకు ఉన్న అపారమైన నమ్మకానికి ప్రతీకగా నిలిచే గొప్ప నిర్మాణమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. అంతేకాక, అయోధ్య రామమందిరం భారత నాగరిక వారసత్వానికి ఓ చిహ్నంగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఈ మేరకు దేశ పౌరులకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసిన రాష్ట్రపతి గురువారం జాతిని ఉద్దేశించి ప్రసంగించారు. రాజ్యాంగం రూపకల్పనలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కృషి, పాత్రను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. నారీ శక్తి వందన్ అదినియమ్ (చట్ట సభలో మహిళా రిజర్వేషన్‌కు సంబంధించిన బిల్లు) మహిళా సాధికారతకు విప్లవాత్మకమైన ఓ సాధనమని అభిప్రాయపడ్డారు. బిహార్ మాజీ సీఎం దివంగత కర్పూరి ఠాకూర్‌ను భారతరత్నతో గౌరవించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వెనకబడిన తరగతుల సంక్షేమానికి విశేష కృషి చేసిన కర్పూరి ఠాకూర్ జీవితం స్ఫూర్తిదాయకం అన్నారు. జీ20 సదస్సుకు అత్యద్భుతంగా ఆతిథ్యం ఇవ్వడంతో అంతర్జాతీయ వేదికపై భారతదేశ కీర్తి మరింత పెరిగిందని తెలిపారు. అంతరిక్ష పరిశోధన, ఐటీ రంగంలో భారత్ దూసుకెళుతోందని అన్నారు. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా నిలవాలంటే దేశ ప్రజలంతా తమ బాధ్యతలను వంద శాతం నిర్వర్తించాలని ఆమె పిలుపునిచ్చారు.

నరసరావుపేట లోక్‌సభ బరిలో అనిల్ యాదవ్!

- నెల్లూరు సిటీలో గెలిచే చాన్సు లేదనే!!

అమరావతి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ నరసరావుపేట లోక్‌సభ స్థానంలో వైసీపీ తరఫున బరిలోకి దిగే అవకాశాలు ఉన్నాయని ఆ పార్టీలో ప్రచారం జరుగుతోంది. సీఎం జగన్ గురువారం ఆయన్ను తాడేపల్లి ప్యాలెస్‌కు పిలిపించారు. నెల్లూరు సిటీ అసెంబ్లీ స్థానంలో అనిల్‌కుమార్ గెలిచే పరిస్థితి లేదని.. అందుచేత నరసరావుపేట ఎంపీగా పోటీచేయాలని ప్రతిపాదన తెచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. ఎంపీగా పోటీపై ఆయన ఇంకా స్పష్టత ఇవ్వలేదని తెలిసింది. ఇక్కడ నుంచి నాగార్జున యాదవ్ పోటీ చేయించాలనుకున్నా ఆ పరిధిలోని ఎమ్మెల్యేలంతా ఆయన అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకించి.. లావుకు మద్దతిచ్చారు. అయితే, నాగార్జున యాదవ్ స్థానంలో... మంగళగిరి పరిధిలోని వెంకటరెడ్డి పాలెం గ్రామానికి చెందిన రియల్టర్ మధు యాదవ్ పేరును పరిశీలించారు. ఆయనకు సీఎంవో నుంచి పిలుపు కూడా అందింది. రూ.20 కోట్లు ఖర్చుపెట్టుకుంటే చాలని చెప్పారని అంటున్నారు. రూ.180 కోట్ల దాకా డిపాజిట్ చేయాలని కొందరు సిటింగ్ ఎంపీలను ఒత్తిడిచేస్తున్న వైసీపీ పెద్దలు.. నరసరావుపేట విషయంలో రూ.20 కోట్లకే తలొగ్గడం చర్చనీయాంశమైంది. అయితే.. ఈ ప్రయత్నం కూడా ఫలించలేదని.. పోటీకి మధు యాదవ్ ఆసక్తి చూపలేదని తెలిసింది. వాస్తవానికి నిన్నమొన్నటిదాకా 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాలకు బలమైన అభ్యర్థులు సిద్ధంగా ఉన్నారన్న వైసీపీ పెద్దలు.. ఇప్పుడు కొత్త ముఖాలను వెతుకుతుండడం గమనార్హం.

చిన్న గ్రామం నుంచి అత్యున్నత స్థాయికి..

- చేపట్టిన ప్రతి పదవికీ వన్నె తెచ్చిన వెంకయ్య



నెల్లూరు, జనవరి 25: పార్టీలో గానీ, ప్రభుత్వంలో గానీ.. ఉపరాష్ట్రపతిగా గానీ చేపట్టిన ప్రతి పదవినీ సమర్థంగా నిర్వహించిన ముప్పవరపు వెంకయ్యనాయుడు.. నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం వద్ద చవటపాళెం అనే చిన్నగ్రామంలో 1949 జూలై 1న జన్మించారు. స్వాతంత్ర్యానంతరం జన్మించి.. ఉపరాష్ట్రపతి పదవి చేపట్టిన మొదటి నేతగా చరిత్రకెక్కారు. వాగ్ధాటి, రాజకీయ క్రియాశీలత ఆయనకు ఎన్నో పదవులను తెచ్చిపెట్టాయి. ప్రతి పదవికీ ఆయన తనదైన శైలిలో వన్నె తెచ్చారు. తన పట్టుదల, కృషి, దృఢసంకల్పంతో అంచెలంచెలుగా ఎదిగారు. బుచ్చిరెడ్డిపాళెంలో స్కూలు విద్యాభ్యాసం, నెల్లూరు వీఆర్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల నుంచి లా పట్టభద్రుడయ్యారు. ఆర్ఎస్ఎస్‌లో చేరిన ఆయన.. కాలేజీ రోజుల్లో ఏబీవీపీలో పనిచేశారు. స్వర్ణభారత్ ట్రస్టు ద్వారా ఆయన ఏనాటి నుంచో సామాజిక సేవలో ఉన్నారు. రాష్ట్ర, జాతీయ స్థాయుల్లో పలు పార్టీ పదవులు చేపట్టారు. ఏకవాక్య పంచ్‌లతో పార్టీ అగ్ర నాయకత్వం, వివిధ పార్టీల నేతల్లో మంచి పేరు సంపాదించారు. హిందీలో అనర్గళంగా ప్రసంగిస్తారు. మరే దక్షిణాది బీజేపీ నేతా ఆ భాషపై అంత పట్టు ప్రదర్శించలేదు. రాష్ట్ర విభజన సమయంలో ఏపీకి ప్రత్యేక హోదా కోసం యూపీఏ సర్కారుపై ఒత్తిడి తెచ్చి సాధించారు. 2014లో నరేంద్ర మోదీని జాతీయ యవనికపైకి తెచ్చి.. పార్టీ ప్రచార కమిటీ సారథిగా నియమించడంలో కీలక పాత్ర పోషించారు. 2017లో వెంకయ్యను ఉపరాష్ట్రపతి (రాజ్యసభ చైర్మన్)గా పంపాలని ప్రధాని మోదీ నిర్ణయించారు. వెంకయ్య పార్టీకి బాధాతప్త హృదయంతో రాజీనామా చేశారు. తర్వాత ఉపరాష్ట్రపతిగా రాజ్యసభను ఐదేళ్లు సజావుగా నిర్వహించారు. 2022లో పదవీవిరమణ చేసి.. రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు.

వినమ్రంగా స్వీకరిస్తున్నా: వెంకయ్య

పద్మవిభూషణ్ పురస్కారం తనను వరించడంపై వెంకయ్యనాయుడు హర్షం వ్యక్తంచేశారు. 'అమృత కాలం దిశగా భారతదేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్న ప్రస్తుత తరుణంలో భారత్ ప్రభుత్వం ప్రకటించిన ఈ పురస్కారాన్ని వినమ్రంగా స్వీకరిస్తున్నా ను. దేశంలోని రైతులు, యువత, మహిళలు సహా నవ భారత నిర్మాణంలో భాగస్వాములు అవుతున్న ప్రతి ఒక్కరికీ నా పురస్కారాన్ని సగర్వంగా అంకితం చేస్తున్నా' అని 'ఎక్స్' వేదికగా స్పందించారు.

భాగవతారిణి ఉమామహేశ్వరికి పద్మశ్రీ

కపిలేశ్వరపురం, జనవరి 25: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం శ్రీసర్వారాయ హరికథా పాఠశాలకు చెందిన డీ ఉమామహేశ్వరిని 'పద్మశ్రీ' అవార్డుకు ఎంపిక చేశారు. కేంద్ర ప్రభుత్వం గురువారం రాత్రి ప్రకటించిన పద్మ అవార్డుల్లో ఆమెను ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రకటించారు. ఉమామహేశ్వరి 14వ ఏట నుంచే హరికథ కోసం తన జీవితాన్ని అంకితం చేశారు. సంస్కృతంలో హరికథ చెప్పగలిగే ఏకైక మహిళా భాగవతారిణి ఆమె. తెలుగులో ఆమె చెప్పే హరికథలకు విశేషాభిమానులు ఉన్నారు. గత ఏడాది ఆమె ప్రతిష్ఠాత్మక సంగీత నాటక అకాడమీ పురస్కారాన్ని న్యూఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అందుకున్నారు. బందరుకు చెందిన ఉమామహేశ్వరి తండ్రి లాలాజీరావు నాదస్వర విద్వాంసుడు. వేములవాడ దేవస్థానంలో 30 ఏళ్ల పాటు నాదస్వర వాదన చేశారాయన. ఆయనతో అవకాశం దొరికినప్పుడల్లా బందరు వెళ్లి అక్కడ హరికథలను విని మక్కువ పెంచుకున్నారు. 14 ఏళ్ల వయసులో కపిలేశ్వరపురం జమీందారు ఎస్‌బీపీబీకే సత్యనారాయణరావు స్థాపించిన హరికథా పాఠశాలలో చేరి ఆదిభట్ల నారాయణదాసు సంప్రదాయంలోనే హరికథ నేర్చుకున్నారు. విజయనగరం సంస్కృత పాఠశాలలో ఆమె తొలి ప్రదర్శన ఇచ్చారు. ఉజ్జయినిలో సంస్కృత పండితుల ఎదుట అభిజ్ఞాన శాకుంతలం చెప్పడంతో ఆ భాషలో చెప్పే తొలి మహిళ అయ్యారు. కుమారసంభవం, రఘువంశం, ఆదిశంకరాచార్య, గీతగోవిందం, భక్తజయదేవ వంటి హరికథలను ఆమె సంస్కృతంలోనే చెప్పారు. ఆమె భర్త కళాకృష్ణ ప్రసిద్ధ నాట్యకారుడు.

కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్లపై పిడుగు!

- క్రమబద్ధీకరణకు బ్రేకులు.. 1600మంది ఆశలపై నీళ్లు

గుంటూరు సిటీ, జనవరి 25: రెండు దశాబ్దాల తర్వాత.. రేపో మాపో సర్వీసు క్రమబద్ధీకరణ అవుతుందన్న ఆనందంలో ఉన్న వైద్య, ఆరోగ్య శాఖలోని కాంట్రాక్టు ఉద్యోగులకు పిడుగులాంటి వార్త తెలిసింది. క్రమబద్ధీకరణకు అవసరమైన ప్రక్రియ నుంచి వారిని తొలగించినట్లు గురువారం అధికారికంగా ప్రకటించారు. రాష్ట్ర స్థాయి అధికారుల ప్రత్యేక ఆదేశాలతో క్రమబద్ధీకరణకు బ్రేకులు పడినట్లు వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయ ఉద్యోగులు చెబుతున్నారు. జీవో 1207 ద్వారా నియమితులైన వారిని ప్రస్తుతం క్రమబద్ధీకరణ నుంచి మినహాయించినట్లు తెలిసింది. ప్రభుత్వం గత ఏడాది అక్టోబరులో తీసుకువచ్చిన ప్రత్యేక చట్టం ప్రకారం అన్ని అర్హతలూ ఉన్నప్పటికీ తమను క్రమబద్ధీకరణకు దూరంగా ఉంచటంపై కాంట్రాక్టు హెల్త్ అసిస్టెంట్‌లు(మేల్) నిరసన వ్యక్తం చేస్తున్నారు.

ఊపందుకున్న సెర్ప్ సిబ్బంది సమ్మె

అమరావతి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): జగన్ అధికారంలోకి వచ్చేందుకు అడ్డగోలుగా ఇచ్చిన హామీలు ఇప్పుడు ఆయన మెడకే చుట్టుకుంటున్నాయి. ఎన్నికల ముందు వైసీపీ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలంటూ అంగన్వాడీలు, మునిసిపల్ సిబ్బంది సమ్మెలు చేశారు. ఇప్పుడు దీర్ఘకాలికంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఈ నెల 8న ఏపీ రాష్ట్ర సెర్ప్ ఉద్యోగుల జేఏసీ సెర్ప్ సీఈఓకు సమ్మె నోటీసు ఇచ్చింది. ప్రభుత్వం స్పందించకపోవడంతో మంగళవారం నుంచి సమ్మె బాట పట్టారు. గురువారం నుంచి అన్ని జిల్లాల్లో సమ్మె ఊపందుకుంది. కాగా, సెర్ప్ కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ కోసం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం ఒక్కసారి కూడా సమావేశం కాలేదని, సెర్ప్‌ను ప్రభుత్వ సంస్థగా గుర్తించి ఉద్యోగులకు కేడర్ ఫిక్స్ చేస్తూ పేస్కేల్ అమలు చేసి క్రమబద్ధీకరణ చేయాలని నోటీసులో పేర్కొన్నారు. క్రమబద్ధీకరణకు ఆర్థికశాఖ ద్వారా సెర్ప్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ పరిధిలో శాంక్షన్ పోస్టులుగా ఇచ్చిన మెమోను జీఓగా తీసుకురావాలన్నారు. ఇక, డీఆర్‌డీఏ, వైఎస్సార్ క్రాంతి పథకం ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో విజయవాడలోని ధర్నాచౌక్‌లో గురువారం ధర్నా చేపట్టారు. సెర్ప్ సంస్థను ప్రభుత్వ సంస్థగా గుర్తించాలని, సిబ్బందిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.

జ్ఞానవాపి మసీదు కింద ఆలయ శిథిలాలు!

వారణాసి, జనవరి 25: జ్ఞానవాపిలో గతంలో ఉన్న భారీ హిందూ ఆలయాన్ని కూల్చి, ఆ శిథిలాలపై మసీదును నిర్మించారని భారత పురావస్తు విభాగం (ఏఎస్ఐ) సర్వే తేల్చినట్లు వెల్లడైంది. మసీదు నిర్మాణంలో ఆలయం స్తంభాలను, రాళ్లను ఉపయోగించారని, ఆలయం గోడలతోపాటు కొన్ని ఇతర నిర్మాణాలను యథాతథంగా మసీదులో కలిపేశారని ఈ సర్వే తెలిపింది. ఏఎస్ఐ సర్వే నివేదికను గురువారం జిల్లా కోర్టు ఆదేశాల మేరకు.. జ్ఞానవాపి కేసులోని ఇరుపక్షాలకు చెందిన 11 మంది కక్షిదారులకు అందజేశారు. హిందూ కక్షిదారుల తరఫు న్యాయవాది విష్ణుశంకర్‌జైన్ విలేకరుల సమావేశంలో ఏఎస్ఐ సర్వే నివేదికలో ఉన్న వివరాలను వెల్లడించారు. ఈ నివేదిక 839 పేజీలు ఉన్నదని తెలిపారు. గతంలో ఉన్న ఆలయాన్ని ధ్వంసం చేసి దాని శిథిలాలపైనే మసీదును నిర్మించారని, ఈ మేరకు పలు ఆధారాలు ఉన్నాయని ఈ నివేదిక స్పష్టం చేస్తోందని చెప్పారు. మసీదు నిర్మాణంలో ఆలయం స్తంభాలను ఉపయోగించారని, ఆలయ నిర్మాణంలోని కొన్ని భాగాలను యథాతథంగా అలాగే ఉంచారని తెలిపారు. 'సర్వే సందర్భంగా ఇప్పుడున్న మసీదు గోడలపై, అంతకు ముందటి ఆలయ నిర్మాణం తాలూకు గోడలపై 34 శాసనాలు ఉన్నట్లు ఏఎస్ఐ గుర్తించింది. వీటిలో 32 శాసనాలను నకలు చేసింది. ఇవి దేవనగరి, గ్రంథ, తెలుగు, కన్నడ లిపులలో ఉన్నాయి. వాస్తవానికి ఇవి హిందూ ఆలయంలో ఏర్పాటు చేసిన శిలాశాసనాలు. వాటిని మసీదు నిర్మాణంలో ఉపయోగించారు. ఈ శాసనాల మీద జనార్దన, రుద్ర, ఉమేశ్వర అనే దేవుళ్ల పేర్లు ఉన్నాయి' అని ఏఎస్ఐ నివేదిక వెల్లడించిందని విష్ణుశంకర్ జైన్ తెలిపారు. ఆలయం గోడల మీద చిత్రించిన కమలం గుర్తులను తొలగించి ఆ గోడలను మసీదు నిర్మాణంలో ఉపయోగించిన ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు.

నేపథ్యం ఇదీ..

వారణాసిలో విశ్వనాథుడి ఆలయం పక్కన ఉన్న మసీదు కింద ఆలయం ఉందని హిందూ కక్షిదారులు జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో.. కోర్టు ఆ ప్రాంతంలో ఏఎస్ఐ సర్వేకు గత ఏడాది జూలై 21న ఆదేశించింది. సర్వే జరిపిన ఏఎస్ఐ తన నివేదికను కోర్టుకు డిసెంబరు 18న సమర్పించింది. ఈ సర్వే నివేదిక ప్రతిని అందజేయాలని హిందూ, ముస్లిం కక్షిదారులు కోర్టుకు విజ్ఞప్తి చేశారు. కోర్టు అందుకు అంగీకరించటంతో కక్షిదారులకు నివేదిక ప్రతులను అందించారు.

వికసించిన పద్మాలు

(మొదటి పేజీ తరువాయి)

తేజాలను పద్మవిభూషణ్ పురస్కారం వరించింది! వారిలో ఒకరు మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు కాగా.. మరొకరు తెలుగు చిత్రపరిశ్రమలో మెగాస్టార్‌గా వెలుగొందుతున్న చిరంజీవి. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని.. 2024కుగాను పద్మ పురస్కారాలను కేంద్ర ప్రభుత్వం గురువారం రాత్రి పొద్దుపోయాక ప్రకటించింది. ఆ జాబితాలో పద్మభూషణ్ కేటగిరీలో తెలుగువారు ఎవరూ లేరు. ఇక, పద్మశ్రీ పురస్కారాలు.. తెలంగాణకు చెందిన ఐదుగురికి, ఏపీకి చెందిన ఒకరికి దక్కాయి. తెలంగాణ నుంచి పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైనవారిలో.. జనగాం ప్రాంతానికి చెందిన చిందు యక్షగానం కళాకారుడు గడ్డం సమ్మయ్య, నారాయణపేట్ జిల్లా దామెరగిద్ద గ్రామానికి చెందిన ప్రముఖ బుర్రవీణ కళాకారుడు దాసరి కొండప్ప, తనకు మిగిలిన ఏకైక ఆస్తి అయిన ఇంటిని గ్రంథాలయంగా మార్చి 2 లక్షల పుస్తకాలను సమకూర్చిన డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, బంజారా జాతి జాగృతం కోసం పాటుపడుతున్న కేతావత్ సోమ్‌లాల్, యాదాద్రి సహా పలు ఆలయాల నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన ప్రముఖ స్థపతి వేలు ఆనందాచారి ఉన్నారు. అలాగే.. ఏపీకి చెందిన ప్రముఖ హరికథా కళాకారిణి, డి.ఉమామహేశ్వరికి పద్మశ్రీ పురస్కారం ప్రకటించింది.

132 మందికి..

వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన 132 మంది ప్రముఖులకు కేంద్రం పద్మ పురస్కారాలను ప్రకటించింది. వారిలో ఐదుగురిని పద్మవిభూషణ్.. 17 మందిని పద్మభూషణ్, 110 మందిని పద్మశ్రీ పురస్కారాలు వరించాయి. బిహార్‌కు చెందిన శాంతిదేవి పాసవాన్, శివన్ పాసవాన్ ద్వయానికి కళల విభాగంలో ఒకటి.. కేరళకు చెందిన అశ్వతి తిరునల్ గౌరి, లక్ష్మీ బాయి తంపురట్టి ద్వయానికి సాహిత్యం, విద్య కేటగిరీలో ఒకటి చొప్పున పద్మశ్రీ పురస్కారాన్ని కేంద్రం ప్రకటించింది. మొత్తమ్మీద ఈ జాబితాలో మొత్తం 30 మంది మహిళలు ఉన్నారు.

పద్మభూషణ్ గ్రహీతలు..

పద్మవిభూషణ్ పురస్కారాలు లభించిన వారిలో వెంకయ్య నాయుడు, చిరంజీవితోపాటు.. తమిళనాడుకు చెందిన సినీ నటి వైజయంతీ మాల బాలి, ప్రముఖ నర్తకి పద్మా సుబ్రహ్మణ్యం, సులభ్ శౌచాలయ వ్యవస్థాపకుడు బిందేశ్వర్ పాఠక్ (మరణానంతర పురస్కారం) ఉన్నారు. ఇక, పద్మభూషణ్ లభించిన వారిలో.. మిథున్ చక్రవర్తి, గాయని ఉషా ఉతప్, తమిళ నటుడు విజయ్‌కాంత్ (మరణానంతరం), కేంద్ర మాజీ మంత్రి సత్యవ్రత ముఖర్జీ (మరణానంతరం), ప్రముఖ సంగీత దర్శకుడు ప్యారేలాల్, ప్రముఖ వ్యాపారవేత్త సీతారామ్ జిందాల్, మహారాష్ట్రకు చెందిన సీనియర్ జర్నలిస్టు హోమస్‌జీ ఎన్ కామా, తైవాన్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, ఫాక్స్‌కాన్ గ్రూప్ ఛైర్మన్ యంగ్ లియూ, సుప్రీంకోర్టులో మొట్టమొదటి మహిళా జడ్జిగా నియమితురాలైన ఎం.ఫాతిమా బీవి (మరణానంతరం), ప్రముఖ గుండె వైద్య నిపుణులు అశ్విన్ బాలచంద్ మెహతా, తేజస్ మధుసూదన్ పటేల్, యూపీ మాజీ గవర్నర్, కేంద్ర మాజీ మంత్రి రామ్ నాయక్, తేజస్ మధుసూదన్ పటేల్, కేంద్ర మాజీ మంత్రి ఓలంచేరి రాజగోపాల్, దత్తాత్రేయ అంబాదాస్ మయాలు, తోగ్దాన్ రిన్‌పోచే (మరణానంతరం), కేంద్ర మాజీ మంత్రి చంద్రేశ్వర్ ప్రసాద్ ఠాకూర్, కుందన్ వ్యాస్ ఉన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి పద్మశ్రీ పురస్కారాలు పొందినవారిలో ముగ్గురు (డి.ఉమామహేశ్వరి, గడ్డం సమ్మయ్య, దాసరి కొండప్ప).. 'అన్‌సంగ్ హీరోస్' పేరిట విడుదల చేసిన 34 మంది జాబితాలో ఉన్నారు. అలాగే, పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన తెలుగేతర ప్రముఖుల్లో.. రోహన్ బోపన్న, జోత్స్న చిన్నప్ప వంటివారు ఉన్నారు.

స్పీకర్ దురుద్దేశంతోనే రాజీనామా ఆమోదించారు

- హైకోర్టును ఆశ్రయించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

అమరావతి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ఎన్నికల్లో పాల్గొనకుండా చేయాలనే దురుద్దేశంతో 2021 ఫిబ్రవరిలో ఎమ్మెల్యే పదవికి చేసిన రాజీనామాను స్పీకర్ ఈ ఏడాది జనవరి 23న ఆమోదించారని పేర్కొంటూ టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాజీనామాను ఆమోదిస్తూ స్పీకర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్‌తో పాటు, తదనంతరం న్యాయశాఖ ముఖ్యకార్యదర్శి ఈనెల 23న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను చట్టవిరుద్ధమైనవిగా ప్రకటిస్తూ రద్దు చేయాలని ఆయన అభ్యర్థించారు. వాటిని సస్పెండ్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనడంతో పాటు రాజ్యసభ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకొనేలా చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌ను ఆదేశించాలని కోరారు. న్యాయశాఖ ముఖ్యకార్యదర్శి, ఏపీ అసెంబ్లీ స్పీకర్, కేంద్ర ఎన్నికల కమిషనర్, ఏపీ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్‌ను వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు.

35 మంది విశాఖ ఉక్కు ఉద్యోగులపై వేటు

విశాఖపట్నం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ఒత్తిళ్లకు లొంగిపోయి విశాఖ ఉక్కు యాజమాన్యం సిబ్బందిని తగ్గించే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. తాజాగా వివిధ విభాగాల్లో 35 మందిని అనారోగ్యం కారణాలతో తొలగిస్తున్నట్టు నోటీసులు జారీచేసింది. ఇక విధులకు రావలసిన అవసరం లేదని వారికి స్పష్టంచేసింది. ఈ విషయాన్ని చాలా రహస్యంగా ఉంచింది. శుక్రవారం రిపబ్లిక్ డే సెలవు కావడంతో దీనిపై ఎవరూ ప్రశ్నించే సాహసం చేయరని, శనివారం నాటికి వ్యతిరేకత కొంత తగ్గుతుందని ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని దాచి పెట్టింది. విశాఖ ఉక్కులో క్యాన్సర్ బారిన పడినవారు, డయాలసిస్ చేయించుకుంటున్నవారు, పక్షవాతం వచ్చి విధులకు రాలేనివారు సుమారు 100 మంది వరకు ఉన్నారు. వీరు ఏదో ఒక సమయంలో వచ్చి అటెండెన్స్ వేయించుకుంటే సరిపోయేది. జీతం ఇచ్చేవారు. అయితే కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ... ఇటీవల పనితీరు బాగాలేనివారిని తీసేయాలని ఆదేశించింది. దాంతో వారిని పిలిచి మాట్లాడారు. 'భవిష్యత్తులో 8 గంటలూ పనిచేయాల్సి ఉంటుందని, మీరు చేయగలరా? లేదంటే మెడికల్ బెనిఫిట్స్ ఇస్తాము, వెళ్లిపోండి' అంటూ క్లాస్ తీసుకున్నారు. ఇక తప్పదని తెలిసి వారంతా సంతకాలు చేసేశారు. వాటిని మెడికల్ బోర్డుకు రిఫర్ చేసి... తొలి విడతలో 35 మందిని తొలగిస్తున్నట్టు తెలిపారు.

ఏ కష్టమొచ్చినా అండగా టీడీపీ

- చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో మృతి చెందినవారి కుటుంబాలకు భువనేశ్వరి పరామర్శ
- కోనసీమ జిల్లాలో ఏడు కుటుంబాలకు 3 లక్షల చొప్పున సాయం



కోనసీమ జిల్లా ఉప్పలగుప్త మండలం చల్లపల్లిలో విశ్వనాథం భార్య ఆదిలక్ష్మిని ఓదారుస్తున్న నారా భువనేశ్వరి

అమలాపురం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): 'తెలుగుదేశం పార్టీ పేదల పక్షపాతి.. ప్రజలకు ఏ చిన్న కష్టం వచ్చినా ఆదుకోవడంలో ముందుంటుంది. ముఖ్యంగా విద్య, వైద్యంలతో పాటు ఇతర కష్టకాలాల్లో ఆర్థిక చేయూత అందిస్తుంది' అని ఎన్టీఆర్ ట్రస్టు చైర్‌పర్సన్, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీమణి భువనేశ్వరి పేర్కొన్నారు. 'నిజం గెలవాలి' యాత్రలో భాగంగా గురువారం ఆమె డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సుడిగాలి పర్యటన జరిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి జైలులో పెట్టిన సమయంలో మనస్తాపానికి గురై మృతిచెందిన ఏడుగురు టీడీపీ కార్యకర్తల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షలు వంతున ఆర్థిక సహాయాన్ని భువనేశ్వరి అందించారు. బాధిత కుటుంబ సభ్యులతో మమేకమై వారిని ఓదార్చారు. తొలుత అమలాపురంలోని సత్యనారాయణ గార్డెన్స్ నుంచి బయల్దేరిన భువనేశ్వరి అయినవిల్లి మండలం ఎస్.మూలపొలంలో మోరంపూడి మీరాసాహెబ్, ఉప్పలగుప్తం మండలం చల్లపల్లిలో చెందిన సలాది విశ్వనాథం, అల్లవరం మండలం రెల్లుగడ్డలో నడింపల్లి పల్లంరాజు, మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురంలో చెల్లుబోయిన నరసింహారావు, రాజోలు మండలం సోంపల్లిలో సరెళ్ల పెద్దిరాజు, కపిలేశ్వరపురం మండలం నల్లూరులో జొన్నకూటి రాజు, మండపేట మండలంలో పాలతోడులో మందపల్లి ధర్మరాజు కుటుంబీకులను పరామర్శించి ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. పర్యటనలో టీడీపీ అమలాపురం లోక్‌సభ ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్, జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు అయితాబత్తుల ఆనందరావు, నామన రాంబాబు, గొల్లపల్లి సూర్యారావు, వేగుళ్ల జోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అధిక సంఖ్యలో కార్యకర్తలు తరలిరావడంతో భారీ కాన్వాయ్‌తో భువనేశ్వరి పర్యటన సాగింది.

ఢిల్లీ గణతంత్ర వేడుకలకు ఏపీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

అమరావతి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి):దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం జరిగే 75వ గణతంత్ర దినోత్సవ కవాతులో ఏపీలోని వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన 10 మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొంటున్నట్టు జాతీయ సేవా పథకం రాష్ట్ర అధికారి అశోక్‌రెడ్డి తెలిపారు.

'సింహాద్రి' నాలుగో యూనిట్‌లో ఉత్పత్తికి అంతరాయం

పరవాడ, జనవరి 25: అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో గల సింహాద్రి నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ)లోని నాలుగో యూనిట్‌లో గురువారం మధ్యాహ్నం విద్యుదుత్పత్తికి అంతరాయం ఏర్పడింది. యూనిట్‌కు సంబంధించిన బాయిలర్ ట్యూబ్‌లకు రంధ్రాలు ఏర్పడడంతో ఉత్పత్తి అర్ధాంతరంగా నిలిచిపోయింది. అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు ప్రారంభించారు.

అనుమానాస్పదంగా ఇద్దరు చిన్నారుల మృతి

- పానీపూరీ తినడం వల్లేనని తల్లిదండ్రుల ఆరోపణ



రామకృష్ణ, విజయ్

జంగారెడ్డిగూడెం, జనవరి 25: ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో ఇద్దరు చిన్నారులు అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా...పానీపూరి తిన్న తమ పిల్లలు అనారోగ్యం పాలై మృతిచెందారని తల్లి దండ్రులు ఆరోపిస్తున్నారు. నంద్యాల జిల్లాకు చెందిన బెయల్‌పాటి రవి తన భార్య చిన్న జమక్క, కుమారులు రామకృష్ణ (11), విజయ్(6)లతో కలిసి పొట్ట కూటి కోసం రెండు నెలల క్రితం జంగారెడ్డిగూడెం వచ్చాడు. వీరు పట్టణాల్లో గుడారాలు ఏర్పాటు చేసుకుని అక్కడ నుంచి చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లి నీలిమందు, ప్లాస్టిక్ సామగ్రి అమ్ముకుంటూ జీవిస్తుంటారు. బుధవారం రాత్రి ఏడు గంటల సమయంలో పిల్లలిద్దరితో కలసి పట్టణంలో ఒక పానీ పూరీ దుకాణం వద్ద పానీ పూరి తిని ఇంటికి వెళ్లి భోజనం చేసి నిద్రపోయారు. గురువారం తెల్లవారుజామున మూడు గంటలకు చిన్న కుమారుడు విజయ్‌కు కడుపు నొప్పి రావడంతో తొలుత స్థానిక ఓ ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడ నుంచి రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పటికే విజయ్ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఉదయం 6:30 గంటల సమయంలో పెద్ద కుమారుడు రామకృష్ణకూ తీవ్రమైన కడుపునొప్పి రావడంతో తొలుత స్థానిక ఓ ఆస్పత్రికి, అక్కడ నుంచి ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పిల్లలిద్దరూ మృతి చెందడంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగింది. జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. ఘటనా స్థలాన్ని డీఎస్పీ ధనుంజయుడు, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తల్లిదండ్రులు చెబుతున్నట్టు పానీ పూరి తినడం వల్ల మృతి చెందారా ? లేదా నేలపై పడుకున్న సమయంలో ఏదైనా విష పురుగు కాటుకు గురయ్యారా..? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. రాత్రి ఇంట్లో తిన్న ఆహారాన్ని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు.

28వ వర్ధంతి
26 జనవరి 2024



డాక్టర్ బి.వి. రావు
~ 1935 - 1996 ~

"ప్రతిఫలాపేక్ష లేకుండా తన కర్తవ్యాన్ని నిర్వర్తించిన వాడు జననమరణచక్రం నుండి విముక్తుడై, అనుబంధనాలలో అతీతమైన ఉత్తమ స్థితిని పొందగలడు..."
భగవద్గీత. 2వ అధ్యాయము, 51వ శ్లోకము

లక్షలాది కోళ్ల పెంపకందారుల కుటుంబాలలో ఆనందం నింపిన కర్మయోగికి ఆయన 28వ వర్ధంతి సందర్భంగా శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము మరియు ఆయన ఆశయాలకు పునరంకితమవుతున్నాము.

V H GROUP వేంకటేశ్వర హేచరీస్ గ్రూప్
NECC NATIONAL EGG CO-ORDINATION COMMITTEE (Non-Govt. Public Charitable Trust)

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సరైన చికిత్స...!

కాస్తంత ఒళ్ళు వెచ్చబడి, దగ్గూ జలుబూ తోడైతే ఓ నాలుగురోజులు యాంటీబయాటిక్స్ వాడేయడం అలవాటుగా మారినకాలంలో కేంద్ర ఆరోగ్యశాఖ ఇటీవల జారీచేసిన ఆదేశాలు మెచ్చుకోదగినవి. వైరల్ ఇన్ఫెక్షన్లకు సైతం యాంటీబయాటిక్స్ రాసేస్తున్న వైద్యుల సంఖ్య అధికంగా ఉన్నందువల్ల కాబోలు, ఈ మందుల విషయంలో కాస్తంత బాధ్యతగా నడుచుకోమని అది ఆదేశాలు జారీ చేసింది. రోగికి ఈ మందులు సూచించడానికి దారితీసిన నిర్దిష్టమైన కారణాలని కూడా వైద్యుడు విధిగా రాయాలని, ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ షాపులవారు ఈ మందులను అమ్మకూడదని ఆరోగ్యశాఖ పేర్కొంది. ఇది సూచనో, హెచ్చరికో, ఆదేశమో తెలియదు. ఈ మార్గదర్శకాలను ఉల్లంఘించినపక్షంలో సహించేది లేదని ఆరోగ్యశాఖ అటు వైద్యులను కానీ, ఇటు దుకాణదారులను కానీ ప్రత్యేకంగా హెచ్చరించలేదు. డ్రగ్స్ అండ్ కాస్మొటిక్స్ నిబంధనల్లో యాంటీబయోటిక్స్ ఇప్పటికే షెడ్యూల్ హెచ్, హెచ్1లో ఉన్నాయి. అర్హతగల వైద్యుడు రాసిచ్చిన చీటీ ఆధారంగానే వాటిని దుకాణదారు అమ్మాలి. అయినా, ప్రిస్క్రిప్షన్ లేకుండానే వాటి అమ్మకం జోరుగా సాగిపోతున్నది. గతంలోనూ పలుమార్లు ఇటువంటి ఆదేశాలు వెలువడిన నేపథ్యంలో, కేంద్ర ఆరోగ్యశాఖ వాటిని మరోమారు గుర్తుచేసిందని మాత్రమే అనుకోవాలి. అలాగే, వీటిని ఏ దశలో, ఎటువంటి రోగిమీద ప్రయోగించాలన్నది ఏళ్ళతరబడి వైద్యశాస్త్రం చదివిన వైద్యులకూ తెలుసు. ఇప్పుడు కార్యకారణసంబంధాలను కూడా విధిగా ప్రస్తావించాలన్న నియమం వారిమీద ఏ మేరకు పనిచేస్తుందో చూడాలి.

నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ ఒక ఏడాదిపాటు పదిహేను రాష్ట్రాల్లో నిర్వహించిన అధ్యయన ఫలితాలను కేంద్ర ఆరోగ్యశాఖ ఇటీవల ప్రకటించింది. పదివేలమంది ఆస్పత్రి పేషంట్లమీద యాంటీబయాటిక్స్ వాడకం ఏ విధంగా ఉన్నదో ఆ సర్వే గమనించింది. మిగతా వివరాలను అటుంచితే, 94శాతం మందికి కచ్చితమైన డయాగ్నసిస్ జరిగి, ఇన్ఫెక్షన్ మూలం రూఢీకాకముందే యాంటీబయాటిక్స్ ప్రయోగం జరిగిపోయిందని ఈ సర్వే చెబుతోంది. వీటి వాడకం తప్పదని ఇదమిత్థంగా తేలినతరువాత ఇచ్చింది ఆరుశాతంమందికి మాత్రమేనని సర్వే గ్రహించింది. కేవలం లక్షణాల ఆధారంగా రోగికి వైద్యుడు యాంటీబయాటిక్స్ రాయడమే అత్యధికశాతంమంది విషయంలో జరుగుతోంది. ఇక, ఇంటెన్సివ్ కేర్‌లో ఉన్నవారికీ, ఇతరవార్డుల్లో ఉన్నవారికీ మధ్య ఈ మందుల ప్రయోగంలో తేడా స్వల్పమేనని, వీటిని అత్యధికంగా వాడుతూండటం దేశంలో యాంటీబయాటిక్ రెసిస్టెన్స్ హెచ్చడానికి దారితీస్తున్నదని ఈ సర్వే తేల్చింది.

అరుదుగా, ఆపదలో మాత్రమే వాడాల్సిన ఈ మందులను మనదేశంలో ప్రజలు, వైద్యులు యథేచ్ఛగా వాడుతున్నట్టు లాన్సెట్ వంటివి చెప్పడమే కాక, అనుభవంలోనూ ఉన్నదే. మందులషాపుల్లో కొనుక్కొని వాటిని మింగే అలవాటు మిగతాదేశాల్లో కంటే మనకు ఎక్కువే. ఈ దుర్వినియోగంతో అవి క్రమంగా పనిచేయకపోవడం, దేహానికి మేలు చేసే బాక్టీరియా బలహీనపడటం, రోగనిరోధకశక్తి సన్నగిల్లడం, జీర్ణాశయ సమస్యలతో సహా కొత్తరోగాలు పుట్టుకురావడం వంటి ప్రమాదాలున్నాయని తెలియకపోదు. కానీ, యాంటీబయాటిక్స్ చుట్టూ వేలకోట్ల వ్యాపారం జరుగుతూనే ఉంది, ప్రభుత్వాలు అప్పుడప్పుడు హెచ్చరికలతో చేతులు దులిపేసుకోవడమూ జరుగుతోంది.

రోగలక్షణాలన్నీ వెంటనే మటుమాయం కావాలని, తక్షణ ఉపశమనం దక్కాలని తమదగ్గరకు వచ్చే పేషెంట్లు డిమాండ్ చేస్తున్నప్పుడు తాము మాత్రం ఏం చేయగలమని వైద్యుల వాదన. రోగనిదానానికి కాస్తంత సమయం పడుతుందన్న గ్రహింపుతో నిదానంగా ఉండే లక్షణం ప్రజల్లోనూ తగ్గింది. కాలంతో పరుగులు తీయాల్సిన పాడుకాలం వల్ల కూడా రోగలక్షణాలను ఎక్కువకాలం భరించే ఓర్పు తగ్గిపోయి, వైద్యుడిని తప్పుబట్టడమూ పెరిగిపోతోంది. కానీ, అతితక్కువగా ఉండే యాంటీబయాటిక్స్‌ను ఎంత ఎక్కువగా దుర్వినియోగం చేస్తే, ఆపదలో అవి ఉపకరించకుండాపోతాయన్న గ్రహింపు ప్రజలకు, వైద్యులకూ ఉండాలి. డాక్టర్‌నీ, అమ్మకందారుడినీ హెచ్చరించి యాంటీబయాటిక్స్ విస్తృత వినియోగాన్ని నియంత్రించడానికి ఇప్పుడు జరుగుతున్న ప్రయత్నానికి తనిఖీలు, జరిమానాలు కూడా తోడైతేనే కాస్తంత ఫలితం ఉంటుంది. దానితోపాటు, ఈ మందులే కాదు, అన్ని మందులూ అనవసరంగా వాడటం వల్ల వచ్చిపడే ప్రమాదం గురించి ప్రజలను చైతన్యవంతం చేసే పని కూడా విస్తృతంగా జరగాలి.

పోతన పద్యాలకు 'కొండపల్లి' రూపురేఖలు

జనవరి 27న ప్రసిద్ధ చిత్రకారులు, స్వాతంత్ర్య సమరయోధులు, నిజాం వ్యతిరేక పోరాటకారులు కొండపల్లి శేషగిరిరావు జయంతి. జయంతి మాత్రమే కాదు, శత జయంతి సందర్భం. వారి కళను, సేవలను ఏడాదిపాటు ప్రభుత్వం ఘనంగా స్మరించుకోవలసిన ఉత్సవ వేళా శుభసందర్భం. ఈ తరుణంలో వారిని ఆత్మీయంగా యాది చేసుకోవడం, ప్రభుత్వానికి చిరు సూచన చేయడం అంటే అది నూతన ప్రభుత్వానికి కూడా వన్నె తేగల సదవకాశమే.

భారతీయ పురాణేతిహాసాల పాత్రలెన్నిటినో తన కుంచెతో అపూర్వంగా మనకు అందించిన కొండపల్లి శేషగిరిరావు తన ఒడిలో ల్యాప్‌టాప్ పెట్టుకుని చిరునవ్వులు చిందించే ఈ చిత్రం తీసిన అదృష్టం నాది. ఇది వారిలోని సంప్రదాయత — ఆధునికతల మేలు కలయికలను రూపుకడుతుంది. అది వారి ప్రత్యేకతను, ప్రయోగాత్మను సైతం వెల్లడి చేసే మంచి జ్ఞాపకం. కాలం గడిచే కొద్దీ వన్నె తేలేది కళా వ్యక్తిత్వమే. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన వారిని వందేళ్ళ సందర్భంగా అక్షరాలా స్మరించుకోవడం తెలంగాణకు మాత్రమే కాదు, తెలుగు ప్రజలకూ గర్వకారణమే.

ఓరుగల్లులో జన్మించిన కొండపల్లి విద్యార్థిగా వారాల అబ్బాయి. మెహిది నవాజ్ జంగ్ ప్రోత్సాహంతో శాంతినికేతన్‌లో చదువుకున్న చిత్రకళా విద్యార్థి. తర్వాత చిత్రకళా ఉపాధ్యాయులు. జేఎన్‌టియూ చిత్రకళా విభాగంలో వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. పూర్తికాలం చిత్రకారుడిగా జీవితకాలమూ కృషి చేశారు. చిత్రకారులుగా రామాయణ మహాభారతాల వంటి కావ్యాల నుంచి ఎన్నో పాత్రలను తీసుకుని జీవం పోశారు. వారి చిత్రాలలో శకుంతల, దమయంతి వంటి పురాణ పాత్రల రమణీయత చూడవలసిందే తప్ప చెప్పదగినది కాదు. కొలనులో లచ్చి మొదలు విశ్వామిత్రుడు దాకా వారు చూడనిది లేదు, చిత్రించని శైలి లేదు. వరూధినీ ప్రవరాఖ్యుడు మొదలు రాణీ రుద్రమ, గణపతి దేవుడు, అన్నమయ్య, త్యాగయ్య వంటి వాగ్గేయకారులు మొదలు శాతవాహనులు, విష్ణుకుండినులు, పల్నాటి బ్రహ్మనాయుడు వంటి చారిత్రక వ్యక్తుల దాకా, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ నుంచి మొన్నటి మన తెలుగుతల్లి వరకూ వారి చేతుల్లో జీవం పోసుకున్నవే అన్న గ్రహింపు సహృదయులకు ఉన్నదే.

దేశంలో శిల్పకళకు పేరొందిన ఎన్నిటినో, ముఖ్యంగా మన దక్కనీ రాళ్ళను రప్పలనూ, అజంతా ఎల్లోరా రామప్ప రాచకొండలను వారు ఎంత గొప్పగా చిత్రించి పదిలం చేశారో చెప్పనవసరం లేదు. కాలుకు బలపం కట్టుకుని చేర్యాల వెళ్లి కాకిపడగల చిత్రకళను లోకానికి చాటి చెప్పినదీ వీరే కదా. కాకతీయ శిల్పకళను రేఖల్లో నిక్షిప్తం చేసి భావితరాలకు అందించిన తీరు కళాకారులకూ నిరంతర స్ఫూర్తి. కొండపల్లి అందించిన కళా నిధినిక్షేపాల్లో 'సురేఖ' గ్రంథం కాకతీయ శిల్పకళకు మకుటాయమానమైన రేఖల పొదుగు.



కొండపల్లి శేషగిరిరావు

చిత్రించని శైలి లేదు. వరూధినీ ప్రవరాఖ్యుడు మొదలు రాణీ రుద్రమ, గణపతి దేవుడు, అన్నమయ్య, త్యాగయ్య వంటి వాగ్గేయకారులు మొదలు పల్నాటి బ్రహ్మనాయుడు వంటి చారిత్రక వ్యక్తుల దాకా, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ నుంచి మొన్నటి మన తెలుగుతల్లి వరకూ వారి చేతుల్లో జీవం పోసుకున్నవే అన్న గ్రహింపు సహృదయులకు ఉన్నదే.

తెలంగాణాలో ముగ్గురు చిత్రకారుల గురించి మొదట ప్రస్తావించదలిస్తే, ముగ్గురూ మూడు పండుగలకు ప్రతీకలు. వినాయక చవితి అంటే దివంగత పి.టి.రెడ్డిని తలచుకోవాలి. వారి గణేషుడి చిత్ర రాజాలు ఇప్పటికీ అద్వితీయం. వీరు కొండపల్లి కన్నా వయసులో పెద్దలు. ఇక, బతుకమ్మ అంటే కాపు రాజయ్య. వీరు కొండపల్లి తర్వాతి వయస్కులు. ఈ ఏడు కొండపల్లి శత జయంతి అయితే, వచ్చే ఏడూ రాజయ్య గారిది. ఇక, దసరా అంటే కొండపల్లి శేషగిరిరావునే చెప్పాలి.

అవును మరి. కొండపల్లి గారు పోతన భాగవతాన్ని పదహారుసార్లు చదివి అందంగా ప్రశాంతంగా భక్తిభావం వొలికేల చిత్రించిన మాదిరే, అంతకన్నా గొప్ప ఏకాగ్రతతో పూర్ణ దీక్షతో నవరాత్రుల సందర్భంగా ఉండేవారు. తన పౌరాణిక అధ్యయనం నుంచి, లోతైన తాత్త్వికత నుంచి, అంతకుమించి గొప్ప ధ్యానంతో తన మనోనేత్రంతో దుర్గామాతలను వీక్షించి, తొమ్మిది రోజులలో ఒక చిత్రాన్ని ఒక్కో ఏడు ఒక చిత్రాన్ని పూర్తి చేసి, అలా ఆ విశ్వ మాతలను ఆరాధించిన వైనం ఒక తపస్సు. చిత్రకళలో దుర్గామాతను వారివలే కొలిచి, పునీతులు అయిన భారతీయ చిత్రకారులు మరొకరు ఉండరనే అనుకుంటాను.


ఒక్క మాటలో చెప్పాలంటే, చిత్రకళలో వారు కాకిని చిత్రించారు, కావ్య నాయకులనూ చిత్రించారు, దేవీ దేవతలను చిత్రించారు. అనేక విలువైన రచనలూ చేశారు. శిల్పకళ, కుడ్యకళ, అలంకార కళ గురించి లోతైన వ్యాసాలు రాశారు. స్త్రీల చిత్రలిపి గురించి కూడా పరిశోధన గావించారు. తెలంగాణ సోయితో ఆయన చేసిన రచనలు 'చిత్రకళా రమణీయము' గ్రంథంగా వచ్చింది. అది పండిత పామరులనూ నిత్య విద్యార్థులను చేయగల దిక్సూచి. ఇలా పరిపరి విధాలా కొండపల్లి జీవిత పర్యంతం కృషిచేస్తూ తెలంగాణకు విలువైన మేధో ఆస్తిపాస్తులను వదిలి వెళ్లారు. కానీ, వారు సృజించిన అనేక చిత్రకళా ఖండాలను చూడాలంటే ఒక శాశ్వత మ్యూజియం ఇప్పటికీ లేదు. వారి రచనలు విస్తృతంగా ప్రజల్లోకి చేరలేదు కూడా. నూతన తరానికి వారి పట్ల లోతైన అవగాహన లేదంటే అతిశయోక్తి కాదు. ఆ దిశలో గత ప్రభుత్వం కూడా ఎలాంటి చొరవ తీసుకోలేదు. ఇప్పటికైనా ఈ ముగ్గురి కళాకారులనే కాదు, మిగతా వారిని సమున్నతంగా గుర్తించుకునే దిశలో ప్రభుత్వం ఈ ఉత్సవ వేళలోనైనా పూనుకోవాలి.

సాహిత్య రంగంలో గత ప్రభుత్వం కాళోజీ, దాశరథి వంటి వైతాళికులను గుర్తు చేసుకుంటూ వారి పేరిట ఒక విశిష్ట పురస్కారాన్ని ఏర్పాటు చేసింది. కానీ తెలంగాణ గర్వించదగ్గ చిత్రకారుల స్ఫూర్తిని నాటి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఇప్పటి ప్రభుత్వమైనా ఉద్దండులైన కళాకారులను గుర్తు చేసుకోవడం తెలంగాణ పునరుజ్జీవనానికి అత్యవసరం. కొండగుర్తు వంటి కొండపల్లి శేషగిరిరావు స్మృతిలో ప్రభుత్వం ఏ చిన్న పని చేసినా విస్తృత కళా రంగానికి అదొక ఒరవడి అవుతుంది. నాందీ ప్రస్తావనగా గుర్తించబడుతుంది. మహోన్నత కళాకారుడిగా, విశిష్ట రచయితగా, విస్తృత పరిశోధకుడిగా కొండపల్లి సేవలను గుర్తుచేసుకోవడం, వారి కళా ఖండాలను పరిరక్షించడం, చిత్రకళా ప్రదర్శనలు నిర్వహించడం, రచనలను గ్రంథాలుగా అచ్చువేయడం, వారి పేరిట గొప్ప పురస్కారం ఏర్పాటు చేయడం, ఒక కళా పీఠాన్ని ఏర్పాటు చేసి స్మారక ప్రసంగాన్ని ప్రారంభించడం — ఇటువంటివన్నీ వారి కోసం కాదు, మనల్ని మనం గౌరవించుకోవడానికే. మన వైభవాన్ని మనం చాటుకోవడానికే. చిత్రకారులుగా ప్రారంభమై నేడు ముఖ్యమంత్రి స్థానంలో కొలువు తీరిన రేవంత్ రెడ్డి గారికి ఈ మాట చేరుతుందనే భావిద్దాం. అంతేకాదు, ప్రభుత్వం ఒక సాంస్కృతిక విధానాన్ని ఏర్పాటు చేసుకుని, సలహాదారులను పెట్టుకునే దశలో ఈ వ్యాసం ఒక చిరు ఆలోచన కలిగించినా మంచిదని రాయడం.

(జనవరి 27: కొండపల్లి శేషగిరిరావు శత జయంతి ఆరంభం)

■ కందుకూరి రమేష్‌బాబు

రామరాజ్యానికి మోదీ రహదారి ఏది?





■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

నరేంద్ర మోదీ 'ప్రతిభావంతుడైన ఒక ఈవెంట్ మేనేజర్ మాత్రమే'నని 2014లో భారతీయ జనతా పార్టీ అగ్ర నాయకుడు లాల్ కృష్ణ అడ్వానీ కొట్టి వేశారు. నాటి సార్వత్రిక ఎన్నికలలో ప్రధానమంత్రి పదవికి బీజేపీ అభ్యర్థిత్వానికై నరేంద్ర మోదీతో ఆయన పోటీ పడవలసివచ్చిన సందర్భమది. ఒక దశాబ్దం అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన 'ఈవెంట్ మేనేజిమెంట్' శక్తి సామర్థ్యాలను తిరుగులేని రీతిలో నిరూపించారు. అయోధ్య రామ మందిరంలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం గురించి నేను ప్రస్తావిస్తున్నాను. 1947 అనంతరం భారత ప్రజలు అటువంటి మత—రాజకీయ మహోత్సవాన్ని చూసి ఉండరనడంలో సందేహం లేదు. రాజ్యాధికారం, మతాభినివేశం, మీడియా అత్యుత్సాహం, ప్రజాభీష్టం సమ్మిళితమైన సంఘటనే అయోధ్యలో రాముడి ప్రాణప్రతిష్ఠ. బహుశా, దీనికి సాటి రాగల సంఘటన ఏదైనా ఉంటే అది, 1990లో అడ్వాణీ అయోధ్య రథయాత్ర మాత్రమేనని చెప్పవచ్చు. బీజేపీని దేశ రాజకీయాలో కేంద్ర స్థానంలోకి తీసుకు వెళ్లిన సంఘటన అది. ఆ చరిత్రకు తార్కిక ముగింపే రాముడి ప్రాణప్రతిష్ఠ. అయోధ్యలో కొత్తగా నిర్మించిన రామాలయంలో బాల రాముడి ప్రాణప్రతిష్ఠ బీజేపీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీని దేశ రాజకీయాలో మరికొంత కాలం తిరుగులేని శక్తులుగా నిలబెట్టనున్నది. ఒక విధంగా రఘురాముడికి లభించిన అపూర్వ గౌరవం నరేంద్ర మోదీకి సైతం అపూర్వ గౌరవమే. ఈ గౌరవం మోదీకి చరిత్రలో స్థానాన్ని కల్పించనున్నది.

జి—20 శిఖరాగ్ర సదస్సు నిర్వహణతో మోదీకి 'విశ్వగురు' ప్రతిష్ఠను సమకూర్చింది. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పిస్తున్న అధికరణ 370 రద్దు, పుల్వామాలో పాక్ ఉగ్రదాడికి దీటైన ప్రతిచర్య మోదీని మహా శక్తిమంతుడైన జాతీయవాది అనే యశో శోభితుడిని చేసింది. బాలాకోట్ దాడి అనంతరం 'ఘర్ మే ఘుస్కర్ మారా' (మనం వారి భూభాగంలోకి వెళ్లి, వారి ఇంటిని కూల్చివేశాం) అన్న ఉద్విగ్నభరిత ప్రకటన 2019 సార్వత్రిక ఎన్నికలలో మోదీ మహాశక్తిని అద్వితీయంగా గెలిపించింది.

ఇప్పుడు అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవం మోదీని మరింత సమున్నత స్థాయికి తీసుకువెళ్లింది. ఆధునిక హిందూ చక్రవర్తి లేదా హిందూ హృదయ్ సమ్రాట్‌గా దేశ ప్రజల మనస్సుల్లో మోదీ సుప్రతిష్ఠితమయ్యారు. మహా వైవిధ్యభరితమైన హిందూ మతంలోని సంప్రదాయ లోపాలు, లొసుగులకు అతీతంగా మోదీ అందరి మనసులను గెలుచుకున్నారు. బాల రాముడిని ఒక తాత్కాలిక శిబిరం నుంచి కొత్తగా నిర్మించిన ఒక దివ్య మందిరంలోకి ఆహ్వానిస్తూ ఈ శుభ సంఘటన చోటుచేసుకున్న జనవరి 22 ఒక మహత్వపూర్ణ తేదీగా రాబోయే 1000 సంవత్సరాలపాటు దేశ ప్రజలు గుర్తుంచుకుంటారని మోదీ ఉద్ఘాటించారు. అయోధ్య ఆలయంలో పూజాది కార్యక్రమాలను ఆయన చాల నిష్ఠగా నిర్వహించారు. అంతకు ముందు దేశంలోని వివిధ ఆలయాలను సందర్శించడంతో పాటు ఆహారాదుల విషయంలో సంప్రదాయం నిర్దేశించిన నిష్ఠలను పాటించారు. మోదీ ఏ ఆలయాన్ని సందర్శించినా టీవీ కెమెరాలు ఆయన ప్రతి కదలికను ప్రజలకు విపులంగా చూపాయి. మోదీ ఉద్దేశపూర్వకంగానే మతానికి, రాజ్యావ్యవస్థకు మధ్య ఉన్న విభజన రేఖలను చెరిపివేశారు. మరింత స్పష్టంగా చెప్పాలంటే మతమే రాజ్యంగా రాజ్యమే మతంగా పరిణమించింది.

సంఘ్ పరివార్ దృష్టిలో రామ జన్మభూమి ఆందోళన కేవలం ఒక వివాదాస్పద స్థలంలో రామాలయాన్ని నిర్మించడానికి పరిమితమైనది మాత్రమే కాదు. అది హిందూ మత ఔన్నత్యాన్ని నిశ్చితంగా ప్రకటించడం, హిందువులకు చారిత్రకంగా జరిగిన అవమానాలకు ప్రతీకారం తీర్చుకోవడం. అలాగే నాగరికతా సంబంధాలను నిర్మించుకోవడం, రాజ్యాంగబద్ధమైన లౌకికవాదాన్ని కూలదోసి, తమ సొంత దార్శనికతను ప్రతిబింబించే ఏకీకృత హిందూత్వ రిపబ్లిక్‌ను నిర్మించుకోవడం. ఈ కొత్త గణరాజ్యంలో హిందూ మతాన్ని అనధికారిక రాజ్య మతంగా పాటించడం. సైద్ధాంతిక విశ్వాసాలు, రాజకీయ అనివార్యతల మధ్య ఒక సమతూకాన్ని బీజేపీ చాలా కాలంగా పాటిస్తూ వచ్చింది. వాజపేయి హయాంలో సంకీర్ణ ప్రభుత్వాల సారథిగా అయోధ్యలో రామాలయ నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వలేకపోయింది. మోదీ హయాంలో పార్లమెంటులో బీజేపీకి సంపూర్ణ మెజారిటీ లభించడంతో అయోధ్యలో రామాలయ నిర్మాణానికి పార్టీ, ప్రభుత్వమూ తమ ఎజెండాలో అగ్ర ప్రాధాన్యమిచ్చాయి. సార్వత్రిక ఎన్నికల సంవత్సరంలో తమకు కలసివచ్చేట్టుగా ఆ ఎజెండాను అమలుపరిచాయి.

ఈ కారణంగానే ప్రధాని మోదీ సంభావ్య విమర్శలను ఉపేక్షించి, నిస్సంకోచంగా ఆలయ ప్రారంభోత్సవ వేడుకలను తానే స్వయంగా నిర్వహించారు. ఆరెస్సెస్ సర్ సంఘ్ సంచాలక్ మోహన్ భాగవత్ కేవలం మోదీకి సహాయకుడుగా మాత్రమే ఆ వేడుకలలో పాల్గొనడం గమనార్హం. 'దేవ్ సే దేశ్, రామ్ సే రాష్ట్ర' (దేవుని నుంచి దేశానికి, రాముడి నుంచి జాతికి) అనేది కొత్త మంత్రంగా ఉన్న భారత్‌కు తనను తాను తిరుగులేని నాయకుడుగా మోదీ ప్రతిష్ఠించుకున్న వైనమది. చాలా జాగ్రత్తగా ఎంపిక చేసుకుని అయోధ్యకు ఆహ్వానించిన సాధువులు, సన్యాసులు, ఇతర హిందూ మత పెద్దలు, వివిఐపి సెలెబ్రిటీలు ముక్తకంఠంతో మోదీకి జేజేలు పలికారు.

అయోధ్యకు రాముడు మళ్లీ విచ్చేశాడు. కాలం ఇంతటితో ఆగిపోదు కదా. దేశ ప్రజలకు మరింత మెరుగైన భవిష్యత్తు నిర్మించడం ఎలా? ఇది ఇప్పుడు దేశం ముందున్న ప్రశ్న. మోదీ నిర్వర్తించాల్సిన బృహత్తర బాధ్యత. శ్రీరాముడు అందరివాడని మోదీ ఉద్ఘాటించారు. అయితే చాలా సంవత్సరాలుగా 'జైశ్రీరామ్' అని వీధుల్లో నినదిస్తూ భిన్న మతాల వారిని బెదిరించిన, 1992లో బాబ్రీ మసీదును కూల్చివేసిన నేరానికి పాల్పడిన సంఘ్ పరివార్ కార్యకర్తలు మోదీ అభిభాషణను గౌరవిస్తారా? ఇస్లామిక్ మత ఛాందసవాదానికి ప్రతిస్పందనగా రామాలయ అంశాన్ని ఒక అస్త్రంగా చేసుకోవడం వల్ల మత సామరస్యం దెబ్బతింది. రాజకీయ విభేదాలు తీవ్రమయ్యాయి.

ప్రధానమంత్రి వక్కాణించినట్టు 'రాముడు అగ్ని కాదు, శక్తి, ఒక వివాదం కాదు, ఒక పరిష్కారమే' అయితే మైనారిటీ వర్గాల వారు అణగివుండేలా చేసేందుకు చట్టబద్ధ ప్రక్రియలకు విరుద్ధంగా బుల్‌డోజర్లతో వారిని కుమ్మడం, చావుదెబ్బ కొట్టడం ఎందుకు? హిందూ—ముస్లిం సంబంధాలను 'లవ్ జిహాద్'గా దుష్ప్రచారం చేయడమెందుకు? గోరక్షణ నిఘా బృందాలు ముస్లింలను చట్ట విరుద్ధ పద్ధతుల్లో వధించడమెందుకు? భిన్న మతాల వారి మధ్య సదవగాహనను పెంపొందించి సామరస్యాన్ని నెలకొల్పే ప్రయత్నాలు ఎందుకు జరగడంలేదు? ప్రజా జీవితంలో మరింత ఎక్కువగా పాల్గొనేలా ముస్లింలను ఎందుకు ప్రోత్సహించడం లేదు. ముస్లిం జనాభా అత్యధికంగా ఉన్న ఏకైక రాష్ట్రమైన జమ్ము—కశ్మీర్‌ను విభజించి ఒక కేంద్రపాలిత రాష్ట్రంగా చేయవలసిన అవసరమేమిటి? ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌ను సుదీర్ఘ కాలంగా అతలాకుతలం చేస్తున్న జాతుల ఘర్షణపై ప్రధానమంత్రి మౌనంగా ఎందుకు ఉండిపోయారు? సమాజంలోని భిన్న వర్గాల మధ్య అడ్డుగోడలు సృష్టిస్తున్న వివాదాలను సత్వరమే పరిష్కరించేందుకు ఎందుకు శ్రద్ధ చూపడం లేదు? క్రైస్తవ మిషనరీలపై సంఘ్ పరివార్ తరచు చేస్తున్న దాడులను ఎందుకు అరికట్టడం లేదు? అయోధ్యలో రామ మందిర నిర్మాణాన్ని నిజంగా ఒక నవశకానికి నాందిగా ఉద్దేశించారా. సకల మత, సర్వ సమత్వ సమ్మిళిత రామరాజ్యానికి ఆ మందిరం ఒక ప్రతీకగా భాసిల్లనున్నదా? ఇటువంటి సదుద్దేశమే ఆ ఆలయ నిర్మాణం వెనుక ఉంటే కుల మతాలకు, ఆర్థిక, సామాజిక అంతరాలకు అతీతంగా పౌరులు అందరినీ సమ భావంతో చూడాలని, వారికి సమ న్యాయం అందించాలని, ఇది భారత లౌకిక రాజ్యవ్యవస్థ విధ్యుక్త ధర్మమని ప్రధానమంత్రి దేశపాలనా వ్యవస్థలోని అన్ని స్థాయిలలో ఉన్న తన సహచరులు అందరికీ ఒక దృఢమైన సందేశాన్ని పంపడం ద్వారా ఆ నవశకానికి నాంది పలకాలి. కొన్ని సామాజికవర్గాల వారిని దేశద్రోహులుగా పరిగణించే ధోరణులకు స్వస్తి చెప్పి తీరాలి. అలా వ్యవహరిస్తున్న వారిపై కఠిన చర్యలు చేపట్టాలి. ధరల పెరుగుదలకు 'మియా' కూరగాయల విక్రేతలే కారణమని అస్సాం ముఖ్యమంత్రి ఆరోపించినప్పుడు, పాఠశాల బాలలు శాంటాక్లాజ్ వేషధారణ చేయడాన్ని మధ్యప్రదేశ్ ప్రభుత్వం తీవ్రంగా ఆక్షేపించినప్పుడు, ఢిల్లీలో మైనారిటీలను సామాజికంగా, ఆర్థికంగా వెలివేయాలని పిలుపునిచ్చినప్పుడు మౌనంగా ఉండిపోవడం లేదా ఎటువంటి చర్య చేపట్టకపోవడం రామ రాజ్య ఆవిర్భావానికి ఎలా దారితీస్తుంది?

అయోధ్యలో రాముడికి ప్రాణప్రతిష్ఠ కేవలం ఉత్సవ సమయం మాత్రమే కాదు, సత్సంకల్పాలను సత్కార్యాచరణలోకి తీసుకువచ్చేందుకు ఒక మహత్వ పూర్ణ అవకాశాన్ని కల్పించిన సందర్భం కూడా. నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి ప్రధానమంత్రి కావడాన్ని రాముడి ప్రాణప్రతిష్ఠ ఖాయం చేసింది. ఆ హ్యాట్రిక్ మోదీకి, జవహర్‌లాల్ నెహ్రూ అనంతరం వరుసగా మూడోసారి ప్రధానమంత్రి అయ్యే ఘనతను సమకూర్చుతుంది. అయితే చరిత్రలో తనకు లభించే సుప్రతిష్ఠ సార్థకం కావాలన్నా, తన పాలనా వారసత్వం భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిపోవాలన్నా అయోధ్యలో రఘురాముడికి ప్రాణప్రతిష్ఠ చేస్తూ దేశప్రజలకు ఇచ్చిన సమున్నత హామీలు, మహోదాత్త వాగ్దానాలను నెరవేర్చాలి. గోధ్రా అనంతర అల్లర్లు 2002—2014 సంవత్సరాల మధ్య నరేంద్ర మోదీకి ప్రజల్లో మతపరమైన చీలికలు సృష్టించే రాజకీయవేత్త అనే కళంకాన్ని కలిగించాయి. ఇప్పుడు చరిత్రలో తన స్థానాన్ని మహోన్నతంగా నిలుపుకునేందుకు ఉద్యుక్తుడు అయినందున మోదీ అటువంటి కళంకాలకు ఆస్కారం లేని రీతుల్లో విశాల దృక్పథంతో దేశ పాలన చేయాలి. అవును, అయోధ్యలో ఆయనే అన్నట్టు ఇది విజయోత్సవ వేళ మాత్రమే కాదు, వినయంగా జాతినిర్మాణానికి సమాయత్తం కావల్సిన శుభ సందర్భం.

> అయోధ్యలో రాముడికి ప్రాణప్రతిష్ఠ నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి ప్రధానమంత్రి కావడాన్ని ఖాయం చేసింది. ఆ హ్యాట్రిక్ మోదీకి, జవహర్‌లాల్ నెహ్రూ అనంతరం వరుసగా మూడోసారి ప్రధానమంత్రి అయ్యే ఘనతను సమకూరుస్తుంది. చరిత్రలో తనకు లభించే సుప్రతిష్ఠ సార్థకం కావాలన్నా, తన పాలనా వారసత్వం భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిపోవాలన్నా అయోధ్యలో రఘురాముడికి ప్రాణప్రతిష్ఠ చేస్తూ దేశప్రజలకు ఇచ్చిన సమున్నత హామీలు, మహోదాత్త వాగ్దానాలను మోదీ తప్పక నెరవేర్చాలి.

రాజ్యాంగమే మన వెలుగుబాట

భారత రాజ్యాంగం 1950, జనవరి 26న అమలులోకి వచ్చింది. డా. బాబూ రాజేంద్రప్రసాద్ నేతృత్వంలో రాజ్యాంగాన్ని రూపొందించి, ఆమోదించింది భారత రాజ్యాంగసభ. బాబా సాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్‌గా వ్యవహరించారు. ప్రజలు రాజ్యాంగబద్ధ విధానాల ద్వారానే తమ సమస్యలను పరిష్కరించుకోవాలని అంబేడ్కర్ పిలుపునిచ్చారు. కానీ నేటికీ రక్తపాత విప్లవం ద్వారా మార్పు కోసం నక్సలైట్లు పనిచేయడం దురదృష్టకరం. పరిపాలకులు కూడా ప్రజల సమస్యలను మొదటి దశలోనే గుర్తించి సకాలంలో పరిష్కరించే ప్రయత్నం చేయాలి.

రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా చట్టసభలు చట్టాలు చేయాలి. ఈ చట్టాలు రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ఉన్నాయా లేదా అన్నది తేల్చాల్సింది ఉన్నత న్యాయస్థానాలు. రాజ్యాంగంలో ఉన్న 'అత్యయిక పరిస్థితి' నిబంధనను దుర్వినియోగం చేసి, ఆనాటి ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ తన అధికారాన్ని, పదవిని కాపాడుకోవడానికి ప్రయత్నించారు. ఆ చీకటి కాలంలో కొంత మంది ఉన్నత న్యాయమూర్తులు సైతం తమ పదవుల కోసం దానిని సమర్థించారు. అదో చీకటి అధ్యాయం.

భారత రాజ్యాంగ పీఠిక (Pre-amble)పై రాజ్యాంగసభలో వారం రోజులు విస్తృత చర్చ జరిగింది. కొందరు సెక్యులర్, సోషలిస్టు పదాలను జోడించాలని సూచించారు. వారి సలహాలను డా.అంబేడ్కర్ తార్కికంగా తిరస్కరించారు. 1975 అత్యయిక పరిస్థితిలో ప్రతిపక్ష నాయకులు జైలులో ఉన్న వేళ, సమగ్ర చర్చ లేకుండానే భారత రాజ్యాంగ పీఠికలో సోషలిస్టు, సెక్యులరిస్ట్ పదాలను జోడించారు. నేటి వ్యవహారంలో సెక్యులరిజం అంటే మత సమభావన కాదు. ధర్మ(మత) వ్యతిరేక, హిందూ వ్యతిరేక, మైనారిటీ మతాల సమర్థనగా చెలామణి అవుతున్నది.

కొన్ని విజాతీయ శక్తులు నిర్మించిన భ్రమల వల్ల మన దేశానికి, అయోధ్య సమస్య పరిష్కారానికి నష్టం వాటిల్లింది. భారతదేశపు ఆత్మకు ప్రతీక అయిన అయోధ్యలో శ్రీరామ జన్మభూమి కోసం ఈ దేశ ప్రజలు 74 ఏళ్ల పోరాటాలు చేశారు. 1947 నుంచి న్యాయ స్థానాలలో కేసులు నిరవధికంగా కొనసాగాయి. ప్రజాజాగరణ ఉద్యమాలు, కరసేవకుల బలిదానాలు, ప్రజల ఆగ్రహం వల్ల, ఎట్టకేలకు సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు మేరకు బాల రాముని మందిర నిర్మాణం సుగమం అయింది. రామ మందిర నిర్మాణ పనులు చురుకుగా సాగి, జనవరి 22న అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. 550 సంవత్సరాల క్లిష్ట సమస్యకు భారత రాజ్యాంగం ఆధారంగా భారత న్యాయ వ్యవస్థ సమస్యను పరిష్కరించింది. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మన భారతదేశాన్ని ఒక సుసంపన్న దేశంగా తీర్చిదిద్దుకుందాం.

— శ్యాం ప్రసాద్
అఖిల భారతీయ సామాజిక సమరసత ప్రముఖ్

భయం పుట్టిస్తున్న భావి రాజకీయం

ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం మనదని చాలా ఘనంగా చెప్పుకుంటాం. మనదేశ రాజకీయ రంగానికి ఆ కితాబు ఉండడం వింత కాదు. కేవలం జనాభా కారణంగా దక్కిన ఆ ఘనతను నైతిక విలువల పరంగా మనం కాపాడుకోగలిగినప్పుడే సార్థకత! అతిపెద్ద రాజ్యాంగం పుస్తకం రాసుకుని మురిసిపోవడం కాదు.. అందులోని విలువలను సంపూర్ణంగా ఆచరించగలిగినప్పుడే దానికి మన్నన! కానీ మనదేశంలో ప్రస్తుతం ఏం జరుగుతోంది? రాజకీయ రంగం పూర్తిగా దారి తప్పిపోతోంది. 'ప్రజాజీవితం' అనే పడికట్టు పదంతో మనం వ్యవహరిస్తుంటాం గానీ.. వాస్తవంగా రాజకీయరంగం ప్రజాజీవితం కాకుండాపోతోంది. పూర్తిగా కార్పొరేట్ మయం అవుతోంది. అన్ని వ్యాపారాల్లాగానే ఇది కూడా ఒక వ్యాపారం అవుతోంది. దీనివల్ల భవిష్యత్తు ఎలా ఉండబోతుందనే ఆలోచన వస్తే భయం పుడుతోంది.

మారుతున్న సామాజిక జీవనశైలులతో.. రియల్ ఎస్టేట్, సాఫ్ట్‌వేర్, ఇతర కార్పొరేట్ వ్యాపారాలు, దళారీ పనులలో కోట్లకు కోట్లు కష్టం తెలియకుండా వెనకేసిన వారు, కీలకమైన ప్రభుత్వోద్యోగాల్లో ఉంటూ ఇబ్బడిముబ్బడిగా అవినీతికి పాల్పడుతూ వందల కోట్లు ఆర్జించిన వాళ్లు అందరూ కూడా రాజకీయాన్ని తమ లక్ష్యంగా ఎంచుకుంటున్నారు. కేవలం ధనబలం ఒక్కటే ప్రాతిపదికగా, అర్హతగా అడుగుపెడుతున్నారు. అలాంటివారు ఈ రంగాన్ని ఒక వ్యాపారంలాగానే చూడగలరు తప్ప.. ప్రజాజీవితంగా భావిస్తారని ఆశించడం మూర్ఖత్వం.

గెలుపోటములు ఒక్కటే ప్రాతిపదికనా?! ఈ ప్రశ్న చాలా తలతిక్కగా అనిపిస్తుంది. గెలుపు ప్రాతిపదిక కాకుండా అసలు రాజకీయరంగం ఎలా ఉంటుంది? గెలవడానికి కాకపోతే ఎవరైనా ఎన్నికల్లో ఎందుకు పోటీచేస్తారు? అనే ఎదురుప్రశ్న వస్తుంది. కానీ.. ప్రతి విషయంలోనూ గెలుపోటములు మాత్రమే ప్రధానం అనుకునే వైఖరి ప్రమాదకరం. ఎందుకంటే.. ప్రజా సమస్యల కోసం నిలబడి పోరాడే చిత్తశుద్ధి గల నాయకుడు గెలిచే అవకాశం లేకపోయినా సరే, పార్టీలు అలాంటి వారికి టిక్కెట్లు ఇచ్చి నిలబెట్టాలి, ప్రోత్సహించాలి. వారికి అన్ని రకాలుగా అండగా నిలబడి పార్టీనే గెలిపించుకోవాలి. ఒకటి రెండు చోట్ల ఓటమి చెందవచ్చు కానీ.. ప్రజలకోసం నిస్వార్థంగా పనిచేసే వారికి లభించే గుర్తింపు అది. ఆ మాత్రం గుర్తింపు ఉంటే వారిలోని చిత్తశుద్ధి సడలిపోకుండా ఉంటుంది. కానీ పార్టీలు అలాంటి నిజమైన నాయకుల్ని తయారుచేయడం గురించి పట్టించుకోవడం లేదు. అలాంటి వారు ఉన్నా.. ప్రోత్సహించే ఉద్దేశమూ లేదు. అధికారం, ధనార్జన మాత్రమే లక్ష్యాలుగా ఉంటున్నాయి. దానికి తగ్గట్టుగానే అభ్యర్థుల ఎంపిక జరుగుతోంది. అంతిమంగా ప్రజల కోసం పనిచేయడం మాత్రమే తెలిసిన వారు కనపడకుండా పోతున్నారు. ప్రత్యక్ష రాజకీయాల నుంచి విరమించుకుంటున్నారు.

తెలుగునాట స్టూడెంట్స్ యూనియన్ ఎన్నికలు రద్దు చేయడంతో విద్యార్థి యూనియన్ల నుంచి భవిష్యత్ నాయకులు తయారుకావడం అనేది కనుమరుగైపోయింది. జాగ్రత్తగా పరిశీలిస్తే ఉభయ కమ్యూనిస్టు పార్టీలు, బీజేపీల్లో దాదాపుగా నాయకులందరూ కూడా పూర్వాశ్రమంలో ఆయా పార్టీల విద్యార్థి విభాగాలైన ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీలలో పనిచేస్తూ ఎదిగినవారే. విద్యార్థి దశలోనే నాయకత్వం వైపు నడక ప్రారంభించిన వారిలో అపారమైన పోరాటపటిమ, ఉద్యమస్ఫూర్తి ఉంటాయి. నలుగురి కోసం పనిచేయడం, ఉద్యమించడం అనేది వారి మౌలిక లక్షణంగా తయారవుతుంది. వారు ఎదిగి రాజకీయాల్లోకి రావడం వల్ల సమాజానికి మంచే జరుగుతుంది. రాష్ట్రంలో కొన్ని దశాబ్దాలుగా కళాశాలలు, యూనివర్సిటీల్లో ఎన్నికలే లేకపోవడంతో విద్యార్థి సంఘాల పాత్ర పరిమితంగా మారిపోయింది. నిజానికి ఆ వయసులో నాయకులు తయారుకావడం లేదు. ఇది భవిష్యత్తుకు చాలా ప్రమాదకరమైన సంకేతం. చంద్రబాబునాయుడు, సీపీఐ నేత నారాయణ, బీవీ రాఘవులుతో పాటు వందలాది మంది నేటితరం నాయకులు విద్యార్థి సంఘాల నుంచి వచ్చినవారే. భవిష్యత్తులో ఉద్యమశీలత లేని హైబ్రిడ్ నాయకత్వం వల్ల రాజకీయాలు ప్రమాదంలో పడతాయి.

ఇదివరలో ప్రతి పార్టీలో పదుల సంఖ్యలో సీనియర్ నాయకులు ఉండేవారు. వారికి జిల్లా మీద, రాష్ట్రం మీద అన్ని రంగాలలో మంచి పట్టు ఉండేది. ఒక నాయకుడు జిల్లా పరిషత్ ఛైర్మన్ అయ్యారంటే.. జిల్లాలోని ప్రతి పంచాయతీలోనూ కనీసం కొందరిని పేరు పెట్టి పలకరించేంత విస్తృతంగా పర్యటించేవారు, సంబంధాలు కొనసాగించేవారు. దాని వల్ల పార్టీలు పటిష్ఠంగా తయారయ్యేవి. ఇవాళ్టి తరంలో ఒక్క నియోజకవర్గం మీద పట్టున్న నాయకులు ఒక్కరు కూడా లేరు.

గెలుపోటములు తప్ప మరో అంశం పట్టించుకోని నవతరం కార్పొరేట్ రాజకీయ శైలికి వైఎస్సార్ కాంగ్రెస్ చక్కటి ఉదాహరణ. తమ పార్టీ నాయకులకు ఒక నియోజకవర్గం లేదా ఒక ప్రాంతం మీద పట్టు ఏర్పడితే.. వారు పాతుకుపోతారనే భయం పార్టీ అధినేతలో కనిపిస్తోందా అనే అనుమానం మనకు కలుగుతుంది. పార్టీలో తాను తప్ప ఎవ్వరూ కూడా నాయకులుగా ఎదగకూడదనే ధోరణికి నిదర్శనం అది. ఆ పార్టీని జగన్మోహన్ రెడ్డి ఒక కార్పొరేట్ సంస్థలాగానే నిర్వహిస్తున్నారు. వారికి నాయకులు అవసరం లేదు. గెలుపోటములు మాత్రమే కావాలి. ఇలాంటి కార్పొరేట్ వ్యాపార దృక్పథం, సక్సెస్ ముసుగులో పడే ఆరాటం కారణంగానే ఎమ్మెల్యేలను, ఎంపీలను ఇష్టం వచ్చినట్టుగా మారుస్తున్నారు.

ఇలాంటి చర్యల వల్ల ఏ ఒక్క నాయకుడికి కూడా ఏ ఒక్క నియోజకవర్గం గానీ, జిల్లా గానీ, ప్రాంతం మీద గానీ నిర్దిష్టమైన పట్టు లేకుండా పోయే ప్రమాదం ఉంటుంది. ఒకప్పటి పరిస్థితి ఇది కాదు. నాయకులకు జిల్లా వ్యాప్తంగా పట్టుండేది. చిన్న ఉదాహరణ పరిశీలిస్తే.. కృష్ణా జిల్లాలో పిన్నమనేని కోటేశ్వరరావు, చనుమోలు వెంకట్రావు, గుంటూరు జిల్లాలో చేబ్రోలు హనుమయ్య యడ్లపాటి వెంకటరావు, కొత్త రఘురామయ్య, నెల్లూరు—ప్రకాశం జిల్లాల్లో బెజవాడ గోపాలరెడ్డి, పుచ్చలపల్లి సుందరయ్య, వెంకయ్యనాయుడు, కడప జిల్లాలో వైఎస్ రాజశేఖర రెడ్డి వంటి నాయకులు ఉండేవాళ్లు. సీనియర్లను మినహాయిస్తే ఈ తరం నేతల్లో అలాంటి ఒక్క పేరు కూడా మనకు వినిపించదు.

ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే.. భవిష్యత్ రాజకీయ చిత్రం భయవిహ్వలం కాక మరేమవుతుంది? రేపటి తరంలో కేవలం వ్యాపారులు, పెట్టుబడిదారులు, దుర్మార్గులు, అవినీతిపరులు మాత్రమే ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా అన్ని పార్టీల తరఫున బరిలో నిలుస్తుంటారు. ఎవరో ఒకరిని ఎంచుకోవాల్సిందే తప్ప, ప్రజలకు వేరే గత్యంతరం ఉండదు. వ్యాపారం తప్ప మరొకటి తెలియని వారు చట్టసభల్లో కూర్చుని ఈ దేశం మనుగడను శాసించే చట్టాలను తయారుచేస్తే అవి ఎలా రూపొందుతాయో ఊహించుకోవాలంటేనే భయం కలుగుతోంది. మోదీ సర్కారు రైతు జీవితాన్ని వ్యాపారుల పరం చేసే చట్టాలు తెస్తే, సుదీర్ఘ పోరాటంతో ఆ చట్టాలు రద్దయ్యాయి. కానీ భవిష్యత్తులో అన్ని రకాల చట్టాలూ అదే తరహాలో రూపొందుతూ ఉంటే.. అసలు పోరాడే శక్తి సామాన్యుల్లో మిగులుతుందా అనేది అన్నింటికంటె పెద్ద భయం.

> కేవలం వ్యాపారులు, పెట్టుబడిదారులు, దుర్మార్గులు, అవినీతిపరులు మాత్రమే ఎమ్మెల్యేలు, ఎంపీలుగా భవిష్యత్తులో అన్ని పార్టీల తరఫున బరిలో నిలుస్తారు. వ్యాపారం తప్ప మరొకటి తెలియని వారు చట్టసభల్లో కూర్చుని ఈ దేశం మనుగడను శాసించే చట్టాలను తయారుచేస్తే అవి ఎలా రూపొందుతాయో ఊహించుకోవాలంటేనే భయం కలుగుతోంది. విద్యార్థి దశలోనే నాయకత్వం వైపు నడక ప్రారంభించిన వారిలో అపారమైన పోరాటపటిమ, ఉద్యమస్ఫూర్తి ఉంటాయి. అలాంటి వారిని ప్రోత్సహించాలి.





● దాసరి కృష్ణమోహన్

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా: ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033. మెయిల్:editpage@andhrajyothy.com



ముస్తాబైన ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం



హరికథావనంలో వికసించిన పద్మం

బందరు కళాకారిణికి పద్మశ్రీ గౌరవం

బందరు నుంచి బద్రీనాథ్ వరకూ ఎదిగిన ఉమామహేశ్వరి



పాశ్చాత్య కళలు ప్రజా బాహుళ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న తరుణంలో మన చారిత్రక కళకు ప్రాణం వచ్చింది. ప్రజా కళల రాజసం తగ్గిపోతున్న సమయంలో హరికథకు అరుదైన గౌరవం దక్కింది. సంస్కృతంలో హరికథ చెప్పిన తొలి మహిళగా బందరుకు చెందిన ఉమామహేశ్వరికి కేంద్ర ప్రభుత్వం గురువారం పద్మశ్రీ ప్రకటించి గౌరవించింది. మచిలీపట్నం రామానాయుడుపేట షేక్ ఇమాం వీధిలో లాలాజీరావు, సరోజినీ దంపతులకు ఉమామహేశ్వరి 1960లో జన్మించారు. మచిలీపట్నంలో సంగీతం నేర్చుకున్నారు. వయోలిన్, వీణ, ఫ్లూట్‌లపై ఆమె హరికథ చెప్పడం ప్రారంభించారు. సంప్రదాయ సంగీత కుటుంబంలో జన్మించిన ఆమె వేములవాడ రాజరాజేశ్వరి దేవాలయంలో హరికథా గానం చేసేవారు. ప్రముఖ నాట్యాచార్యుడు కళాకృష్ణను 1995లో వివాహమాడారు. కాళిదాసు రచించిన 'కుమారసంభవం' ఇతివృత్తాన్ని ఆధారం చేసుకుని ఉజ్జయినీలో సంస్కృతంలో హరికథను గానం చేశారు. కపిలేశ్వరపురం సర్వరాయ హరికథా పాఠశాలలో హరికథను అభ్యసించారు. ఆ తరువాత ఆమె అంచెలంచెలుగా ఎదిగి జాతీయస్థాయి కళాకారిణిగా గుర్తింపు పొందారు. వేములవాడ రాజరాజేశ్వరి దేవస్థానం ఆస్థాన విద్వాంసురాలిగా ఆమె సంగీత ప్రపంచానికి సేవలందించారు. 1989లో బద్రీనాథ్‌లో ఆమె ఆదిశంకరాచార్యుడిపై చెప్పిన హరికథ ప్రముఖులను ఆకర్షించింది. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ, నీలం సంజీవరెడ్డి, జ్ఞాని జైల్‌సింగ్, పండిట్ శంకర్‌దయాళ్ శర్మలు ఈమె హరికథాగానం విన్నారు. మాజీ ముఖ్యమంత్రులు మర్రి చెన్నారెడ్డి, ఎన్టీ రామారావు, మాజీ గవర్నర్ భీష్మ నారాయణ సింగ్ వీరిని ప్రశంసించారు. 1993లో అమెరికా, 2003లో సింగపూర్, ఇండోనేషియాలో హరికథాగానం చేశారు. ఆమె ఆడియో, వీడియోలు జన బాహుళ్యంలోకి వెళ్లాయి. కేంద్ర సంగీత నాటక అకాడమీ వీరికి అవార్డులు ఇచ్చి గౌరవించింది.

- మచిలీపట్నం టౌన్

ఎన్నికలకు ముందే నోట్ల కట్టలు

పలుచోట్ల భారీగా నగదు పట్టివేత

- 6లో..

నేడే గణతంత్ర దినం వీరుల త్యాగఫలం

జిల్లావ్యాప్తంగా మువ్వన్నెల వెలుగులు



స్వరాజ్య మైదానంలో అంబేడ్కర్ వి గ్రహానికి మువ్వన్నెల వెలుగులు (ఇన్‌సెట్‌లో) రైల్వేస్టేషన్ వద్ద గాంధీ మహాత్ముడు

బ్రిటీష్ పాలకుల నిరంకుశ శృంఖలాలను తెంచి, దాస్య చెర నుంచి భరతజాతికి విముక్తి కల్పించి, స్వేచ్ఛా కుసుమాలు విరబూయించిన పండుగ రోజైన గణతంత్ర దినోత్సవ సంబరాలకు జిల్లా ముస్తాబైంది. సామ్రాజ్యవాద దురహంకారాన్ని మొక్కవోని ధైర్యంతో ఎదిరించి, ప్రాణాలను సైతం తృణప్రాయంగా వదిలిన అమరవీరులను స్మరిస్తూ జాతీయ పతాకాన్ని ఎగురవేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, సందర్శనీయ ప్రాంతాలను మువ్వన్నెల వెలుగులతో ముచ్చటగా అలంకరించారు. ఎటుచూసినా జాతీయ పతాకాలతో విజయవాడ నగరం మరింత అందంగా ముస్తాబైంది.

జయహో.. అమరావతి



అమరావతి ఉద్యమానికి 1,500 రోజులు

చరిత్ర లిఖించిన అమరావతి ఉద్యమం 1,500వ రోజు కూడా దద్దరిల్లింది. రాజధాని గ్రామాల్లో గురువారం చేపట్టిన అమరావతి సమర శంఖారావ సభలు పోరు నినాదాలై మార్మోగాయి. వెలగపూడి, మందడంలో నిర్వహించిన సభల్లో రైతులు, మహిళలు పిడికిలి బిగించి ప్రతినబూనారు. సరిగ్గా 81 రోజుల్లో ప్రభుత్వం గాలికిపోతుందంటూ హెచ్చరించారు.

- భారీ సభలతో దద్దరిల్లిన రాజధాని ప్రాంతం
- ఉద్యమంలో అమరులకు నివాళి
- జగన్‌పై విరుచుకుపడిన అఖిలపక్ష నేతలు

వెలగపూడి, మందడం వేదికగా నేతల హెచ్చరికలు



మందడం సభలో పాల్గొన్న మహిళలు (ఇన్‌సెట్‌లో) తుళ్లూరులో 1,500 రోజుల ఆకారంలో కొవ్వొత్తుల ప్రదర్శన

తుళ్లూరు/గుంటూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : రాజధాని ఉద్యమం 1,500 రోజులకు చేరుకున్న సందర్భంగా అమరావతి గ్రామాల్లో గురువారం ప్రత్యేక సభలు నిర్వహించారు. అమరావతి జేఏసీ నేత పువ్వాడ సుధాకర్ అధ్యక్షతన వెలగపూడి శిబిరం వద్ద జరిగిన సభలో వేలాదిమంది రైతులు, మహిళలు, దళిత, బహుజనులు పాల్గొన్నారు. తొలుత అమరావతి అమరవీరులు 277 మందికి నివాళులర్పించారు. ఇటీవల మృతిచెందిన దళిత జేఏసీ నేత గడ్డం మార్టిన్ లూథర్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం అమరావతి ఉద్యమ నినాదభేరి మోగించారు. ప్రాసమణి ప్రసంగంతో సభ ప్రారంభమైంది. అమరావతి ఉద్యమాన్ని, రైతులు, మహిళల త్యాగపూరిత పోరాటాన్ని తన ప్రాసలతో ఆయన శ్లాఘించారు. ప్రభుత్వ దుర్మార్గాలను ఎండగట్టారు. రాజధాని ఉద్యమ గాయకుడు రమణ తన ఆటపాటలతో ప్రజలను ఆకట్టుకున్నారు. రాజధాని గ్రామాల మహిళలు పలువురు కోలాట ప్రదర్శనతో అలరించారు.

సువర్ణ లిఖితమైనది ఈ ఉద్యమం

1,500 రోజులుగా అమరావతి రైతులు సాగిస్తున్న ఉద్యమం చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించాలని సీపీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ అన్నారు. అమరావతిలోనే జగన్ పతనం మొదలైందన్నారు. మూడు నెలల్లో ప్రభుత్వం మారుతుందని, నూటికి నూరుశాతం అమరావతే రాజధాని అని పేర్కొన్నారు. సీపీఎం నేత బాబూరావు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వానికి ఆక్సిజన్ ఇస్తోందే మోదీ ప్రభుత్వమన్నారు. అమరావతి విషయంలో



మందడంలో అన్ని పార్టీల నాయకుల సంఘీభావం

జగన్, మోదీలిద్దరూ నిందితులేనన్నారు. ఇద్దరినీ గద్దె దించేందుకు ఐక్యంగా పోరాడాలన్నారు. పోలీసులు, లాఠీల దౌర్జన్యాలను ఢీకొని నిలబడిన అమరావతి రైతులకు మాజీ మంత్రి దేవినేని ఉమా అభినందనలు తెలిపారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మాట్లాడుతూ అందరి ఉమ్మడి శత్రువైన జగన్‌ను సాగనంపడానికి కలిసికట్టుగా పోరాడాలన్నారు. ఎమ్మెల్సీ అశోక్‌బాబు మాట్లాడుతూ నాలుగేళ్ల క్రితం మూడు రాజధానుల బిల్లును మండలిలో నిలువరించి, జగన్ కుట్రను భగ్నం చేశామన్నారు. హిందూ మహాసభ సభ్యుడు

మిగతా 6వ పేజీలో...



● చూసిన కనులదే భాగ్యం

పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో గురువారం ఆది దంపతుల గిరి ప్రదక్షిణ ఘనంగా జరిగింది. దుర్గాఘాట్ సమీపంలోని శ్రీకామధేను అమ్మవారి ఆలయం నుంచి ప్రారంభమైన రథోత్సవం వన్‌టౌన్ మీదుగా తిరిగి ఇంద్రకీలాద్రి చేరుకుంది.

- 6లో..



సెంట్రల్‌ను ఆక్రమిస్తున్న పశ్చిమ వైసీపీ నేతలు

అట్నుంచి ఇటూ

సెంట్రల్ నియోజకవర్గ వైసీపీలో ముసలం రోజురోజుకూ ముదురుతోంది. సిటింగ్ ఎమ్మెల్యే మల్లాది విష్ణును కాదని స్థానికేతరుడైన పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు ఇక్కడ టికెట్ ఇవ్వడంపై స్థానిక వైసీపీ నేతలు తొలి నుంచి ఆగ్రహావేశాలతో రగిలిపోతున్నారు. తాజాగా సెంట్రల్ నియోజకవర్గంలోని 21 డివిజన్లకు స్థానికేతరులను ఇన్‌చార్జులుగా నియమించడం, గురువారం జరిగిన కార్యాలయ ప్రారంభోత్సవంలో వారిదే పెత్తనం కావడంతో ఆగ్రహానికి ఆజ్యం పోసినట్లైంది.

- డివిజన్ ఇన్‌చార్జులుగా పశ్చిమ నేతల నియామకం
- దుర్గగుడి చైర్మన్, మేయర్ భర్తకు కూడా బాధ్యతలు
- వెలంపల్లి తీరుపై రగిలిపోతున్న సెంట్రల్ వైసీపీ నేతలు
- తమపై స్థానికేతరుల పెత్తనమేమిటంటూ ఆగ్రహం
- కార్యాలయ ప్రారంభంలోనూ పశ్చిమదే పై చేయి

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ నియోజకవర్గంలో 21 డివిజన్లు ఉన్నాయి. వీటిలో 16 డివిజన్లకు వైసీపీ కార్పొరేటర్లు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ప్రస్తుతం అన్ని డివిజన్లకు కార్పొరేటర్లతో పాటు డివిజన్ కో-ఆర్డినేటర్లు ఉన్నారు. వీరంతా మల్లాది విష్ణు మనుషులు కావడంతో తనకు ఎంతవరకు సహకరిస్తారన్న అనుమానం పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో గురువారం 21 డివిజన్లకు ఇన్‌చార్జులను నియమిస్తూ వెలంపల్లి ఓ జాబితా విడుదల చేశారు. వీరంతా సెంట్రల్ నియోజకవర్గానికి చెందినవారైతే ఎలాంటి ఇబ్బంది ఉండేది కాదు. కానీ, 21 మందిలో ఒక్కరు కూడా స్థానికులు లేరు. అందరూ పశ్చిమ నియోజకవర్గానికి చెందినవారే. వీరిని ఇన్‌చార్జులుగా నియమించడంతో స్థానిక నాయకుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. డివిజన్ ఇన్‌చార్జులుగా నియమితులైన వారిలో దుర్గగుడి చైర్మన్, మేయర్ భర్త కూడా ఉండటం విశేషం. దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబును 60వ డివిజన్ ఇన్‌చార్జిగా నియమించారు. వెలంపల్లి అవినీతిలో కీలక భాగస్వామిగా పేరొందిన కొండపల్లి బుజ్జిని 29వ డివిజన్ ఇన్‌చార్జిగా, మేయర్ రాయన భాగ్యలక్ష్మి భర్త నరేంద్రను 31వ డివిజన్ ఇన్‌చార్జిగా నియమించారు.

ఇప్పుడే ఇలా.. గెలిస్తే ఎలా..?

ఎన్నికల ముందే సెంట్రల్ నియోజకవర్గంలో పశ్చిమ నియోజకవర్గ నాయకులను దింపి, తమపై పెత్తనం చెలాయించాలని చూస్తున్న వెలంపల్లి తీరుపై కార్పొరేటర్లు, డివిజన్ స్థాయి వైసీపీ నాయకులు అంతర్గతంగా ఆగ్రహావేశాలతో రగిలిపోతున్నారు. స్థానిక నాయకులను చేతగాని వారిగా పరిగణించి పొరుగున ఉన్న పశ్చిమ నాయకులను ఇక్కడికి దిగుమతి చేయడం ఏమిటని, ఇది తమను అవమానించడమేనని అంతర్గత చర్చల్లో మాట్లాడుకుంటున్నారు. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో నోరువిప్పి మాట్లాడితే ఏం జరుగుతుందోనని అవమానాలను భరిస్తున్నారు. సెంట్రల్ నియోజకవర్గంలో వైసీపీకి మంచి నాయకత్వమే ఉంది. సిటింగ్ ఎమ్మెల్యే మల్లాది విష్ణుతో పాటు ఫైబర్‌నెట్ చైర్మన్ గౌతంరెడ్డి, కార్పొరేటర్ జానారెడ్డి, డిప్యూటీ మేయర్ భర్త అవుతు శ్రీనివాసరెడ్డి, తోట శ్రీనివాస్ వంటి నాయకులు ఉన్నారు. వీరిలో ఒక్కరు కూడా వెలంపల్లిని మనస్ఫూర్తిగా స్వాగతించడం లేదని వారి అనుచరగణమే చెబుతోంది. వెలంపల్లి పొరపాటున సెంట్రల్‌లో గెలిస్తే ఇక్కడే పాతుకుపోతాడని, ఈ ఎలక్షన్లలో కాకపోతే వచ్చే ఎన్నికల్లోనైనా

మిగతా 6వ పేజీలో...



● పురస్కారం

బెస్ట్ ఎలక్ట్రోరల్ అవార్డు కలెక్టర్ ఢిల్లీరావును వరించింది. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు.

- 6లో..

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావుకు
బెస్ట్ ఎలక్ట్రోరల్ అవార్డు

▸▸ గవర్నర్ నుంచి పురస్కారం అందుకున్న కలెక్టర్

కృష్ణలంక, జనవరి 25 : ఎన్నికల ప్రక్రియలో సమర్థవంతమైన సేవలు అందించినందుకు ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.దిల్లీరావుకు బెస్ట్ ఎలక్ట్రోరల్ అవార్డు వరించింది. రాష్ట్రంలో ముగ్గురు కలెక్టర్లకు మాత్రమే ఈ అవార్డులు వరించగా.. వారిలో దిల్లీరావు ఒకరు. గురువారం గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి కలెక్టర్ అవార్డును అందుకున్నారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజాస్వామ్య ఔన్నత్యాన్ని ప్రజలకు వివరించి అర్హులైన వారిని ఓటర్ల జాబితాలో చేర్పించడంలోను, ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించడంలో కృతకృత్యులవ్వాలని కలెక్టర్ దిల్లీరావును గవర్నర్ అభినందించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో తుది ఓటర్ల జాబితా రూపకల్పనలో, ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాల్లో విశిష్ట సేవలందించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావుకు గవర్నర్ అబ్దుల్ నజీర్ పురస్కారాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యవ్యవస్థలో ఎన్నికల ప్రక్రియ కీలకమని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వామ్యం కావాల్సిన అవసరముందన్నారు. కలెక్టర్ దిల్లీరావు మాట్లాడుతూ, జిల్లా అధికారులు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలు, బీఎల్ఓలకు అప్పగించిన బాధ్యతలను సమిష్టి కృషితో సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా పురస్కారం లభించిందన్నారు. ఓటర్ల జాబితా రూపకల్పనలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ పురస్కారం లభించినట్లే అని పేర్కొన్నారు. చేసిన కృషిని గుర్తించి జిల్లాకు అవార్డును అందించినందుకు గవర్నర్, ఈసీఐ, సీఈఓలకు ధన్యవాదాలు తెలిపారు.



బీఎల్‌వోలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కలెక్టర్ దిల్లీరావు

ఓటర్ల జాబితా రూపకల్పనలో బీఎల్‌వోల సేవలు భేష్

కృష్ణలంక, జనవరి 25 : ఎన్టీఆర్ జిల్లా ఎస్ఎస్ఆర్-2024 ఓటర్ల జాబితా రూపకల్పనలో క్షేత్రస్థాయిలో బూత్‌స్థాయి అధికారుల (బీఎల్ఓ) సేవలను కలెక్టర్ ఎస్.దిల్లీరావు అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తుది ఓటర్ల జాబితా రూపకల్పనలో నిబద్ధతతో సేవలందించిన 48 మంది బీఎల్‌వోలకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా పరిశీలనకు ఇంటింటి సర్వే, కొత్త ఓటర్ల నమోదు, స్వీప్ కార్యక్రమాల విజయవంతానికి కృషి చేయడంలో బీఎల్‌వోలు కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు.

భక్తితో.. ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ

వన్‌టౌన్, జనవరి 25 : పౌర్ణమి సందర్భంగా దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్చరణలు, అమ్మవారి నామస్మరణలు, మంగళవాయిద్యాల నడుమ దుర్గాఘాట్ సమీపంలో శ్రీ కామధేను అమ్మవారి ఆలయం వద్ద ఉదయం 5.55 గంటలకు వేద పండితులు, అర్చకులు ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. ప్రచారరథంలో కొలువుదీరిన గంగా, పార్వతి సమేత మల్లేశ్వరస్వామివార్లకు భక్తులు పూలు, పండ్లు తదితరాలను సమర్పించి పూజలు చేసి ఆశీస్సులు అందుకున్నారు. గిరి ప్రదక్షిణ కుమ్మరిపాలెం సెంటర్, నాలుగుస్తంభాల సెంటర్, సితార సెంటర్, కబేళా, పాల ఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, నెహ్రూబొమ్మ సెంటర్, బ్రాహ్మణవీధి ఘాట్‌రోడ్డు మీదుగా డప్పులు, బేతాళ నృత్యాలు తదితర సాంస్కృతిక కార్యక్రమాల నడుమ తిరిగి ఆలయానికి చేరుకుంది. కార్యక్రమంలో ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ కర్నాటి రాంబాబు, సభ్యులు ఉద్యోగులు, భక్తులు పాల్గొన్నారు.



హుండీలలో నగదు లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

తిరుపతమ్మ హుండీల ఆదాయం రూ.కోటి

పెనుగంచిప్రోలు : తిరుపతమ్మ అమ్మవారికి రూ.1,21,59,039 నగదు, 80 యూఎస్ఏ డాలర్లు, ఆస్ట్రేలియా కరెన్సీ 50 పౌండ్స్, 37 గ్రాముల బంగారం, 720 గ్రాముల వెండి ఆదాయంగా సమకూరినట్టు ఆలయ ఈవో, డిప్యూటీ కలెక్టర్ కె.రమేష్ నాయుడు తెలిపారు. జగ్గయ్యపేట గ్రూప్ టెంపుల్స్ ఈవో సి.జయప్రకాష్‌బాబు సమక్షంలో అమ్మవారి హుండీల ఆదాయం గురువారం లెక్కించగా 117 రోజులకు భక్తులు కానుకల రూపంలో పై మొత్తాన్ని సమర్పించినట్టు ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఛైర్మన్ జంగాల శ్రీనివాసరావు (వాసు), ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

29 నుంచి నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ఉంగుటూరు, జనవరి 25 : కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణ భారత్‌ట్రస్ట్ ప్రాంగణంలోని యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయంఉపాధి ఉచితశిక్షణా సంస్థ(యూబీఆర్ఎస్ఈటీఐ)లో ఈనెల 29 నుంచి బ్యుటీషియన్(30రోజులు), ఫోటోగ్రఫీ అండ్ వీడియోగ్రఫీ (30రోజులు)లు, ఫిబ్రవరి మొదటివారంలో జ్యూట్‌బ్యాగుల తయారీ(13రోజులు)పై నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్టు సంస్థ డైరెక్టర్ పి.మల్లికార్జునరెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తెల్లరేషన్‌కార్డు కలిగి, 18నుంచి 45సం.ల మధ్య వయసు, తెలుగులో చదవటం, రాయటం వచ్చిన కృష్ణా/ఎన్టీఆర్ జిల్లాల్లోని గ్రామీణప్రాంతాలకు చెందిన అభ్యర్థులు పైన పేర్కొన్న చేతివృత్తుల్లో ఉచితశిక్షణకు అర్హులన్నారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు భోజన, వసతి సదుపాయాలు కల్పించబడతాయన్నారు. శిక్షణపూర్తిచేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు, కోర్సులకు సంబంధించిన మెటీరియల్‌ను ఉచితంగా అందించడంతోపాటు, వారి ఉపాధికి అవసరమైన సహాయ, సహకారాలు పూర్తిస్థాయిలో అందించటం జరుగుతుందన్నారు. ఆసక్తి గలవారు నాలుగు పాస్‌పోర్టుసైజు ఫోటోలు, రేషన్, ఆధార్‌కార్డు, విద్యార్హత ధ్రువీకరణపత్రాల నకళ్లతో ఈనెల 29లోగా నేరుగా శిక్షణాకేంద్రానికి విచ్చేసి పేర్లను నమోదుచేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 6304254730, 9962512337, 9440772382 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

మంత్రి జోగి ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే సారథి వర్గం డుమ్మా!

కంకిపాడు, జనవరి 25 : పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్తగా మంత్రి జోగి రమేశ్ నియోజకవర్గస్థాయి సమావేశానికి గురువారం కంకిపాడులోని ఓ హోటల్‌లో భారీగా ఏర్పాట్లు చేశారు. అయితే సమావేశానికి సారథి వర్గం డుమ్మా కొట్టింది. సమావేశానికి ప్రధానంగా కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ తుమ్మల చంద్రశేఖర్, కంకిపాడు ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, మండల అధ్యక్షుడు మద్దాలి రామచంద్రరావు, దుర్గగుడి పాలకమండలి మాజీ సభ్యుడు నెరుసు సతీష్, ఉప్పర కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా శ్రీనివాసరావు, పెనమలూరు మండలానికి చెందిన ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు వల్లె నరసింహారావు, ఉయ్యూరు మండలఅధ్యక్షులు హాజరు కాలేదు. వీరికి జోగి నుంచి ఆహ్వానం వెళ్లినా ఆత్మీయ సమావేశానికి రాకపోవడం చర్చనీయాంశంగా మారింది.

కాంగ్రెస్‌లోకి రండి..

రాష్ట్ర పర్యటనలో భాగంగా దుట్టాను కలిసిన షర్మిల

రాజకీయాలకు దూరంగా ఉంటున్నా : దుట్టా



దుట్టాతో షర్మిల భేటీ

హనుమాన్‌జంక్షన్, జనవరి 25 : గన్నవరం నియోజక వర్గ వైసీపీ సీనియర్ నేత దుట్టా రామచంద్రరావును పీసీసీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల కాంగ్రెస్ పార్టీలోకి రావాలని కోరారు. గురువారం రాష్ట్ర పర్యటనలో భాగంగా గన్నవరం వెళుతూ మార్గమధ్యలో హనుమాన్‌జంక్షన్‌లోని దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మిత్రుడు, సన్నిహితుడు సీనియర్ నేత దుట్టా రామచంద్రరావును ఆమె కలిశారు. కొద్ది సేపు మంతనాలు సాగించారు. కాంగ్రెస్ పార్టీకి మీలాంటి సీనియర్ నాయకులు అవసరం ఎంతో ఉందని, పార్టీకి పూర్వ వైభవం వస్తుందని చెప్పినట్టు సమాచారం. అయితే రాజకీయాలకు దూరంగా ఉంటున్నానని దుట్టా సున్నితంగా తిరస్కరించినట్టు తెలిసింది. అనంతరం షర్మిల మీడియాతో మాట్లాడుతూ, రాజశేఖర్ బిడ్డగా దుట్టా రామచంద్రరావు తనను ఆశీర్వదించి. సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని తెలిపారన్నారు. దుట్టా రామచంద్రరావు కాంగ్రెస్ పార్టీలోకి చేరతారా అన్న మీడియా ప్రతినిధుల ప్రశ్నకు వెరీ సూన్ అని షర్మిల బదులిచ్చారు. షర్మిల వెంట పీసీసీ మాజీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు, పీసీసీ సభ్యురాలు సుంకర పద్మశ్రీ ఉన్నారు.







బొమ్ములూరు టోల్‌గేట్ వద్ద స్వాధీనం చేసుకున్న నగదును చూపుతున్న సీఐ నరసింహమూర్తి, చౌటపల్లి వద్ద స్వాధీనం చేసుకున్న నగదుతో గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్, యాకమూరులో నగదుతో సీఐ కిషోర్‌బాబు

ఎన్నికలకు ముందే..
నోట్ల కట్టలు!

▸▸ రహదారులపై పోలీసుల తనిఖీలు ▸▸ పలుచోట్ల భారీగా నగదు స్వాధీనం

ఎన్నికలు సమీపిస్తుండటంతో ఉమ్మడి కృష్ణా జిల్లాల పోలీసు అధికారులు జాతీయ రహదారులపై వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. దీంతో అనుమతులు లేని నగదు భారీగా పట్టుబడుతోంది. బుధ, గురువారాల్లోనే పోలీసు తనిఖీల్లో సరైన పత్రాలు చూపని సుమారు రూ. కోటికి పైగా నగదును స్వాధీనం చేసుకున్నారు.

బొమ్ములూరు టోల్‌గేట్ వద్ద రెండు కార్లలో రూ. 60 లక్షలకు పైగా స్వాధీనం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జనవరి 25 : బొమ్ములూరు టోల్‌గేట్ వద్ద గురవారం సీఐ నరసింహమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో రెండుకార్లలో ఎటువంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ. 52,50,000, రూ. 9.94లక్షలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రియల్‌ఎస్టేట్ వ్యాపారం జేస్తూ బుధవారం రాత్రి కారులో నగదు తరలిస్తున్న ఇద్దరిని, భూమి అమ్మగా వచ్చిన సొమ్మని చెబుతూ గురువారం ఉదయం నగదుతో కాకినాడ నుంచి చెన్నయ్ వెళుతున్న ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎటువంటి పత్రాలు లేకుండా భారీ మొత్తంలో నగదు రవాణాను తనిఖీల్లో గుర్తించి తహసీల్దార్‌కు, ఇన్‌కం ట్యాక్స్ అధికారులకు సమాచారం అందించినట్టు సీఐ తెలిపారు. తనిఖీల్లో హనుమాన్‌జంక్షన్ ఎస్సై జనార్దన్, తిరుమలరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చౌటుపల్లి వద్ద రూ.61 లక్షలు సీజ్

గుడివాడ రూరల్ : గుడివాడ రూరల్ మండలం ముదినేపల్లి రోడ్డులో చౌటుపల్లి వద్ద రూరల్ పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టి సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.61 లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్ తెలిపారు. వేములపల్లి సత్యనారాయణ కారులో రూ.61 లక్షలు తరలిస్తుండగా సీజ్ చేసినట్టు తెలిపారు. తనిఖీల్లో గుడివాడ రూరల్ సీఐ ఏసుబాబు, ఎస్ఐ లక్ష్మీనరసింహమూర్తి పాల్గొన్నారు.

యాకమూరులో రూ. 9 లక్షలు..

తోట్లవల్లూరు : యాకమూరు చెక్‌పోస్టు వద్ద గురువారం వాహన తనిఖీల్లో ఎటువంటి పత్రాలు చూపని రూ. 9 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ఎం కిషోర్‌బాబు తెలిపారు.

పోరంకిలో రూ.8.80లక్షలు..

పెనమలూరు : పశ్చిమ గోదావరిజిల్లా ఉంగుటూరు మండలం వెలమిల్లి గ్రామానికి చెందిన వాకచర్ల వెంకటేశ్వరరావు బుధవారం పోరంకి వందడుగుల రోడ్డులో కారులో వెళుతుండగా పోలీసులు తనిఖీలు నిర్వహించి ఎటువంటి పత్రాలు లేని రూ.8.80లక్షలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

పొట్టిపాడు టోల్‌గేట్ వద్ద రూ. 4.10లక్షలు..

ఉంగుటూరు : పొట్టిపాడు టోల్‌గేట్‌వద్ద గురువారం ఆత్కూరు ఎస్సై టి.సూర్యశ్రీనివాస్ నేతృత్వంలో చేపట్టిన వాహనాల తనిఖీల్లో సరైన పత్రాలు లేకుండా ఐదుగురు వ్యక్తులు పిడుగురాళ్లనుంచి రావులపాలెంకు కారులో తరలిస్తున్న రూ.4.10లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఫైనాన్స్ వ్యాపారం నిమిత్తం తీసుకెళ్తున్నట్టు సదరు వ్యక్తులు విచారణలో వెల్లడించినట్టు ఎస్సై తెలిపారు.

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం

▸▸ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు

కృష్ణలంక, జనవరి 25 : ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్రస్థాయి 75వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసినట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు తెలిపారు. గురువారం స్టేడియంలో నిర్వహించిన రిహార్సల్స్‌ను ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి అజయ్‌జైన్, ఏపీఎస్‌పీ బెటాలియన్ అదనపు డైరెక్టర్ జనరల్ బి.శంకర్‌బాత్ర భక్షి, ప్రొటోకాల్ డైరెక్టర్, జీఏడీ డిప్యూటీ సెక్రటరీ ఎం.బాలసుబ్రమణ్యం రెడ్డి, కలెక్టర్ దిల్లీరావు, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, నగర పోలీసు కమిషనర్ కాంతిరాణా తదితరులు పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, స్టేడియంలో రాష్ట్రస్థాయి గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు తెలిపారు. వేడుకలకు ఉదయం 8.51లకు రాష్ట్ర డీజీపీ కేవీ రాజేంద్రనాథ్ రెడ్డి, 8.55లకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహరరెడ్డి, 8.56లకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్‌సింగ్ ఠాగూర్, 5.57 రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి, 8.58కు గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రాంగణానికి చేరుకొంటారని తెలిపారు. ఉదయం 9గంటలకు గవర్నర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. అనంతరం పోలీసు గౌరవ వందనాన్ని స్వీకరించి గణతంత్ర దినోత్సవ సందేశాన్ని ఇస్తారన్నారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ అభివృద్ధి పథకాలపై రూపొందించిన అలంకృత శకటాలను పరిశీలిస్తారని, ఉత్తమ ప్రదర్శన కనబరిచిన శకటాలకు, కవాతు బృందాలకు జ్ఞాపికలను అందచేస్తారన్నారు. వేడుకలో ఇండియన్ ఆర్మీ, సెంట్రల్ రిజర్వ్ పోలీసు, తమిళనాడు రాష్ట్ర పోలీసు, కర్నూల్ ఏపీఎస్‌పీ రెండో బెటాలియన్, విజయనగరం ఏపీఎస్‌పీ ఐదో బెటాలియన్, ఎన్‌సీసీ బాలబాలికలు తదితర బృందాలు కవాతులో పాల్గొంటారని కలెక్టర్ తెలిపారు.



రిహార్సల్స్ పరిశీలిస్తున్న కలెక్టర్ దిల్లీరావు

పద్మవిభూషణ్ చిరంజీవికి అభినందనలు - ఎంపీ బాలశౌరి

విజయవాడ, జనవరి 25 : ప్రముఖ సినీ నటుడు చిరంజీవికి పద్మవిభూషణ్ పురస్కారం రావడం ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలందరికీ గర్వకారణమని మచిలీపట్నం ఎంపీ బాలశౌరి పేర్కొన్నారు. పద్మవిభూషణ్ పురస్కారం లభించిన సందర్భంగా ఆయన చిరంజీవికి అభినందనలు తెలియజేశారు. స్వయంకృషితో ఎదిగిన వ్యక్తి చిరంజీవి అని, ఆయన క్రమశిక్షణ, కఠోర శ్రమే ఆయనకు ఈ పురస్కారం దక్కేలా చేసిందన్నారు. భారతరత్నకు అర్హుడైన వ్యక్తి అని ఆయనకు దేశ అత్యున్నత పురస్కారమూ దక్కాలని కోరుకుంటున్నట్టు బాలశౌరి పేర్కొన్నారు.

ప్రత్యేక రైళ్ల సేవలు పొడిగింపు

హైదరాబాద్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని ఆయా ప్రాంతాలకు కేటాయించిన ప్రత్యేక రైళ్ల సేవల గడువును పొడిగించినట్లు గురువారం దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. తిరుపతి -అకోలా ప్రత్యేక రైలు(07605)ఫిబ్రవరి 2 నుంచి మార్చి29 వరకు, అకోలా-తిరుపతి రైలు(07606) ఫిబ్రవరి4 నుంచి మార్చి31 వరకు, పూర్ణ-తిరుపతి రైలు (07609) ఫిబ్రవరి 5నుంచి మార్చి25వరకు, తిరుపతి-పూర్ణ రైలు(07610)ఫిబ్రవరి 6 నుంచి మార్చి26 వరకు పొడిగించారు. అలాగే హైదరాబాద్-నర్సాపూర్ రైలు(07631), లింగంపల్లి-కాకినాడ టౌన్ రైలు(07446) ఫిబ్రవరి 3నుంచి మార్చి 30 వరకు, నర్సాపూర్-హైదరాబాద్ రైలు(07632), తిరుపతి-సికింద్రాబాద్ రైలు(07481) ఫిబ్రవరి 4 నుంచి మార్చి31 వరకు, సికింద్రాబాద్-తిరుపతి రైలు(07482) ఫిబ్రవరి 5నుంచి ఏప్రిల్ 1 వరకు , కాకినాడ టౌన్-లింగంపల్లి ప్రత్యేక రైలు (07445)ఫిబ్రవరి 2 నుంచి మార్చి 29వరకు పొడిగించినట్లు రైల్వే అధికారులు తెలిపారు.

ప్రజా ప్రభుత్వం ఏర్పాటుతో అమరావతి రాజధాని

▸▸ కేశినేని శివనాథ్(చిన్ని)

విద్యాధరపురం, జనవరి 25 : మూడు నెలల తరువాత ఆంధ్రప్రదేశ్‌లో ప్రజా ప్రభుత్వం ఏర్పాటై అమరావతి రాజధానిగా కొనసాగుతుందని టీడీపీ సీనియర్ నాయకులు కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. అమరావతి పరిరక్షణ మహోద్యమం 1500 రోజులు పూర్తయిన సందర్భంగా గురువారం వెలగపూడిలో జరిగిన అమరావతి శంఖారావం సభలో కేశినేని చిన్ని, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా కేశినేని చిన్ని మాట్లాడుతూ, అమరావతి రైతుల ఉద్యమానికి టీడీపీ మద్దతు ఉంటుందన్నారు. మూడు నెలల తరువాత జగన్‌రెడ్డి ఇంటికే పరిమితమవుతాడని తెలిపారు. వైసీపీ మునిగిపోయే నావ అని.. చాలామంది టీడీపీ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. మూడు నెలల తరువాత ఏపీలో ఏర్పడే ప్రజా ప్రభుత్వం అమరావతిలోనే రాజధాని నిర్మాణాలు చేపడతామని, అప్పటివరకు రైతులు ధైర్యంగా ఉండాలని చెప్పారు. ఓటు ఆయుధంతో సీఎం జగన్‌రెడ్డికి బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరిట రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారన్నారు. ఎన్నికల ముందు మెరుగైన రాజధాని అమరావతిలోనే నిర్మిస్తామని చెప్పి ముఖ్యమంత్రి జగన్ మాట తప్పారన్నారు. రాజధాని అమరావతిని నిర్వీర్యం చేశారన్నారు. వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర అభివృద్ధిని విస్మరించారన్నారు. మోదీ, జగన్ ఇద్దరూ తోడు దొంగలేనని, రాష్ట్రానికి రాజధాని లేకుండా చేసిన పాపం ఇద్దరిదీ అని ఎద్దేవా చేశారు. రాజధానికి తమకు సంబంధం లేదని కోర్టులో బీజేపీ, కేంద్రం అఫిడవిట్ దాఖలు చేసిందన్నారు. విశాఖ ఉక్కు నిలబడాలని, ప్రత్యేక హోదా రావాలని డిమాండ్ చేశారు. రాజధానిగా అమరావతిని కొనసాగించడమే కాకుండా రాజధానిలో ఉన్న రైతులకు కౌలు 20 సంవత్సరాలు పొడిగించాలన్నారు. ప్రజా ఉద్యమమే ఇప్పటివరకు అమరావతిని కాపాడిందని, భవిష్యత్తులోనూ రాష్ట్ర ప్రజల సంఘీభావం ఐక్యఉద్యమాన్ని నమ్ముకుంటేనే న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రాజధాని అమరావతి కార్యదర్శి ఎం.రవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేశినేని శివనాథ్ (చిన్ని)

మహిళల ద్రోహి జగన్ రెడ్డి

▸▸ తల్లి, చెల్లినే కాదు అంగన్వాడీ, డ్వాక్రాలకూ మోసం

▸▸ ఆసరా పేరుతో అక్క చెల్లెమ్మలకు టోకరా

▸▸ నెట్టెం రఘురాం, ఆచంట సునీతల ధ్వజం

జగ్గయ్యపేట, జనవరి 25 : రాష్ట్రంలో కోటి 14 లక్షల మంది డ్వాక్రా మహిళల్లో 75 శాతం మంది మహిళలకు సకాలంలో రుణాలు చెల్లించ లేదనే సాకుతో ఆసరా పథకం రాకుండా ఎగనామం పెట్టిన జగన్‌రెడ్డి మహిళా ద్రోహి అని ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి నెట్టెం రఘురాం ధ్వజమెత్తారు. చెల్లిని, తల్లిని మోసం చేసేందుకూ వెనుకాడని జగన్‌రెడ్డి అమరావతి మహిళా రైతులు, డ్వాక్రా మహిళలు, అంగన్వాడీ కార్యకర్తలు యానిమేటర్లు ఇలా మహిళలందరినీ కక్ష గట్టి వేధిస్తున్నాడని అన్నారు. గురువారం ఆయన తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ, డ్వాక్రా మహిళలు దాచుకున్న రూ.2158 కోట్లు అభయ హస్తం నిధులను దారి మళ్లించటం జగన్‌మార్క్ స్త్రీ సంక్షేమమని ఎద్దేవా చేశారు. ఎస్సీ ఎస్టీ మహిళల కోసం నాడు చంద్రబాబు రూ.800 కోట్లు ఇస్తే.. జగన్‌రెడ్డి 45 ఏళ్లకే పింఛన్ పేరుతో ఒక్కొక్క మహిళకు రూ.1.80లక్షలకు టోకరా వేశారని విమర్శించారు. రాష్ట్ర తెలుగునాడు అంగన్వాడీ, డ్వాక్రా సాధికారత సంస్థ అధ్యక్షురాలు ఆచంట సునీత మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీల నివేదిక ప్రకారమే రాష్ట్రంలో మహిళలపై 2 లక్షలకు పైగా అత్యాచారాలు జరగటమే జగన్‌రెడ్డి పాలనలో జరిగిన మహిళా ఉద్ధరణ అని విమర్శించారు. డ్వాక్రా మహిళలను నిలువునా ముంచాడని ఆసరా కొందరికే దక్కిందని విమర్శించారు. చంద్రబాబు మానసపుత్రికలుగా డ్వాక్రా మహిళలు దేశంలోనే విప్లవాత్మక పొదుపు ఉద్యమాన్ని తీసుకువచ్చారని అన్నారు. సమావేశంలో విజయవాడ పార్లమెంట్ అంగన్వాడీ విభాగం ప్రధాన కార్యదర్శి గద్దె రాజ్యలక్ష్మి, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కన్నెబోయిన రామలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.



జయహో బీసీ కార్యక్రమంలో మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర

టీడీపీ, జనసేన ప్రభుత్వంతోనే బీసీలకు సముచిత స్థానం : రవీంద్ర

మచిలీపట్నం టౌన్ : టీడీపీ, జనసేన ప్రభుత్వంతోనే బీసీలకు సముచిత స్థానం లభిస్తుందని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర అన్నారు. బందరు మండలం చిన్నాపురం గ్రామంలో జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో కొల్లు రవీంద్ర మాట్లాడుతూ, వైసీపీ పాలనలో బీసీలకు అందాల్సిన రిజర్వేషన్లలో కోత విధించడంతో పదవులు లభించకుండా పోయాయన్నారు. బీసీ కార్పొరేషన్ నిర్వీర్యమైందని, సబ్సిడీ రుణాలు రద్దు చేశారన్నారు. చంద్రబాబు హయాంలో బీసీ వర్గాలకు తగిన ప్రాధాన్యత కల్పించారన్నారు. జగన్‌రెడ్డి పాలనలో కక్షసాధింపు చర్యలకు పాల్పడుతూ పలువురు తెలుగుదేశం నాయకులపై అక్రమ కేసులు పెట్టించి జైళ్లకు పంపారన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ల బుల్లయ్య, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, గల్లా తిమోతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురికి రవీంద్ర టీడీపీ కండువాలు కప్పి పార్టీలో చేర్చుకున్నారు.

ఎనిమిది మంది ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగ్

విజయవాడ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు రేంజ్ నుంచి వచ్చిన కోమాకుల శివాజీకి సైబర్ క్రైం పీఎస్ 1లో పోస్టింగ్ ఇచ్చారు. ఇంతకుముందు ఆయన ఇదే పోస్టులో పనిచేశారు. వైసత్యరమేష్‌కు సైబర్ క్రైం పీఎస్ 2ను కేటాయించారు. ఆర్.విజయ్‌కుమార్‌కు ట్రాఫిక్ 3లో పోస్టింగ్ ఇచ్చారు. బి.వెంకటేశ్వరరావును ట్రాఫిక్1లో నియమించారు. ఎస్.పరమేశ్వర్‌కు సీసీఎస్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ఇబ్రహీంపట్నం నుంచి వీఆర్‌లోకి వచ్చిన పలివెల శ్రీనుకు స్పెషల్‌బ్రాంచ్‌లో పోస్టింగ్ ఇచ్చారు. ట్రాఫిక్ విభాగంలో ఉన్న కె.మహేంద్రకు స్పెషల్ బ్రాంచ్ అటాచ్‌మెంట్ ఇచ్చి ట్రాఫిక్2లో పోస్టింగ్ ఇచ్చారు. వీఆర్‌లో ఉన్న ఎస్‌కే అహ్మద్ ఆలీని ట్రాఫిక్ 3కి బదిలీ చేశారు. ఎస్‌వీవీ లక్ష్మీనారాయణకు సీసీఎస్ అటాచ్‌మెంట్ ఇచ్చి పీసీఆర్ కేటాయించారు.

మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య



మైలవరం, జనవరి 25 : ప్రియుడితో మనస్పర్ధల కారణంగా మనస్తాపం చెందిన మహిళా కానిస్టేబుల్ చాలిఎంపరంబిల్ సురభి(24) ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. తోట్లవల్లూరు మండలం బొడ్డపాడు గ్రామంలో సచివాలయ మహిళా కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సురభి నూజివీడు మండలం యలమందల గ్రామానికి చెందిన సురేష్ ప్రేమించుకున్నారు. బుధవారం రాత్రి ప్రియుడితో గొడవపడి ఆశ్రమంలో గురువారం తెల్లవారుజామున మైలవరంలో దేవుని చెరువులో అద్దెకుంటున్న ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మైలవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి ఎస్సై ఎస్.హరిప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సభా సమరం

(5వ పేజీ తరువాయి)

వెలగపూడి గోపాలకృష్ణ మాట్లాడుతూ 81 రోజుల సమయమే మిగిలి ఉందని, బీజేపీ, సీపీఐ, సీపీఎంలు సిద్ధాంతాలను పక్కనపెట్టి రాష్ట్రం కోసం చంద్రబాబును గెలిపించాలని వేడుకున్నారు.

అమరావతిపై అసత్య ప్రచారాలు

వెలగపూడి శిబిరంలో టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ మాట్లాడుతూ సైకో జగన్‌పై మొట్టమొదట తిరుగుబాటు బావుటా ఎగరేసింది అమరావతి రైతులేనన్నారు. టీడీపీ నాయకురాలు నన్నపనేని రాజకుమారి కన్నీటి పర్యంతమయ్యారు. మందడం సభలో శాసన మండలి మాజీ ఛైర్మన్ షరీఫ్ మాట్లాడుతూ మూడు రాజధానుల బిల్లును మండలిలో ఆమోదం పొందడానికి జగన్‌రెడ్డి అనేక ప్రలోభాలు చేశారన్నారు. టీడీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అమరావతి పోరాటం తుది దశకు చేరిందన్నారు. ఈ సభలో టీడీపీ నాయకులు కేశినేని శివనాథ్ (చిన్ని), కృష్ణా జిల్లా పరిషత్ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనూరాధ, మైనారిటీ నేత ఫరూక్ షుబ్లీ, సీపీఐ నాయకుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు, దళిత జేఏసీ నేత పోతుల బాలకోటయ్య, నాయకులు పిల్లి మాణిక్యరావు, ఆంధ్రప్రదేశ్ పరిరక్షణ సమితి నేత కొలికిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అట్నుంచి ఇటూ..

(5వ పేజీ తరువాయి)

సీటు దక్కుతుందన్న ఆశతో ఉన్న పై నాయకుల ఆశలన్నీ ఆవిరైపోతాయని, ఈ కారణంగా వెలంపల్లి గెలవడానికి వీరెవ్వరూ సహకరించే పరిస్థితి లేదని వైసీపీకి చెందిన ఓ సీనియర్ కార్పొరేటర్ వ్యాఖ్యానించారు.

సజ్జల రాక వెనుక కారణమదే..

వైసీపీ సెంట్రల్ కార్యాలయ ప్రారంభోత్సవానికి గురువారం సజ్జల రామకృష్ణారెడ్డి హాజరయ్యారు. సజ్జల రాక వెనుక పెద్ద కథే నడిచింది. కార్యాలయ ప్రారంభోత్సవానికి సిట్టింగ్ ఎమ్మెల్యే మల్లాది విష్ణును వెలంపల్లి ఆహ్వానించగా, ఆయన నుంచి స్పందన రాలేదు. దీంతో విష్ణు హాజరుకాకుంటే దాని ప్రభావం కచ్చితంగా ఎన్నికల ప్రచారంపై పడుతుందని, ఆదిలోనే హంసపాదుగా మారుతుందని భావించిన వెలంపల్లి చక్రం తిప్పి సజ్జలను కార్యాలయ ప్రారంభోత్సవానికి ఆహ్వానించినట్టు వైసీపీ వర్గాల సమాచారం. సజ్జల రావడంతో విష్ణు కూడా తప్పనిసరి పరిస్థితుల్లో హాజరయ్యారు. దీంతో వెలంపల్లి వర్గం ఊపిరిపీల్చుకుంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	119, 127, 138
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.40

ఇంటికెళ్లడానికి జగన్‌రెడ్డి సిద్ధమా..?

విద్యాధరపురం, జనవరి 25: నగరంలో సిద్ధం పేరుతో జగన్‌రెడ్డి ఫొటోతో ఇబ్బడి ముబ్బడిగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంపై టీడీపీ జిల్లా కార్యదర్శి మీర్జా ముజఫర్ బేగ్ స్పందిస్తూ ఇంటికెళ్లడానికి జగన్‌రెడ్డి సిద్ధమా అని ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్‌రెడ్డి ఇంటికి వెళ్లిపోవడానికి సిద్ధం పేరిట ముందుగానే ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు అనిపిస్తుందన్నారు. దిగిపోవాల్సి వస్తే సంతోషంగా అంగీకరిస్తానంటూ జగన్ ఒక జాతీయ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన ఉదహరించారు. ఇంటర్వ్యూ ఇచ్చి 24 గంటలు కూడా గడవకముందే దిగిపోయేందుకు సిద్ధం అంటూ జగన్‌రెడ్డి పరోక్షంగా ఓటమిని అంగీకరిస్తున్నారా? అని ప్రశ్నించారు. సిద్ధం ఫ్లెక్సీల అర్థాన్ని విశదీకరించాలన్నారు.

నగరాభివృద్ధే లక్ష్యంగా బడ్జెట్

చిట్టినగర్, జనవరి 25(ఆంధ్రజ్యోతి) : ప్రజల శ్రేయస్సు, నగర అభివృద్ధే ధ్యేయంగా బడ్జెట్‌ను రూపొందించాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ అన్నారు. వీఎంసీ కార్యాలయంలో తన చాంబర్‌లో అధికారులతో గురువారం సమావేశమయ్యారు. 2024-2025 బడ్జెట్ అంచనాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. నగర అభివృద్ధిపై పలు సూచనలు చేశారు.

చంద్రబాబుతోనే భవిష్యత్తుకు గ్యారెంటీ

మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

గుణదల, జనవరి 25: యువత భవిష్యత్తుకు గ్యారెంటీ టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుతోనే సాధ్యపడుతుందని సెంట్రల్ మాజీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం గుణదల్లోని ఒకటవ డివిజన్లో గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా బొండా ఉమా ఒకటవ డివిజన్లో ఇంటింటికి తిరిగి భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను పంపిణీ చేశారు. అదే సమయంలో స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పూర్ టు రిచ్ కుటుంబాలకు నమ్మకం భరోసా అనేది టీడీపీ అధికారంలోకి వస్తేనే సాధ్యపడుతుందని చెప్పారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో చంద్రబాబు వెనుకడుగు వేయరన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం అనే పునాదులపై ఏర్పాటు చేసిన పార్టీ టీడీపీ అని చెప్పారు. స్థానిక టీడీపీ నేతలు పిన్నమనేని రితీష్ కుమార్, సురేష్, మురళి, దేవి, శివ బార్గవ్, సత్య తదితరులు పాల్గొన్నారు.



భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో స్థానికులతో మాట్లాడుతున్న బొండా ఉమా, బొండా రవితేజ, ఎంఎస్ బేగ్

బీసీల చైతన్య బస్సుయాత్ర జయప్రదం చేయాలి

అజిత్‌సింగ్‌నగర్: స్థానిక టీడీపీ సెంట్రల్ కార్యాలయంలో గురువారం టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు నియోజకవర్గ బీసీ నేతలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27, 28, 29 తేదీల్లో నియోజకవర్గంలో పెద్ద ఎత్తున తలపెట్టిన బీసీల చైతన్య బస్సు యాత్ర, పాదయాత్రలలో ప్రతి ఒక్కరూ పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

అభివృద్ధిపై శ్వేతపత్రం

విడుదల చేయాలి: బొండా రవితేజ

అజిత్‌సింగ్‌నగర్: సెంట్రల్ నియోజకవర్గం అభివృద్ధిపై వైసీపీ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని టీడీపీ యువనేత బొండా రవితేజ డిమాండ్ చేశారు. అజిత్‌సింగ్‌నగర్ 58వ డివిజన్‌లో గురువారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన ఇంటింటికి వెళ్లి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం టీడీపీ అధికారంలోకి రాగానే అమలు చేయనున్న వివిధ పథకాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. నేతలు ఎరుబోతు శ్రావణి, ఎరుబోతు రామారావు, పిరియా సోమేశ్వరరావు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలుపునకు కృషి చేయాలి

విద్యాధరపుర: రానున్న ఎన్నికలలో టీడీపీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్ 40వ డివిజన్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. గురువారం ఆయన 40వ డివిజన్ అధ్యక్షుడు పి.వి చిన్నసుబ్బయ్యతో కలిసి యువతతో మమేకమై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ నిర్వహించిన యువగళం పాదయాత్ర ముఖ్య ఉద్దేశ్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జగన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఇంటికి పంపించి టీడీపీని అధికారంలోకి తీసుకురావాలన్నారు. ముఖ్యంగా యువతకు మంచిరోజులు వస్తున్నాయని ఆయన తెలిపారు.

ఆసరా పేరుతో డ్వాక్రా మహిళలకు జగన్ టోకరా: ఎంఎస్ బేగ్

వన్‌టౌన్, జనవరి 25: ఆసరా పేరుతో జగన్‌రెడ్డి డ్వాక్రా మహిళలకు టోకరా వేస్తున్నారని టీడీపీ సీనియర్ నాయకులు ఎంఎస్ బేగ్ అన్నారు. గురువారం వన్‌టౌన్‌లోని పశ్చిమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాసిరకం మద్యంతో మహిళల తాళి తెంచుతున్నారన్నారు. వివేకా హత్య కేసు నిందితులను రక్షిస్తున్న జగన్ మహిళా ద్రోహి కాదా అని ప్రశ్నించారు. ఉచితంగా ఇళ్లు ఇస్తామని నమ్మించి మాట తప్పి ఓటీఎస్ పేరుతో ఒక్కొక్క మహిళ వద్ద రూ.10 నుంచి రూ.30 వేలు డబ్బులను బలవంతంగా వసూలు చేశారని తెలిపారు. మహిళా అధ్యక్షురాలు సుకాశి సరిత మాట్లాడుతూ చంద్రన్న పాలనలో సున్నా వడ్డీ రూ.5లక్షలకు వర్తింప చేస్తే జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత రూ.3లక్షల కోత కోసి మోసం చేశారన్నారు. మహిళా ప్రధాన కార్యదర్శి నసీమా, ఎల్.శాంతి, రాధిక, కొట్టేటి సరిత, వరలక్ష్మి, అపర్ణ, బుజ్జి, లక్ష్మి, రామలక్ష్మి, మల్లేశ్వరి, విజయలక్ష్మి, మౌనిక, జానకి, పార్వతి పాల్గొన్నారు.

పశ్చిమ కాంగ్రెస్ టికెట్‌కు మీసాల రాజేశ్వరరావు దరఖాస్తు

వన్‌టౌన్, జనవరి 25: విజయవాడ పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసేందుకు తనకు అవకాశం కల్పించాలని పీసీసీ ఉపాధ్యక్షుడు మీసాల రాజేశ్వరరావు పార్టీ నేతలకు దరఖాస్తు చేసుకున్నారు. ఆంధ్రరత్నభవన్‌లో గురువారం సంబంధిత నాయకులకు దరఖాస్తును అందజేశారు. నియోజకవర్గ ప్రజల అభీష్టం మేరకు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తానని ఆయన తెలిపారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ ఓటుతోనే సాధ్యం

వీఎంసీ డిప్యూటీ కమిషనర్ డి.వెంకటలక్ష్మి



డాక్టర్ పి.కృష్ణమూర్తిని సత్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు, తదితరులు

వన్‌టౌన్, జనవరి 25: ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారానే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమవుతుందని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ డి.వెంకటలక్ష్మి అన్నారు. కేబీఎన్ కాలేజీ జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్)విభాగాల ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం అవగాహన కార్యక్రమాన్ని, వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకటలక్ష్మి మాట్లాడుతూ ఓటు హక్కును తెలియజేసేందుకు, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఓటరు దినోత్సవాన్ని పెద్ద ఎత్తున దేశ వ్యాప్తంగా నిర్వహిస్తుందని తెలిపారు.

సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు మాట్లాడుతూ దేశంలో అత్యధికంగా ఉన్న యువత ఓటును వినియోగించుకోవటంపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఓటు అవశ్యకతను సమాజంలోని ప్రతి ఒక్కరికి తెలియజేయాలని యువతకు సూచించారు. అనంతరం ఎక్కువ పర్యాయాలు ఓటు వేసిన సీనియర్ సిటిజన్, కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కృష్ణమూర్తిని ఘనంగా సత్కరించారు. కొత్తగా ఓటు నమోదైన వారికి ఐడీ కార్డును అందించారు. వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రామ్ ఆఫీసర్ వి.శేషగిరిరావు స్వాగతం పలకగా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డి.పవన్‌కుమార్, ఎన్.సాంబశివరావు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యానికి ఓటే ఆయుధం : ఎమ్మెల్యే గద్దె

పటమట, జనవరి 25 : మంచి సమాజాన్ని నిర్మించాలన్నా, మంచి పాలకులను ఎన్నుకోవడం ఓటుతోనే సాధ్యమవుతుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలించే వారిని ఎన్నుకుని తద్వారా మంచి భవిష్యత్తును అందుకోవాలనే ఉద్దేశ్యంతో అంబేడ్కర్ ఓటు హక్కును కల్పించారని తెలిపారు. పాలకులను ప్రశ్నించే హక్కు ఉన్నప్పటికీ మంచివారిని ఎన్నుకునే హక్కు మాత్రం ఓటు ద్వారానే సాధ్యమని అన్నారు. రాతియుగం నుంచి స్వర్ణయుగం వైపు నడిపించేది ఓటు మాత్రమేనని అన్నారు. ప్రతి ఒక్కరూ వారి ఓటును ఎప్పటికప్పుడు ఉందో లేదో పరిశీలించుకోవాలని అన్నారు. ఓటు లేనివారు వెంటనే కొత్త ఓటు నమోదు చేసుకోవాలని అన్నారు. ప్రజాస్వామ్యానికి ఓటే పునాది అని, ఓటు హక్కును నిర్లక్ష్యం చేయొద్దని గద్దె కోరారు. తమ ఓటు హక్కు ఉందో లేదో తెలుసుకునేందుకు అశోక్ నగర్‌లోని తమ కార్యాలయంలో, మొబైల్ నెంబర్ 9346922569కు చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

వివాహిత ఆత్మహత్య

పాయకాపురం, జనవరి 25 : భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై నున్న రూరల్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం వాంబేకాలనీ ప్రాంతానికి చెందిన పోతునూరి తేజశ్రీ(23)కి ఆంధ్రప్రభ కాలనీకి చెందిన గర్రె వెంకటేష్‌బాబుకు రెండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఓ బాబు. భర్త విధుల నిమిత్తం నాలుగు రోజుల క్రితం వేరే ఊరెళ్లాడు. భార్య వాంబేకాలనీలోని పుట్టింటికి వచ్చింది. బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అందుకున్న నున్న రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అయితే భర్త వేధింపుల కారణంగానే తమ కుమార్తె ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆ కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మరో యువకుడు..

కండ్రిక ప్రాంతానికి చెందిన ధవరసింగ్ సింహాచలం(30) అతని భార్యకు మనస్పర్థల కారణంగా కొంతకాలంగా దూరంగా ఉంటున్నారు. అయితే బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో సింహాచలం ఫ్యాన్ రాడ్డుకు చీరతో ఉరివేసుకున్నాడు. సమాచారం అందుకున్న నున్న రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ధర్నా చేస్తున్న మహిళలు, పాల్గొన్న మహేష్, నాగోతి రామారావు, డి.వి.రమణబాబు

తాగునీటి సమస్యను పరిష్కరించాలని
ఖాళీ బిందెలతో మహిళల ధర్నా

చిట్టినగర్, జనవరి 25:. 47వ డివిజన్ కొండప్రాంతంలో మంచినీటి సమస్యను పరిష్కరించాలని గురువారం టీనర్‌పేట అడ్డరోడ్డు, సర్కిల్ కార్యాలయం ఎదుట మహిళలు ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. ధర్నాలో జనసేన , టీడీపీ, సీపీఐ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జనసేన నగర అధ్యక్షుడు పోతిన మహేశ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించాల్సిన కార్పొరేటర్ డివిజన్‌లో కనిపించడంలేదని, ప్రజల సమస్యలు గాలికి వదిలేశారని దుయ్యబట్టారు. కొన్ని రోజులుగా 47వ డివిజన్ కొండప్రాంతంలో మంచినీటి సమస్యతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గుక్కెడు మంచినీటి కోసం మహిళలు రోడ్లు ఎక్కాల్సిన పరిస్థితన్నారు. మేయర్ డివిజన్‌లోనూ పరిస్థితి ఇదేనన్నారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోకుంటే ప్రజలతోపాటు వివిధ రాజకీయ పార్టీలతో కలిసి ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ మాజీ కార్పొరేటర్ డి.వి. రమణబాబు, టీడీపీ నాయకులు నాగోతి రామారావు, వై.కనకరావు, జి. అనిల్‌కుమార్, మల్లెపు రాజు, విజయకుమారి, పొట్నూరి శ్రీనివాసరావు, గడ్డిపాటి కిరణ్‌కుమార్, మల్లెపు విజయలక్ష్మి, హనుమాన్, శనివారపు శివ, వాసు. బొట్టా సాయికుమార్, గంగాధర్, పులిచేరి రమేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ దుకాణం నుంచి మద్యం అక్రమంగా తరలిస్తున్న
వైన్‌షాపు సూపర్‌వైజర్, సేల్స్‌మన్‌లపై కేసు

పాయకాపురం, జనవరి 25 : మద్యం అక్రమంగా తరలిస్తూ బుధవారం అరెస్టు అయిన సింగ్‌నగర్‌కు చెందిన కోన గిరీష్ బాబు ప్రభుత్వ వైన్స్ షాపులో సేల్స్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. అతనితో పాటు సహకరించిన మరో వ్యక్తిపై గురువారం నున్న రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం పాయకాపురం ఉడాకాలనీ సబ్‌స్టేషన్ ప్రాంతం వైపుగా మద్యం అక్రమంగా తరలుతున్నట్లు నున్న రూరల్ పోలీసులకు బుధవారం సమాచారం అందింది. ఆ ప్రాంతానికి వెళ్లిన పోలీసులు అనుమానాస్పదంగా మోటర్‌సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద మద్యం సీసాలు ఉన్నట్లు గుర్తించి, స్టేషన్‌కు తరలించి విచారించారు. సదరు వ్యక్తి కండ్రిక పాతపాడు రోడ్డులోని ప్రభుత్వ వైన్స్ షాపులో సేల్స్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్న కోన గిరీష్‌బాబుగా విచారణలో తేలింది. మరింత లోతుగా విచారించగా వైన్ షాపు సూపర్‌వైజర్ రౌతు రామకృష్ణ సహాయంతో భవానీపురంలోని బార్ అండ్ రెస్టారెంట్‌లకు మద్యాన్ని అధిక రేట్లకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నట్లు తేలింది. వారి వద్ద నుంచి 192 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



నున్న రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం

వన్‌టౌన్ సీఐగా దుర్గాశేఖర్‌రెడ్డి బాధ్యతల స్వీకారం
కృష్ణలంక సీఐగా మురళీకృష్ణ ..

వన్‌టౌన్, జనవరి 25: వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐగా డి.దుర్గాశేఖర్‌రెడ్డి గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ సీఐగా పనిచేసిన సురేష్‌రెడ్డి విజయవాడ స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సీఐగా బాధ్యతలు చేపట్టిన దుర్గాశేఖర్‌రెడ్డికి సురేష్‌రెడ్డి అమ్మవారి చిత్రపటం, పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. కృష్ణలంక సీఐగా ఏ.మురళీ కృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం సీఐగా విధులు నిర్వహిం చిన దుర్గారావు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

మదర్ థెరెసా సేవాసంస్థ ఉదారత

భవానీపురం, జనవరి 25 : మదర్ థెరెసా సేవా సంస్థలోని దివ్యాంగులు రాజీవ్‌నగర్‌లోని ఒక పేద కుటుంబానికి తమ వంతు సాయంగా 25 కేజీల బియ్యం అందించి ఉదారతను చాటుకున్నారు. అసోసియేషన్ ప్రతినిధులు ఎస్.రాఘవేంద్రరావు, చంద్రరావు, ఎన్.సోమేశ్వరరావు, యు.శ్రీనివాసరావులు పాల్గొన్నారు.



ఇళయరాజా కుమార్తె భవతారిణి మృతి



ప్రముఖ సంగీత దర్శకుడు, 'ఇసైజ్ఞాని' ఇళయరాజా కుమార్తె, సంగీత దర్శకురాలు, నేపథ్యగాయని భవతారిణి (47) కేన్సర్ కారణంగా గురువారం సాయంత్రం 5.20 గంటల సమయంలో శ్రీలంకలో మృతి చెందారు. ఐదు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను ఆయుర్వేద చికిత్స కోసం సోదరుడు, సంగీత దర్శకుడు యువన్ శంకర్ రాజా శ్రీలంకకు తీసుకెళ్ళారు. అక్కడి వైద్యులు కేన్సర్ నాలుగో దశగా గుర్తించి చికిత్స అందిస్తూ వచ్చారు. ఈ క్రమంలో ఆమె గురువారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. తన తండ్రి ఇళయరాజా సంగీతం అందించిన 'భారతి' అనే చిత్రం కోసం ఆమె పాడిన పాటకు ఉత్తమ నేపథ్యగాయనిగా 2000 సంవత్సరంలో జాతీయ అవార్డును సొంతం చేసుకున్నారు. ఆ తర్వాత పలు చిత్రాల్లో సినిమా పాటలను ఆలపించారు. అంతేకాకుండా, ఆమె సంగీత దర్శకురాలిగా కూడా కొనసాగుతున్నారు. చెన్నై నగరంలోని రోసరీ మెట్రిక్ స్కూల్‌లో విద్యాభ్యాసం చేసిన ఆమె.. నటి రేవతి దర్శకత్వం వహించిన 'మిత్ర మై ఫ్రెండ్' అనే చిత్రం ద్వారా సంగీత దర్శకురాలిగా, 'రాసయ్య' అనే చిత్రం ద్వారా గాయనిగా వెండితెరకు పరిచయమయ్యారు. తన తండ్రి ఇళయరాజా, సోదరులు కార్తీక్ రాజా, యువన్ శంకర్ రాజా సంగీతం సమకూర్చిన చిత్రాల్లోనే నేపథ్యగానం చేశారు. ఆమె దాదాపు 20కి పైగా చిత్రాలకు పాటలు పాడారు. అలాగే, 2002లో సంగీత దర్శకురాలిగా పరిచయమైన ఆమె.. దాదాపు పది చిత్రాలకు సంగీతం అందించారు. వీటిలో రెండు హిందీ చిత్రాలు కూడా ఉన్నాయి. 2019లో ఆమె చివరగా 'మాయాండి' అనే చిత్రానికి సంగీతం అందించగా, ఇపుడు మూడు చిత్రాలకు సంగీతం అందించేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. కాగా, ఇళయరాజా కూడా శ్రీలంకలోనే ఉన్నారు. శనివారం శ్రీలంకలో ఇళయరాజా మ్యూజిక్ ఫెస్ట్ కార్యక్రమం జరగాల్సి ఉండగా, ఇందుకోసం ఆయన అక్కడకు వెళ్ళారు. భవతారిణి మృతదేహాన్ని శుక్రవారం నగరానికి తీసుకునిరానున్నారు. భవతారిణి భర్త శబరి రాజ్ వ్యాపారవేత్త.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

కాన్ఫిడెంట్‌గా ఉన్నా

రవి కస్తూరి



'ఇదొక సైకలాజికల్ థ్రిల్లర్. యాక్షన్, ఎమోషన్ అంశాలతో పాటు ఫ్యామిలీ డ్రామా కూడా ఉంది. జీవితం చాలించాలనుకొనే ఓ వ్యక్తి దాన్ని ఎలా అధిగవిుంచాడనే అంశాన్ని చిత్రంలో చూపించాం. సినిమా ప్రారంభం నుంచి దీనిపై కాన్ఫిడెంట్‌గా ఉన్నా' అన్నారు నిర్మాత రవి కస్తూరి. గీతానంద్, నేహా సోలంకి జంటగా నటించిన 'గేమ్ ఆన్' చిత్రాన్ని ఆయన దయానంద్ దర్శకత్వంలో నిర్మించారు. ఫిబ్రవరి 2న ఈ సినిమా విడుదలవుతున్న సందర్భంగా గురువారం రవి మీడియాతో మాట్లాడారు. 'ఆస్ట్రేలియాలో వ్యాపారాలు చేస్తూ ఈ చిత్ర నిర్మాణం చూసుకోవడం చాలా ఛాలెంజింగ్‌గా అనిపించింది. కంటెంట్ మీద మాకు పూర్తి నమ్మకం ఉంది. ఫస్ట్ కాపీ చూసి హ్యాపీగా ఫీలయ్యా. ఇకపై నిర్మాతగా కొనసాగాలనుకుంటున్నా. ఇప్పటికే రెండు కథలు విన్నా. ఈ సినిమా రిలీజ్ అయ్యాక వాటిని అనౌన్స్ చేస్తాం' అని చెప్పారు.














సహజయోగ

జయహో భారత మాతా జయహో

ప్రతియేటా ఆగస్టు 15వ తేదీన.. వలస పాలన నుంచి భారతదేశం విముక్తి పొందిన సందర్భాన్ని... స్వాతంత్ర్య దినంగా వేడుక చేసుకుంటాం. భారత రాజ్యాంగాన్ని అధికారికంగా ఆమోదించిన రోజుగా జనవరి 26వ తేదీ నాడు గణతంత్ర దినోత్సవం నిర్వహించుకుంటాం. ఈ ఏడాది యావద్భారతావని 75వ గణతంత్ర వేడుకలు జరుపుకొంటోంది.



పూజ్యశ్రీమాతాజీ నిర్మలాదేవి నాటి స్వాతంత్ర్య సమరంలో తన అనుభవాల గురించి వివిధ సందర్భాల్లో పలు విషయాలు వెల్లడించారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో, 1941లో... భారతమాతను కీర్తిస్తూ ఒక గీతాన్ని ఆమె రచించి గానం చేశారు. 'మా తేరీ జయహో, తేరాహి విజయ్ హో, తేరే గీత్ సే ఆజ్ జగయే జీవిత్ హో మా తేరీ జయ్‌హో' అనే గీతాన్ని స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా సహజయోగులు ఇప్పటికీ గానం చేస్తూ ఉంటారు. ఆ గీతానికి తెలుగు అనువాదం:

జయహో! భారత మాతా! జయహో!
నీ జయ జయ ధ్వానాలతో జగమంతా మారు మోగుతోంది
జయహో భారత మాతా జయహో !
నీ పల్లెల్లోని పచ్చటి పొలాలు కూడా నీ కీర్తి గానాన్ని ఆలపిస్తున్నాయి.
నీ జయ జయ ధ్వానాలతో పట్టణాలు మారుమోగుతున్నాయి.
జయహో భారత మాతా జయహో
ప్రజలు దాస్య శృంఖలాలతో బతుకీడుస్తున్నా.. ఈ దేశం గర్వంగా నీ జయ జయ గానాలు చేస్తోంది.
నా కళ్ళు అశ్రుతప్తమైనప్పుడు, దుఃఖంతో నా గొంతు మూగబోయినప్పుడు
నా హృదయం మాత్రం నీ విజయం కోసం పరితపిస్తోంది
జయహో భారత మాతా జయహో!
అమర వీరుల చితిమంటలు ఆకాశానికి ఎగిరి పడుతున్నప్పుడు కూడా వారి ఆత్మలు నీ విజయం కోసమే నీ కీర్తిని శ్లాఘిస్తున్నాయి.
జయహో భారత మాతా జయహో!

భారతదేశం అనేక బిన్నమతాలు, సంస్కృతులు, సంప్రదాయాలు, అత్యున్నతమైన ఆధ్యాత్మిక వారసత్వం కలిగిన పుణ్యభూమి. ఎందరో ఆధ్యాత్మిక గురువులు, అవతార పురుషులు, మహర్షులు జన్మించిన యోగ భూమి. అయితే ఈ దేశం ఎన్నో విదేశీ శక్తుల దాడులకు లోనయింది. సుమారు 300 ఏళ్ళ బ్రిటిష్ పాలనలో అనేక చేదు అనుభవాలను చవిచూసింది. ఎంతోమంది దేశభక్తుల పోరాటాలు, త్యాగాల ఫలితంగా... దాస్య శృంఖలాల నుంచి భారతజాతి విముక్తి పొంది.. స్వాతంత్ర్యం సంపాదించుకుంది. మహాత్మా గాంధీ లాంటి ఎందరెందరో మహనీయులు, దేశభక్తులు ఈ ఉద్యమంలో తమవంతు పాత్ర పోషించారు. అలాగే స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని, త్యాగాలు చేసినా... చరిత్ర పుటలలోకి ఎక్కనివారూ ఉన్నారు. వారిలో శ్రీమాతాజీ నిర్మలాదేవి తండ్రి ప్రసాదరావు సాల్వే కుటుంబం ఒకటి. బాల్యం నుంచే జాతీయ భావాలు నిర్మలాదేవి మనసులో గట్టిగా నాటుకున్నాయి.

> స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని, త్యాగాలు చేసినా... చరిత్ర పుటలలోకి ఎక్కని వారూ ఉన్నారు. వారిలో శ్రీమాతాజీ నిర్మలాదేవి తండ్రి ప్రసాదరావు సాల్వే కుటుంబం ఒకటి. బాల్యం నుంచే జాతీయ భావాలు నిర్మలాదేవి మనసులో గట్టిగా నాటుకున్నాయి.



"నా దేశభక్తి ఎంత లోతైనదో నాకు తెలుసు. మన జాతీయ పతాకాన్ని చూసినప్పుడు, వందేమాతరం లాంటి దేశభక్తి గీతాలను విన్నప్పుడు. కన్నీటి పర్యంతమవుతాను. స్వాతంత్ర్యం కోసం ప్రజలు పడిన కష్టాలు కళ్ళారా చూశాను. అవి గుర్తు రావడం వల్ల కావచ్చు లేదా మన దేశంలో నెలకొన్న క్లిష్టమైన పరిస్థితుల వల్ల కావచ్చు, నా హృదయంలో దేశం పట్ల ఉన్న ప్రేమ వల్ల కావచ్చు.. ఆ ఉద్వేగాన్ని నేను తట్టుకోలేను. అలాంటి ఒక సంఘటన ఇంకా నా మనసులో మెదులుతోంది. ఒక రోజు మా తండ్రిగారు జాతీయ జెండాను భుజాన వేసుకొని.. హైకోర్టు ప్రాంగణంలో నడుస్తూ ఉంటే.. బ్రిటిష్ పోలీసులు ఆయనను తుపాకీతో కాల్చారు. కాలికి గాయమై, రక్తం కారుతున్నా లెక్క చేయకుండా ఆయన 'వందేమాతరం' అని నినదిస్తూ సాగిపోయారు. ఇలాంటి సంఘటనలు ఆ రోజుల్లో ఎన్నో చూశాను. అలాంటి దేశభక్తులను కన్న ధన్యభూమి మన భారతదేశం" అని ఆమె చెప్పారు.


శ్రీమాతాజీ నిర్మలాదేవి తండ్రి ప్రసాదరావు సాల్వే మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ఏర్పడిన మొట్టమొదటి రాజ్యాంగ సభలో సభ్యుడిగా ఉన్నారు. అంతే కాదు, రాజ్యాంగ రచనలో పాలుపంచుకున్నారు. దేశ విముక్తి కోసం తమ సర్వస్వాన్ని నిస్వార్థంగా త్యాగం చేసి, గాంధీ మహాత్ముని అడుగుజాడల్లో పయనించిన శ్రీమాతాజీ నిర్మలాదేవినీ, ఆమె కుటుంబాన్నీ ఈ సందర్భంగా స్మరించుకోవడం సముచితం.

డాక్టర్ పి. రాకేష్
8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ



మెహెర్‌వాణి

అంతా నా సంకల్పమే



31న అవతార్ మెహెర్‌బాబా అమరతిథి

అవతార్ మెహెర్‌బాబాను మానవరూపంలో వచ్చిన జన్మించిన భగవంతుడిగా భక్తులు ఆరాధిస్తారు. గత అవతారాలలో రాముడిగా, కృష్ణునిగా, బుద్ధుడిగా, ఏసు క్రీస్తుగా వచ్చాననీ, ఇప్పుడు మెహెర్‌బాబాగా అవతరించాననీ ఆయన ప్రకటించారు. ఆయన కొన్నాళ్ళు ఒక కొండమీద ఏకాంతంగా గడిపారు. ఆహారం తీసుకోకుండా... కేవలం కాఫీ మాత్రమే తాగేవారు. లాహరా అనే పల్లెటూరి కుర్రవాడు ఆయనకు కొండ కింద నుంచి ఫ్లాస్క్‌లో కాఫీ తీసుకువచ్చేవాడు. దారిలో అతను కొంత కాఫీ తాగుతూ ఉండేవాడు. అదే ఫ్లాస్కులో కాఫీని బాబాకు ఇచ్చేవాడు. ఈ ఉదంతం గురించి తెలిసిన ఒక భక్తుడు కొంతకాలం తరువాత బాబాకు దాన్ని గుర్తు చేస్తూ "మీరు కొండమీద ఏకాంతంలో ఉన్నప్పుడు... ఒక పల్లెటూరి పిల్లవాడు కాఫీ తెచ్చేవాడు. ఫ్లాస్క్‌లో కాఫీ మధ్యలో అతను తాగేవాడు. మీకేమీ అనిపించలేదా? మీరు అవతార పురుషులు. మీరు రాముని అవతారంలో ఉన్నప్పుడు... శబరి కొరికిన ఎంగిలి పండ్లను తిన్నారు కదా! అప్పుడు మీరది పట్టించుకోలేదు. అందుకే ఆ కుర్రాడు మీ కాఫీని ఎంగిలి చేసినా పట్టించుకోలేదా?" అని అడిగాడు. అప్పుడు బాబా "నువ్వు చెప్పింది నిజం. నేను పట్టించుకోలేదు. కానీ మెహెరాకి (బాబా సన్నిహిత భక్తురాలు) అది నచ్చదు. నా భక్తులు అలాంటి విషయాల్లో శ్రద్ధ తీసుకుంటారు. నేను తీసుకోను. రాముడు అడవుల్లో ఉన్నాడు. అప్పట్లో ప్రజలకు శుచి గురించి తెలీదు" అన్నారు.

"వాటిలో క్రిములు ఉంటే మీ మీద ప్రభావం చూపిస్తాయి కదా?" అన్నాడు ఆ భక్తుడు.

"అవును. చూపిస్తాయి. కానీ నేను దేవుణ్ణి. ప్రపంచంలో అంతా నా సంకల్పం ప్రకారమే జరుగుతుంది. నాకు అనారోగ్యం రాకూడదనేది నా సంకల్పమే" అన్నారు బాబా.

"మిమ్మల్ని ఈ ప్రశ్నలు అడగడం కూడా మీ సంకల్పమేనా?" అని అడిగాడా భక్తుడు.

"అవును నా సంకల్పమే" అన్నారాయన.

ఒక ఏడాది శ్రీరామనవమి వేడుకలను బాబా సమక్షంలో ఘనంగా జరిపారు. ఆ సందర్భంలో భక్తుడి కుమార్తె అయిన షీలా అనే పన్నెండేళ్ళ అమ్మాయితో మెహెర్‌బాబా మాట్లాడుతూ రాముడు అనేక ఇక్కట్లు ఎదుర్కొన్నాడని చెప్పారు. "నీవు రామాయణం చదివావా? చదువు" అని ఆమెకు సూచించారు. "చదవలేదు బాబా! మీరు మా పక్కన ఉండగా రామాయణం, భగవద్గీత మాకెందుకు" అని అమె జవాబు ఇచ్చింది. "ప్రతి ఒక్కరూ రామాయణం తప్పక చదవాలని అన్నారు. ఆ గ్రంథం ద్వారా రఘురాముడి ఔన్నత్యం గురించి, మానవాళి కోసం రాముడు అనుభవించిన బాధల గురించి అవగాహన కలుగుతుంది" అని బాబా తెలిపారు. "భగవంతుడు మానవ రూపధారిగా వచ్చినప్పుడు, సామాన్య మానవునిలా అన్ని రకాల బాధలు అనుభవించవల్సిందే" అని ఆ చిన్నారి అడిగిన మరో ప్రశ్నకు ఆయన బదులిచ్చారు.

• మల్లాది కృష్ణానంద్

నవ్య | చిత్రజ్యోతి

సినీ వనంలో విరిసిన పద్మాలు

ప్రతిభామూర్తులపై పురస్కార వర్షం కురిసింది. అభినందనల వెల్లువతో అద్వితీయ కళామూర్తులు తడిసి తరించిపోయారు. భారతీయ వెండితెరపై వెన్నెల సంతకాన్ని అద్దిన అందాల చందమామ వైజయంతిమాల.. తెలుగు ప్రజల హృదయాల్లో చెదరని స్థానాన్ని సొంతం చేసుకున్న మెగాస్టార్ చిరంజీవి.. ఇటీవలే దిగంతాలకు చేరిన నటనాయకుడు విజయ్‌కాంత్.. డిస్కోడాన్సర్‌గా యువతరంతో స్టెప్పులేయించిన విథున్ చక్రవర్తి.. తన గానంతో శ్రోతల్ని ఉర్రూతలూగించిన ఉషా ఊతప్... 'పద్మ' విజేతలయ్యారు. వారికి అక్షరాభినందనలు అందిస్తూ..













చిరంజీవి కీర్తికిరీటంలో మరో కలికితురాయి వచ్చి చేరింది. ఇప్పటికే పద్మభూషణుడిగా అలరారుతున్న మెగాస్టార్ చిరంజీవి, ఇప్పుడు పద్మవిభూషణుడయ్యారు. 2024వ సంవత్సరానికి గాను, కళారంగ విభాగం నుంచి దేశంలోనే రెండవ అత్యున్నత పురస్కారమైన 'పద్మవిభూషణ్ 'పురస్కారానికి చిరంజీవి ఎంపికయ్యారు. ఆయన్ని ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం వరించడంతో తెలుగుచిత్ర పరిశ్రమతోపాటు కోట్లాదిమంది అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలుగు చిత్రపరిశ్రమ తరఫున ఈ పురస్కారం అందుకున్న వారిలో చిరంజీవి రెండవవారు కాగా, తెలుగు సినీ కళాకారుడిగా ఆయన మూడోవారు. 2011వ సంవత్సరంలో నటసమ్రాట్, డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు ఈ పురస్కారం అందుకున్నారు. అలాగే తెలుగువారైన గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కూడా ఈ అవార్డు అందుకున్నారు. అయితే.. ఆయనకు తమిళనాడు ప్రభుత్వ ప్రతిపాదనపై ఈ అవార్డు లభించింది. తెలుగువాడిగా, తెలుగు చిత్రపరిశ్రమ తరఫున అక్కినేని తర్వాత ఇన్నాళ్లకు ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని చిరంజీవి అందుకోనున్నారు.



1978లో 'ప్రాణంఖరీదు' సినిమాతో నటుడిగా చిరంజీవి ప్రయాణం మొదలైంది. తొలినాళ్లలో ప్రతినాయకపాత్రలు కూడా పోషించారాయన. 'మనవూరి పాండవులు' సినిమాకి గాను తొలి వందరోజుల జ్ఞాపిక అందుకున్నారు. కె.బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన ఇదికథకాదు, 47రోజులు చిత్రాలు నటుడిగా చిరంజీవిని నిలబెట్టాయని చెప్పాలి. ఆయన కెరీర్‌కు తొలి బ్రేక్ 'పున్నమినాగు'. ఇందులో చిరంజీవి నటనకు తెలుగుప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. 'పున్నమినాగు' తర్వాత చిరంజీవి విషయంలో ప్రేక్షకుల దృక్కోణం మారింది. 'ఇంట్లోరామయ్య-వీధిలోకృష్ణయ్య'తో కుటుంబ ప్రేక్షకులకు చేరువైన చిరంజీవి, 'ఖైదీ'తో స్టార్‌గా మారారు. ఓవైపు అభిమానుల్ని దృష్టిలో పెట్టుకొని సినిమాలు చేస్తూనే.. నటుడిగా ఆకలి తీర్చుకునేందుకు అభిలాష, ఛాలెంజ్, శుభలేఖ, విజేత, రుద్రవీణ, ఆరాధన, స్వయంకృషి, ఆపద్బాంధవుడు తదితర చిత్రాలు చేస్తూ భళా అనిపించుకున్నారు చిరంజీవి.

తెలుగు సినిమా అంటే చిరంజీవికి ముందు, చిరంజీవి తర్వాత అనేంతగా చరిత్ర సృష్టించారు. ఆయన ఆగమనంతో తెలుగు సినిమాలో గణనీయమైన మార్పులొచ్చాయి. వేగం పెరిగింది. ఆంగికాభినయం, ఆహార్యం, డాన్సులు, పోరాటాలు ఇలా చాలా విషయాల్లో మార్పుకు కారణమయ్యారు చిరంజీవి. తర్వాత వస్తున్న తరానికి రోల్‌మోడల్‌గా నిలిచారు.

'పసివాడి ప్రాణం'(1987) చిత్రం చిరంజీవి ఇమేజ్‌ని సమూలంగా మార్చేసింది. ఆ సినిమాతో టాలీవుడ్ నంబర్‌వన్ హీరోగా అవతరించారాయన. ఆ సినిమా నుంచి 'శంకర్‌దాదా జిందాబాద్'(2007) వరకూ చిరంజీవికి ఎదురు లేకుండా పోయింది. ఎన్టీయార్ తర్వాత తెలుగుచలనచిత్ర చరిత్రలో ఎక్కువ సంవత్సరాలు నంబర్‌వన్ స్థానాన్ని అధిష్ఠించిన హీరోగా రికార్డ్ సృష్టించారు చిరంజీవి.

> నటుడిగా 46ఏళ్ల కెరీర్.. ఎన్నో అద్భుతమైన పాత్రలు.. ఉత్తమనటుడిగా రాష్ట్రప్రభుత్వం నుంచి మూడు సార్లు నంది అవార్డులు, నటుడిగా తొమ్మిది ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, 2006లో పద్మభూషణ్, 2016లో రాష్ట్రప్రభుత్వ ప్రతిష్ఠాత్మక రఘుపతివెంకయ్య పురస్కారం, ఐఎఫ్‌ఎఫ్‌ఐ ఇండియన్ ఫిల్మ్ పర్సనాలిటీ ఆఫ్ ది ఇయర్‌గా 2022లో జాతీయ గౌరవ పురస్కారం.. ఇక ప్రైవేటు సంస్థల పురస్కారాలకైతే లెక్కేలేదు.

2007లో 'ప్రజారాజ్యం' పేరుతో రాజకీయ పార్టీని స్థాపించి ఎన్నికల్లో గణనీయమైన ఓట్లు, సీట్లు సాధించారు. శాసనసభ్యుడిగా, కేంద్రసహాయమంత్రిగా బాధ్యతలను నిర్వర్తించిన చిరంజీవి.. ఆ తర్వాత రాజకీయాలకు దూరం జరిగారు. దాదాపు పదేళ్ల పాటు సినిమాలకు దూరంగా ఉన్న ఆయన.. 'ఖైదీనంబర్ 150'తో మళ్లీ హీరోగా రీఎంట్రీ ఇచ్చారు. పదేళ్ల విరామం తర్వాత వచ్చిన ఆ సినిమా వందకోట్ల పైచిలుకు వసూళ్లను సాధించి, చిరంజీవి స్థామినా ఏ మాత్రం తగ్గలేదని నిరూపించింది. ప్రస్తుతం హీరోగా యువహీరోలకు సైతం పోటీ ఇస్తూ దూసుకుపోతున్నారు మెగాస్టార్. ఇక సేవాకార్యక్రమాల విషయం చిరంజీవి ఎప్పుడూ ముందే వుంటారు. చిరంజీవి బ్లడ్‌బ్యాంక్, చిరంజీవి ఐబ్యాంక్‌ల ద్వారా ప్రజలకు సేవలందిస్తూ ఆపద్బాంధవుడనిపించుకున్నారు. అంతేకాదు, కరోనా టైమ్‌లో ఆక్సిజన్ ప్లాంట్‌లను స్థాపించి, ఆక్సిజన్ సిలండర్లను అందించి వేలాదిమంది బాధితులను ఆదుకున్నారు. ఇక ఆయన చేసే గుప్తదానాలకైతే లెక్కేలేదు.

తెలుగు సినిమా స్థాయినీ, గౌరవాన్ని పెంచి ఎందరో నటులకు ఆదర్శప్రాయుడిగా నిలిచిన ఈ మహానటుడిని రెండవ అత్యున్నత జాతీయపురస్కారమైన 'పద్మవిభూషణ్' వరించడం హర్షణీయం.



అందాలరాశికి అపురూప పురస్కారం





నాటి అందాలతార, అద్భుత నర్తకి, గొప్పనటి వైజయంతిమాలను పద్మవిభూషణ్ అవార్డు వరించింది. 1968లో పద్మశ్రీ అవార్డును అందుకున్న వైజయంతిమాల, 2011లో పద్మభూషణ్ పురస్కారాన్ని కూడా సొంతం చేసుకున్నారు. ఈ ఏడాది గణతంత్రదినోత్సవ సందర్భంగా దేశంలోని రెండో అత్యుత్తమ పురస్కారమైన పద్మవిభూషణ్ పురస్కారానికి భారత ప్రభుత్వం వైజయంతిమాలను ఎంపిక చేసింది.

తమిళనాడు మద్రాస్ ప్రెసిడెన్సీలోని ట్రిప్లికెన్‌లో 1933లో జన్మించారు వైజయంతిమాల. ఆమె తల్లి వసుంధరదేవి శాస్త్రీయనృత్య కళాకారిణి. కొన్ని సినిమాల్లో కూడా ఆమె నటించారు. తల్లి వారసత్వంగా వైజయంతిమాల కూడా చిన్నతనంలోనే శాస్త్రీయనృత్యం అభ్యసించి, ప్రావీణం సాధించారు. అలాగే కర్ణాటక సంగీతం కూడా నేర్చుకున్నారు. ఆమెలోని కళాతృష్ణను గమనించిన తల్లి ఆమెను నటిగా ప్రోత్సహించారు.

తమిళంలో ఏవీఎం ప్రొడక్షన్స్ నిర్మించిన 'వళ్లై'(1949) వైజయంతిమాల తొలి చిత్రం. అదే సినిమా 'జీవితం'(1950) పేరుతో తెలుగులో రీమేక్ చేశారు. ఆ సినిమా ద్వారా తెలుగు తెరకు పరిచయం అయ్యారు వైజయంతిమాల. 1954లో విడుదలైన 'సంగం' సినిమాలో ఎన్టీయార్‌తో కలిసి నటించారు. తెలుగు, తమిళ భాషల్లో పలు చిత్రాల్లో నటించారు వైజయంతిమాల. 1951లో ఏవీఎం సంస్థ నిర్మించిన 'బహార్' చిత్రంతో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన వైజయంతిమాల 'లడ్కీ', 'నాగిన్' చిత్రాలతో అక్కడ తిరుగులేని సూపర్‌స్టార్‌గా ఎదిగారు. దిలీప్‌కుమార్ హీరోగా రూపొందిన 'దేవదాస్'(1955) చిత్రంలో చంద్రముఖి పాత్ర నటిగా వైజయంతిమాలకు మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆ పాత్రకు తొలి ఫిల్మ్‌ఫేర్ అందుకున్నారామె. ఆ వరుసలోనే కెరీర్ మొత్తంమీద 5 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు అందుకున్నారు వైజయంతిమాల.

అందం, అభినయం, అబ్బురపరిచే నాట్యకౌశలంతో బాలీవుడ్ ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేశారు వైజయంతిమాల. అప్పట్లో హీరోతో ప్రమేయం లేకుండా కేవలం ఆమె కోసమే టికెట్లు తెగేవి. ఓ విధంగా ఆమెది కూడా హీరో ఇమేజే. ఎంతటి నటులనైనా డామినేట్ చేయగల అద్భుతమైన సౌందర్యం వైజయంతిమాల సొంతం. హిందీ పరిశ్రమను ఉర్రూతలూగించిన కాంబినేషన్ దిలిప్‌కుమార్, వైజయంతిమాల. వారిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన మధుమతి, గంగజమున, నయాదౌర్ చిత్రాలు ఇండియన్ క్లాసిక్స్‌గా నిలిచాయి. అలాగే వైజయంతిమాల, రాజ్‌కపూర్ నటించిన 'సంగం' చిత్రం ప్రాంతాలకు అతీతమైన విజయాన్ని సాధించింది. కిశోర్‌కుమార్‌కు జోడీగా 'న్యూఢిల్లీ', దేవానంద్ 'జ్యూయల్‌థీఫ్', హిస్టారికల్ మూవీ 'ఆమ్రపాలీ'.. ఇలా చెప్పుకుంటూపోతే అద్భుతాలు ఎన్నో!

వైజయంతిమాల గొప్ప నటి, నృత్యకళాకారిణి మాత్రమే కాదు. గొప్ప గురువు కూడా. ఎంతోమందికి నృత్యాన్ని నేర్పారామె. అంతేకాదు, శిష్యగణంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడమేకాక, సొంతంగా నృత్యరీతుల్ని కూడా సమకూర్చారామె.

కేవలం సినిమాకు సంబంధించిన పురస్కారాలేకాక, నాట్యకళాకారిణిగా ఎన్నో ప్రైవేటు సంస్థల నుంచి అవార్డులను అందుకున్నారు వైజయంతిమాల.

ఆమె తమిళనాడు ప్రభుత్వం కలైమామణి బిరుదుతో సత్కరించింది. 2008వ సంవత్సరానికి గాను అక్కినేని నాగేశ్వరరావు నేషనల్ అవార్డును కూడా అందుకున్నారామె..

90 ఏళ్ల వయసు.. 75 ఏళ్ల కళాజీవితం.. లెక్కకు విుంచిన పురస్కారాలు.. దేశం గర్వించదగ్గ కళారూపాలు.. వెరసి వైజయంతిమాల. ఆ మహాకళాకారిణికి దేశంలోని రెండో అత్యుత్తమ పురస్కారమైన పద్మవిభూషణ్ వరించడం నిజంగా ఆనందించదగ్గ విషయం.

కెప్టెన్‌కు పద్మభూషణ్



తమిళ సినీ, రాజకీయరంగాల్లో నాలుగు దశాబ్దాలకు పైగా తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న సీనియర్ నటుడు విజయకాంత్. తమిళ సినీ, రాజకీయరంగాల్లో కీలకంగా వ్యవహరించిన ఆయన ఇటీవల కన్ను మూశారు. 'కెప్టెన్'గా అభిమానుల్లో గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన విజయకాంత్‌కు పద్మభూషణ్ పురస్కారం ప్రకటించింది కేంద్రప్రభుత్వం.

క్వీన్ ఆఫ్ పాప్



అల్లు అర్జున్ నటించిన 'రేసుగుర్రం' చిత్రంలో టైటిల్ సాంగ్ గుర్తుంది కదూ హస్కీ వాయిస్‌తో ఆ పాట పాడిన గాయని ఉషా ఊతప్. 'క్వీన్ ఆఫ్ పాప్'గా పేరు తెచ్చుకున్న ఉషకు తెలుగులో ఇది రెండో సినిమా. అంతకు ముందు అంటే 1991లో వచ్చిన 'కీచురాళ్లు' సినిమాలో టైటిల్ సాంగ్ పాడారు. తెలుగులో ఆమె ఈ రెండు పాటలే పాడినా, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఎన్నో పాటలు పాడారు. తెర వెనుకే కాదు మలయాళ, తమిళ, కన్నడ, హిందీ చిత్రాల్లో కూడా తెరపై మెరిశారు. పద్మభూషణ్ పురస్కారాన్ని ఆమె అందుకోనున్నారు.

బాలీవుడ్‌పై బలమైన ముద్ర



ఒకప్పుడు తన డాన్సులతో, అభినయంతో యువతరానికి అలరించిన బెంగాలీ బాబు మిథున్ చక్రవర్తి. 'డిస్కో డాన్సర్', 'డాన్స్ డాన్స్' వంటి చిత్రాల్లో విుథున్ డాన్స్ చూసి ఆనాటి అమ్మాయిలు వెర్రెత్తి పోయేవారు. 'ఐయామ్ డిస్కో డాన్సర్' అంటూ ఆయన తెరపై పాడుతుంటే థియేటర్లలో ప్రేక్షకులు ఆనందంతో గంతులు వేసేవారు. మిథున్ అసలు పేరు గౌరంగ చక్రవర్తి. 1976లో వచ్చిన 'మృగయా' ఆయన తొలి చిత్రం. మొదటి సినిమాతోనే ఉత్తమ నటుడిగా జాతీయ అవార్డ్ పొందారు. ప్రారంభంలో కొన్ని బెంగాలీ చిత్రాల్లో నటించిన మిథున్ ఆ తర్వాత బాలీవుడ్‌కు వెళ్లి హీరోగా అక్కడ ఎంతో రాణించారు.. ముఖ్యంగా 80ల దశకంలో హిందీ సినిమాపై ఎంతో ప్రభావం చూపిన నటుడాయన. రెండు సార్లు ఉత్తమ నటుడిగా, ఒకసారి సహాయ నటుడిగా మిథున్ జాతీయ అవార్డులు అందుకొన్నారు. హీరోగానే కాదు కేరెక్టర్ ఆర్టిస్ట్‌గా కూడా ఆయన రాణిస్తున్నారు. పవన్‌కల్యాణ్ నటించిన 'గోపాల గోపాల'లో విలన్‌గా ఆకట్టుకొన్నారు. ఆమధ్య వచ్చిన 'కశ్మీరీ ఫైల్స్' చిత్రంలో విుథున్ నటనని ప్రేక్షకులు మరువలేరు. మంచి పాత్రల కోసం ఇప్పటికీ పరితపించే ఆ విశిష్ట నటుడిని పద్మభూషణ్ పురస్కారంతో కేంద్ర ప్రభుత్వం సత్కరించనుంది.

'దిక్సూచి' వెబ్ పేజీలో... సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/jq1vCpPలో చదవండి.

బిజినెస్

కార్వీ స్టాక్ బ్రోకింగ్ కేసులో 'సుప్రీం' స్టే

న్యూఢిల్లీ: కార్వీ స్టాక్ బ్రోకింగ్ కేసులో సెబీ, ఎన్ఎస్‌డీఎల్‌కు పెద్ద ఊరట లభించింది. ఈ కేసులో గత ఏడాది డిసెంబరు 20న సెక్యూరిటీస్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (శాట్) జారీ చేసిన ఆదేశాలపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చింది. కార్వీ స్టాక్ బ్రోకింగ్ సంస్థ తన ఖాతాదారుల షేర్లను బ్యాంకుల వద్ద కుదువ పెట్టి పెద్ద మొత్తంలో రుణాలు తీసుకుంది. ఈ కుంభకోణం బయటపడడంతో సెబీ, ఎన్ఎస్‌డీఎల్ రంగంలోకి దిగి ఆ షేర్లను మళ్లీ ఖాతాదారులకు బదిలీ చేయించాయి. యాక్సిస్ బ్యాంక్ నేతృత్వంలోని బ్యాంకులు, ఆర్థిక సంస్థలు ఈ విషయాన్ని శాట్‌లో సవాల్ చేశాయి. దాంతో కార్వీ కుదువ పెట్టిన షేర్ల విలువకు సమాన మొత్తాన్ని బ్యాంకులకు చెల్లించాలని శాట్ గత ఏడాది డిసెంబరులో సెబీ, ఎన్ఎస్‌డీఎల్‌ను ఆదేశించింది. ఈ సంస్థలు ఈ విషయాన్ని సుప్రీంకోర్టులో సవాల్ చేశాయి. కేసును విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం శాట్ తీర్పుపై స్టే ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కేసు తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

తగ్గిన సైయెంట్ లాభం

హైదరాబాద్: సైయెంట్.. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.147.2 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంతో పోల్చితే లాభం 5.6 శాతం క్షీణించింది. త్రైమాసిక సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం ఆదాయం మాత్రం 12.6 శాతం వృద్ధి చెంది రూ.1,821.4 కోట్లుగా నమోదైంది.

పారిశ్రామిక పద్మాలు

ఇద్దరికి పద్మ భూషణ్.. మరో ఇద్దరికి పద్మశ్రీ


సీతారాం జిందాల్


యంగ్ లియు

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాదికి గాను పద్మ పురస్కారాలను ప్రకటించింది. వాణిజ్యం, పారిశ్రామిక విభాగం నుంచి ఇద్దరికి పద్మ భూషణ్, మరో ఇద్దరికి పద్మశ్రీ చొప్పున మొత్తం నలుగురిని ఈ అవార్డులు వరించాయి. కర్ణాటకకు చెందిన జిందాల్ అల్యూమినియం లిమిటెడ్, సీతారాం జిందాల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సీతారాం జిందాల్‌కు పద్మ భూషణ్ లభించింది. అలాగే, తైవాన్‌కు చెందిన ఫాక్స్‌కాన్ సీఈఓ, చైర్మన్ యంగ్ లియుకు సైతం పద్మ భూషణ్ దక్కింది. ఫాక్స్‌కాన్ ప్రపంచంలోనే అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ మాన్యుఫాక్చరింగ్ కంపెనీ. మన దేశంలోనూ మొబైల్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల ప్లాంట్లను నిర్వహిస్తోంది. జెపీమోర్గాన్ ఇండియా సీఈఓ కల్పన మోర్పారియాతో పాటు కర్ణాటకకు చెందిన శశి సోనీకి పద్మశ్రీ లభించింది.


శశి సోనీ · కల్పన మోర్పారియా

పద్మ భూషణ్	పద్మశ్రీ
సీతారాం జిందాల్ (కర్ణాటక)	కల్పన మోర్పారియా (మహారాష్ట్ర)
యంగ్ లియు (తైవాన్)	శశి సోనీ (కర్ణాటక)

బెయిన్ క్యాపిటల్ చేతికి సాయి లైఫ్ సైన్సెస్!



హైదరాబాద్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న సాయి లైఫ్ సైన్సెస్ కంపెనీ యాజమాన్యం చేతులు మారే సూచనలు కనిపిస్తున్నాయి. కాంట్రాక్టు పద్ధతిలో ఫార్మా కంపెనీలకు పరిశోధన, అభివృద్ధి, తయారీ సేవలు (సీఆర్‌డీఎంఓ) అందించే ఈ కంపెనీ ఈక్విటీలో మెజారిటీ వాటా కోసం ప్రముఖ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ (పీఈ) బెయిన్ క్యాపిటల్ అత్యధిక ధర కోట్ చేసినట్టు సమాచారం. ఇందుకోసం మరో పీఈ సంస్థ టీపీజీ క్యాపిటల్ చేతిలో ఉన్న 43.4 శాతం వాటాతో పాటు కంపెనీ ప్రధాన ప్రమోటర్ చైర్మన్ కే రంగ రాజు, ఎండీ, సీఈఓ కృష్ణ కనుమూరి వాటాల కొనుగోలుపైనా బెయిన్ క్యాపిటల్ ఆసక్తి చూపిస్తోంది. అన్నీ అనుకున్నట్టు జరిగితే వచ్చే కొద్ది వారాల్లోనే దీనికి సంబంధించిన ఒప్పందంపై సంతకాలు జరిగే అవకాశం ఉంది. ప్రతిపాదిత డీల్‌లో భాగంగా కంపెనీ విలువను సుమారు 80 కోట్ల డాలర్లు (సుమారు రూ.6,600 కోట్లు)గా లెక్కగట్టినట్లు తెలుస్తోంది. దాదాపు 3,000 మంది పని చేస్తున్న సాయి లైఫ్ సైన్సెస్ కంపెనీకి భారత్‌తో పాటు అమెరికా, బ్రిటన్, జపాన్ దేశాల్లోనూ యూనిట్లు ఉన్నాయి. టీపీజీ క్యాపిటల్ 2018లో సాయి లైఫ్‌సైన్సెస్‌లో టీపీజీ క్యాపిటల్ 13.5 కోట్ల డాలర్లు పెట్టుబడులు పెట్టింది. ప్రస్తుతం సంస్థలో టీపీజీకి 43.4 శాతం వాటా ఉండగా మరో పీఈ సంస్థ హెచ్‌బీఎం ప్రైవేట్ ఈక్విటీ ఇండియాకు 6 శాతం వాటా ఉంది. మిగిలిన వాటా పూర్తిగా ఫౌండర్ కుటుంబం/ప్రమోటర్ గ్రూప్ చేతిలో ఉంది.

ఐటీ రంగ షేర్లలో అమ్మకాలు

సెన్సెక్స్ 359 పాయింట్లు డౌన్

ముంబై: ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) రంగ షేర్లలో అమ్మకాలతో పాటు విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు తరలిపోవడంతో గురువారం ఈక్విటీ సూచీలు నష్టాల్లో ముగిశాయి. ఒక దశలో 741 పాయింట్లకు పైగా క్షీణించిన సెన్సెక్స్ చివరికి 359.64 పాయింట్ల నష్టంతో 70,700.67 వద్ద ముగిసింది. నిఫ్టీ 101.35 పాయింట్లు కోల్పోయి 21,352.60 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 19 నష్టపోగా.. టెక్ మహీంద్రా షేరు 6.12 శాతం పతనమై సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. ఎయిర్‌టెల్ 2.57 శాతం నష్టపోగా.. ఐటీసీ, విప్రో, ఏషియన్ పెయింట్స్, హెచ్‌సీఎల్ టెక్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, నెస్లే, కోటక్ బ్యాంక్ షేర్లు ఒక శాతానికి పైగా విలువను చేజార్చుకున్నాయి.ఎన్‌టీపీసీ, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు 1%పైగా లాభపడ్డాయి.

4 కంపెనీల ఐపీఓలకు సెబీ ఓకే: ఎంటెరో హెల్త్‌కేర్ సొల్యూషన్స్, జేఎన్‌కే ఇండియా, ఎక్సికామ్ టెలీ-సిస్టమ్స్, ఆక్మే ఫిన్‌ట్రేడ్ (ఇండియా) ఐపీఓ ప్రతిపాదనలకు క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆమోదం తెలిపింది.

నోవా అగ్రిటెక్ ఐపీఓకు 109 రెట్ల బిడ్లు: హైదరాబాద్‌కు చెందిన నోవా అగ్రిటెక్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ)కు ఇన్వెస్టర్లు బ్రహ్మరథం పట్టారు. గురువారంతో ముగిసిన కంపెనీ ఆఫరింగ్‌కు ఇష్యూ సైజుతో పోలిస్తే 109.36 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.

పుత్రులకు ప్రేమతో..!

ఇద్దరు కుమారులకు రూ.480 కోట్ల విలువైన విప్రో షేర్లను బహుమతిగా ఇచ్చిన ప్రేమ్‌జీ

ఐటీ కంపెనీ విప్రో వ్యవస్థాపకులు అజీమ్ ప్రేమ్‌జీ తన ఇద్దరు కుమారులైన రిషద్ ప్రేమ్‌జీ, తారిఖ్ ప్రేమ్‌జీకి సుమారు రూ.480 కోట్ల విలువైన 1.02 కోట్ల కంపెనీ షేర్లను బహుమతిగా ఇచ్చారు. అందులో రిషద్, తారిఖ్‌కు 51,15,090 చొప్పున షేర్లు లభించాయి. అయితే, ఈ లావాదేవీతో కంపెనీలో ప్రమోటర్, ప్రమోటర్ గ్రూప్ షేర్ హోల్డింగ్‌లో ఎలాంటి మార్పు ఉండబోదని విప్రో స్పష్టం చేసింది.

మైక్రోసాఫ్ట్ @ 3 లక్షల కోట్ల డాలర్లు

తెలుగు తేజం సత్య నాదెళ్ల సారథ్యంలో మైక్రోసాఫ్ట్ మరో రికార్డును నమోదు చేసుకుంది. అమెరికా స్టాక్ మార్కెట్లో మైక్రోసాఫ్ట్ షేరు బుధవారం 1.3 శాతం ఎగబాకి 404 డాలర్లకు చేరుకుంది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ తొలిసారిగా 3 లక్షల కోట్ల డాలర్ల మైలురాయికి చేరింది. ప్రపంచంలో యాపిల్ తర్వాత ఈ స్థాయి మార్కెట్ విలువను సాధించిన రెండో కంపెనీగా మైక్రోసాఫ్ట్ చరిత్రలో నిలిచింది.

స్లోవేనియా కంపెనీతో లారస్ ల్యాబ్స్ జేవీ

హైదరాబాద్‌లో కొత్త కంపెనీ ఏర్పాటు

హైదరాబాద్‌లో జాయింట్ వెంచర్‌లో ఒక కంపెనీ ఏర్పాటు చేయడం కోసం స్లోవేనియాకు చెందిన ఔషధ కంపెనీ కేఆర్‌కేఏతో లారస్ ల్యాబ్స్ ఒప్పందం కుదుర్చుకుంది. కొత్తగా ఏర్పాటు చేయబోయే ఆ కంపెనీలో కేఆర్‌కేఏ 51 శాతం వాటాలు కలిగి ఉంటే లారస్ 49 శాతం వాటా కలిగి ఉంటుంది. ఈ కొత్త కంపెనీ ప్రారంభ మూలధనం 5 కోట్ల యూరోల (రూ.450 కోట్లు) మేరకు ఉంటుం ది. భారత మార్కెట్‌తో పాటుగా కొత్త మార్కెట్లకు ఫినిష్డ్ ఉత్పత్తులను ప్రతిపాదిత కంపెనీ ఉత్పత్తి చేస్తుందని లారస్ ల్యాబ్స్ రెగ్యులేటరీ సంస్థలకు పంపిన సందేశంలో తెలిపింది. నిర్దేశిత కాలపరిమితిలో ఈ కొత్త కంపెనీ భారత మార్కెట్‌కు నాణ్యమైన ఉత్పత్తులను అందుబాటులోకి తెస్తుందని లారస్ ల్యాబ్స్ సీఈఓ సత్యనారాయణ చావా తెలిపారు. అత్యున్నత నాణ్యత గల ఉత్పత్తులను అందించేందుకు భాగస్వాములిద్దరూ కట్టుబడి ఉంటారని కేఆర్‌కేఏ ప్రెసిడెంట్ జోజ్ కొలారిక్ చెప్పారు. అంచెలవారీగా జాయింట్ కంపెనీని అభివృద్ధి చేసేందుకు భాగస్వాములిద్దరూ అంగీకారానికి వచ్చినట్టు ఆయన తెలిపారు. భారత మార్కెట్‌తో పాటు ఇద్దరు భాగస్వాములు ఇప్పటివరకు ప్రవేశించని, యూరోపియన్ యూనియన్ పరిధిలోకి రాని ఇతర మార్కెట్లలో ప్రవేశానికి ఈ కొత్త కంపెనీ ఒక ప్రణాళిక రూపొందించనుంది. రెండు కంపెనీలు పలు సంవత్సరాలుగా కలిసికట్టుగా కాంట్రాక్టు విధానంలో పని చేస్తున్నాయి. తమ వ్యాపారాల విషయంలో పరస్పరం సహకరించుకుంటున్నాయి.

మూడింతలు పెరిగిన పీఎన్‌బీ లాభం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో రూ.2,223 కోట్ల నికర లాభం ఆర్జించింది. ఇది 15 నెలల గరిష్ఠ స్థాయి. అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో లాభం మూడు రెట్లు పెరిగిందని వడ్డీల రూపంలో ఆదాయం పెరగడంతో పాటు ఆస్తుల నాణ్యత మెరుగుపడడం ఇందుకు కారణమని పేర్కొంది. 2022-23 ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో బ్యాంక్ ఆర్జించిన లాభం రూ629 కోట్లుంది. బ్యాంక్ మొత్తం ఆదాయం ఇదే కాలంలో రూ.25,722 కోట్ల నుంచి రూ.29,962 కోట్లకు పెరిగింది.

హెచ్‌పీసీఎల్ లాభంలో భారీ వృద్ధి

న్యూఢిల్లీ: ఆయిల్ మార్కెటింగ్ కంపెనీ హెచ్‌పీసీఎల్ డిసెంబరు త్రైమాసికంలో స్టాండ్ అలోన్ ప్రాతిపదికన రూ.529.02 కోట్ల నికరలాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.172.43 కోట్లతో పోల్చితే లాభం మూడింతలు పెరిగింది. శక్తివంతమైన మార్కెటింగ్ మార్జిన్లు ఇన్వెంటరీ నష్టాల ప్రభావాన్ని తగ్గించాయి కంపెనీ తెలిపింది. అంతర్జాతీయ విపణిలో క్రూడాయిల్ ధరలు తగ్గినా 21 నెలలుగా రిటైల్ ధరలను స్తంభింప చేయడం మార్కెట్ మార్జిన్లు పెరగడానికి దోహదపడింది. కంపెనీ ఆదాయం మాత్రం గత ఏడాది తరహాలోనే రూ.1.18 లక్షల కోట్ల వద్ద స్థిరంగా ఉంది.

రామ్‌రాజ్ కాటన్ ప్రచారకర్తగా రిషబ్ శెట్టి



హైదరాబాద్: రామ్‌రాజ్ కాటన్ ప్రచారకర్తగా కాంతారా ఫేమ్ రిషబ్ శెట్టి నియమితులయ్యారు. రామ్‌రాజ్ ధోతీలు, షర్ట్స్, కుర్తాలకు రిషబ్ ప్రచారం చేపట్టనున్నారని రామ్‌రాజ్ కాటన్ మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ ఈశ్వర్ తెలిపారు. రామ్‌రాజ్ బ్రాండ్‌కు ప్రచారం చేపట్టం ఎంతగానో సంతోషాన్నిస్తోందని ఈ సందర్భంగా రిషబ్ శెట్టి అన్నారు. ఉత్తమ నటుడు, దర్శకుడు అయిన రిషబ్ శెట్టి ప్రచారంతో రామ్‌రాజ్ బ్రాండ్ వినియోగదారులకు మరింత చేరువ అవుతుందని సంస్థ ఎండీ అరుణ్ తెలిపారు.

● వేదాంత కన్సాలిడేటెడ్ నికర లాభం డిసెంబరు త్రైమాసికంలో 18.3 శాతం తగ్గింది. గత ఏడాదితో పోల్చితే లాభం రూ.2464 కోట్ల నుంచి రూ.2013 కోట్లకు దిగివచ్చింది. అయితే కన్సాలిడేటెడ్ ఆదాయం మాత్రం రూ.36,320 కోట్లకు పెరిగింది. గత ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.34,818 కోట్లుంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,950 ▼	57,700 ▼	77,500 ▲
ముంబై	62,312 ▼	57,078 ▼	71,299 ▲



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

25వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	540
26 జనవరి		విశాఖపట్నం	565
చిత్తూరు	573	వరంగల్	542
గోదావరి	540	డజను గుడ్లు రూ.72	



ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	107	గోదావరి	111
వరంగల్	107	విజయవాడ	111
కరీంనగర్	107	గుంటూరు	112
మహబూబ్‌నగర్	107	ఒంగోలు	112
కర్నూలు	107	చిత్తూరు	110
విశాఖపట్నం	108		

'హిండెన్‌బర్గ్'తో మరింత బలోపేతమయ్యాం.. ఆస్తులూ పెంచుకున్నాం : గౌతమ్ అదానీ

న్యూఢిల్లీ: అమెరికా షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్‌పై అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ మరోసారి విరుచుకుపడ్డారు. అబద్ధాలు, అరకొర సమాచారంతో ఈ సంస్థ తమ ఆర్థిక సామ్రాజ్యాన్ని కూలదోయాలని చూసిందని ఆరోపించారు. అయినా ఈ కట్టుకథలను తట్టుకుని అదానీ గ్రూప్ మరింత ఎదిగిందన్నారు. హిండెన్‌బర్గ్ నివేదిక వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ఒక పత్రికలో రాసిన వ్యాసంలో గౌతమ్ అదానీ ఈ విషయం తెలిపారు. ఈ నివేదిక వచ్చిన తర్వాత కూడా తమ గ్రూప్ కంపెనీల్లో వాటాలు విక్రయించడం ద్వారా రూ.40,000 కోట్లు సమీకరించడమే గాక, రూ.17,500 కోట్ల అప్పులనూ తీర్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. తమ గ్రూప్ కంపెనీల నిర్వహణలోని ఆస్తుల విలువ ఇదే సమయంలో రూ.4.5 లక్షల కోట్లకు చేరిందన్నారు. వాటాదారుల సంఖ్యా 43 శాతం పెరిగి 70 లక్షలకు చేరిందన్నారు.

స్పోర్ట్స్

బోపన్న.. అడుగు దూరంలో!

ఫైనల్లో తొలిసారి రోహన్ జంట



టైటిల్ ఫైట్‌కు సబలెంక, జెంగ్ ● ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్‌ను ముద్దాడేందుకు రోహన్ బోపన్న మ్యాచ్ దూరంలో నిలిచాడు. 43 ఏళ్ల లేటు వయసులో డబుల్స్‌లో నెం:1 ర్యాంక్‌ను దక్కించుకొన్న బోపన్న.. మొదటిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లోకి అడుగుపెట్టాడు. గురువారం హోరాహోరీగా జరిగిన పురుషుల డబుల్స్ సెమీస్‌లో రెండో సీడ్ బోపన్న-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ 6-3, 3-6, 7-6 (10-7)తో చైనా-చెక్ ద్వయం జిజెన్‌జాంగ్-థామస్ మచాక్‌పై గెలిచింది. రెండు గంటలకు పైగా సాగిన పోరులో ప్రత్యర్థి జోడీ నుంచి బోపన్న-ఎబ్డెన్‌కు తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. కానీ, కీలక సమయంలో పవర్‌ఫుల్ సర్వీస్‌లతోపాటు అనుభవం కూడా రోహన్‌కు కలసి వచ్చింది. శనివారం జరిగే టైటిల్ ఫైట్‌లో ఇటలీ జంట సైమన్ బోలెల్లీ-ఆండ్రియా వవస్సోరితో రోహన్ ద్వయం తలపడనుంది. 2010లో లియాండర్ పేస్‌తో, గతేడాది ఎబ్డెన్‌తో కలసి రోహన్ యూఎస్ ఓపెన్ ఫైనల్‌కు చేరినా తుది మెట్టుపై నిరాశే ఎదురైంది.

సబలెంక మరోసారి..



మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంప్ అరియానా సబలెంక (బెలారస్) మరోసారి ఫైనల్‌కు దూసుకెళ్లింది. యూఎస్ ఓపెన్ ఫైనల్లో కొకో గాఫ్ చేతిలో ఎదురైన పరాజయానికి బదులు తీర్చుకుంది. సెమీస్‌లో రెండో సీడ్ సబలెంక 7-6(2), 6-4తో నాలుగో సీడ్ కొకొ గాఫ్ (అమెరికా)పై వరుస సెట్లలో నెగ్గింది. మరో సెమీస్‌లో 12వ సీడ్ క్విన్‌గ్‌వెన్ జెంగ్ (చైనా) 6-4, 6-4తో దయానా ఎస్ట్రీమ్‌స్కా (ఉక్రెయిన్)పై అలవోకగా నెగ్గింది. తొలిసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ చేరిన జెంగ్. శనివారం జరిగే తుది పోరులో సబలెంకతో అమీతుమీ తేల్చుకోనుంది.

రోహన్ బోపన్న, జోష్నకు పద్మశ్రీ





న్యూఢిల్లీ: టెన్నిస్ డబుల్స్ తాజా ర్యాంకింగ్స్‌లో వరల్డ్ నెంబర్ వన్‌గా నిలిచిన రోహన్ బోపన్నను పద్మశ్రీ అవార్డు వరించింది. గురువారం ప్రకటించిన పద్మశ్రీ అవార్డుల్లో క్రీడారంగం నుంచి ఏడుగురు ఎంపికయ్యారు. బోపన్నతోపాటు స్క్వాష్ క్రీడాకారిణి జోష్న చినప్ప, గౌరవ్ ఖన్నా (పారా బ్యాడ్మింటన్ కోచ్), ఉదయ్ విశ్వనాథ్ (మల్లఖంబ్ కోచ్), సతేంద్ర సింగ్ (పారాస్విమ్మర్), పూర్ణిమా మహతో (ఆర్చరీ కోచ్), హర్బిందర్ సింగ్ (హాకీ మాజీ ఆటగాడు) ఉన్నారు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో టైటిల్ దిశగా దూసుకెళ్తున్న బోపన్న 2023లో జరిగిన ఆసియా క్రీడల మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణం అందుకున్నాడు. అలాగే గతేడాది మూడు గ్రాండ్‌స్లామ్ ఈవెంట్లలో ఫైనల్స్‌వరకూ చేరుకున్నాడు.

ఇటు అన్న.. అటు తమ్ముడు



న్యూఢిల్లీ: ఒకే రోజు శతకాలతో అదరగొట్టిన క్రికెట్ సోదరులు సర్ఫరాజ్, ముషీర్‌ల పేర్లు భారత క్రికెట్ వర్గాల్లో మార్మోగిపోతున్నాయి. ఇంగ్లండ్ లయన్స్‌తో మ్యాచ్‌లో భారత్-ఎ తరపున సర్ఫరాజ్ (161) భారీ సెంచరీతో హైలైట్‌గా నిలిచాడు. మరోవైపు అండర్-19 వరల్డ్‌కప్‌లో అతడి సోదరుడైన ముషీర్ ఐర్లాండ్‌తో మ్యాచ్‌లో శతకం చేయడంతో యువ భారత్ ఘన విజయం సాధించింది. ఎంతో ప్రతిభగలిగిన ఈ ఇద్దరు ముంబై బ్రదర్స్. ఆయా జట్ల బ్యాటింగ్‌కు వెన్నెముకగా నిలవడం ఇప్పుడు యావత్ దేశ దృష్టిని ఆకర్షించింది.

మెరిసిన ముషీర్

- ఐర్లాండ్‌పై భారత్ విక్టరీ
- అండర్-19 వరల్డ్‌కప్

బ్లూంఫోంటీన్ (సౌతాఫ్రికా): ముషీర్ ఖాన్ (118) శతకంతోపాటు బౌలర్లు నమన్ తివారి (4/53), సౌమీ పాండే (3/21) విజృంభించడంతో.. గురువారం జరిగిన వన్డే అండర్-19 వరల్డ్‌కప్ పోరులో భారత్ 201 రన్స్ తేడాతో ఐర్లాండ్‌ను చిత్తుచేసింది. టాస్ ఓడిన భారత్ 7 వికెట్లకు 301 పరుగులు చేసింది. ఛేదనలో ఐర్లాండ్ 29.4 ఓవర్లలో 100 రన్స్‌కే కుప్పకూలింది.

తిప్పేసి.. దంచేసి

రాణించిన స్పిన్ త్రయం ● ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 246 ఆలౌట్

- అదరగొట్టిన జైస్వాల్
- భారత్ తొలి ఇన్నింగ్స్ 119/1


అశ్విన్ (3/68)
జడేజా (3/88)


జైస్వాల్ (76 బ్యాటింగ్)

హైదరాబాద్: ఇంగ్లండ్ బజ్‌బాల్ గేమ్ రివర్స్ అయ్యింది. భారత గడ్డపై స్పిన్‌ను ఎదుర్కొంటూ ఎదురుదాడికి దిగడం అంత సులువు కాదనే విషయం స్టోక్స్ సేనకు తొలిరోజే తెలిసొచ్చింది. అటు ఇదీ భారత బజ్‌బాల్ గేమ్ అంటూ ఉప్పల్ మైదానంలో యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ (70 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 76 బ్యాటింగ్) ధనాధన్ ఆటతో చెలరేగాడు. ఫలితంగా మొదటి రోజు టీమిండియా ఆధిపత్యమే కనిపించింది. స్పిన్ త్రయం అశ్విన్ (3/68), జడేజా (3/88), అక్షర్ (2/33) సుడులు తిరిగే బంతులకు పేసర్ బుమ్రా (2/28) తోడు కావడంతో గురువారం ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 64.3 ఓవర్లలో 246 పరుగులకు కుప్పకూలింది. స్టోక్స్ (70), బెయిర్‌స్టో (37), డకెట్ (35) రాణించారు. ఆ తర్వాత చివరి సెషన్‌లో బరిలోకి దిగిన భారత్ ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 23 ఓవర్లలో 119/1 స్కోరుతో నిలిచింది. క్రీజులో జైస్వాల్‌తో పాటు గిల్ (14 బ్యాటింగ్) ఉన్నాడు.

తొలి సెషన్ ఇద్దరిదీ: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ ఆరంభంలో ఎదురుదాడి వ్యూహాన్నే నమ్ముకుంది. ఓపెనర్లు క్రాలే, డకెట్‌లో పోటాపోటీ బౌండరీలతో చెలరేగడంతో జట్టు 11 ఓవర్లలోనే 53 పరుగులు సాధించింది. బజ్‌బాల్ గేమ్ రుచి చూపిస్తున్నట్టు అనిపించినా.. 12వ ఓవర్‌లో అశ్విన్ తొలి దెబ్బ వేశాడు. జోరు మీదున్న డకెట్‌ను ఎల్బీ చేయడంతో తొలి వికెట్‌కు 54 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత పోప్ (1)ను జడేజా, క్రాలేను అశ్విన్ అవుట్ చేయడంతో 60/3 స్కోరుతో తడబడింది. అయితే అనుభవజ్ఞులు రూట్, బెయిర్‌స్టో పరిస్థితిని చక్కదిద్దారు. ఆరంభంలో జానీ వేగం కనబరిచినా తర్వాత ఆచితూచి ఆడాడు. దీంతో 108/3 దగ్గర తొలి సెషన్ ముగిసింది.

ఐదు వికెట్లతో ఆధిపత్యం: రెండో సెషన్‌లో భారత బౌలర్ల హవా సాగింది. దీంతో ప్రత్యర్థి ఏకంగా మరో ఐదు వికెట్లను కోల్పోయింది. క్రీజులో చక్కగా కుదురుకున్న బెయిర్‌స్టో, రూట్ ఆరంభంలోనే పెవిలియన్‌కు చేరారు. అక్షర్ రిప్పర్ బంతికి బెయిర్‌స్టో క్లీన్‌బౌల్డ్ అవడంతో నాలుగో వికెట్‌కు 61 పరుగుల భాగస్వామ్య ముగిసింది. ఇక స్వీప్ షాట్‌కు వెళ్లిన రూట్ షార్ట్ ఫైన్ లెగ్‌లో బుమ్రాకు క్యాచ్ ఇచ్చాడు. అనంతరం పూర్తి రక్షణాత్మక ధోరణిలోకి వెళ్లిన ఇంగ్లండ్ నుంచి 20 ఓవర్లపాటు కనీసం ఓ ఫోర్ కూడా రాలేదు. కెప్టెన్ స్టోక్స్ పట్టుదలగా నిలువగా అతడికి టెయిలెండర్లు కాస్త సహకరించారు. ఉన్నకాసేపు టామ్ హార్ట్‌లీ (23) వేగంగా ఆడి జడేజా ఓవర్‌లో బౌల్డయ్యాడు. 57వ ఓవర్‌లో స్టోక్స్ మూడు ఫోర్లు బాదడంతో ఈ సెషన్‌లో జట్టు 107 పరుగులు సాధించగలిగింది. ఆఖరి సెషన్‌లో బ్యాట్‌కు పనిచెప్పిన స్టోక్స్.. జడ్డూ ఓవర్‌లో రెండు సిక్సర్లతో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. అటు మార్క్ ఉడ్ (11)ను అశ్విన్, స్టోక్స్‌ను బుమ్రా అవుట్ చేయడంతో ఈ సెషన్ తొలి 39 బంతుల్లోనే ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్ ముగిసింది.

జైస్వాల్ బాదుడు : ప్రత్యర్థి బజ్‌బాల్ గేమ్‌కు సవాల్ విసిరేలా ఓపెనర్ జైస్వాల్ ఇన్నింగ్స్ సాగింది. స్పిన్నర్ జాక్ లీచ్ మాత్రమే పొదుపుగా బౌలింగ్ చేశాడు. తొలి బంతినే ఫోర్‌గా మలిచిన జైస్వాల్ రెండో ఓవర్‌లో రెండు సిక్సర్లతో స్వాగతం పలికాడు. టీ20 తరహాలో సాగిన అతడి ఆటతో 39 బంతుల్లోనే జట్టు 50 పరుగులకు చేరింది. ఇక 47 బంతుల్లో జైస్వాల్ అర్ధసెంచరీ కూడా పూర్తి చేసుకున్నాడు. అయితే జట్టు 80 పరుగుల వద్ద కెప్టెన్ రోహిత్ (24)ను లీచ్ అవుట్ చేశాడు. ఈ దశలో వరుసగా నాలుగు ఓవర్లు గిల్ నెమ్మదిగా ఆడడంతో ఐదు పరుగులే వచ్చాయి. కానీ 19వ ఓవర్‌లో జైస్వాల్ ఫోర్‌తో జట్టు స్కోరు వందకి చేరింది. మరో వికెట్ పడకుండా నాలుగు ఓవర్ల అనంతరం ఈ ఇద్దరూ తొలి రోజు ఆటను ముగించారు.

1

భారత్‌లో జరిగిన టెస్టుల్లో తొలి రోజు కనీసం పది వికెట్లు కోల్పోయి ఎక్కువ పరుగులు (365) నమోదు కావడం ఇదే మొదటిసారి.

భారత్-ఇంగ్లండ్ మధ్య జరిగిన టెస్టుల్లో ఎక్కువ పరుగులు (2,555) సాధించిన బ్యాటర్‌గా జో రూట్. సచిన్ (2,535)ను దాటేశాడు. అలాగే భారత్‌పై టెస్టు ఫార్మాట్‌లో ఎక్కువ రన్స్ సాధించిన పాంటింగ్‌తో సమంగా నిలిచాడు.

టెస్టుల్లో అధిక వికెట్లు (50 టెస్టుల్లో 504) తీసిన భారత జోడీగా అశ్విన్-జడేజా. గతంలో కుంబ్లే-హర్భజన్ (54 టెస్టుల్లో 501) ఈ ఫీట్ సాధించారు.

విరాట్ అభిమాని.. రోహిత్ కాళ్లుమొక్కి



ఉప్పల్ మైదానంలో తొలి రోజు భారత్ ఇన్నింగ్స్ సమయంలో అనూహ్య సంఘటన చోటు చేసుకుంది. విరాట్ కోహ్లీ వీరాభిమాని ఒకరు అతడి పేరుతో ఉన్న జెర్సీని ధరించి సెక్యూరిటీ సిబ్బంది కళ్లుగప్పి గ్రౌండ్‌లోకి దూసుకెళ్లాడు. క్రీజులో ఉన్న రోహిత్ కాళ్లు మొక్కి, కౌగిలించుకునేందుకు యత్నించగా సిబ్బంది అతడిని బయటికి తీసుకెళ్లారు. దీం తో స్టేడియంలోని భద్రతాలోపాలు బయటపడినట్టయ్యింది.

కోహ్లీ.. కోహ్లీ

తొలి రోజు ఆటను చూసేందుకు వచ్చిన ప్రేక్షకులు కోహ్లీ నామస్మరణతో ఊగిపోయారు. వ్యక్తిగత కారణాలతో కోహ్లీ రెండు టెస్టులకు దూరమైన విషయం తెలిసిందే. దీంతో కోహ్లీ ఫొటోలతో కూడిన 'వి య్ మిస్ యూ విరాట్' అనే ప్లకార్డులు అధికంగా కనిపించాయి. అలాగే యువత కోహ్లీ.. కోహ్లీ అంటూ నినాదాలతో ఉప్పల్ స్టేడియాన్ని హోరెత్తించారు. విరాట్‌ను ప్రత్యక్షంగా వీక్షిద్దామని ఎంతగానో ఎదురు చూసిన వారికి అతను లేకపోవడం తీవ్రంగా నిరుత్సాహాన్ని కలిగించింది.

స్కోరుబోర్డు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (సి) సిరాజ్ (బి) అశ్విన్ 20; డకెట్ (ఎల్బీ) అశ్విన్ 35; పోప్ (సి) రోహిత్ (బి) జడేజా 1; రూట్ (సి) బుమ్రా (బి) జడేజా 29; బెయిర్‌స్టో (బి) అక్షర్ 37; స్టోక్స్ (బి) బుమ్రా 70; ఫోక్స్ (సి) భరత్ (బి) అక్షర్ 4; రెహాన్ (సి) భరత్ (బి) బుమ్రా 13; హార్ట్‌లీ (బి) జడేజా 23; ఉడ్ (బి) అశ్విన్ 11; లీచ్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు: 3; **మొత్తం: 64.3 ఓవర్లలో 246 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-55, 2-58, 3-60, 4-121, 5-125, 6-137, 7-155, 8-193, 9-234, 10-246; **బౌలింగ్:** బుమ్రా 8.3-1-28-2, సిరాజ్4-0-28-0, జడేజా 18-4-88-3,అశ్విన్21-1-68-3, అక్షర్ 13-1- 33-2.

భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (బ్యాటింగ్) 76; రోహిత్ (సి) స్టోక్స్ (బి) లీచ్ 24; గిల్ (బ్యాటింగ్) 14; ఎక్స్‌ట్రాలు: 5; **మొత్తం: 23 ఓవర్లలో 119/1. వికెట్ పతనం:** 1-80. **బౌలింగ్:** ఉడ్ 2-0-9-0; హార్ట్‌లీ 9-0-63-0; లీచ్ 9-2-24-1; రెహాన్ 3-0-22-0.

ఉత్తమ వన్డే క్రికెటర్ కోహ్లీ


కమిన్స్

క్రికెటర్ ఆఫ్ ద ఇయర్‌గా కమిన్స్ ● ఐసీసీ అవార్డులు

దుబాయ్: విరాట్ కోహ్లీ రికార్డు స్థాయిలో నాలుగోసారి ఐసీసీ వన్డే ఉత్తమ క్రికెటర్‌గా నిలిచాడు. గతేడాది వివిధ ఫార్మాట్లలో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన క్రికెటర్లకు ఐసీసీ అవార్డులను ప్రకటించింది. విరాట్ 2012, 2017, 2018లోనూ ఈ పురస్కారం దక్కించుకోగా, ప్రపంచ క్రికెట్‌లో నాలుగుసార్లు బెస్ట్ వన్డే ప్లేయర్‌గా నిలిచిన ఏకైక ఆటగాడయ్యాడు. 2023లో విరాట్ 24 వన్డేల్లో 72.47 సగటుతో ఆరు శతకాలు, ఎనిమిది హాఫ్ సెంచరీలతో 1377 పరుగులు పూర్తి చేశాడు. ఇక గతేడాది వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌తో పాటు వన్డే వరల్డ్‌కప్‌ను కూడా అందించిన ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌ను ఐసీసీ క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు వరించింది. ఉత్తమ టెస్టు ఆటగాడిగా ఉస్మాన్ ఖవాజా (ఆసీస్) నిలిచాడు. మహిళల్లో ఉత్తమ క్రికెటర్‌గా నాట్ సివర్ బ్రంట్ (ఇంగ్లండ్), వన్డే బెస్ట్ ప్లేయర్‌గా చమరి ఆటపట్టు (శ్రీలంక) అవార్డులను అందుకోనున్నారు.

'ఫేక్' ముఖాలు!

- వైసీపీ మూకల దిగజారుడు ప్రచారం
- 'వాచ్' కథను అబద్ధం చేసేందుకు తిప్పలు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఫేక్ మాటలు... ఫేక్ వార్తలు... ఫేక్ పోస్టింగ్‌లు! సోషల్ మీడియా నిండా వైసీపీ మూక 'ఫేక్ ముఖాలే'! విపక్ష నేతలపై బురదజల్లడమే లక్ష్యంగా అన్ని విలువలూ మరిచి, అడ్డగోలుగా బరితెగించి మరీ ఫేక్ ప్రచారానికి తెరలేపుతున్నారు. దీనికోసం ఇప్పటికే పలుమార్లు 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' లోగోలను దుర్వినియోగం చేశారు. తాజాగా... 'వే2న్యూస్' వంటి ఆన్‌లైన్ వార్తల యాప్‌ల లోగోలనూ వాడేస్తున్నారు. హైకోర్టు న్యాయమూర్తికి వైసీపీ ఎంపీ 2021లో డైమండ్ వాచ్ ఇవ్వజూపినట్లు 'ఆంధ్రజ్యోతి' సంచలన కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై ఏ వివరణ ఇచ్చుకోలేక, తేలుకుట్టిన దొంగల్లా గమ్మునున్న 'వైసీపీ మూక' ఒక తప్పుడు ప్రచారానికి తెరలేపింది. "డైమండ్ వాచ్ వార్త ఫేక్ అయినా ప్రజల్లోకి బాగా వెళ్ళింది. ప్రజలు నమ్మేశారు. ఇలాంటి వార్తలు మళ్లీ మళ్లీ ఇద్దాం" అంటూ ఏబీఎన్ చానల్ ఆఫీసులో డెస్క్ ఇన్‌చార్జిలు చర్చించుకున్నారని, ఆ వీడియో లీక్ అయిందని... ఫేక్ న్యూస్ సృష్టించారు. పైగా... దానిని 'వే2న్యూస్' లోగోతో సోషల్ మీడియాలోకి వదిలారు. కొందరైనా దీనిని నిజమని, 'ఆంధ్రజ్యోతి' కథనం అబద్ధమని నమ్ముతారన్నది వారి అత్యాశ! దీనిపై 'వే2న్యూస్' వెంటనే స్పందించింది. "కొన్ని దుష్ట శక్తులు మా లోగోతో ఫేక్ వార్తను సృష్టించి, మా పేరుతో ప్రచారంలో పెట్టారు' అని స్పష్టం చేసింది.



'వే 2 న్యూస్' లోగోతో ప్రచారమైన ఫేక్ వార్త.. దాంతో తమకు సంబంధంలేదంటూ ఆ సంస్థ స్పష్టీకరణ.

లోకేశ్ లక్ష్యంగా...

'టీడీపీ-జనసేన మధ్య పొత్తులు, జనసేనకు కేటాయించిన సీట్లు' అంటూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు పేరుతో బుధవారం ఒక 'ఫేక్ ప్రకటన సృష్టించారు. అదేరోజు అర్ధరాత్రి మరో ఫేక్ డ్రామాకు తెరలేపారు. టీడీపీ యువ నేత లోకేశ్‌ను అమెరికా పోలీసులు అదుపులోకి తీసుకున్నారంటూ... వైసీపీ అనుకూల వెబ్‌సైట్‌లో తొలుత ప్రచురించారు. దానిని తమ గ్రూపుల్లో విస్తృతంగా ప్రచారంలో పెట్టారు. అంతటితో ఆగకుండా... 'లోకేశ్ అరెస్టుకు నిరసనగా అమెరికాలోని ఆంధ్ర ప్రదేశ్ ప్రజలు అమెరికా అధ్యక్షుడు బైడెన్‌కు వ్యతిరేకంగా ఓటు వేయాలని చంద్రబాబు పిలుపు' అంటూ మరో బ్రేకింగ్ న్యూస్ సృష్టించారు. దీనికి 'ఏబీఎన్' చానల్ లోగో వాడుకున్నారు. ఇదంతా ఫేక్ ప్రచారమే! కొందరినైనా నమ్మించేందుకు చేసిన ప్రయత్నమే! జనాన్ని వెరి వెంగళప్పలను చేసే ఎత్తుగడే!

స్పీకర్‌కు ఏక వాక్య సమాధానం పంపిన చంద్రబాబు

అమరావతి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌కు టీడీపీ అధినేత చంద్రబాబు ఏక వాక్య సమాధానం పంపారు. కొద్దిరోజుల క్రితం స్పీకర్ కార్యాలయం ఒక నోటీసును చంద్రబాబుకు పంపింది. టీడీపీ నుంచి వైసీపీలోకి మారిన నలుగురు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని టీడీపీ శాసనసభాపక్షం తరపున విప్ డోలా బాల వీరాంజనేయులు ఇటీవల స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై పార్టీ అధ్యక్షునిగా చంద్రబాబు తన వైఖరి తెలపాలని స్పీకర్ నోటీసు పంపారు. ఈ నోటీసుకు చంద్రబాబు గురువారం సమాధానం పంపారు. 'పార్టీ నిర్ణయం మేరకే అనర్హత పిటిషన్ ఇచ్చాం. ఆ మేరకు మీరు చర్యలు తీసుకోండి' అని పేర్కొన్నారు.

పీకలేరన్న జగన్ దిగిపోతానంటున్నారు: షరీఫ్

అమరావతి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): 2021లో వెంట్రుక కూడా పీకలేరన్న జగన్ ఇప్పుడు సంతోషంగా దిగిపోతాననడానికి కారణం ప్రజాగ్రహమేనని టీడీపీ సీనియర్ నేత ఎంఏ షరీఫ్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డబ్బులిచ్చి మరీ ఇంటర్వ్యూ పేరుతో జాతీయ మీడియా సంస్థకు జగన్ చెప్పిన విషయాలు ఆయన్ని పట్టి పీడిస్తున్న భయానికి సంకేతాలని తెలిపారు. ప్రజాగ్రహాన్ని గ్రహించే చివర్లో అప్రజాస్వామిక విధానాలను నమ్ముకున్నారని ఆరోపించారు.

కేడీల పాలనలో రైతన్నలకు బేడీలు: అచ్చెన్న

రాజధాని కోసం పోరాడుతున్న రైతన్నలకు కేడీల పాలనలో బేడీలు వేశారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తెలిపారు. దేశంలోనే 1,500 రోజుల పాటు ఉద్యమించిన చరిత్ర అమరావతి రైతులకే దక్కుతుందన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం నిర్మించతలపెట్టిన అమరావతిని పూర్తి చేయలేని పాలకులు మూడు రాజధానులంటూ పరువు తీశారన్నారు. అమరావతి పోరాటంలో 275 మంది రైతుల మరణానికి జగన్ కారకులయ్యారని, 151 సీట్లు వచ్చాయని విర్రవీగుతున్న ఆయన అమరావతి అంశంతోనే మట్టికరవడం తథ్యమన్నారు.

వైసీపీ నుంచి 50మంది ఎమ్మెల్యేలు జంప్: రఘురామ

న్యూఢిల్లీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ నుంచి త్వరలో 50మంది ఎమ్మెల్యేలు కుదిరితే టీడీపీ, జనసేనపార్టీల్లో, లేకుంటే కాంగ్రెస్ పార్టీలో అయినా చేరే అవకాశం ఉందని నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు అన్నారు. రచ్చబండ కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఇప్పుడు కాకపోతే కనీసం 2029లో అయినా బాగుపడతామనే ఉద్దేశంతో వారు వైసీపీకి గుడ్‌బై చెప్పబోతున్నారని పేర్కొన్నారు. ఏపీలో ఖాళీ కానున్న మూడు రాజ్యసభ సీట్లలో ఒకటి వైసీపీకి దక్కకపోవచ్చని అన్నారు.

2 లక్షల ఓట్లతో కేశినేని ఓటమి ఖాయం: బుద్దా

హైదరాబాద్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): కేశినేని నాని విజయవాడ లోక్‌సభ నియోజకవర్గంలో 2లక్షల ఓట్ల తేడాతో ఓడిపోబోతున్నారని టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న జోస్యం చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో బుద్దా మీడియాతో మాట్లాడుతూ.. కేశినేని నాని వైసీపీలో చేరడం వల్ల ఆ పార్టీకి భారమే తప్ప లాభం ఉండబోదన్నారు. 2009లో ప్రజారాజ్యం.. 2014లో టీడీపీ.. 2024లో వైసీపీలోకి మారి ఆయారాం.. గయారాంలకు అధ్యక్షుడైన నానికి మతిభ్రమించి పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారన్నారు. చంద్రబాబు గురించి, లోకేశ్ గురించి మాట్లాడితే వీపు విమానం మోత మోగుతుందని హెచ్చరించారు. తిరుపతి లడ్డూలను సైతం అమ్ముకున్న చరిత్ర కేశినేని నానిదని ఆరోపించారు. గెస్ట్‌హౌస్‌ల్లో సెక్స్‌రాకెట్లు నడిపారన్నారు.

జై భారత్ నేషనల్ పార్టీ మేనిఫెస్టో విడుదల

విజయవాడ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జై భారత్ నేషనల్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను ఆ పార్టీ అధ్యక్షుడు, సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ గురువారం విజయవాడలో విడుదల చేశారు. తమది ప్రజా మేనిఫెస్టో అని, ప్రజల వినతుల ఆధారంగా రూపొందించామని ఈ సందర్భంగా తెలిపారు. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన, రైతులకు ఏడాదికి రూ.10వేల చొప్పున చేయూత, వ్యవసాయ కూలీలకు రూ.5వేలు ఇవ్వడంతో పాటు స్వామినాథన్ కమిటీ ప్రకారం కనీస మద్దతు ధరలు అమలు చేస్తామన్నారు.

నెట్‌వర్క్ ఆస్పత్రులపై కక్ష..!

- సమ్మె చేశారని 52 ఆస్పత్రులపై ఆరోగ్యశ్రీ ట్రస్ట్ వేటు

అమరావతి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): శస్త్ర చికిత్సల ప్యాకేజీలు పెంచాలని, బిల్లుల బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సమ్మె చేస్తున్న ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులపై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగింది. సమ్మెలో పాల్గొన్న ఆస్పత్రులను నెట్‌వర్క్ జాబితా నుంచి తొలగించింది. సమ్మె వల్ల రోగులపై ఎలాంటి ప్రభావం పడకపోయినప్పటికీ.. ఆరోగ్యశ్రీ సేవలు నిలిపేశారన్న కారణంతో రాష్ట్రవ్యాప్తంగా 52 ఆస్పత్రులను సస్పెండ్ చేసింది. గురువారం రాత్రి ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో నేతత్వంలో ప్రత్యేక కమిటీ సమావేశమైంది. దీంతో పాటు రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ కూడా అత్యవసర సమావేశం ఏర్పాటు చేసింది. ఆరోగ్యశ్రీ సేవలు తాము కొనసాగించలేమని సంతకాలు చేసి ఇచ్చిన ఆస్పత్రులన్నింటినీ నెట్‌వర్క్ జాబితా నుంచి తొలగించేశారు. ఇందులో ఒక్క కడపలోనే 15 ఆస్పత్రులు ఉండగా.. తూర్పుగోదావరిలో 12, పశ్చిమగోదావరిలో 10, కష్ణాలో ఒక ఆస్పత్రి ఉన్నాయి.

నెట్‌వర్క్ ఆస్పత్రుల సమ్మె పాక్షికం

ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు తలపెట్టిన సమ్మె పాక్షికంగానే జరిగింది. గురువారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేస్తున్నామని నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ ప్రభుత్వానికి బుధవారం సాయంత్రం నోటీసులు ఇచ్చింది. దీనికి అనుగుణంగానే గురువారం రాష్ట్రవ్యాప్తంగా కొన్ని ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేసినట్టు ఉదయమే బోర్డులు పెట్టారు. అయితే 10 గంటల తర్వాత ఆ బోర్డులను తొలగించేసి ఓపీ సేవలు యథావిధిగా కొనసాగించారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.295 కోట్లు విడుదల చేసింది. శుక్రవారం సాయంత్రానికి మరికొంత విడుదల చేస్తామని ఆరోగ్యశ్రీ అధికారులు చెబుతున్నారు.

'వాచ్'పై వేమిరెడ్డి తూచ్

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

మా కథనం అక్షర సత్యం

'ఆంధ్రజ్యోతి' కథనం కాదు... దీనిపై వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఇచ్చిన ప్రకటనే అవాస్తవం. 2021లో టీటీడీ ఈవో ధర్మారెడ్డి, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కలిసి హైకోర్టులోని ఒక కీలక న్యాయమూర్తి కుటుంబ సభ్యుడి వివాహానికి వెళ్లారని.. వజ్రాలు పొదిగిన బంగారు వాచ్ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఇవ్వడానికి ప్రయత్నించగా ఆ జడ్జి తిరస్కరించారని బుధవారం 'ఆంధ్రజ్యోతి' వెల్లడించింది. దీనిపై వేమిరెడ్డి నింపాదిగా, ముక్తసరిగా గురువారం సాయంత్రం ఓ ఖండన విడుదల చేశారు. ఇంత తాపీగా వివరణ ఇవ్వడంలోనే అసలు విషయం అర్థమవుతుంది. 'తాడేపల్లి' నుంచి వచ్చిన ఒత్తిడి మేరకే వేమిరెడ్డి ఇలా 'సంబంధంలేదు... అవాస్తవం' అని వివరణ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఆయనతో తూతూమంత్రంగా ఒక ఖండన ఇప్పించి, దానిని తమ రోత పత్రికలో, కూలి, నీలి మీడియాలలో విస్తృత ప్రచారం చేసి, 'ఆంధ్రజ్యోతి' తప్పుడు కథనాలను రాస్తోందని ప్రచారం చేయడమే జగన్ శిబిరం ఎత్తుగడ! 'ఆంధ్రజ్యోతి' ఇప్పుడూ చెబుతోంది! ఆ కథనం ముమ్మాటికీ నిజం! వందశాతం నిర్ధారించుకున్న తర్వాతే ప్రచురించిన కథనం! ఆ అంశానికీ తనకూ సంబంధంలేదని చెబుతున్న వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి... ఆరోజున తాను ధర్మారెడ్డి సమేతంగా జడ్జి కుటుంబంలో జరిగిన వివాహానికి హాజరయ్యారా, లేదా? 'మీకో చిన్న గిఫ్ట్' అంటూ తానే స్వయంగా వజ్రాలు పొదిగిన వాచ్ తీసి ఇవ్వబోయారా, లేదా? దానిని జడ్జి తిరస్కరించారా, లేదా? ఇవేవీ చెప్పకుండా 'సంబంధం లేదు' అంటే సరిపోతుందా? హైకోర్టు జడ్జికే కానుక రూపంలో ప్రలోభాల వల విసరడం దుస్సాహసమే! ఈ విషయం బయటపడటంతో వేమిరెడ్డి నిండా ఇరుక్కుపోయారు. బయటపడే మార్గంలేక, పక్కా రాజకీయ నాయకుడి తరహాలో తనకేం సంబంధంలేదని తప్పించుకోవాలని చూస్తున్నారు. పైగా... 'నిరాధారం' అంటూ పడికట్టు పదాలతో ప్రకటన వెలువరించారు. బంగారు వాచ్‌ను తిరస్కరించిన ఆ జడ్జి... దీనిపై అప్పుడే సుప్రీంకోర్టుకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిగి ఉంటే... అన్ని ఆధారాలూ బయటికి వచ్చేవి. ఆ అంశంపై విచారణ జరిగితే మొదట ఇరుక్కుపోయేది వేమిరెడ్డే!



వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి

మళ్లీ మళ్లీ చెబుతున్నాం...

'నన్ను నెల్లూరు లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించినందునే ఇలాంటి అసత్య కథనాలు వస్తున్నాయి' అంటూ వేమిరెడ్డి ఒక కొత్త థియరీ పుట్టించారు. ఆయనను మాత్రమే కాదు... 175 మంది అభ్యర్థులను శాసనసభకు, 25 మందిని లోక్‌సభకు జగన్ అభ్యర్థులుగా ప్రకటిస్తారు. ఇప్పటికే కొందరు అభ్యర్థులను ప్రకటించారు. కానీ... వేమిరెడ్డి పైనే 'వాచ్' కథనం ఎందుకు వచ్చిందంటే, అది అక్షరాలా నిజం కాబట్టి! జగన్ శిబిరం న్యాయ వ్యవస్థను సైతం మేనేజ్ చేసేందుకు చేసిన ప్రయత్నాన్ని మాత్రమే 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. అంతే తప్ప.. దీనికి వేమిరెడ్డి పోటీతో సంబంధమే లేదు. మళ్లీ చెబుతున్నాం! 'వజ్రాలు పొదిగిన బంగారు వాచ్' శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం ముమ్మాటికీ నిజం!

కుటుంబం చీలింది జగనన్న వల్లే

(మొదటి పేజీ తరువాయి)

ఏలూరుల్లో ఉభయ గోదావరి జిల్లాల కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలతో ఆమె సమావేశాలు నిర్వహించారు. 'నాకు వ్యక్తిగతంగా అన్యాయం చేసినా రాష్ట్రానికి మేలు చేస్తే చాలనుకున్నాను. మంచి ముఖ్యమంత్రి అనిపించుకుని వైఎస్‌కు పేరు తెస్తే చాలనుకున్నాను. కానీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని జగన్ ముంచేశాడు. బీజేపీకి వైసీపీని, ఎంపీలను, ఎమ్మెల్యేలను, రాష్ట్రాన్ని, ప్రజలను కూడా బానిసలుగా చేసేశాడు. పూర్తిగా నియంతలా మారిపోయాడు. పెద్దపెద్ద కోటలు కట్టుకుని అందులోనే ఉండిపోయాడు. ప్రజలను కలవడమే మానేశాడు. పార్టీ ఎమ్మెల్యేలకు సీఎంను కలిసే స్వేచ్ఛే లేకుండా చేసేశాడు. వైఎస్ ప్రజల మనిషి అయితే జగన్ ప్రజలకు దూరంగా మెలిగే వ్యక్తి' అని నిప్పులు చెరిగారు. వైఎస్ వారసులమని చెప్పుకొంటే సరిపోదని, పాలనలోనూ ఆయన కనిపించాలని.. వీరిద్దరి పాలనలో భూమికి, ఆకాశానికి, నక్కకు, నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్‌ను చీల్చడమే కాకుండా తన కుటుంబాన్ని కూడా చీల్చిందని జగన్ ఇటీవల పెద్ద పెద్ద మాటలు మాట్లాడాడని.. రాష్ట్రం అభివృద్ధి లేకుండా దయనీయ స్థితిలో ఉండడానికి ఆయనే కారణమని ధ్వజమెత్తారు. ఇంకా ఏమన్నారంటే..

ఎండనకా, వాననకా పాదయాత్ర

జగన్ పార్టీ ఇబ్బందుల్లో ఉందని అప్పట్లో 18మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేసి ఆయన వైపు నిలబడ్డారు. వారందరినీ వైసీపీ ప్రభుత్వం వచ్చాక మంత్రులను చేస్తామన్నారు. వారిలో ఎంతమంది ఇప్పుడు మంత్రులుగా ఉన్నారు? వారు రాజీనామా చేస్తే నేను, అమ్మ వారి గెలుపు కోసం కష్టపడ్డాం. తర్వాత వైసీపీ ఇబ్బందుల్లో ఉందని పాదయాత్ర చేయమంటే నా బిడ్డలను కాదనుకుని ఎండనకా, వాననకా వేల కిలోమీటర్లు పాదయాత్ర చేశాను. రోడ్లపై పడుకున్నాను. సమైక్య రాష్ట్రం కోరుతూ యాత్ర చేయమని అడిగితే చేశాను. పార్టీకి అండగా ఉన్నాను. కానీ జగన్ సీఎం అయిన రోజు నుంచీ మనిషే మారిపోయాడు. ఈ ఐదేళ్లలో ఏపీ అటు ఇటూ కాకుండా పోయింది.

జనానికి దూరంగా..

వైఎస్ ప్రజల మనిషి. ప్రజల మధ్యే బతికారు. వారి మధ్య ఉంటే సంతోషంగా ఉంటుందని గర్వంగా చెప్పారు. కానీ మీరు (జగన్) నియంతలా తయారయ్యారు. ప్రజలెవరూ మీ వద్దకు రావడానికి వీల్లేదు. మీరూ ప్రజల వద్దకు వెళ్లరు.. వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు రోజూ 30మందికిపైగా ఎమ్మెల్యేలను కలిసేవారు. ఇప్పుడు కనీసం మీ ఎమ్మెల్యేలు కూడా మిమ్మల్ని కలిసే స్వేచ్ఛలేదు. ఇదా వైఎస్ పాలన? ఎంతమంది పార్టీ కోసం కష్టపడితే మీరు సీఎం అయ్యారు? ఎందరు త్యాగాలు చేస్తే, ఎందరు ఆస్తులు అమ్ముకుంటే సీఎం అయ్యారు? జగన్ ఎవరి త్యాగాలనూ గుర్తించలేదు. ఎవరినీ అభినందించలేదు. పక్కనున్నవారిని.. నా, నీ అనుకున్న వాళ్లందరినీ దూరం చేసుకున్నాడు.

హోదా ఉద్యమమేదీ?

జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రత్యేక హోదా కోసం అప్పుడున్న టీడీపీ ప్రభుత్వాన్ని రోజూ ప్రశ్నించారు. మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తే ఎందుకు రాదన్నారు. కానీ సీఎం అయ్యాక ఒక్కసారి కూడా ఉద్యమం చేయలేదు. బీజేపీకి బానిసైపోయాడు. పోలవరానికి కేంద్రం నిధులు ఇవ్వకపోయినా నిలదీయలేదు. రాజధానికి డబ్బులు ఇవ్వకపోయినా అడగలేదు. 3రాజధానులన్నారు. కానీ రాజధానే లేకుండాపోయింది. జగన్ పాలనలో ఎంతోమంది రైతులు వ్యవసాయం మానేశారు. వైఎస్ పేదింటి బిడ్డలను కడుపులో పెట్టి చూసుకున్నారు. జగన్ పాలనలో పేద బిడ్డల పెద్ద చదువులకు భరోసా ఉందా..? ఫీజు రీయింబర్స్‌మెంట్ లేదు. ఉద్యోగం వస్తుందన్న భరోసా లేదు. పరిశ్రమలు లేవు. చివరకు ప్రభుత్వ ఉద్యోగాలు కూడా లేవు. వైఎస్ కుటుంబాన్ని అవమానించిన కాంగ్రెస్‌లో నేను ఎప్పుడూ చేరకపోయేదాన్ని. కానీ రాహుల్, సోనియా గాంధీతో మాట్లాడాక నమ్మకం కలిగింది. వైఎస్‌ను ఇంతలా అభిమానిస్తూ నెత్తిన పెట్టుకుంటున్నారని.. ఆయనంటే వారికి గుండెలనిండా అభిమానం ఉందని తెలిసింది. వైఎస్ మరణానంతరం ఆయన కుటుంబంపై నమోదైన కేసులగురించి సోనియా మాట్లాడుతూ.. రాజశేఖర్‌రెడ్డి కుటుంబానికి నేనంత హాని చేస్తానా అని అన్నారు. కేసుల విషయంలో వారి ప్రమేయం లేదని నిర్ధారించుకున్నాక కాంగ్రెస్‌తో కలిసి పనిచేయడానికి అంగీకరించాను. రాష్ట్రంలో పార్టీలు అమ్ముడుపోయాయని తెలిశాక నా మనసు ఆగలేదు. అందుకే ఏపీకి వెళ్లి పనిచేయాలని కోరితే కాదనలేకపోయాను. రాష్ట్రం కోసం ఈ నిర్ణయం తీసుకున్నాను. కాంగ్రెస్‌లో చేరాక నన్ను వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తారని తెలుసు. నిందిస్తారనీ తెలుసు. కానీ ప్రజల కోసం, ఏపీ కోసం ముందుకొచ్చాను. రాష్ట్రానికి మున్ముందు మేలు జరగాలన్నా, హోదా కావాలన్నా, విశాఖ స్టీల్‌ప్లాంట్ కావాలన్నా కాంగ్రెస్ అధికారంలోకి రావాలి. ప్రత్యేక హోదా తీసుకురావాలన్న ఇంగితం జగన్‌కు గానీ, చంద్రబాబుకు గానీ లేదు. వారు బీజేపీకి బానిసలు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేయకుండా ఆపామని సజ్జల రామకృష్ణారెడ్డి చెబుతున్నారు. మరి మూడేళ్లుగా అక్కడి ఉద్యోగులు ఎందుకు సమ్మె చేస్తున్నారు?

> రాష్ట్రంలో బీజేపీ ఒక్క ఎమ్మెల్యే, ఎంపీ గెలవలేదు. అయినా ఇక్కడ రాజ్యమేలుతోంది. దీనికి కారణం జగన్. తన పార్టీనే కాదు.. రాష్ట్రాన్ని, ప్రజలను కూడా బీజేపీకి బానిసలుగా మార్చేశాడు.
> అప్పుడేమో ప్రత్యేక హోదా కోసం మూకుమ్మడి రాజీనామాలు చేయాలన్నారు. మరి ఇప్పుడు ఎందుకు చేయడం లేదు? - షర్మిల

ఉండవల్లితో షర్మిల భేటీ

రాజమహేంద్రవరం, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్‌తో షర్మిల గురువారమిక్కడ సమావేశమయ్యారు. తన తండ్రికి, కాంగ్రెస్‌కు తెలిసిన వ్యక్తిగా ఉండవల్లిని మర్యాదపూర్వకంగా కలిశానని.. ఇందులో రాజకీయం ఏమీ లేదన్నారు.



పోలవరాన్ని సా..గదీస్తూ

పోలవరం ప్రాజెక్టు రాజశేఖరరెడ్డి కల. సీఎం అయిన తర్వాత శంకుస్థాపన చేశారు. ఆయన మరణం తర్వాత ప్రాజెక్టు పక్కకు పడిపోయింది. చంద్రబాబు ప్రభుత్వం కూడా ప్రాజెక్టును పూర్తిచేయలేదు. జగన్ సీఎం అయ్యాక 2021లోగా పూర్తిచేస్తా అన్నారు. రివర్స్ టెండరింగ్ పేరుతో వ్యయం పెంచేశారు. ఎత్తు తగ్గించేశారు. కేంద్రం నిధులు ఇవ్వకపోయినా.. నిధులు సాధిస్తామంటూ జగన్ సా..గదీస్తున్నారు తప్పించి 2023 పోయినా ప్రాజెక్టు కదల్లేదు.

బీజేపీ అంటే..

షర్మిల తన ప్రసంగంలో బీజేపీపై సెటైర్లు విసిరారు. "బీజేపీ అంటే ఎక్కడో లేదు.. ఇక్కడేఉంది. 'బీ' అంటే బాబు.. 'జే' అంటే జగన్.. 'పీ' అంటే పవన్ కల్యాణ్" అని ఆమె అనగానే కాంగ్రెస్ కార్యకర్తలు హర్షధ్వానాలు చేశారు. జనసేన, టీడీపీ, వైసీపీలకు రాష్ట్రంలో ఓటేస్తే బీజేపీకి వేసినట్లేనని ప్రజలను హెచ్చరించారు.

8 లక్షల కోట్ల అప్పు ఎక్కడ?

రాష్ట్రం అప్పులమయమైంది. మన రాష్ట్రం ఏర్పడే నాటికి అప్పు రూ.లక్షా 80వేల కోట్లు. చంద్రబాబు హయాంలో మరో లక్షా 80వేల కోట్లు. జగనన్న వచ్చాక 8 లక్షల కోట్లు. మొత్తమంతా కలిపి 11లక్షల 58వేల కోట్లు. ఇన్ని లక్షల అప్పులు తెచ్చి రాజధాని కట్టారా, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేశారా? మూడు రాజధానులన్న జగనన్న.. ఒక్క రాజధాని అయినా తెచ్చాడా?

కాంగ్రెస్ సోషల్ మీడియాలో చేరండి

రాష్ట్ర భవితవ్యాన్ని చక్కదిద్దగల .. అభివృద్ధి పథాన నడపగల సత్తా కాంగ్రెస్ పార్టీకే ఉందని షర్మిల చెప్పారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం కాంగ్రెస్ పార్టీ నిర్వహించే సోషల్ మీడియాలో చేరాలని రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ సోషల్ మీడియాలో చేరేందుకు 9550803366కు మిస్డ్ కాల్ ఇవ్వాలని ప్రజలను షర్మిల కోరారు.

అక్షరాలా.. అబద్ధాల 'చదువు'!

(మొదటి పేజీ తరువాయి)

కౌంటర్లు లేవు. హామీల వైఫల్యం గురించి ప్రస్తావన లేకుండా అనుకూలంగా, భజన తరహాలో సదస్సు ముగిసింది. ఈ సదస్సులో సీఎం జగన్ చెప్పిందేమిటి, అసలు వాస్తవాలు ఏమిటి? ఒక్కసారి పరిశీలిద్దాం..

సీఎం: ధనికుల పిల్లలు ఇంగ్లిష్ మీడియంలో చదువుతున్నప్పుడు, పేదల పిల్లలు ఎందుకు చదవకూడదు? ఆ అంతరాన్ని తొలగించడానికే ఇంగ్లిష్ మీడియం బోధన అమలు చేస్తున్నాం.

వాస్తవం: విద్యార్థుల తల్లిదండ్రులుగానీ, ప్రతిపక్షాలుగానీ ఇంగ్లీష్ మీడియం వద్దని ఎక్కడా చెప్పలేదు. రెండు మాధ్యమాలు ఉంచాలని డిమాండ్ చేశాయి. ప్రభుత్వం అకస్మాత్తుగా తెలుగు మీడియం తొలగించడంతో చాలామంది పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల విద్యాశాఖ తల్లిదండ్రులతో బలవంతంగా ఇంగ్లిష్ మీడియం మాత్రమే కావాలని సంతకాలు చేయించుకుంది. ఇలా తెలుగును తొలగించడాన్ని న్యాయస్థానాలు కూడా తప్పుబట్టినా ప్రభుత్వ తీరు మారలేదు.

సీఎం: ప్రభుత్వ బడుల్లో చదువుతున్న 8, 9 తరగతుల పిల్లల వద్ద ట్యాబ్‌లు ఉన్నాయి. నా పుట్టినరోజు నాడు ఇవ్వడం సంతోషంగా ఉంది. ఇది ఏటా కొనసాగుతుంది.

వాస్తవం: రెండేళ్ల కిందట ప్రభుత్వం వద్ద ట్యాబ్‌ల ఆలోచనే లేదు. 9నుంచి ఇంటర్ వరకు చదివే పిల్లలకు అమ్మఒడి వద్దనుకుంటే ల్యాప్‌ట్యాప్‌లు ఇస్తామని జగన్ ప్రకటించారు. దీంతో 7లక్షల మంది విద్యార్థులు ల్యాప్‌ట్యాప్‌ల కోసం ఆప్షన్ ఇచ్చారు. ఆ తర్వాత సీన్ మారిపోయింది. అసలు ల్యాప్‌ట్యాప్‌లు అనే హామీని ఇవ్వలేదన్నట్టుగా ట్యాబ్‌ల విధానం తెచ్చారు. అదికూడా ఏడాది ఒక్క తరగతికే. ల్యాప్‌ట్యాప్‌లు ఇస్తామన్న మాట ఎందుకుతప్పారు? ఆ హామీ ఏమైంది? అనే ప్రశ్నలు సదస్సులో రాలేదు. తన పుట్టినరోజు నాడు ట్యాబ్‌లు ఇవ్వడం గొప్ప విషయంటూ ముసిముసిగా నవ్వుకుంటూ జగన్ సమాధానమిచ్చారు.

సీఎం: నాడు-నేడు పనులు రూ.14వేల కోట్ల అంచనాతో మొదలుపెట్టాం. ఇప్పటివరకూ రూ.8300కోట్లు ఖర్చు చేశాం. వచ్చే మార్చి నాటికి మూడో విడత పూర్తిచేస్తాం.

వాస్తవం: అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ ప్రభుత్వం నాడు-నేడు ప్రారంభించింది. మూడేళ్లలో మొత్తం పూర్తిచేస్తామని ప్రగల్భాలు పలికింది. మొదటి దశలో 15,575 బడుల్లో పనులు పూర్తయ్యాయి. రూ.8వేల కోట్లతో చేపట్టిన రెండో దశలో ఇంకా సగం పనులే పూర్తయ్యాయి. ఎన్నికల్లోగా రెండో దశ పూర్తికావడం కష్టం. మూడో దశ గురించి ఆలోచనే లేదు. మొత్తంగా రెండు దశల్లో సుమారు 31వేల బడులను చేపట్టగా, మిగిలిన 14వేల బడుల్లో ఎందుకు పూర్తిచేయలేకపోయారో సీఎం చెప్పలేదు.



సీఎం: 2018లో మా రాష్ట్రంలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో చాలా తక్కువగా ఉంది. ఇప్పుడు వంద శాతానికి తీసుకొచ్చాం.

వాస్తవం: ఇదే నిజమైతే బడి బయట పిల్లలను తిరిగి బడుల్లో చేర్పించాలని ప్రభుత్వం ప్రత్యేక డ్రైవ్‌లు ఎందుకు నిర్వహించింది? ఎంత ప్రయత్నించినా కొందరు పిల్లల్ని ట్రేస్‌అవుట్ చేయలేకపోతున్నామంటూ వలంటీర్లు చేతులెత్తేశారు. పిల్లలంతా బడుల్లో లేరని పాఠశాల విద్య అధికారులే సీఎంకు సమీక్షలో తెలిపారు. ఇప్పుడు వంద శాతం జీఈఆర్ సాధించామని ఎలా చెప్పారో జగన్‌కే తెలియాలి.

సీఎం: బడుల్లో ఇంటర్నేషనల్ బాకలారియేట్ ప్రవేశపెడుతున్నాం. 2035 నాటికి మొత్తం ఐబీలోకి మారుస్తాం.

వాస్తవం: మరో రెండేళ్ల తర్వాత ఐబీ సిలబస్ ప్రారంభమవుతుంది. వచ్చే ఏడాది టీచర్లకు శిక్షణ ఇస్తారు. అది సక్రమంగా పట్టాలెక్కుతుందో లేదో తెలియదు. కానీ ఈపాటికే ఐబీని తెచ్చేసినట్టుగా జగన్ గొప్పలు చెప్పుకొన్నారు. ఇది అమలైతే మరో 12ఏళ్ల తర్వాతగానీ పదో తరగతి విద్యార్థులకు ఐబీలో పరీక్షలు జరగవు. కానీ ఇప్పుడే పిల్లలను ప్రపంచ స్థాయిలో పోటీపడేలా చేసినట్టుగా జగన్ గొప్పలు చెప్పుకొన్నారు. అసలు విషయం ఏంటంటే సీబీఎస్‌ఈలో ప్రభుత్వం ఫెయిలైంది. రెండేళ్లలో మొత్తం 45వేల బడుల్లో సీబీఎస్‌ఈ తెస్తామని వైసీపీ అధికారంలోకి వచ్చినప్పుడు ప్రకటించింది. 45వేల బడులు లక్ష్యం అయితే ఇప్పటికి వెయ్యి బడుల్లో మాత్రమే అమలు చేయగలిగింది. అందులో దారుణంగా ఫెయిల్ కావడంతో ఐబీ అనే కొత్త నాటకానికి తెరతీసింది. ఇండియా టుడే కూడా సీబీఎస్‌ఈ గురించి అడగలేదు. ఇక అలాంటి ప్రశ్నలే లేవు కాబట్టి నవ్వుకుంటూ.... ఐబీ తెచ్చాం అన్న రీతిలో జగన్ సమాధానం చెప్పారు.

కంప్యూటర్ కోర్సంటే బీకాం

ప్రపంచంలోని ప్రముఖ యూనివర్సిటీల్లో ఉండే కోర్సులను ఆన్‌లైన్ రూపంలో మన విద్యార్థులకు అందుబాటులోకి తెస్తున్నట్టు సీఎం చెప్పారు. 1800 కోర్సులకు వచ్చే నెలలో ఒప్పందం చేసుకుంటామన్నారు. అంటే వచ్చే విద్యా సంవత్సరంలో అవి అందుబాటులోకి వస్తాయి. కానీ ఇప్పటికే వచ్చేసినట్టుగా కలరింగ్ ఇచ్చారు. అయితే అందులో ఒక కంప్యూటర్ కోర్సు గురించి చెప్తారా? అని ఇండియా టుడే ప్రతినిధి ప్రశ్నించగా... 'ఉదాహరణకు చెప్పాలంటే బీకాం కోర్సు' అని జగన్ సెలవిచ్చారు. కేవలం బీకాం కోర్సులో కంప్యూటర్స్ ఉంటుందా అని తిరిగి ప్రశ్న రాకపోవడంతో జగన్ తనలో తనే నవ్వుకున్నారు. ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

ప్రచారానికి దూరమట..!

అది ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమం అని కొన్ని ప్రశ్నలు చూస్తే తెలిసిపోతుంది. "విద్యారంగంలో ఇంత మంది చేస్తున్నా ప్రచారానికి ఎందుకు దూరంగా ఉంటున్నారు?" అని ఇండియా టుడే అడిగింది. "మేం ఏ పనులు చేశామో మేం చెప్పుకోవడం కాదు. మీరు స్వయంగా చూడటం ఆనందంగా ఉంది" అని జగన్ సెలవిచ్చారు. వాస్తవానికి విద్యారంగాన్ని జగన్ ప్రభుత్వం పూర్తిస్థాయి రాజకీయ ప్రచారానికి వినియోగించుకుంటోంది. ఏడాదిలో నాలుగుసార్లు విద్యా దీవెన నగదు వేస్తే ప్రతిసారీ భారీ బహిరంగ సభ పెట్టి జగన్ బటన్ నొక్కుతున్నారు. ఉన్నత విద్యామండలి వద్ద అప్పు తీసుకుని మరీ సభలు నిర్వహించిన ఘనత ఈ ప్రభుత్వానిది. అలాగే వసతి దీవెన విడుదల చేయాలన్నా జగన్ సభ పెట్టాల్సిందే. పాఠశాలల విషయానికొస్తే విద్యాకానుక ఇచ్చేటప్పుడు, అమ్మఒడి విడుదల చేసేటప్పుడు, ట్యాబ్‌లు ఇచ్చే సమయంలో ప్రతిసారీ కోట్లాది రూపాయలతో భారీ సభలు పెట్టి వాటిని రాజకీయ విమర్శలకు వాడుకుంటున్నారు. కానీ ఇవేం తెలియదన్నట్టుగా ప్రచారానికి దూరంగా ఉంటున్నారేంటని ఇండియా టుడే అడగటం, 'మేం చెప్పుకోం' అని జగన్ బదులివ్వడం చూసి జనం నవ్వుకుంటున్నారు.

పిల్లలు ఎందుకు వెళ్లిపోయారు?

జీఈఆర్ గురించి ప్రశ్న అడిగిన ఇండియా టుడే ప్రభుత్వ బడుల్లో పిల్లల సంఖ్య ఎలా ఉంది అని ఎందుకు అడగలేదో వాళ్లకే తెలియాలి. నిజంగా సీఎం చెప్పిన పనులన్నీ పూర్తిచేసి ఉంటే ఈపాటికి ప్రైవేటు బడులు పతానావస్థకు చేరి ఉండేవి. కానీ ప్రభుత్వ బడులను విద్యార్థులు వదిలేసి వెళ్లిపోతున్నారు. 2021-22లో 45.71 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చదివారు. 2022-23లో ఒకేసారి నాలుగు లక్షల మంది విద్యార్థులు తగ్గడంతో ఆ సంఖ్య 41.38 లక్షలకు పడిపోయింది. ఇక 2023-24లో ఇంకా దారుణంగా 39 లక్షల లోపే విద్యార్థులు బడుల్లో ఉన్నారు. నిజంగా బడుల రూపురేఖలు మార్చి ఉంటే, ఇంగ్లిష్ మీడియంతో అంతరాలు తగ్గించి ఉంటే, అంతర్జాతీయ సిలబస్‌లు తెస్తుంటే పిల్లలు పెరగడానికి బదులుగా ఎందుకు తగ్గిపోయారు? అసలు సదస్సులో ఎక్కడా ఈ ప్రస్తావనే రాలేదు.

టీచర్ల భర్తీ ఊసేదీ.?

ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల భర్తీపై ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ చాలా బాధపడిపోయారు. 23 వేల ఖాళీలుంటే ఎందుకు భర్తీచేయడం లేదంటూ అప్పటి ప్రభుత్వాన్ని పదే పదే నిలదీశారు. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీతో మొత్తం భర్తీ చేస్తామన్నారు. ఇప్పటికి దాదాపు ఐదేళ్లు అవుతున్నా మెగా డీఎస్సీ కాదు కదా ఒక్క పోస్టునూ భర్తీ చేయలేదు. ఇలాంటి ఇబ్బంది పెట్టే ప్రతికూల ప్రశ్నలు సీఎంకు ఎదురుకాలేదు. ప్రాయోజిత కార్యక్రమం కావడంతో పక్కాగా ముందుగా అనుకున్న ప్రశ్నలే రావడంతో చిరునవ్వులు చిందిస్తూ సీఎం చకచకా సమాధానాలిచ్చారు.



జనసేనలో చేరిన కొనతాల రామకృష్ణకు పార్టీ సభ్యత్వం ఇస్తున్న పవన్

క్రైస్తవులకు మేం వ్యతిరేకం కాదు


- వారి హక్కుల పరిరక్షణకు అండగా ఉంటాం
- మైనార్టీ నిధుల దుర్వినియోగంపై కమిటీ: పవన్

అమరావతి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తన స్వార్థం కోసం మతాన్ని వాడుకునే వ్యక్తే తప్ప ఏసుక్రీస్తు బోధనలను పాటించే వ్యక్తి కాదని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. ఆయన నిజంగా క్రీస్తు వాక్యాలు పాటిస్తే రాష్ట్రాన్ని ఇలా ఇబ్బందులు పెట్టేవారు కాదని చెప్పారు. జనసేన పార్టీ క్రైస్తవులకు వ్యతిరేకం కాదని, తాను అండగా నిలబడి చూపిస్తానన్నారు. తాను బీజేపీకి సన్నిహితంగా ఉన్నందున క్రైస్తవులకు వ్యతిరేకమని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అందరికీ న్యాయం చేయడానికి సిద్ధంగా ఉన్నానని, మతాన్ని ఎన్నికల కోసం వాడుకోబోనని స్పష్టం చేశారు. గురువారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన క్రైస్తవ మత పెద్దలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పవన్ మాట్లాడుతూ... తాను అన్ని మతాలను గౌరవిస్తున్నందుకే పార్టీ మూల సిద్ధాంతాల్లో మత ప్రస్తావన లేని రాజకీయం అనే అంశాన్ని చేర్చామని గుర్తు చేశారు. జగన్ హయాంలో 517 ఆలయాలు అపవిత్రమయ్యాయని, ఆయా ఘటనల్లో దోషులను పట్టుకోకపోతే, పాలకుడు అన్యమతస్తుల పక్షం వహిస్తున్నారనే భావన హిందువులకు కలుగుతుందన్నారు. ఇది ప్రమాదకరమని, ఇలాంటి రుగ్మతలను పూర్తిగా తీసేయాలన్న లక్ష్యంతో మాట్లాడతానని, దీనిని కూడా క్రీస్తు నుంచే నేర్చుకున్నానని పవన్ తెలిపారు. క్రైస్తవుల మనోభావాలకు, ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగితే జనసేన పార్టీ తరఫున వారికి అండగా నిలబతానని హామీ ఇచ్చారు. మైనార్టీలకు కేటాయించిన నిధులు క్రిస్టియన్ మైనార్టీలకు ఎందుకు రావడం లేదని పవన్ ప్రశ్నించారు. ఈ అంశంపై విచారణ జరిపించి వారికి నిధులు ఇప్పించే ప్రయత్నం చేస్తామన్నారు. క్రైస్తవ సమాజానికి ఎలాంటి సాయం కావాలన్నా చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. బైబిల్ సాక్షిగా ఎన్నికల రోజు జనసేన వైపు నిలబడాలని వారిని కోరారు. క్రైస్తవుల సమస్యల పరిష్కారంపై కమిటీని వేస్తామన్నారు. కోనసీమను కలహాల సీమ కాదు ప్రేమసీమ అని నిరూపిద్దామని పవన్ పిలుపునిచ్చారు.

కొణతాలకు పార్టీ సభ్యత్వం

మాజీ ఎంపీ కొణతాల రామకృష్ణ జనసేన పార్టీలో చేరారు. గురువారం మధ్యాహ్నం పార్టీ కార్యాలయానికి చేరుకున్న ఆయన పవన్‌తో భేటీ అయ్యారు. అనంతరం పవన్ సమక్షంలోనే జనసేన సభ్యత్వాన్ని నమోదు చేసుకున్నారు.

వైసీపీ కార్యాలయం ప్రారంభోత్సవంలో సచివాలయ సిబ్బంది



ర్యాలీలో పాల్గొన్న సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు

విజయవాడ (అజిత్‌సింగ్‌నగర్), జనవరి 25: విజయవాడలో గురువారం జరిగిన సెంట్రల్ నియోజకవర్గ వైసీపీ కార్యాలయ ప్రారంభోత్సవం ప్రభుత్వ కార్యక్రమాన్ని తలపించింది. ఈ సందర్భంగా జరిగిన పార్టీ ర్యాలీలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. సచివాలయాల సిబ్బంది కార్యక్రమానికి హాజరు కావాలంటూ వైసీపీ కార్పొరేటర్లు, నేతలు హుకుం జారీ చేయడంతో కార్యక్రమానికి వెళ్లకపోతే ఏమవుతుందోనని భయపడి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు భారీగా హాజరయ్యారు.

మూడు నెలల్లో కొత్త ప్రభుత్వం

- చంద్రబాబే ముఖ్యమంత్రి.. అమరావతే రాజధాని
- రైతులపై అక్రమ కేసులు ఎత్తేసే బాధ్యత మాదే!
- జగన్ పతనం అమరావతి నుంచే మొదలు
- అమరావతి సమర శంఖారావం సభలో వక్తలు



అమరావతి ఉద్యమానికి 1500 రోజులు పూర్తయిన సందర్భంగా నిర్వహించిన సభలో మండలి మాజీ చైర్మన్ షరీఫ్ పాదాలపై పూలు జల్లుతున్న మహిళ



మందడంలో నిర్వహించిన సభకు హాజరైన మహిళలు

గుంటూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): 'ఎన్నికల నోటిఫికేషన్ రాగానే తాడేపల్లి పిల్లి మూటా ముల్లె సర్దుకుంటుంది. వచ్చే ఎన్నికల్లో టీడీపీ గెలవబోతోంది. చంద్రబాబు ముఖ్యమంత్రి అవుతున్నారు. అమరావతి రాజధానిని ఆయనే పూర్తి చేస్తారు. ప్రపంచస్థాయి రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దుతారు' అని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు చెప్పారు. అమరావతి మహోద్యమం 1500 రోజులకు చేరిన సందర్భంగా రాజధాని గ్రామాలైన వెలగపూడి, మందడంలలో గురువారం ఏర్పాటు చేసిన 'అమరావతి సమర శంఖారావం' సభకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఇచ్చిన పొలాల్లో, చంద్రబాబు నిర్మించిన శాసన సభలోనే చట్టాలు తయారవుతాయి. ఆయన నిర్మించిన సచివాలయం నుంచే పాలన సాగుతుంది. ప్రస్తుత ముఖ్యమంత్రికి అమరావతిని విచ్ఛిన్నం చేయడమే పని. దాన్ని అడ్డుకున్న రైతులు, మహిళలపై పోలీసులు, దౌర్జన్యాలు, ఎన్ని చేసినా మీరిచ్చిన పొలాలే మిమ్మల్ని కాపాడాయి. రేపు చంద్రబాబు మీకు న్యాయం చేస్తారు. 277 మంది అమరావతి రైతుల బలిదానాల సాక్షిగా అమరావతి ప్రపంచ రాజధానిగా వెలుగొందుతుంది' అని ఉమ భరోసా ఇచ్చారు. రైతులపై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు ఎత్తేసే వరకూ బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ 'మూడు నెలల తరువాత జగన్ ప్రభుత్వం ఉండదు. గాలికి పోతుంది. జగన్ రాష్ట్రాన్ని మోసం చేస్తుంటే 151 ఎమ్మెల్యేలు, మంత్రులు దద్దమ్మల్లా బల్లలు చరిచారు' అని విరుచుకుపడ్డారు. '1500 మంది పోలీసులు ఉంటే తప్ప అడుగు బయట పెట్టలేని జగన్.. ఒక్కసారి అమరావతి రా! మగాళ్ల వరకూ అవసరం లేదు. మా అమరావతి మహిళలే చాలు అంటూ తీవ్ర హెచ్చరికలు చేశారు. అమరావతి రైతుల మహోద్యమం చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించాల్సిన ఘట్టమన్నారు. సీపీఎం నేత బాబూరావు మాట్లాడుతూ అమరావతి విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముద్దాయిలన్నారు. వెలగపూడి గోపాలకృష్ణ మాట్లాడుతూ జగన్ వంటి రాక్షసుడిని పారదోలడానికి అన్ని పార్టీలు ఏకమై వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలన్నారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మాట్లాడుతూ 'ఎన్నికలు అయ్యేంత వరకూ పట్టు విడువకుండా పోరాటం చేయాలి. న్యాయం చేసే పార్టీని గెలిపించుకోవాలి' అని పిలుపునిచ్చారు. పోతుల బాలకోటయ్య, కొలికిపూడి శ్రీనివాస్ ప్రసంగించగా.. జేఏసీ నేత పువ్వాడ సుధాకర్ అధ్యక్షత వహించారు. తొలుత అమరావతి ఉద్యమంలో చనిపోయిన రైతులకు నివాళులు అర్పించారు. దళిత జేఏసీ నేత మార్టిన్ లూథర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. సభలో ఎమ్మెల్సీ అశోక్‌బాబు, టీడీపీ నేతలు పట్టాభిరామ్, శ్రావణ్‌కుమార్, నన్నపనేని రాజకుమారి, ఫారూక్ షుబ్లీ, జనసేన నేత గాదె వెంకటేశ్వరరావు రైతులకు సంఘీభావం ప్రకటించారు. నెల్లూరు జిల్లా కావలి నుంచి వచ్చిన ప్రాసమణి అమరావతి రైతుల మహోద్యమాన్ని తన ప్రాసలతో హోరెత్తించారు.

బైరైటీస్.. బడా స్కామ్

(మొదటి పేజీ తరువాయి)

పూర్తి చేయడం, ఎన్నికలు ముగిసేలోగా మొత్తం బైరైటీస్‌ను ఖాళీ చేయడం, వందల కోట్లు పోగేసుకోవడం! ఇదీ.. స్కీమ్! బైరైటీస్‌ను కొట్టేసేందుకు వేసిన మాస్టర్ ప్లాన్! ఇందులో టెండర్ డాక్యుమెంట్ ఫీజు నుంచి టన్ను బైరైటీస్‌కు నిర్ణయించిన రిజర్వు ధర వరకు సకలం 'స్కామ్'లో భాగమే! బైరైటీస్‌లో ఏ, బీ, సీ, డీ గ్రేడ్‌లు ఉంటాయి. ఆ తర్వాత వచ్చేది 'వేస్ట్' గ్రేడ్. ఇందులో ఏ, బీ గ్రేడ్‌లకు రేటు ఎక్కువ. మంగంపేట మైనింగ్ ఏరియాలో ఏ, బీ గ్రేడ్‌ల బైరైటీస్‌ను అమ్మేశారు. అవి అతి తక్కువ నిల్వలున్నాయి. కానీ... సీ, డీ, డబ్ల్యూ (వేస్ట్) గ్రేడ్ నిల్వలు పేరుకుపోయాయి. వాటి అమ్మకాలపై ఇంతకాలం నిర్ణయం తీసుకోలేదు. 'సరుకు మొత్తం' కొట్టేసేందుకు సరిగ్గా ఎన్నికల ముందు వరకు ఆగారు. ఇప్పుడు టెండర్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.

ధర.. దగా...

బైరైటీస్‌కు డిమాండ్ ఎక్కువ. ఏదీ దొరకనప్పుడు 'వేస్ట్' గ్రేడ్ కూడా కొంటారు. మన దేశంలో దొరికే బైరైటీస్ బాగా నాణ్యమైనది. ప్రస్తుతం మార్కెట్‌లో సీ, డీ గ్రేడ్‌ల బైరైటీస్ ధర టన్నుకు రూ.1650 దాకా ఉంది. ఏ, బీ గ్రేడ్‌లు దొరక్కపోతే దీనికి బాగా డిమాండ్ పెరుగుతుంది. ధర కూడా పెరుగుతూనే ఉంటుంది. ఏవిధంగా చూసినా.. టన్ను బైరైటీస్ రిజర్వు ధర కనీసం రూ.1650గా నిర్ణయించాలి. అంతకంటే ఎవరు ఎక్కువ కోట్ చేస్తే వాళ్లకు టెండరు ఇవ్వాలి. కానీ... ఏపీఎండీసీ కేవలం రూ.1200 రిజర్వు ప్రైస్ నిర్ణయిస్తూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఫైలు పంపించినట్లు తెలిసింది. ఇది చూసి ఆయన ఆశ్చర్యపోయారు. "ఏ, బీ గ్రేడ్‌లు దొరక్కపోతే సీ, డీ గ్రేడ్‌లకు డిమాండ్ పెరుగుతుంది కదా! ధరను 500 నుంచి వెయ్యి పెంచొచ్చు. దీని వల్ల ప్రభుత్వానికి అదనపు ఆదాయం వస్తుంది. మీరేవిటి ఉన్న ధరనే తగ్గించారు? దీనికి ఒప్పుకోను" అంటూ ఫైల్ తిప్పి పంపించారు. దీంతో గనుల శాఖలోని 'బంగారు కొండ' ప్లాన్ మార్చారు. సీఎంవోలో ఈ ఫైలుపై ఆమోద ముద్ర పొందారు. అంటే... బైరైటీస్ రిజర్వు ధర నిర్ణయంలోనే దగా జరిగింది. అంటే... టన్నుకు కనీసం రూ.450 దోచేశారనుకున్నా, కోటి టన్నులకు రూ.450 కోట్లు కొట్టేసినట్లే! టన్ను ధరను రూ.2వేలుగా నిర్ణయించినా.. బిడ్డింగ్‌లో అంతకుమించే ధర పలికే అవకాశముంది. కానీ... అస్మదీయులకు దోచిపెట్టేందుకే ఈ దగా! మంత్రి చెప్పినట్లుగా రిజర్వు ప్రైస్‌ను టన్నుకు మార్కెట్ ధరపై రూ.500 పెంచితే, రూ.2150 అయ్యేది. అంటే... ఇప్పుడు నిర్ణయించిన ధరకంటే రూ.950 అధికం. కోటి టన్నులకు రూ.950 కోట్లు. ఇదంతా ప్రభుత్వం కోల్పోతున్న ఆదాయం. కంపెనీలు దక్కించుకోనున్న కనీస లాభం!

తొందర తొందరగా టెండర్...

టెండరు ఏ కంపెనీలకు దక్కాలి, ఎవరెవరికి ఎంత వాటా వెళ్లాలి... ఇవన్నీ 'బంగారు కొండ' ముందుగానే నిర్ణయించినట్లు సమాచారం. ఎంపిక చేసిన కంపెనీలు మాత్రమే పాల్గొనేలా పక్కాగా స్కెచ్ వేశారు. ఇలాంటి టెండర్లలో బిడ్ల దాఖలుకు నెల నుంచి రెండు నెలలు గడువు ఇస్తారు. కానీ.. 15 రోజుల్లోనే చుట్టేస్తున్నారు. గురువారం టెండర్ నోటిఫికేషన్ ఇచ్చారు. బిడ్ల దాఖలుకు ఫిబ్రవరి 7 చివరి తేదీ. 8వ తేదీన సాంకేతిక అర్హత సాధించిన కంపెనీలను ప్రకటిస్తారు. 9న బైరైటీస్ వేలం నిర్వహిస్తారు. టన్ను రిజర్వు ధర రూ.1200గా నిర్ణయించినప్పటికీ... ఈ విషయాన్ని ఏపీఎండీసీ బహిరంగపరచలేదు. 'ఆర్‌ఎఫ్‌పీ' (రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్)లోనే ఆ వివరాలు ఉంటాయని తెలిపారు. బైరైటీస్ టెండరు డాక్యుమెంట్ ఫీజు... రూ.29.50 లక్షలు! ఇది... 18శాతం జీఎస్టీతో కలిపి! ఇది 'నాన్ రిఫండబుల్'. టెండర్ల చరిత్రలోనే అత్యంత ఖరీదైన డాక్యుమెంట్ ఇదే. ఇక.. బిడ్ సెక్యూరిటీని రూ.90 కోట్లుగా నిర్ణయించారు. బిడ్ దక్కని వారికి దీనిని తిరిగి చెల్లిస్తారు.

ఇసుక దారిలోనే మస్కా...

మొన్నటికి మొన్న రాష్ట్రవ్యాప్తంగా ఇసుక టెండర్లను అస్మదీయులకు కట్టబెట్టినందుకు అమలు చేసిన స్కీమ్‌నే.. బైరైటీస్‌కూ వాడుతున్నారు. ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా రాష్ట్ర స్థాయిలో టెండర్లు పిలిస్తే అందరికీ తెలిసిపోతుంది. అన్ని వివరాలూ బయటపెట్టాలి. అందుకే... కోల్‌కతా కేంద్రంగా ఉన్న ఎంఎస్‌టీసీ (మెటల్ స్క్రాప్ ట్రేడింగ్ కార్పొరేషన్ - కేంద్ర ప్రభుత్వ సంస్థ)కే బైరైటీస్ టెండర్లనూ అప్పగించారు. ఇసుక టెండర్లను ఎంఎస్‌టీసీ ద్వారా గుట్టుగా కట్టబెట్టారు. టెండర్ డాక్యుమెంట్, బిడ్‌లు దాఖలు చేసిన కంపెనీలు, వాటి అర్హతల వివరాలేవీ బయటకు రాలేదు. బైరైటీస్ విషయంలోనూ ఇదే జరగనుంది. ఏపీఎండీసీ సంస్థ టెండర్ డాక్యుమెంట్‌లో ఎంఎస్‌టీసీ లింకు ఇచ్చింది. కానీ.. దాన్ని తెరిస్తే ఏమీ కనిపించదు. అంతా రహస్యమే!

'మంగంపేట'ను

ముంచేశారు

బైరైటీస్ దోపిడీలో మరో 'చీకటి' కోణం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి కడప జిల్లాలోని మంగంపేట బైరైటీస్ గనులను అడ్డగోలుగా దోచేశారు. గనుల శాఖలోని గజదొంగలు అడ్డదారుల్లో తరలించి కోట్లు కొల్లగొట్టారు. బైరైటీస్ దోపిడీలో మరో 'చీకటి' కోణం బయటపడింది. కొందరు అధికారులు బినామీ కంపెనీలు ఏర్పాటు చేయించి సీ గ్రేడ్ పేరిట ఏ గ్రేడ్ బైరైటీస్‌ను తరలించి సొమ్ము చేసుకోగా... దీన్ని తలదన్నేలా అసలు రికార్డుల్లోకే ఎక్కకుండా డంపింగ్ యార్డు నుంచి చీకట్లో అడ్డదారుల్లో బైరైటీస్‌ను తరలించి దందా సాగించారు. గనుల ఘనుడు బంగారుకొండ ఈ చీకటి బాగోతం నడిపించారు. గత మూడేళ్లలో అక్రమంగా తరలించిన బైరైటీస్ విలువ రూ.420 కోట్ల పైమాటే. మంగంపేట డంపింగ్ యార్డులో రికార్డులకు ఎక్కకుండా చిమ్మ చీకట్లో అడ్డదారిలో దారి మళ్లించారు. మంగంపేటలోనే గతంలో పనిచేసిన ఓ ఉన్నతాధికారి, మరో నలుగురు అధికారులను ఉపయోగించుకొని దోపిడీ కొనసాగించారు. ఈ దందాలో బంగారుకొండ వాటా 80 శాతం. ఇక ఏ గ్రేడ్ బైరైటీస్‌ను సీ గ్రేడ్ కింద చూపి దారి మళ్లించిన వ్యవహారంలో అధికారులు ప్రభుత్వ ఖజానాకు మరో రూ.650 కోట్లు గండికొట్టారు. గజదొంగలంతా ఇలా మొత్తం 1000 కోట్ల పైనే దోచుకున్నట్లు అంచనా. సీ గ్రేడ్ పేరిట ఏ గ్రేడ్ బైరైటీస్ తరలింపు వ్యవహారంపై ఇదివరకే 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. చీకటి దోపిడీ దీనికి అదనం. అయితే ఈ విషయం బయటకు రాకుండా, విచారణ ముందుకు సాగకుండా బంగారుకొండ, వసూల్‌రాజా కలిసి అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారు.

చీకట్లో దోపిడీ ఇలా..

విశ్వసనీయ సమాచారం ప్రకారం... మంగంపేటలో బైరైటీస్ దోపిడీ రెండు రకాలుగా జరిగింది. అతి విలువైన ఏ గ్రేడ్ బైరైటీస్‌ను సీ గ్రేడ్ కింద చూపి అస్మదీయ కంపెనీలకు కట్టబెట్టారు. దీనిపై ఇదివరకే 'ఆంధ్రజ్యోతి' సమగ్ర సమాచారం అందించింది. ఇక రెండోది.. కంప్యూటర్లు, ఆర్‌ఎఫ్‌ఐడీ రీడర్లు, వేయింగ్ మిషన్‌లు, ఇతర వ్యవస్థలు రికార్డులు ఏమార్చి దొడ్డిదారిలో ఏ గ్రేడ్ బైరైటీస్‌ను దారి మళ్లించారు. బైరైటీస్ మైన్ డంపింగ్ యార్డులోకి ప్రధానంగా 4ద్వారాలు ఉన్నాయి. లారీలు వాటి ద్వారానే యార్డులోకి వెళ్తాయి. ఆ సమయంలో లారీ నంబర్, దాని ఆర్‌ఎఫ్‌ఐడీ నంబర్‌ను కంప్యూటర్‌లో నమోదు చేస్తారు. అలాగే స్కానర్ ద్వారా వాటి ట్యాగ్ లైన్ రీడ్ చేస్తారు. ఇలా రోజుకు కొన్ని వందల లారీలు యార్డులోకి వస్తుంటాయి. సాయంత్రం తర్వాత మూడో షిఫ్ట్ నుంచే అసలు కథ మొదలవుతుంది. చీకట్లో దోపిడీ అన్న మాట. మూడో షిఫ్ట్‌లో 100 లారీలు యార్డులోకి వెళ్తే 60 మాత్రమే తిరిగి ప్రధాన ద్వారాల గుండా బయటకు వెళ్తాయి. మిగిలిన 40 లారీలు బయటకు రావు. వాహనాలు బ్రేక్ డౌన్ అయ్యాయని, సాంకేతిక సమస్య వచ్చిందని, ఇంకా రకరకాల కారణాలు చెప్పి వాటిని వేయింగ్ మిషన్ రూట్, ఆర్‌ఎఫ్‌ఐడీ స్కానర్ ఉన్న ప్రధాన గేట్ల నుంచి కాకుండా దొడ్డిదారిలో బయటకు పంపిస్తారు. అలా చీకట్లో బయటకు వెళ్లిన లారీల్లో ఏ గ్రేడ్ బైరైటీస్‌ను తరలిస్తారు. వాటిని అస్మదీయ కంపెనీల డంపింగ్ యార్డుకు తరలిస్తారు. అవి గమ్యస్థానానికి చేరుకోగానే మొదట మైనింగ్ ఏరియాలోకి వచ్చిన ఆ వాహనాల ఎంట్రీ రికార్డులను రాత్రికి రాత్రే తొలగిస్తారు. ఇలా గత మూడేళ్లుగా చీకట్లో అప్రతిహతంగా బైరైటీస్‌ను అక్రమంగా తరలించారు. తద్వారా రూ.420 కోట్లపైనే కొల్లగొట్టారని తెలిసింది. ఈ దోపిడీ బయటకు రాకుండా మంగంపేట బైరైటీస్ డంపింగ్ యార్డులోకి వాహనాలను స్కాన్ చేసి నమోదు చేసే కంప్యూటర్ల రికార్డులను ఏ రోజుకు ఆ రోజే మార్చేవారు. తరలింపు లారీల వివరాలు నమోదు కాకుండా చేసేవారు. మంగంపేట ప్రాజెక్టు చీఫ్ ఆఫీసర్ కార్యాలయం, ఏపీఎండీసీ వద్ద ఆ వివరాలేవీ లేకుండా చేశారు.

సొంతమనిషికి పోస్టింగ్

మంగంపేట బైరైటీస్ అక్రమాల్లో కీలక పాత్రధారిగా భావిస్తున్న అధికారి ఇంతకుముందు కూడా అక్కడ పనిచేశారు. ఆ సమయంలోనే ఆయనపై అనేక ఫిర్యాదులు రాగా విజిలెన్స్ విచారణ జరిగింది. ఆయనపై శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ ప్రాసిక్యూషన్‌కు విజిలెన్స్ సిఫారసు చేసింది. అయితే అప్పట్లో ఆయన్ను సస్పెండ్ చేయకుండా మరో జిల్లాకు మార్చారు. గనుల శాఖలోకి బంగారుకొండ రాగానే ఈ అధికారినే తిరిగి మంగంపేటకు పంపించారు. ఏ పని చెప్పినా మారు మాట్లాడకుండా చేస్తారని, రూల్స్ పట్టించుకోరని ఆయన్ను ఏరికోరి ఎంపిక చేశారు. విచారణలో బైరైటీస్ అక్రమాలకు ఆ అధికారిని బాధ్యుడిని చేస్తూ సస్పెండ్ చేయగా, బంగారుకొండ సేఫ్‌గా ఉన్నారు.

విచారణకు అడ్డుపుల్ల!

మంగంపేట డంపింగ్ యార్డు నుంచి బైరైటీస్‌ను చీకట్లో అడ్డదారిలో తరలించిన వ్యవహారంపై సమగ్ర విచారణ జరిగితే అసలు దోపిడీ విలువ బయట పడుతుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ వివరాలేవీ బయటకు రాకుండా దాచేందుకు విజిలెన్స్ విచారణకు గనుల శాఖ అధికారుల సహకరించడం లేదని తెలిసింది. విజిలెన్స్ కోరిన సమాచారం ఇవ్వకుండా, అసలు విచారణే ముందుకు సాగకుండా వసూల్ రాజాతో తీవ్రమైన ఒత్తిడి చేయిస్తున్నారు. విజిలెన్స్ విచారణ జరిగితే మంగంపేట ప్రాజెక్టు చీఫ్ ఆఫీసర్‌తో పాటు గనుల శాఖ ఘనుడు బంగారుకొండ బాగోతం బయటకు వస్తుంది. బంగారుకొండ మౌఖిక ఆదేశాలతో మంగంపేటలో చీకట్లో డొంకదారిలో బైరైటీస్ దోపిడీ సాగిందని వెలుగులోకి వస్తుంది. దీంతో తన దాకా విజిలెన్స్ టీమ్ రాకుండా జాగ్రత్తపడుతున్నారు. దోపిడీ సొమ్ములో 80% వాటా బంగారుకొండ కు, 20% మంగంపేటలో పనిచేసిన కీలక అధికారికి వెళ్లినట్లు నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది.

బిల్లులు రాక.. అప్పులు తీరక..

- మనోవేదనతో వైసీపీ సర్పంచ్ మృతి



కొండన్న (ఫైల్)

బుక్కరాయసముద్రం, జనవరి 25: చేసిన పనులకు బిల్లులు అందక, తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న అధికార పార్టీకి చెందిన సర్పంచ్.. మనోవేదనతో ప్రాణాలు కోల్పోయాడు. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం సిద్ధరాంపురం సర్పంచ్ గుద్దిటి కొండన్న(48) తీవ్ర అనారోగ్యంతో బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో గురువారం మృతిచెందారు. పంచాయతీ పరిధిలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం భవనాలను కొండన్న నిర్మించాడు. ఇతర అభివృద్ధి పనులు చేయించాడు. వీటన్నింటికీ ప్రభుత్వం నుంచి రూ.50 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉంది. పార్టీ అధికారంలో ఉన్నందున, బిల్లులు వస్తాయన్న ధీమాతో అప్పులు చేసి పనులు చేయించాడు. ఏళ్ల తరబడి బిల్లులు రాకపోవడంతో వాటిపై వడ్డీలు పెరిగాయి. దీనికితోడు సర్పంచ్ ఎన్నికలలో రూ.50 లక్షలకు పైగా ఖర్చు చేశాడని ఆయన మద్దతుదారులు అంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే (శింగనమల) జొన్నలగడ్డ పద్మావతితో పొసగకపోవడంతో ఆయనకు బిల్లులు రానివ్వకుండా చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొండన్న ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయాడని, ఒత్తిడి కారణంగా తీవ్ర అనారోగ్యం పాలయ్యారని ఆయన వర్గీయులు అంటున్నారు.

డబ్బు తీసుకోలేదని కాణిపాకంలో ప్రమాణం చేస్తారా?

- రోజాకు వైసీపీ కౌన్సిలర్ భువనేశ్వరి సవాల్



ఫోన్ సంభాషణను వినిపిస్తున్న భువనేశ్వరి

తిరుపతి (తిలక్‌రోడ్), జనవరి 25: 'పుత్తూరు మున్సిపల్ చైర్‌పర్సన్ పదవి ఇస్తానని చెప్పి మాట తప్పిన మంత్రి రోజా.. తన వద్ద డబ్బు తీసుకోలేదని కాణిపాకంలో ప్రమాణం చేసేందుకు సిద్ధమా?' అని 17వ వార్డు వైసీపీ కౌన్సిలర్ భువనేశ్వరి సవాల్ విసిరారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. 'పదవి ఇస్తానంటేనే రూ.40 లక్షలను మూడు కంతుల్లో కుమారస్వామి రెడ్డి మనిషి సత్యాకు ఇచ్చానని, డబ్బు వెనక్కి ఇవ్వమంటే రూ.29 లక్షలు మాత్రమే ఇస్తామని చెప్పి, రూ.13 లక్షలే ఇచ్చారని మిగిలిన డబ్బు కోసం కాళ్లరిగేలా తిప్పించుకున్నారని' ఆవేదన వ్యక్తం చేశారు. తన వద్ద డబ్బు తీసుకెళ్లిన సత్యా తనతో ఫోన్‌లో మాట్లాడిన వాయిస్ రికార్డును ఆమె వినిపించారు.

కోడికత్తి శ్రీనుపై జైలు అధికారుల ఒత్తిడి!


దీక్ష విరమణ, క్షీణించిన ఆరోగ్యం: విదసం

ఆరిలోవ (విశాఖపట్నం), జనవరి 25: వైఎస్ జగన్‌పై కోడికత్తితో దాడి చేసిన కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న జనిపల్లి శ్రీనివాసరావు విశాఖ సెంట్రల్ జైలులో చేపట్టిన నిరాహార దీక్ష గురువారం విరమించినట్టు విశాఖ దళిత సంఘాల ఐక్య వేదిక (విదసం) కన్వీనర్ బూసి వెంకటరావు తెలిపారు. గురువారం ఆయన కేంద్ర కారాగారంలో ములాఖత్ ద్వారా శ్రీనివాస్‌ను కలిశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. 'శ్రీనివాస్ ఆరోగ్యం బాగా క్షీణించింది. ఇద్దరు ఖైదీల సహాయంతో నన్ను ములాఖత్‌లో కలిశాడు. జైలు అధికారులు తీవ్ర ఒత్తిడితో దీక్ష విరమించినట్టు చెప్పాడు. అతడికి మెరుగైన వైద్యం అందించాలి' అని వెంకటరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కోట్ల సొమ్ముతో పరార్!

- 'ఎర్ర' సొమ్మా.. మద్యానికి సంబంధించినదా?
- చిత్తూరు జిల్లాలో ఘటన.. రాష్ట్రంలో కలకలం
- సొమ్ముల పంపిణీపై స్మగ్లర్ల మధ్య వివాదం
- భారీ మొత్తంతో పరారైన ఓ స్మగ్లర్
- కీలక నేత ఆదేశాలతో రంగంలోకి పోలీస్
- అయినా అందరూ గప్‌చుప్

అమరావతి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలో భారీగా డబ్బు గల్లంతయిన వ్యవహారం రాష్ట్రంలో కలకలం రేపుతోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం... తమిళనాడు, కేరళ, తదితర ప్రాంతాలకు చెందిన ఎర్ర చందనం స్మగ్లర్లు చిత్తూరు తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలోని అయ్యప్ప వెంచర్స్ సమీపంలో బుధవారం రాత్రి సమావేశమయ్యారు. భారీ మొత్తంలో ఉన్న సొమ్మును వాటాలుగా పంచుకునే విషయమై వారి మధ్య చర్చలు జరిగాయి. ఇది ఎంతకూ తెగకపోగా.. ఇద్దరు ప్రధాన వ్యక్తుల మధ్య తీవ్ర వాగ్యుద్ధం చోటుచేసుకుంది. ఇదే అదనుగా వారిలోని ఓ స్మగ్లర్ భారీగా డబ్బు తీసుకుని వాహనంలో పరారైనట్టు సమాచారం. ఈ విషయమై అధికార పార్టీ కీలక నేత ఒకరు హుటాహుటిన పోలీసులను రంగంలోకి దించారు. పరారైన స్మగ్లర్ కోసం వేట మొదలయ్యింది. గల్లంతయిన సొమ్ములో మద్యం లావాదేవీలకు సంబంధించిన సొమ్ములు కూడా ఉన్నట్టు తెలుస్తోంది. పారిపోయిన వ్యక్తిని పట్టుకోవడానికి చిత్తూరు జిల్లా పోలీసులు తమిళనాడు వైపు వెళ్లినట్టు తెలిసింది. అయితే కీలక నేత ఆదేశాల మేరకు ఈ ఘటనకు సంబంధించి పోలీసులెవరూ నోరుమెదపడం లేదు. 'ఏమీ జరగలేదు, ఎలాంటి ఫిర్యాదు అందలేదు' అంటూ విషయాన్ని తేల్చేస్తున్నారు. గల్లంతయిన సొమ్ము, పరారైన వ్యక్తులు దొరికితే అసలు విషయం బయటకు వచ్చే అవకాశం ఉంది



మీ వాళ్లనే వదల్లేదు.. ఇక మమ్మల్ని వదిలేస్తారా?

- చంపుతారేమో.. చంపండి
- బెయిల్ లభించినా.. దస్తగిరి ఇంటికి రాలేని పరిస్థితి
- తప్పు చేయకుంటే అవినాశ్‌రెడ్డి కోర్టుకెందుకు వెళ్తున్నాడు
- రాక్షసత్వాన్ని మీ వాళ్లపై చూపండి: దస్తగిరి భార్య



పులివెందుల, జనవరి 25: 'మీ వాళ్లనే విడిచిపెట్టనప్పుడు.. మమ్మల్ని వదిలేస్తారని మాకు నమ్మకం లేదు. నా భర్తకు బెయిల్ వచ్చినా పులివెందులకు రాలేని దుస్థితి నెలకొంది' అంటూ మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి భార్య షబానా ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మీడియాకు ఒక వీడియో సందేశాన్ని ఆమె విడుదల చేశారు. 'ఐదు కోట్లు ఆశచూపి నా భర్తను నాశనం చేశారు. వైసీపీకి చెందిన ప్రతి ఒక్కరు దస్తగిరికి శత్రువులై కూర్చున్నారు. ఈ రాక్షస పాలన నుంచి నా భర్తను కాపాడండి. దిక్కులేని పరిస్థితిలో మేమున్నాం. ఎర్రగుంట్ల కేసులో నా శక్తికి మించి పోరాడి నా భర్తకు బెయిల్ తెచ్చుకున్నా. కానీ, నా భర్త ఇంటికి రాలేని పరిస్థితి ఉంది. ఎందుకంటే మళ్లీ పీటీ వారెంట్లు వేస్తారు. మళ్లీ దాని మీద ఫైట్ చేసి బెయిల్ తెచ్చుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. మీ తమ్ముడు తప్పు చేయనంత వరకు మీరు మమ్మల్ని ఎందుకు ఇబ్బంది పెడుతున్నారు. మాతో మీకెందుకండీ యుద్ధం. మీ సంతోషాల కోసం మా ఆయనను ఎందుకు బలిపశువును చేస్తున్నారు. మీ మీద తప్పుడు ఆరోపణలు వస్తున్నాయని మీరు బాధపడ్డప్పుడు.. తప్పును తప్పు అని మీరు ఒప్పుకోనప్పుడు.. మరి మా ఆయన ఎక్కడ కిడ్నాప్ చేశాడు? ఎక్కడ దొంగతనం చేశాడు? ఎవరిని కొట్టాడు? ఏ తప్పూ చేయకుంటే ఎంపీ అవినాశ్‌రెడ్డి కోర్టుకు ఎందుకు వెళ్తున్నాడు. మీకున్నట్లే భార్యభర్తల బంధం ఉంది. దయచేసి మీ రాక్షసతత్వాన్ని మీ వాళ్లమీద చూపండి మా మీద చూపకండి సార్' అంటూ షబానా ఆవేదన వ్యక్తం చేశారు.

బాబు కంటే తగ్గొద్దు!

- భీమిలిలో రేపు సీఎం శంఖారావానికి భారీగా జనాన్ని తరలించాలి
- ఉత్తరాంధ్ర నేతలకు 'తాడేపల్లి' హుకుం
- ప్రతి నియోజకవర్గం నుంచి 50 వేల మంది టార్గెట్!
- 5 వేల మంది కంటే తీసుకురాలేమని చేతులెత్తేస్తున్న కొందరు ఎమ్మెల్యేలు



అమరావతి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 27వ తేదీన భీమిలిలో నిర్వహించే ఎన్నికల శంఖారావం సభకు జనాన్ని భారీగా తరలించాల్సిందేనని వైసీపీ అధిష్ఠానం తమ నేతలను ఆదేశించింది. ఉత్తరాంధ్ర జిల్లాల పార్టీ అధ్యక్షులందరూ ప్రత్యేక దృష్టి సారించాలని తాడేపల్లి ప్యాలెస్ నుంచి ఆదేశాలు అందాయి. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ యువగళం పాదయాత్ర ముగింపు సందర్భంగా.. గత నెలలో విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లిలో టీడీపీ నిర్వహించిన భారీ బహిరంగ సభకు జనం లక్షలాదిగా పోటెత్తారు. విశాఖ నుంచి విజయనగరం, శ్రీకాకుళం వెళ్లేందుకు కూడా వీలులేకుండా జాతీయ రహదారిపైకి దూసుకొచ్చారు. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేనాని పవన్ కల్యాణ్ పాల్గొన్న ఈ సభ బ్రహ్మాండంగా విజయవంతం కావడం.. కోస్తా జిల్లాల్లో తెలుగుదేశం, జనసేన శ్రేణుల్లో అమితోత్సాహం నింపింది. ఈ నేపథ్యంలో భీమిలిలో సీఎం శనివారం పాల్గొనే సభకు జనం ఏ మాత్రం తగ్గకూడదని తాడేపల్లి ప్యాలెస్ వైసీపీ నేతలకు తేల్చిచెప్పింది. ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని తన ఎమ్మెల్యేలందరికీ భారీ లక్ష్యాలే పెట్టింది. ప్రతి నియోజకవర్గం నుంచి 50 వేల మందిని తీసుకురావాలని స్పష్టం చేసింది. అయితే కొందరు సిటింగ్‌లు ఐదు వేల మందిని మించి తీసుకురాలేమని చేతులెత్తేస్తున్నారు.

సర్వేల సాకుతో పలువురు సిటింగ్‌లకు జగన్ మొండిచేయి చూపారు. పరిశ్రమలు, ఐటీ మంత్రి గుడివాడ అమర్నాథ్‌కు కూడా టికెట్ దక్కలేదు. ఆయన్ను పెందుర్తికి బదిలీ చేస్తారని చెబుతున్నా.. స్థానిక సిటింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అడ్డు పడుతున్నారు. పరిశ్రమల మంత్రిగా అమర్నాథ్ పూర్తిగా విఫలమయ్యారన్న ముద్ర ఆయనపై పడింది. ఉత్తరాంధ్రలో చాలా నియోజకవర్గాలకు జగన్ ఇంకా అధికారికంగా ఇన్‌చార్జులను ప్రకటించలేదు. ఉత్తరాంధ్రలో ఎవరికి టికెట్ దక్కుతుందో తెలియని అయోమయం నెలకొంది. తీరా భారీగా ఖర్చుపెట్టి జనసమీకరణ చేశాక తమకు మొండిచేయి చూపితే పరిస్థితి ఏమిటని కొందరు ఎమ్మెల్యేలు ఆందోళన చెందుతున్నారు.

సభకు 'సిద్ధం'గా నామకరణం

విశాఖపట్నం, జనవరి 25(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయ సదస్సుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సభ నుంచే ఎన్నికల ప్రచారానికి ముఖ్యమంత్రి జగన్ శ్రీకారం చుట్టబోతున్నట్టు వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ ప్రకటించారు. అందులో భాగంగానే ఈ సదస్సుకు 'సిద్ధం' అని నామకరణం చేసి, ఉత్తరాంధ్ర వ్యాప్తంగా ఎక్కడికక్కడ హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. సదస్సును ఎలాగైనా విజయవంతం చేయాలని అధిష్ఠానం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడం, నగర పరిధిలోని నియోజకవర్గాల నుంచే సగం జన సమీకరణ జరగాలని లక్ష్యం విధించడంతో నేతలంతా ఆందోళన చెందుతున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

వైసీపీకి రోజులు దగ్గర పడ్డాయి

- అసాంఘిక శక్తులు పోలీసులకు కనబడటం లేదా..!
- వెలంపల్లి ఓ కామెడీ పీస్ : టీడీపీ నేత బొండా ఉమా

పాయకాపురం, జనవరి 25: రాష్ట్రంలో వైసీపీకి ఎక్స్పైరీ డేట్ దగ్గర పడిందని ఇండియా టుడే ఇంటర్వ్యూలో జగన్‌మోహన్‌రెడ్డి తన ఓటమిని ఒప్పుకున్నాడని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. మొగల్రాజపురంలోని ఆయన నివాసంలో గురువారం విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెస్ట్‌లో వేస్ట్ అయిన వెలంపల్లి అక్కడి నియోజకవర్గంలోని పనికిరానివాడని, సెంట్రల్‌కు పంపించి సీఎం జగన్ వెలంపల్లి శ్రీనివాస్‌ను ఓ కామెడీ పీస్ చేశాడని ఎద్దేవా చేశారు. వెలంపల్లి పర్యటనలో రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులు తిరుగుతుంటే పోలీసులకు కనిపించడం లేదా అని విమర్శించారు. ఆంధ్రజ్యోతి ప్రతికలో ఈ విషయం ప్రచురణ అయిందని అయినా పోలీసులు నిమ్మకు నీరెత్తినట్టు ఉండటం విచారకరమన్నారు. అధికార పార్టీ నేతలు రౌడీషీటర్లను, జేబులు కొట్టేవారిని వెనకేసుకుని తిరుగుతుంటే లా అండ్ ఆర్డర్ కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై లేదా అని ప్రశ్నించారు. పోలీసుల ఉదాసీనత చేస్తుంటే ప్రశాంతంగా ఉన్న సెంట్రల్‌లో లా అండ్ ఆర్డర్ చేజారే ప్రమాదం ఉందన్నారు. సెంట్రల్ నియోజకవర్గంలో 25వేల ఓట్ల మెజారిటీతో గెలుస్తానని వెలంపల్లి ప్రకటించడం వాపును చూసుకుని బలుపు అనుకోవడమేనన్నారు. ప్రజలు విజ్ఞులని టీడీపీకి ఓటు వేసి చంద్రబాబును సీఎంను చేస్తారని ధీమా వ్యక్తం చేశారు. నేతలు లబ్బా వైకుంఠం, పైడి తులసి పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచే అమరావతి రైతుల పోరాటం


విద్యాధరపురం: రాష్ట్ర చరిత్రలో అమరావతి రైతుల 1500 రోజుల పోరాటం నిలిచిపోతుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నె నారాయణ ప్రసాద్ (అన్న) గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని నాటి తొలి ముఖ్యమంత్రిగా అన్ని పక్షాలతో చర్చించి చంద్రబాబు తన దార్శనికతతో రాజధానిగా అమరావతికి రూపకల్పన చేశారన్నారు. లోటు బడ్జెట్ రాష్ట్రంలో రాజధాని కోసం చంద్రబాబుపై నమ్మకంతో అమరావతి రైతులు 33వేల ఎకరాల భూమి ఇచ్చారన్నారు. వైసీపీ ఆది నుంచి అమరావతిపై విషం చిమ్ముతూనే ఉందన్నారు. రాబోయే ఎన్నికలలో టీడీపీ-జనసేన కూటమి విజయం సాధించి ఆంధ్రుల రాజధాని అమరావతిని సాకారం చేస్తుందన్నారు.

ఎన్నికల ఆర్భాటంగా ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి ఆలయ నిర్మాణం

గతనెల 7నే సీఎం జగన్‌తో హడావుడి ప్రారంభోత్సవం

సన్నిధి చేరగా.. సమ్మతి నీయరా..!

- కొనసా..గుతున్న పునర్నిర్మాణ పనులు
- మహాశివరాత్రికి దర్శనాలు కల్పిస్తామని ప్రకటన
- స్వామి దర్శనానికి భక్తుల ఎదురుచూపులు
- ఇంకెన్నాళ్లు సాగదీస్తారంటూ ఆవేదన



ఆంధ్రజ్యోతి-విజయవాడ: డిసెంబరు 7... ఇంద్రకీలాద్రి మాస్టర్ ప్లాన్ నిర్మాణాలకు సీఎం జగన్ భూమిపూజ చేసిన రోజది. రూ.5 కోట్లతో ఆధునికీకరించిన మల్లికార్జున స్వామి ఆలయాన్ని అదేరోజు ప్రారంభించారు. ఆ మర్నాటి నుంచి శివాలయంలో భక్తులకు దర్శనాలు ఉంటాయని భావించారు. సీఎం ఈ శివాలయాన్ని ప్రారంభించి నెల రోజులు పైబడినా భక్తులను అటు వైపునకు అనుమతించలేదు. దీనికి ప్రధాన కారణం శివాలయంలో పనులు పూర్తికాకపోవడమే. శివాలయంలో ఇంకా ఎక్కడి పనులు అక్కడే ఉన్నా హడావుడిగా ప్రారంభం చేశారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రారంభోత్సవాలు, భూమిపూజలు చేయించారని అప్పుడే విమర్శలు వచ్చాయి.

మళ్లీ శివరాత్రికట..!

మల్లికార్జున స్వామి ఆలయ ఆధునికీకరణ మొదలుపెట్టినప్పటి నుంచి శివరాత్రి దర్శనాలు ఒక సాధారణ ప్రకటనగా మారిపోయింది. పనులు ప్రారంభించినప్పటి నుంచి ఎప్పటికి పూర్తవుతాయని అధికారులను అడిగితే శివరాత్రికి భక్తులకు దర్శనాలు కల్పిస్తామని అధికారులు చెబుతూ వచ్చారు. ఏటా ఇదే సమాధానం చెబుతున్నారు. ఇప్పుడు మళ్లీ శివరాత్రికి దర్శనాలు అంటూ భక్తులకు చెబుతున్నారు. అసలు ఈ శివరాత్రికైనా మల్లికార్జున స్వామి దర్శనం ఉంటుందా..? అని భక్తులు ప్రశ్నిస్తున్నారు. సీఎంతో ప్రారంభించే సమయానికి శివాలయం పనులు దాదాపు 70 శాతం పూర్తయ్యాయని అధికారులు చెప్పారు. మిగిలిన 30 శాతం పనులు పూర్తి కాగానే, నెల రోజుల్లోనే స్వామి దర్శనాలను కల్పిస్తామని తెలిపారు. ఇప్పుడు శివరాత్రికి భక్తులను దర్శనాలకు అనుమతిస్తామని చెబుతున్నారు. మార్చిలో వచ్చే శివరాత్రికైనా ఈ పనులు పూర్తవుతాయా..? అనే సందేహం కలుగుతోంది. మాస్టర్ ప్లాన్‌లో భాగంగానే శివాలయం ఆధునికీకరణ చేపట్టారు. ఆ తర్వాత మాస్టర్‌ప్లాన్‌కు పూర్తిస్థాయిలో ఆమోదముద్ర వచ్చాక కనకదుర్గా నగర్‌లో నిర్మాణాలు చేయాలని నిర్ణయించారు. ప్రసాదం పోటు, అన్నదాన భవనం, ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్, మల్టీలెవల్ కారు పార్కింగ్ కాంప్లెక్స్ నిర్మాణాలకు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ పనులకు టెండర్లు పూర్తయినా ఇంకా పనులు ప్రారంభం కాలేదు. వాస్తవానికి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంద్రకీలాద్రిపై పెద్దగా అభివృద్ధి ఏమీ జరగలేదు. ఒక్క మాస్టర్‌ప్లాన్ రూపకల్పన మాత్రమే పూర్తయింది.

రాబోయే ఎన్నికల నాటికి శిలాఫలకాలతో భక్తులను సంతృప్తి పరచాలని ప్రభుత్వం భావించింది. చివరికి అదే చేసి చూపించింది. సీఎం జగన్ హడావుడిగా మహామండపం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. దీన్నే తమ ప్రభుత్వం చేసిన అతిపెద్ద అభివృద్ధిగా చెప్పుకోవాలనుకున్నారు.

అర్ధరాత్రి టీడీపీ బ్యానర్ల తొలగింపు

- అడ్డుకున్న పార్టీ నేతలు
- పోలీసులు జోక్యంతో సద్దుమణిగిన వివాదం



టీడీపీ బ్యానర్లను తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ సిబ్బంది



టీడీపీ బ్యానర్లు తొలగించి వైసీపీ బ్యానర్లను వదిలేసిన టౌన్‌ప్లానింగ్ సిబ్బంది

అజిత్‌సింగ్‌నగర్, జనవరి 25: అధికార పార్టీకి ఓ న్యాయం ప్రతిపక్షానికి మరో న్యాయం అన్న చందాన ఉంది వీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్వాకం. అధికార వైసీపీ బ్యానర్లను నెలల తరబడి తొలగించకుండా వదిలేస్తూ ప్రతిపక్ష పార్టీల బ్యానర్లను కనపడకుండా చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. బుధవారం అర్ధరాత్రి అజిత్‌సింగ్‌నగర్ ఫ్లై ఓవర్‌పై టీడీపీ బ్యానర్ల తొలగింపు వ్యవహారం వివాదాస్పదమైంది. బ్యానర్లను తొలగిస్తున్న సిబ్బందిని టీడీపీ నేతలు అడ్డుకోవడంతో కొంత ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈనెల 30న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు జన్మదినాన్ని పురస్కరించుకుని టీడీపీ నేత పైడి శ్రీను ఆధ్వర్యంలో ఫ్లెక్సీలను ఫ్లై ఓవర్‌పై ఏర్పాటు చేశారు. ఆ వెంటనే టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రత్యక్షమై అర్ధరాత్రి 2 గంటల సమయంలో విధులకు హాజరైన సిబ్బంది టీడీపీ ఫ్లెక్సీలు తొలగిస్తున్నారు. విషయం తెలుసుకున్న పైడి శ్రీను, కొంతమంది టీడీపీ నేతలు ఫ్లై ఓవర్ వద్దకు చేరుకుని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వైసీపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు నెలల తరబడి ఉన్నా తొలగించకుండా కేవలం 2 గంటల వ్యవధిలో తమ ఫ్లెక్సీలను తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. గురువారం వైసీపీ సెంట్రల్ కార్యాలయం ప్రారంభోత్సవం ఉన్నందున తమ బ్యానర్లను తొలగించడం సబబు కాదని వాగ్వాదానికి దిగారు. అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు ఫ్లై ఓవర్ వద్దకు చేరుకుని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. పోలీసులతో టీడీపీ నేతలు మాట్లాడుతుండగానే టీడీపీ ఫ్లెక్సీలను సిబ్బంది పూర్తిగా తొలగించేశారు. అధికారుల చర్యలపై టీడీపీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అందరికీ సమన్యాయం ఉండాలని అధికార పార్టీ బ్యానర్లను తొలగించకుండా పక్కనే ఉన్న తమ బ్యానర్లను తొలగించడం అన్యాయమని పైడి శ్రీను ఆగ్రహం వ్యక్తం చేశారు.



పోలీసులతో మాట్లాడుతున్న పైడి శ్రీను



జస్టిస్ లక్ష్మణ్ రెడ్డి దంపతులకు దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం అందజేస్తున్న ఈవో రామారావు

దుర్గమ్మ సన్నిధిలో లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి దంపతులు

వన్‌టౌన్, జనవరి 25: దుర్గగుడిలో కనకదుర్గమ్మ దర్శనార్థం గురువారం రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి దంపతులు విచ్చేశారు. అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ఈవో రామారావు వారికి దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. వేద పండితులు వేదాశీర్వచనం చేశారు.

గ్యాస్ సిలిండర్‌పై అదనపు చార్జీ వద్దు

- జేసీ డాక్టర్ సంపత్‌కుమార్

కృష్ణలంక, జనవరి 25: జిల్లాలోని కొంతమంది వంట గ్యాస్ పంపిణీదారులు వినియోగదారుల నుంచి బిల్లులో సూచించిన మొత్తం కంటే ఎక్కువ సొమ్ము డిమాండ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఇటీవల కొంతమంది వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వచ్చినట్టు పేర్కొన్నారు. వంటకుపయోగించే సిలిండర్‌కు బిల్లు మొత్తం కంటే అధికంగా వినియోగదారులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. కొందరు డెలివరీ బాయ్స్ ఏజెన్సీ యజమానులు తమ గోడౌన్ నుంచి డెలివరీ పాయింట్ దూరంగా ఉన్నందున ట్రాన్స్‌పోర్ట్ చార్జీల కింద అధికంగా చెల్లించాలని వసూలు చేయడం చట్టరీత్యా నేరపూరిత చర్యగా వివరించారు. జిల్లాలోని అన్ని గ్యాస్ కంపెనీల ఎల్‌పీజీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు, అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. వినియోగదారులు బిల్లుపై ఉన్న ధర మాత్రమే చెల్లించాలన్నారు. ఎలాంటి అదనపు రవాణా చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని, ఎవరైనా డిమాండ్ చేస్తే టోల్‌ఫ్రీ నెం.1967 లేదా 18002333555కు ఫిర్యాదు చేయాలన్నారు. సిలిండర్ బరువుపై అనుమానం ఉంటే డెలివరీ బాయ్ వద్ద ఉన్న తూకం పరికరం ద్వారా సరిచూసుకొనే హక్కు వినియోగదారులకు ఉందన్నారు. సీలుపై అనుమానం ఉంటే వినియోగదారుడి సమక్షంలో సీలు తీసి చూపించాల్సిన బాధ్యత డెలివరీ బాయ్‌కు ఉందని వినియోగదారులు గుర్తించాలన్నారు.

28న లయోల కాలేజీలో జాబ్‌మేళా

పటమట, జనవరి 25: నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ) రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జనవరి 28న నగరంలోని ఆంధ్ర లయోల డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు వైసీపీ తూర్పు ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, ఐటీఐ, డిప్లొమా అర్హత కలిగిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంబంధిత సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వివరాలకు 9603368324 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ప్రయాణికులకు భద్రత కల్పించాలి

- రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్

రైల్వేస్టేషన్, జనవరి 25: ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకునే వరకు వారి భద్రతతో పాటు రైల్వేస్టేషన్‌లో ఎలాంటి అనధికార ఘటనలు జరగకుండా గవర్నమెంట్ రైల్వే పోలీసులు (జీఆర్‌పీ), రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) అధికారులు, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్, డివిజన్ రైల్వే సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ వల్లేశ్వర బి.తోకలకు సూచించారు. గురువారం రైల్వే ఆడిటోరియంలో జీఆర్‌పీ-ఆర్‌పీఎఫ్ విభాగాల సమన్వయ అవగాహన సదస్సు జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్ మాట్లాడుతూ జీఆర్‌పీ-ఆర్‌పీఎఫ్ విభాగాల సిబ్బంది కో-ఆర్డినేషన్‌తో చేస్తే మంచి ఫలితాలు వస్తాయని అందుకు అధికారులు ముందస్తున్న కృషి చేయాలన్నారు. ముఖ్యంగా రైళ్లలో చోరీలు జరగకుండా చేయడం, అనధికారికంగా నిషేధించిన వస్తువులు రవాణా చేయకుండా కట్టుదిట్టమైన పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి సమయాల్లో ప్రయాణించే మహిళలను అప్రమత్తంగా ఉండేలా కిటికీలు మూసివేయడం, విలువైన వస్తువులు జాగ్రత్తగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఒకవేళ అనుకోని విధంగా చోరీ జరిగితే వెంటనే రెండు విభాగాల సిబ్బంది అప్రమత్తమై తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. రానున్న సాధారణ ఎన్నికల దృష్ట్యా రైళ్లలో అనుమానితుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వేసవిలో చోరీలు అధికంగా జరుగుతుంటాయని ఇప్పటి నుంచే ముఖ్యమైన రైళ్లకు రాత్రి సమయాల్లో గస్తీని ముమ్మరం చేయాలన్నారు. రెండు విభాగాల సిబ్బంది కో-ఆర్డినేషన్‌లో పనిచేస్తే ఫలితాలు సాధించవచ్చునన్నారు. సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ వల్లేశ్వర బి.తోకల మాట్లాడుతూ రైల్వేస్టేషన్‌లో సీసీ టీవీలను పెంచడంతో పాటు సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే జీఆర్‌పీ-ఆర్‌పీఎఫ్ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేస్తున్నారని భవిష్యత్తులోనూ ఇలాగే అవలంభిస్తూ ఫలితాలు సాధిస్తామన్నారు. డిప్యూటీ సూపరిటెండెంట్ ఆఫ్ రైల్వే పోలీస్ వి.నాగరాజా రెడ్డి, అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ (ఆర్‌పీఎఫ్) జి.మధుసూదనరావు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జి.కళ్యాణి, రైల్వే ఎస్ఐబీ సీఐ యు.బంగారు రాజు, రైల్వే సీఐలు వి.శ్రీనివాస్, జి.వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, ఆర్‌పీఎఫ్ సీఐ టి.చంద్రశేఖర్‌రెడ్డి, జీఆర్‌పీ ఎస్ఐ ఖాదర్ హుస్సేన్, ఆర్‌పీఎఫ్ ఎస్ఐ మకత్‌లాల్ నాయక్, సిబ్బంది, లా కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న రైల్వే ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్



క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

జాతీయ తైక్వాండో విజేతలకు అభినందన

విజయవాడ స్పోర్ట్సు: రాజస్థాన్‌లో ఇటీవల జరిగిన జాతీయ తైక్వాండోలో పలు పతకాలను సాధించిన ఉమ్మడి కృష్ణా తైక్వాండ్ ప్లేయర్లను కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు గురువారం అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. జిల్లా క్రీడాకారులను ఉన్నతంగా తీర్చిదిద్దిన అసోసియేషన్ సెక్రటరీ అంకమ్మరావు, కోచ్ గౌరీశంకర్‌ను ఆయన అభినందించారు.



చిత్రకళ ప్రదర్శన, పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

28న చిత్రకళ ప్రదర్శన, పోటీలు

గవర్నర్‌పేట, జనవరి 25: సీనియర్ చిత్రకారుడు వేముల కామేశ్వరరావు శత వసంతాల సందర్భంగా ఈనెల 28న ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో చిత్రకళ ప్రదర్శన, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నట్టు ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ మహిళా విభాగం ఇన్‌చార్జి సంధ్యారాణి తెలిపారు. చిత్రలేఖన పోటీలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ గురువారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిత్రకళా ప్రదర్శనను ఉదయం యువజన సంక్షేమశాఖ అధికారి యు.శ్రీనివాసరావు ప్రారంభిస్తారని, మధ్యాహ్నం నుంచి 1వ తరగతి నుంచి డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి అదేరోజు సాయంత్రం విజేతలకు ప్రశంసాపత్రం, బహుమతులు అందజేస్తామన్నారు. వివరాలకు 93479 50085 నెంబరుకు ఫోన్ చేయాలని కోరారు. ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ సంస్థ ఉపాధ్యక్షుడు గిరిధర్ అరసవల్లి, వర్కింగ్ కమిటీ సభ్యులు శ్రావణ్‌కుమార్, సౌజన్య, జాషువా సాంస్కృతిక వేదిక ప్రధాన కార్యదర్శి గుండు నారాయణరావు పాల్గొన్నారు.

శ్రీనివాసరాజు లేనిలోటు పూడ్చలేనిది

- ఎక్స్‌రే సంస్థ అధ్యక్షుడు కొల్లూరి

విజయవాడ కల్చరల్, జనవరి 25: కళలు, కళాకారుల అభ్యున్నతిపై నిరంతరం పరితపించే, కళారంగ ఆత్మీయుడు అల్లూరి సత్య శ్రీనివాస రాజు లేనిలోటు కళారంగానికి తీరనిదని, ఎక్స్‌రే సంస్థ అధ్యక్షుడు కొల్లూరి పేర్కొన్నారు. అమ్మ కల్చరల్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకుడు అల్లూరు సత్య శ్రీనివాసరాజు సంతాప సభ గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం సాయంత్రం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ పేరు ప్రఖ్యాతుల కోసం కాకుండా నిజమైన కళాసేవ చేసిన అరుదైన వ్యక్తి సత్య శ్రీనివాసరాజన్నారు. 2 దశాబ్దాలుగా ఆయన అనేక సంస్థల్లో కీలకపాత్ర పోషిస్తూ సాంస్కృతిక రంగానికి ప్రధానంగా నాట్య రంగానికి ఎంతో కృషి చేశారన్నారు. సత్వంత్ర భారతి రమేష్ మాట్లాడుతూ సత్య శ్రీనివాసరాజు ప్రపంచ నృత్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం ఆయనే ప్రారంభించారన్నారు. కృష్ణా, గుంటూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో నాట్య దినోత్సవాలు నిర్వహించి వందలాది మంది కళాకారులు ఏకం చేసి బృంద నృత్య కళా ప్రదర్శనలు నిర్వహించారన్నారు. కళారంగ ఆత్మీయుడు అమ్మరాజు, ప్రముఖ నాట్యాచార్యుడు పి.హేమంతకుమార్, ఎక్స్‌రే కార్యదర్శి బి.ఆంజనేయరాజు, బాలానందం ఫొటోగ్రఫీ అసోసియేషన్ సభ్యులు శర్మ, యదునాథ్ కుమార్, శ్రీనివాసరెడ్డి, పొత్తూరి సీతారామారావు, చామర్తి వెంకట సుబ్బయ్య, కందికొండ రవికిరణ్, గుర్రం ఏడుకొండలు, బ్రహ్మదేశం వసంతకుమార్, కార్టూనిస్టు నాగిశెట్టి, గ్రంథాలయం సత్య, మిత్రులు పాల్గొని రాజు చిత్రపటానికి పువ్వులతో నివాళులర్పించారు.



సభలో మాట్లాడుతున్న కొల్లూరి ఆంజనేయరాజు

యథాతథ స్థితి పాటించండి

మార్గదర్శి ముప్పి శ్రీనివాస్ కేసులో హైకోర్టు ఆదేశం

అమరావతి: చందాదారుడు ముప్పి శ్రీనివాస్‌కు చిట్ సొమ్మును విడుదల చేయాలని మార్గదర్శి సంస్థను ఆదేశిస్తూ విజయవాడ డిప్యూటీ రిజిస్ట్రార్ (చిట్స్) ఇచ్చిన అవార్డుపై యథాతథ స్థితి పాటించాలని హైకోర్టు గురువారం అధికారులను ఆదేశించింది. విచారణను వచ్చే మంగళవారానికి వాయిదా వేసింది. చట్టనిబంధనల మేరకు పూచీకత్తు సమర్పించనప్పటికీ చందాదారుడు ముప్పి శ్రీనివాస్‌కు చిట్ సొమ్మును విడుదల చేయాలని మార్గదర్శి సంస్థను ఆదేశిస్తూ గతేడాది డిసెంబరు 14న డిప్యూటీ రిజిస్ట్రార్ (చిట్స్) అవార్డు ఇచ్చారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ మార్గదర్శి సంస్థ అప్పీల్ వేసినా రిజిస్ట్రేషన్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నిర్ణయాన్ని వెల్లడించలేదు. మార్గదర్శి చిట్‌ఫండ్ లబ్బీపేట బ్రాంచ్ చీఫ్ మేనేజర్ బి.శ్రీనివాస్ హైకోర్టును ఆశ్రయించారు. తాము వేసిన అప్పీల్‌పై రిజిస్ట్రేషన్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి స్పందించలేదన్నారు. సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు.

ప్రతిభగల పేద విద్యార్థులకు ఆర్థికసాయం

పటమట, జనవరి 25: డాక్టర్ కేఎస్ఎన్ ప్రసాద్ ఫౌండేషన్‌ను స్ఫూర్తిగా తనతో పాటు మాంటిస్సోరి స్కూల్‌లో కలిసి చదువుకున్న మిత్రులు ఎన్ఆర్ఐ వై.గాంధీ, ఎన్.రామకృష్ణ మరికొందరు మిత్రులతో కలిసి మాంటిస్సోరి ఓల్డ్ స్టూడెంట్స్ చారిటబుల్ ట్రస్ట్‌ను 2012లో ప్రారంభించారు. డాక్టర్ కేఎస్ఎన్ ప్రసాద్ మరణం (2021) తర్వాత ప్రతి ఏడాది ఆయన జన్మదినం జనవరి 25న ప్రతిభ గల పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. ఈ ఏడాది గురువారం ఎన్టీఆర్ కాలనీ మలిలేని లైబ్రరీ హాల్ నందు డాక్టర్ కేఎస్ఎన్ ప్రసాద్ ఫౌండేషన్ చైర్మన్ కిలారు స్వప్న చేతుల మీదుగా డాక్టర్ కేఎస్ఎన్ ప్రసాద్ ఫౌండేషన్ తరుపున రూ.6లక్షలు, మాంటిస్సోరి ఓల్డ్ స్టూడెంట్స్ చారిటబుల్ ట్రస్ట్ తరుపున రూ.8లక్షల 21వేలు సహాయనిధిని ట్రస్ట్ చైర్మన్ వీరమాచనేని రంగప్రసాద్ చేతులమీదుగా 93 మంది ఇంటర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్, మెడికల్ విద్యార్థులకు అందజేశారు. ట్రస్ట్ సెక్రటరీ డాక్టర్ జాస్తి విజయకృష్ణ, మాంటిస్సోరి సెక్రటరీ టి. రాఘవ ప్రసాద్, డాక్టర్ కేఎస్ఎన్ ప్రసాద్ ఆప్తమిత్రులు సీహెచ్ రమేష్, జేడీ ప్రసాద్, కిషోర్ పాల్గొన్నారు.



మూలపాడులో ప్రాక్టీస్‌లో పాల్గొన్న విదర్భ టీమ్

నేటి నుంచి బీసీసీఐ ఉమెన్ వన్డే మ్యాచ్‌లు

విజయవాడ స్పోర్ట్సు, జనవరి 25: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 26నుంచి ఫిబ్రవరి 7వరకు బీసీసీఐ అండర్-23 ఉమెన్ వన్డే ట్రోఫీ గ్రూప్-డీ మ్యాచ్‌లు నగరానికి సమీపంలోని మూలపాడు, మంగళగిరి క్రికెట్ స్టేడియాల్లో జరగనున్నాయి. ఏసీఏ అన్ని ఏర్పాట్లు చేసింది. రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో జరిగే ఈ మ్యాచ్‌ల్లో టాప్ రెండు టీమ్‌లు నాకౌట్‌కు క్వాలిఫై అవుతాయి. హైదరాబాద్, మేఘాలయ, బరోడా, విదర్భ, ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జార్కండ్ టీమ్‌లు తలపడతాయి. మూలపాడులో శుక్రవారం డీవీఆర్ గ్రౌండ్స్‌లో బరోడా-విదర్భ, సీపీ గ్రౌండ్స్‌లో హైదరాబాద్- ఉత్తరాఖండ్ తలపడతాయి. మూలపాడులో విదర్భతో పలు జట్లు గురువారం ప్రాక్టీస్‌ను చేశాయి.



సత్య హరిచంద్ర నాటకంలో ఓ సన్నివేశంలో నటిస్తున్న కళాకారులు

అలరించిన 'సత్య హరిశ్చంద్రీయము'

విజయవాడ కల్చరల్, జనవరి 25: శ్రీదేవి కళా నాట్యమండలి, గుమ్మడి కళాపీఠం, అంకమ్మ తల్లి నాట్యమండలి వారిచే కుమ్మారు నాగేశ్వరరావు శిష్య బృందం ఆధ్వర్యంలో 'సత్య హరిశ్చంద్రీయము' నాటకం ప్రదర్శించారు. గాంధీనగర్‌లోని గురువారం కౌతా పూర్ణానంద కళాసత్రంలో అడవి సీను రక్తి కట్టించారు. హరిశ్చంద్రుడిగా జూనియర్ డి.వి, నక్షత్రకుడిగా బండి సదాశివరావు, జక్కంపూడి (సీనియర్ నటులు) వారణాసి సీనులో-హరిశ్చంద్రుడు-కొమరగిరి నాగలక్ష్మి చిన్నాపురం (తొలిపరిచయం) నక్షత్రకుడిగా అడపా ప్రభావతి, జగ్గయపేట (సీనియర్ నటీమణి), చంద్రమతి - పిట్లా నిర్మల, చిన్నాపురంలు నటించారు. వంగలపాటి దేవరాజు మొట్రు అంతోని, ఇట్టా విఠల్, త్రినాథ్, గుమ్మడి విజయ్ కుమార్, గుమ్మడి జీవన్‌కుమార్, కుమ్మారు నాగేశ్వరరావు, మోడి ఆంజనేయులు, ఈగ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో యువతికి ఓటరు కార్డు అందజేస్తున్న గవర్నర్ నజీర్

రాష్ట్ర సచివాలయంలో ఓటర్ల దినోత్సవ ప్రతిజ్ఞ

అమరావతి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఓటు హక్కు వినియోగంపై ప్రజల్లో చైతన్యం తెచ్చే లక్ష్యంతో ఏటా జనవరి 25న జరిపే జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని గురువారం అమరావతిలోని రాష్ట్ర సచివాలయం మొదటి బ్లాక్‌లో నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.ప్రవీణ్‌కుమార్ ఈ కార్యక్రమంలో పాల్గొని అధికారులు, సిబ్బందితో ఓటర్ దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. భారత పౌరులుగా ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసంతో స్వేచ్ఛ, నిష్పక్షపాతం, ప్రశాంత ఎన్నికల నిర్వహణకు, కుల, మత, జాతి, వర్గ, భాష తేడా లేకుండా, ఒత్తిళ్లు, ప్రలోభాలకు ప్రభావితం కాకుండా నిర్భయంగా ఓటు వేస్తామంటూ ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు.

నేటి గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు: భారత 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా అమరావతిలోని రాష్ట్ర అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. శుక్రవారం గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. శాసన మండలి ప్రాంగణంలో మండలి ఛైర్మన్, శాసనసభ ముందు సభాపతి, సచివాలయం మొదటి బ్లాక్ వద్ద ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేలపాడులోని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం వద్ద హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జాతీయ జెండాలను ఆవిష్కరించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఓటుపై అవగాహన, స్పృహ అవసరం: గవర్నర్

విజయవాడ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఓటు వేయటం ఒక్కటే ప్రజాస్వామ్యంలో బలం కాదని, ఓటు అనే హక్కును అవగాహన, స్పృహతో వినియోగించటంలోనే అసలైన బలముందని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమం గురువారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగింది. ముఖ్య అతిథిగా గవర్నర్ నజీర్ యువ ఓటర్లనుద్దేశించి ప్రసంగించారు. యువ ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా ఓటరు బాధ్యత, అవగాహనను కల్పించేలా తపాల శాఖ విడుదల చేసిన ప్రత్యేక స్టాంప్‌ను విడుదల చేశారు.

జగన్‌తో గిరిజనుల అస్తిత్వానికి ముప్పు: టీడీ జనార్దన్

అమరావతి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ పథకాలను రద్దు చేసిన గిరిజన వ్యతిరేకి జగన్‌ను అధికారం నుంచి తప్పించకపోతే గిరిజనుల అస్థిత్వమే ప్రమాదంలో పడుతుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్ అన్నారు. జగన్ పాలనలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు, రాబోయే ఎన్నికల్లో గిరిజనుల వ్యూహం ఎలా ఉండాలో చర్చించేందుకు టీడీపీ గిరిజన నాయకులు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం సమావేశమయ్యారు. రాష్ట్రంలో జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన భూములను, సంపదను యథేచ్ఛగా దోచుకున్నారని ఆయన విమర్శించారు.

జగన్ వెంట జనం లేరు: సీపీఐ నారాయణ

న్యూఢిల్లీ, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర సీఎం జగన్ వెంట ప్రజలు లేరు. తల్లిని, చెల్లిని ఆయన వదిలేశారు. వైసీపీ పాలన చివరి దశకు చేరింది' అని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ అన్నారు. గురువారం ఏపీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 'ఏపీ ప్రజలు జగన్ పాలనపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. అయోధ్య రామమందిర్ ప్రారంభోత్సవాన్ని బీజేపీ ఒక ఈవెంట్‌గా మార్చింది. మోదీ, యోగీ ఈవెంట్ మేనేజర్‌లుగా వ్యవహరించారు. రాజ్యాంగానికి మూడు నామాలు పెట్టారు. మతాన్ని, రాజకీయాన్ని ఒకటి చేశారు' అని నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏపీని రాజధాని లేని రాష్ట్రం చేసిన ఘనత జగన్‌రెడ్డిదే: సీపీఐ

అమరావతి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌ను రాజధాని లేని రాష్ట్రంగా ప్రపంచ పటంలో మిగిల్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌రెడ్డికే దక్కుతుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ విమర్శించారు. అమరావతి రాజధానికి భూములిచ్చిన రైతులు, మహిళలు 1,500 రోజులుగా కొనసాగిస్తున్న ఉద్యమానికి ఆయన గురువారం ఒక ప్రకటనలో జేజేలు పలికారు.

వైఎస్ కుటుంబాన్ని చీల్చింది జగనే: తులసిరెడ్డి

వేంపల్లె, జనవరి 25: తిరుపతిలో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్ తన ఓటమిని ఒప్పుకోవడం హర్షణీయమని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ తమ కుటుంబాన్ని కాంగ్రెస్ చీల్చిందని జగన్ ఆరోపించడంలో వాస్తవం లేదన్నారు. వాస్తవంగా జగనే వైఎస్ కుటుంబాన్ని చీల్చాడన్నారు.

యువతిపై వలంటీర్ అత్యాచారయత్నం

- బయటకు చెబితే పథకాలు ఆపేస్తానని బెదిరింపు..



వలంటీర్ శివరాజ్

గొలుగొండ (అనకాపల్లి జిల్లా), జనవరి 25: యువతిపై అత్యాచారానికి యత్నించి, ఎవరికైనా చెబితే సంక్షేమ పథకాలు ఆపేస్తానని బెదిరించిన గ్రామ వలంటీర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అనకాపల్లి జిల్లా గొలుగొండ ఎస్ఐ నారాయణరావు తెలిపిన వివరాల మేరకు... చోద్యం గ్రామానికి చెందిన యువతి డిగ్రీ చదువుకుంది. బుధవారం ఎస్.రాయవరం మండలం రేవుపోలవరంలో ఏర్పాటుచేసిన పదో తరగతి బ్యాచ్ సమ్మేళనానికి వెళ్లి సాయంత్రం మరో పూర్వ విద్యార్థి బైక్‌పై ఇంటికి తిరిగి వస్తోంది. గొలుగొండ మండలం కొత్తమల్లంపేట గ్రామ సమీపంలో చోద్యం గ్రామ వలంటీర్ మెసర శివరాజ్ అడ్డగించి, పక్కనే ఉన్న తుప్పల్లోకి లాక్కెళ్లి తనపై అత్యాచారం చేయబోయాడని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ విషయం బయటకు చెపితే చంపేస్తానని బెదిరించాడని, తన తల్లికి సంక్షేమ పథకాలను నిలిపివేస్తానని బెదిరించాడని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. వలంటీరును అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

పసి బిడ్డను ఇస్తానని మోసం

మహారాణిపేట (విశాఖపట్నం), జనవరి 25: పిల్లలు లేని మహిళకు అప్పుడే పుట్టిన బిడ్డను ఇస్తానని ఆశపెట్టిన ఓ మహిళ రూ.80 వేలు తీసుకుని మోసం చేసి, పరారైంది. ఈ సంఘటన విశాఖ కేజీహెచ్‌లో వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు...కాకినాడ జిల్లా చేబ్రోలుకు చెందిన వేణుకోటి కృష్ణవేణి (35)కి పదేళ్ల కిందట వివాహం జరిగింది. ఆమెకు పిల్లలు లేరు. సమీప బంధువు వి.లక్ష్మితో కలిసి ఈనెల 20న గాజువాకలోని ఓ వైద్యుని వద్దకు బయలుదేరారు. బస్సు ఓ మహిళ వారికి పరిచయమై కేజీహెచ్‌లో తెలిసినవారు ఉన్నారని, పెంచుకుంటానంటే అప్పుడే పుట్టిన బిడ్డను న్యాయబద్ధంగా అందిస్తానని, కొంత ఖర్చవుతుందని చెప్పింది. దీంతో ఈనెల 21వ తేదీన విశాఖలోని కేజీహెచ్ వద్దకు వచ్చారు. అక్కడ ఆ మహిళకు రూ.80 వేలు ఇచ్చారు. బిడ్డను తీసుకొస్తానని పిల్లల వార్డు వద్దకు వెళ్లిన మహిళ ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మోసం చేసిన మహిళను ఏలూరుకు చెందిన దొంగ వాణి (31)గా పోలీసులు గుర్తించారు. విశాఖ ఎన్జీవో కాలనీలో ఆమెను అరెస్టు చేశారు.

సింగిల్ జడ్జి ఆదేశాలపై 'వ్యూహం' నిర్మాత అప్పీల్

హైదరాబాద్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): వ్యూహం సినిమాకు సెన్సార్ బోర్డు రివైజింగ్ కమిటీ జారీచేసిన సెన్సార్ సర్టిఫికెట్‌ను హైకోర్టు సింగిల్ జడ్జి కొట్టేయడంపై చిత్ర నిర్మాత డివిజన్ బెంచ్‌లో అప్పీల్ దాఖలు చేశారు. ఈ అప్పీల్‌పై గురువారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది. మూడువారాల్లో మళ్లీ నిర్ణయం తీసుకోవాలని సెన్సార్ బోర్డుకు సింగిల్ జడ్జి ఆదేశాలు ఇచ్చారని.. దీనిని ఒక వారానికి తగ్గించాలని పిటిషనర్ అయిన నిర్మాత దాసరి కిరణ్‌కుమార్ తరఫు న్యాయవాది కోరారు. ఈనెల 30న పూర్తిస్థాయి విచారణ చేపడతామని.. ప్రస్తుతం ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులూ ఇవ్వలేమని ధర్మాసనం స్పష్టం చేసింది.

గిరిజన ప్రాంతాల్లో వైద్య సౌకర్యాల కోసం పిల్

అమరావతి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో కనీస వైద్య సౌకర్యాలు కల్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. హైకోర్టు న్యాయవాది ఎలిశెట్టి సోమరాజు ఈ పిల్ దాఖలు చేశారు. చిన్నారి మృతదేహాన్ని ఇంటికి తరలించేందుకు అంబులెన్స్ సౌకర్యం కల్పించని విశాఖ కేజీహెచ్ సూపరింటెండెంట్‌పై విచారణకు ఆదేశించాలని అభ్యర్థించారు. ఆంధ్రజ్యోతి, ఇతర పత్రికల్లో వచ్చిన కథనాలను పిల్‌తో జత చేశారు.

విశాఖలో 'జీవీఎల్ టీమ్' దందా!

- కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల నిధులతో సొంత ప్రచారం
- మొన్న రూ.5 కోట్లతో సంక్రాంతి సంబరాలు
- ఇప్పుడు మళ్లీ 'వైబ్రంట్ వైజాగ్' పేరిట కార్యక్రమాలు, నేడు రేపు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం లోక్‌సభ స్థానానికి పోటీ చేయాలని భావిస్తున్న బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎస్ నరసింహారావు కేంద్ర ప్రభుత్వ సంస్థల నిధులతో సొంత ప్రచారం చేసుకుంటున్నారు. ఎన్నికల సమయం దగ్గర పడటంతో ప్రతి సందర్భాన్నీ పండుగలా చేయడానికి యత్నిస్తున్నారు. దీనికోసం ప్రత్యేకంగా 'జీవీఎల్ టీమ్'ను ఏర్పాటు చేసుకున్నారు. మొన్నటికి మొన్న 'మహా సంక్రాంతి సంబరాలు' పేరుతో జనవరి 12 నుంచి 15 వరకు ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ మైదానంలో కార్యక్రమాలు నిర్వహించారు. ఇదీ పార్టీ తరఫున చేసింది కాదు. ప్రచారంలో తన ఫొటోలు తప్ప ఇంకెవరివీ ఉపయోగించలేదు. దీనికి సుమారుగా రూ.5కోట్ల వరకు ఖర్చయి ఉంటుందని అంచనా. ఈ నిధులన్నీ ఐవోసీ, హెచ్‌పీసీఎల్, కోరమండల్ ఫెర్టిలైజర్స్, హిందుస్థాన్ షిప్‌యార్డు, ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్, ఎల్ఐసీ తదితర సంస్థలు సమకూర్చాయి. పేదలకు ఉపయోగపడే కార్యక్రమమో, ఆసుపత్రి/పాఠశాల భవనం వంటి ప్రయోజనకరమైన నిర్మాణమో అయితే ఆయా సంస్థలు 'సామాజిక బాధ్యత' కింద నిధులు ఇచ్చి సహకరించాయని అనుకోవచ్చు. కానీ 'జీవీఎల్' పేరుతో నిర్వహించిన సంబరాలకు ఈ సంస్థలు అంత పెద్ద మొత్తాలు ఇవ్వడం వెనుక కారణాలేమిటో తెలియడం లేదు. ఈ సంబరాలు ముగిసి పట్టుమని పది రోజులు కాకుండానే ఇప్పుడు 'రిపబ్లిక్ డే'ను పురస్కరించుకొని 'వైబ్రెంట్ వైజాగ్' పేరుతో బీచ్ రోడ్డులో కలర్స్ రన్ వంటి కార్యక్రమాల నిర్వహణకు శ్రీకారం చుట్టారు. శుక్ర, శనివారం రెండు రోజులు ఈ కార్యక్రమాలు ఉంటాయని ప్రకటించారు. వీటికి కూడా భారీగా నిధులు సమీకరించినట్టు సమాచారం. విశాఖపట్నంలో బీజేపీ ఎప్పుడూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించలేదు. ఇప్పుడు బీజేపీ ఎంపీనే నిర్వహిస్తున్నారు కాబట్టి పార్టీ తరఫున చేస్తున్నారా అంటే అదీ లేదు. 'జీవీఎల్ టీమ్' అని చెబుతున్నా... నిధులు మాత్రం ప్రభుత్వ రంగ సంస్థల నుంచి తీసుకుంటున్నారు. జీవీఎల్ యూపీ నుంచి రాజ్యసభకు ఎంపికయ్యారు. రాబోయే ఎన్నికల్లో విశాఖ లోక్‌సభ స్థానానికి పోటీ చేయాలనేది ఆయన ఆలోచన. దానికోసం కొన్నాళ్లుగా విశాఖలో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. 2014 ఎన్నికల్లో విశాఖ నుంచి లోక్‌సభకు బీజేపీ తరఫున కంభంపాటి హరిబాబు (టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా) పోటీచేసి విజయం సాధించారు. దానిని దృష్టిలో ఉంచుకొని విశాఖలో బీజేపీకి ఆదరణ ఉందని జీవీఎల్ తన ప్రయత్నాలు ముమ్మరం చేశారు. అయితే స్థానిక నాయకుల్లో చాలామందికి ఇది నచ్చడం లేదు. అధిష్ఠానం అనుమతితోనే విశాఖ వచ్చానని ఆయన చెప్పడం, ఢిల్లీ పెద్దలు కూడా సహకరించాల్సిందిగా సూచించడంతో అయిష్టంగానే కార్యక్రమాలకు హాజరవుతున్నారు.



ఆంధ్ర విశ్వవిద్యాలయంలో 'జీవీఎల్' సంక్రాంతి సంబరాలు సైకత శిల్పం (ఫైల్ ఫొటో)

'యువ' కలలు నెరవేరుస్తా

- నవ ఓటర్లకు 'మోదీ గ్యారెంటీ'
- నమో యాప్ ద్వారా స్పందించండి
- మంచి ఆలోచనలు పంపినవారిని స్వయంగా కలుస్తా: మోదీ

న్యూఢిల్లీ/బులంద్‌షహర్, జనవరి 25: యువతపై తనకు అపార విశ్వాసం ఉందని.. ఎల్లప్పుడూ వారికే తాను పెద్దపీట వేస్తానని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. వారి కలలు నెరవేర్చడమే తన సంకల్పమని.. ఇది 'మోదీ గ్యారెంటీ' అని పేర్కొన్నారు. కుటుంబ పార్టీలను ఓడించాలని వారికి పిలుపిచ్చారు. ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ యువమోర్చా గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో నవ యువ ఓటర్లనుద్దేశించి ఆయన వర్చువల్‌గా ప్రసంగించారు. దేశవ్యాప్తంగా 5 వేల ప్రాంతాల నుంచి ప్రథమ ఓటర్లు ఆయన ప్రసంగాన్ని విన్నారు. యువతకు అపార ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా మౌలిక వసతుల కల్పనకు పెద్దఎత్తున ఖర్చుచేస్తున్నామని.. 'స్టార్టప్ ఇండియా', 'డిజిటల్ ఇండియా' వంటి పురోగామి పథకాలు, వివిధ రంగాల్లో సంస్కరణలు చేపట్టామని ఆయన తెలిపారు. యువత కలలు నెరవేర్చేందుకు, వారి సామర్థ్యాన్ని పెంపొందించడానికి తన ప్రభుత్వం రాత్రింబవళ్లూ పనిచేస్తోందన్నారు. తొలిసారి ఓటు హక్కు పొందిన యువ ఓటర్లు బీజేపీ అభివృద్ధి ఎజెండాకు మద్దతిస్తున్నారని తెలిపారు. 'అవినీతికి, బంధుప్రీతి, కుటుంబవాదానికి యువత వ్యతిరేకం. కుటుంబాలు నడిపే పార్టీలు ఇతర యువకుల పురోగతిని అంగీకరించవు. ఈ పార్టీల నేతల మనస్తత్వం యువతకు వ్యతిరేకం. మీ ఓట్ల బలంతో ఈ కుటుంబ పార్టీలను ఓడించాలి. భారత దిశ-దశను నిర్ణయించేది మీ ఓట్లే. భారీ మెజారిటీతో పటిష్ఠ సుస్థిర ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలి' అని పిలుపిచ్చారు.

వెలుగు తీసుకొచ్చాం..: 10-12 ఏళ్ల కిందట యువత ముందు అంతా అంధకారమేనని.. తన ప్రభుత్వం వారికి వెలుగు తీసుకొచ్చిందని మోదీ చెప్పారు. నాడు యువతరం ఉపాధిపై ఆశలు కోల్పోయిందన్నారు. నేడు వారికి ఎన్నో అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. దేశ ప్రతిష్ఠ ఇప్పుడు అత్యున్నత శిఖరాలకు చేరిందన్నారు. ఏప్రిల్-మేలో జరిగే లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ మేనిఫెస్టో రూపకల్పనకు సలహాలు పంపాలని యువతను కోరారు. 'నమో యాప్ ద్వారా మీ సూచనలు పంపండి. సుసాధ్యమయ్యే మంచి ఆలోచనలు పంపినవారిలో కొందరిని నేను స్వయంగా కలుస్తా' చెప్పారు. 2014లో తన ప్రభుత్వం రాకముందు ప్రతిపక్షాలు దేశాన్ని పాలించేవని.. ప్రతి రోజూ ఏదో ఒక అవినీతి, కుంభకోణం పతాక శీర్షికల్లో వచ్చేవని గుర్తుచేశారు. ఇప్పుడు వివిధ రంగాల్లో విజయగాథలు, విశ్వసనీయత గురించి అందరూ మాట్లాడుతున్నారని తెలిపారు. కేంద్రంలో గత పదేళ్లుగా సుస్థిర, సుదృఢ ప్రభుత్వం ఉండడం వల్ల పెద్ద పెద్ద నిర్ణయాలు తీసుకున్నామని.. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించామని చెప్పారు. జమ్మూకశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే 370 అధికరణ రద్దు, జీఎస్టీ, చట్టసభల్లో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్, ట్రిపుల్ తలాక్ రద్దు వంటి నిర్ణయాలను ప్రస్తావించారు. 1947కి ముందు స్వాతంత్ర్యం కోసం నాటి యువత పోరాడినట్లే.. వచ్చే పాతికేళ్లలో భారత్‌ను అభివృద్ధి దేశంగా మలిచే బాధ్యత ఇప్పటి యువతరంపై ఉందని ప్రధాని చెప్పారు.

ఎన్నికల శంఖారావం ప్రజలే..: ప్రధాని

తనకు ఎన్నికల శంఖం పూరించాల్సిన అవసరం లేదని, తన కోసం ప్రజలే శంఖారావం చేస్తారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. గురువారం ఆయన ఉత్తరప్రదేశ్‌లో రూ.19,100 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా బులంద్‌షహర్‌లో ఏర్పాటు చేసిన సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.



జైపూర్‌లో మోదీ, మాక్రాన్ రోడ్‌షో

జైపూర్, జనవరి 25: ఢిల్లీలో శుక్రవారం జరిగే భారత గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ముఖ్యఅతిథిగా వచ్చిన ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్ గురువారం సాయంత్రం జైపూర్‌లో ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలూ హస్తకళల దుకాణాన్ని సందర్శించారు. హవామహల్ వద్ద ఇద్దరూ దిగారు. ముఖ్య అతిథి కోసం ప్రధాని అయోధ్య రామమందిర ప్రతిరూపాన్ని కొనుగోలు చేసి బహూకరించారు. అలాగే ఇద్దరు నేతలూ మసాలా చాయ్‌ని సేవించారు. ఆ తర్వాత ఇద్దరూ మళ్లీ వాహనం ఎక్కి సంగనేరి గేట్ వరకు రోడ్‌షో నిర్వహించారు. తర్వాత డిన్నర్, ద్వైపాక్షిక చర్చల కోసం రామ్‌బాఘ్ ప్యాలెస్‌కు బయలుదేరారు. మాక్రాన్ జైపూర్‌లోని అంబర్ ప్యాలెస్, జంతర్‌మంతర్ అబ్జర్వేటరీ, హవామహల్‌ను సందర్శించారు. అంతకు ముందు మధ్యాహ్నం మాక్రాన్‌తోపాటు ఫ్రెంచ్ ప్రతినిధుల బృందాన్ని విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్ జైశంకర్, రాజస్థాన్ గవర్నర్ కల్‌రాజ్ మిశ్రా, ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ.. జైపూర్ విమానాశ్రయంలో స్వాగతం పలికారు.



సదస్సులో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ హరగోపాల్

మనదేశంలోనూ మత రాజ్యాంగం

- కుంభమేళాలో సిద్ధమైంది: హరగోపాల్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 25: ఇస్లామిక్ దేశాల తరహాలో మన దేశంలోనూ మత విలువల ఆధారంగా ప్రత్యామ్నాయ రాజ్యాంగం రాబోతోందని పౌర హక్కుల నేత ఆచార్య జీ హరగోపాల్ పేర్కొన్నారు. రాజ్యాంగం - నైతికత అనే అంశంపై తిరుపతి పౌర చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఎస్వీయూ సెనేట్ హాల్లో గురువారం సదస్సు నిర్వహించారు. ప్రధాన వక్తగా హాజరైన హరగోపాల్ మాట్లాడుతూ... 'అలహాబాద్‌లో నిర్వహించిన కుంభమేళాలో మన దేశానికి కొత్త రాజ్యాంగం తయారు చేశారు. 2024 ఎన్నికల తరువాత దానికి మద్దతు లభిస్తే, కొత్త రాజ్యాంగం అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ఇస్లాంలో కానీ, క్రైస్తవంలో కానీ ఒకే దేవుడు, ఒకే తాత్విక చింతన. కనుక, ఇస్లామిక్ దేశాల్లో మత విలువల ప్రాతిపదికన రాజ్యాంగం అమలవుతూ ఉంది. హిందూ మతంలో ఆరు తాత్విక చింతనలు ఉన్నాయి. ఒక్కో ప్రాంతంలో ఒక్కో దేవుడు ఉన్నాడు. ఏ తాత్వికతను ఆధారం చేసుకొని మత రాజ్యాన్ని ఏర్పాటు చేయడం సాధ్యమవుతుంది? ప్రస్తుత రాజ్యాంగాన్ని వ్యతిరేకించేవారు, సమానత్వాన్ని అంగీకరించరు. ఈ రాజ్యాంగంలో పేర్కొన్నటువంటి సమాజం కంటే ఉన్నతమైన సమాజాన్ని నిర్మించుకోవలసిన సమయంలో, ఉన్న రాజ్యాంగాన్ని కాపాడుకోవలసిన దుస్థితి ఏర్పడింది' అని అన్నారు. ఎస్వీయూ వీసీ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ... మానవ విలువలు కాలానుగుణంగా మారుతుంటాయి. ప్రాంతంతో పాటు కాలం కూడా వాటిని నిర్దేశిస్తుంది' అని అన్నారు. పౌర చైతన్య వేదిక గౌరవాధ్యక్షుడు రాఘవశర్మ అధ్యక్షత వహించిన ఈ సదస్సులో అధ్యక్ష, కార్యదర్శులు వాకా ప్రసాద్, కుమార్‌రెడ్డి, కోశాధికారి హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాల్ని చట్టబద్ధం చేయడానికే చట్టాలు: దాడి

అమరావతి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): దొంగ చేతికి తాళాలు అప్పగించిన విధంగా ప్రజల భూ వివరాలు, రెవెన్యూ రికార్డులను వైసీపీ నేతలకు అప్పగించడానికే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్, సమగ్ర భూ సర్వేలను జగన్ సర్కార్ తీసుకొచ్చిందని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు ఆరోపించారు. గురువారం ఆయన ఓ ప్రకటన చేస్తూ.. వైసీపీ నేతల భూకబ్జాలను చట్టబద్ధం చేయడానికే ఈ చట్టాలు చేశారని ఆరోపించారు. ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా చేసే ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 27/2023ని, జీవో నంబరు 572ను రద్దు చేసే వరకు పోరాడతామన్నారు.

ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు బకాయిలు పెట్టడమేంటి?: అశోక్‌బాబు

అమరావతి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీ పరిధిని, చికిత్సల వ్యయాన్ని పెంచారని జగన్ గొప్పలు చెప్పడం తప్ప.. క్షేత్రస్థాయిలో పేదలకు సరైన వైద్య సేవలు అందడంలేదని టీడీపీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు విమర్శించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే చేసిన చికిత్సలకు నెట్ వర్క్ ఆసుపత్రులకు ప్రభుత్వం రూ.1,200 కోట్లు పైగా చెల్లించాల్సి ఉంది. ఆరోగ్యశ్రీ కింద సేవలందించే ఆసుపత్రులకు రూ.కోట్ల బకాయిలు పెట్టడమే జగన్‌రెడ్డి వైద్యరంగంలో సాధించిన ప్రగతి అని విమర్శించారు. మండిపడ్డారు.

వైద్యరంగంలో 'కృత్రిమ మేధ' అద్భుతాలు

గుంటూరు (మెడికల్), జనవరి 25: న్యూక్లియర్ మెడిసిన్‌లో కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతిక పరిజ్ఞానం అద్భుతాలు సృష్టిస్తోందని వైఎస్ఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కే బాబ్జీ తెలిపారు. మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాలులో ఇండియన్ రేడియోలాజికల్ అండ్ ఇమేజింగ్ అసోసియేషన్ (ఐఆర్ఐఏ) 76వ జాతీయ సదస్సును గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికతో వ్యాధి నిర్ధారణలో కచ్చితత్వం పెరిగిందని, దీంతో మానవ తప్పిదాలు కనిష్ఠ స్థాయికి తగ్గిపోతాయని తెలిపారు. ఐఆర్ఐఏ జాతీయ సదస్సులో 3,300 మంది రేడియాలజిస్టులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు. నాలుగు రోజులు పాటు జరిగే సదస్సులో 36 దేశాలకు చెందిన 330 మంది డాక్టర్లు వక్తలుగా (వీరిలో 67 మంది విదేశీ వైద్యులు) పాల్గొంటున్నారు. రేడియాలజీ రంగానికి విశేష సేవలందించిన నిమ్స్ మాజీ డైరెక్టర్, దివంగత డాక్టర్ కాకర్ల సుబ్బారావు శత జయంతిని పురస్కరించుకుని ఆయనకు నివాళిగా పోస్టర్ ప్రజెంటేషన్ విభాగానికి "డాక్టర్ కాకర్ల సుబ్బారావు సైంటిఫిక్ ఎరీనా"గా నామకరణం చేశారు. కేరళ వర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వైస్ చాన్స్‌లర్ మోహనన్ కున్నుమ్మాల్, ఎంసీ దాస్, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో 300 సెల్ టవర్లు..

- వర్చువల్‌గా ప్రారంభించిన ముఖ్యమంత్రి జగన్

అమరావతి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 300 సెల్ టవర్లను ముఖ్యమంత్రి జగన్ గురువారం తన క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. అల్లూరి జిల్లాలో 246, పార్వతీపురం మన్యం జిల్లాలో 44, ప్రకాశం జిల్లాలో 4, ఏలూరు జిల్లాలో 3, శ్రీకాకుళం జిల్లాలో 2, కాకినాడ జిల్లాలో 1 సెల్‌టవర్లు కొత్తగా ఏర్పాటు చేసినట్టు సీఎం తెలిపారు. వీటి ద్వారా మారుమూల గిరిజన ప్రాంతాల్లోని 944 ఆవాసాల్లో నివసిస్తున్న సుమారు 2 లక్షల మంది ప్రజలకు టెలికం సేవలు సమర్థంగా అందుబాటులో వస్తాయన్నారు. ఎయిర్‌టెల్ ఆధ్వర్యంలో 136, జియో ఆధ్వర్యంలో 164 టవర్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇదేవిధంగా ప్రతి మూడు నెలలకొకసారి 400 నుంచి 500 టవర్ల చొప్పున మరో ఏడాదిలో అన్ని టవర్లు పూర్తి చేస్తామన్నారు.

31న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం


అమరావతి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 31వ తేదీన వెలగపూడి సచివాలయంలో సీఎం జగన్ అధ్యక్షతన జరగనుంది. కేబినెట్‌లో చర్చించే అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో ఈ నెల 29వ తేదీలోగా అందజేయాలని శాఖాధిపతులను సీఎస్ ఆదేశించారు.

188 గ్రామాల్లో వాల్టా చట్టం అమలు

అమరావతి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 188 దుర్భిక్ష గ్రామాల్లో ఏపీ వాల్టా(నీరు, నేల, చెట్లు) చట్టం అమలును కొనసాగిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీచేసింది. భూగర్భ జలాలు ఎండిపోవడంతో రాష్ట్రంలోని 188 గ్రామాలను అత్యంత దుర్భిక్ష గ్రామాలుగా గుర్తించారు. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఈ గ్రామాల్లో బోర్ల తవ్వకం, మైనింగ్ కార్యకలాపాలు చేపట్టరాదని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. రాయలసీమతోపాటు ప్రకాశం, శ్రీకాకుళం జిల్లాల్లోని గ్రామాలు దుర్భిక్ష గ్రామాల జాబితాలో ఉన్నాయి.

'ఎన్నికల' బదిలీలు దాదాపు పూర్తి

- పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ శాఖల్లో ఒకట్రెండు రోజుల్లో ముగియాలి
- కలెక్టరేట్లు, రిటర్నింగ్ అధికారుల ఆఫీసులకు 982 పోస్టుల మంజూరు
- వాటిని త్వరగా భర్తీ చేసుకోవాలి
- కలెక్టర్లకు సీఎస్ ఆదేశం
- ఎన్నికల సన్నద్ధతపై సీఈవోతో కలిసి వీడియో కాన్ఫరెన్స్



అమరావతి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలతో సంబంధం ఉండి.. మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వివిధ శాఖల అధికారుల బదిలీల ప్రక్రియ దాదాపు పూర్తయిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. గురువారమిక్కడ అమరావతి సచివాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) ముఖేశ్‌కుమార్ మీనాతో కలిసి ఎన్నికల సన్నద్ధతపై ఆయన జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల పటిష్ఠ నిర్వహణకు జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయాలు (కలెక్టరేట్లు), అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలకు 982 పోస్టులను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ పోస్టులను త్వరగా భర్తీ చేసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. ఎన్నికలతో సంబంధం ఉండి మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న పంచాయతీరాజ్, ఎక్సైజ్ శాఖల్లో, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ)లో బదిలీల ప్రక్రియ పూర్తయిందన్నారు. పోలీసు, రెవెన్యూ శాఖల్లో కొంత మేరకు బదిలీలు జరిగాయని.. మిగతా బదిలీలు ఒకట్రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపల్ శాఖలో బదిలీలు కూడా రెండ్రోజుల్లో పూర్తి చేయాలన్నారు. 'ఎన్నికల్లో పటిష్ఠ నిఘా కోసం రాష్ట్రవ్యాప్తంగా 105 అంతరాష్ట్ర చెక్‌పోస్టులను ఏర్పాటు చేయగా.. వాటిలో 20 ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులు. పోలీసు శాఖ ద్వారా 62, ఎస్ఈబీ 9, అటవీశాఖ ద్వారా 14 చెక్ పోస్టులను ఏర్పాటు చేశాం. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, ఫర్నిచర్, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు, దివ్యాంగులకు ర్యాంపుల వంటి సౌకర్యాలను త్వరితగతిన ఏర్పాటు చేసేందుకు జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి' అని సీఎస్ స్పష్టం చేశారు. సీఈవో మీనా మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివిధ లాజిస్టిక్ ఏర్పాట్లకు ఇప్పటి నుంచే తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు స్పష్టం చేశారు. ఎన్నికల సన్నద్ధతకు సంబంధించిన ఇతర అంశాలను వివరించారు.

ఎన్నికలకు మేం సిద్ధం: మీనా

రానున్న ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల యంత్రాంగం సిద్ధంగా ఉందని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా చెప్పారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో మీనా మాట్లాడుతూ త్వరలో రాబోయే ఎన్నికల కోసం తనతోపాటు జిల్లా అధికారులు, క్షేత్రస్థాయిలో బీఎల్‌ఓల వరకు అంతా సంసిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఏడాది కాలంగా ఓటర్ల జాబితాల స్వచ్ఛీకరణ కోసం పనిచేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 5.3 లక్షల మంది యువ ఓటర్లను నమోదు చేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 4.08 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని ప్రస్తావిస్తూ.. ఇందులో మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారని తెలిపారు. ఓటరు నమోదు ప్రక్రియను నిరంతరాయంగా కొనసాగిస్తామని తెలిపారు.

ఓటు హక్కును నిర్లక్ష్యం చేయకండి: చంద్రబాబు

అమరావతి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): 'ప్రజాస్వామానికి మీ ఓటే పునాది. కాబట్టి ఓటు హక్కును నిర్లక్ష్యం చేయకండి' అని టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు సూచించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం ఎక్స్ వేదికగా ఆయన ఓటర్లందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ' రాష్ట్రంలో కొత్తగా ఓట్ల దొంగలు వచ్చారు. మీ ఓటు తీసేస్తారు. జాగ్రత్తగా ఉండండి. ఎప్పటికప్పుడు మీ ఓటు చెక్ చేసుకోండి. ఓటు లేని వారు వెంటనే ఓటు కోసం దరఖాస్తు చేసుకోండి' అని చంద్రబాబు సూచించారు.



కిందపడ్డ మంత్రి నాగార్జునను పైకి లేపుతున్న దృశ్యం

కబడ్డీ ఆడుతూ కిందపడ్డ మేరుగ

- కుడిచేతి రెండు వేళ్లు విరగడంతో ప్రైవేటు ఆస్పత్రికి

చీమకుర్తి, జనవరి 25: వైసీపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంలో అపశ్రుతి చోటుచేసుకుంది. ప్రకాశం జిల్లా చీమకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పోటీల ఫైనల్ సందర్భంగా క్రీడాకారులతో సరదాగా కబడ్డీ ఆడుతూ మంత్రి మేరుగ నాగార్జున కిందపడ్డారు. దీంతో ఆయన చేతివేళ్లకు గాయాలయ్యాయి. కుడిచేతి రెండు వేళ్లకు గాయమైంది. వెంటనే తేరుకున్న బాడీగార్డులు, క్రీడాకారులు ఆయనను పైకి లేపారు. సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షలు నిర్వహించిన వైద్యులు రెండు వేళ్లకు ఫ్రాక్చర్ అయినట్లు గుర్తించి చికిత్స అందించారు. అనంతరం నాగార్జున విశ్రాంతి నిమిత్తం ఒంగోలుకు తరలివెళ్లారు.

పని మనిషిపై ఎమ్మెల్యే ముస్తఫా కుటుంబం దాడి

- తన ఇంట్లో పనిచేస్తూ టీడీపీ తరఫున ఉంటారా? అని ఆగ్రహం
- రాజీ చేస్తున్న పోలీసు ఉన్నతాధికారులు



మీడియాకు గోడు వెళ్లబోసుకుంటున్న బాధిత మహిళ

పెదకాకాని, జనవరి 25: తమ పని మనిషి కుమారుడి ఫొటో టీడీపీ ఫ్లెక్సీలో ఉండటం చూసి గుంటూరు తూర్పు వైసీపీ ఎమ్మెల్యే ముస్తఫా కుటుంబం జీర్ణించుకోలేకపోయింది. ఆమెపై దొంగతనం నేరం ఆరోపించి, పోలీసులతో కొట్టించింది. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుంటూరు మంగళదాస్‌నగర్‌లో ఎమ్మెల్యే ముస్తఫా కుటుంబం నివాసం ఉంటోంది. షేక్ ఆషా అనే మహిళ పదిహేనేళ్లుగా వారింట్లో పని చేస్తోంది. ఆమె కుమారుడు షేక్ మసూద్ టీడీపీ అభిమాని. ఈ క్రమంలో మంగళదాస్‌నగర్‌లో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ ఫ్లెక్సీల్లో ఆషా కుమారుడు మసూద్ ఫొటో ఉంది. ఈ విషయం తెలిసి ఎమ్మెల్యే ముస్తఫా కుమార్తె ఫాతిమా, ఆషాపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ఇంట్లో పని చేస్తూ టీడీపీ తరఫున ఉండటం ఏమిటని ప్రశ్నించారు. అంతేగాకుండా తమ ఇంట్లో దొంగతనం చేసినట్లుగా ఆషాపై ఫిర్యాదు చేసి, పోలీసులను పిలిపించి కొట్టించారు. ఈ సంఘటనపై ఆషా కుమారుడితో కలిసి గురువారం పెదకాకాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న ఓ పోలీసు ఉన్నతాధికారి బాధితులను గుంటూరు రప్పించారు. 'ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూసుకుంటా. ఫిర్యాదు వెనక్కి తీసుకోండి. డీఎస్పీ చేత విచారించి న్యాయం చేస్తా' అని ఉన్నతాధికారి హామీ ఇచ్చి బాధితులను ఇంటికి పంపించినట్లు తెలిసింది.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● శుక్రవారం 26 జనవరి 2024

ఓయూలో సెకండ్ ఫేజ్ అడ్మిషన్స్



ఐఐఎఫ్‌టీలో ఆన్‌లైన్ ప్రోగ్రామ్

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- 'ఎక్స్‌పరిమెంటల్ ప్రోగ్రామ్ ఆన్ ఎక్స్‌పోర్ట్ అండ్ ఇంపోర్ట్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది మూడు వారాల వ్యవధి గల ఆన్‌లైన్ ప్రోగ్రామ్. ఇందులో ఆరు ఎక్స్‌పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్లేస్‌ల విజిట్ కూడా ఉంటుంది. ఈ ప్రోగ్రామ్‌లో మూడు ఫేజ్‌లు ఉంటాయి. మొదటి మూడు వారాలను మొదటి ఫేజ్‌గా; నాలుగు, అయిదు వారాలను రెండో ఫేజ్‌గా; చివరి రెండు వారాలను మూడో ఫేజ్‌గా పరిగణిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా వారాంతాల్లో లైవ్ ఆన్‌లైన్ ఇంటరాక్టివ్ సెషన్స్, కేస్ స్టడీ అనాలిసిస్, అసెస్‌మెంట్‌లు ఉంటాయి. మిడిల్/సీనియర్ లెవెల్ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌లు, ఆంత్రప్రెన్యూర్స్, ఎక్స్‌పోర్ట్ సర్వీసెస్ ప్రొఫెషనల్స్ దరఖాస్తు చేసుకోవచ్చు. నిబంధనల ప్రకారం రిపోర్ట్‌లు సబ్మిట్ చేసినవారికి సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు.



ప్రోగ్రామ్‌లోని అంశాలు

- **మొదటి ఫేజ్:** ఇంట్రడక్షన్ & కీ ఎలిమెంట్స్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్, ఫారిన్ ట్రేడ్-పాలసీ & ప్రొసీజర్స్, కస్టమ్స్ ప్రొసీజర్స్
- **రెండో ఫేజ్:** విజిటింగ్ ఆఫ్ 6 పోర్ట్స్
- **మూడో ఫేజ్:** రిపోర్ట్ ప్రజంటేషన్

విజిటింగ్ పోర్ట్స్: స్పెషల్ ఎకనామిక్ జోన్, ఇన్‌లాండ్ కంటైనర్ డిపోట్స్, కంటైనర్ ఫ్రైట్ స్టేషన్స్, సీ పోర్ట్‌లు, ఎయిర్ పోర్ట్‌లు, ల్యాండ్ పోర్ట్‌లు(కస్టమ్స్ స్టేషన్స్), ఫ్రీ ట్రేడ్ వేర్‌హౌసింగ్ జోన్, ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్, ఎక్స్‌పోర్ట్ ఇన్‌స్పెక్షన్ కౌన్సిల్, ఫ్రైట్ ఫార్వర్డ్స్, ఇండస్ట్రియల్ కారిడార్స్, ఎక్స్‌పోర్ట్ క్లస్టర్స్, డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ టర్మినల్స్, మల్టీ మోడల్ పార్క్స్, గతి శక్తి కార్గో టర్మినల్స్

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.20,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 14
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఫిబ్రవరి 17 నుంచి
- **వెబ్‌సైట్:** iift.ac.in

ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ప్రొఫెసర్ జీ రామిరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్(పీజీఆర్ఆర్‌సీడీఈ)- డిగ్రీ, పీజీ, అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా, అడ్వాన్స్‌డ్ డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికిగాను 2023-24 సెకండ్ ఫేజ్ (2024 ఫిబ్రవరి అకడమిక్ సెషన్) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ప్రోగ్రామ్‌లను ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్ (ఓడీఎల్) విధానంలో నిర్వహిస్తారు. ఇవి రెగ్యులర్ డిగ్రీకి సమానం.

డిగ్రీ: బీఏ, బీఏ(మేథమెటిక్స్&స్టాటిస్టిక్స్), బీకాం(జనరల్), బీబీఏ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

పీజీ

- **ఎంబీఏ, ఎంసీఏ:** ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. వీటిని ఇంగ్లీష్ మాధ్యమంలో చదవాలి. కనీసం 50 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. ఎంసీఏ ప్రోగ్రామ్‌నకు మాత్రం ఇంటర్/డిగ్రీ స్థాయిలో మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. టీఎస్ ఐసెట్ 2023/ఏపీ ఐసెట్ 2023 అర్హత ఉండాలి. లేదంటే 2024 ఫిబ్రవరిలో ఓయూ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది.
- **ఎంఏ:** ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. తెలుగు, సంస్కృతం, ఇంగ్లీష్, ఫిలాసఫీ, సోషియాలజీ, పబ్లిక్ పర్సనల్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, సైకాలజీ స్పెషలైజేషన్‌లకు ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. హిందీ, ఉర్దూ స్పెషలైజేషన్‌లకు ఆ మాధ్యమాల్లో పదోతరగతి వరకు చదివి ఉండాలి. లేదంటే డిగ్రీ స్థాయిలో ఆ లాంగ్వేజ్‌ను ప్రధాన సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి.
- ఎంకాం ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఆంగ్ల మాధ్యమంలో చదవాలి. డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.
- **ఎమ్మెస్సీ:** ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ఆంగ్ల మాధ్యమంలో చదవాలి. మేథమెటిక్స్, స్టాటిస్టిక్స్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. డిగ్రీ(మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్)/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు అర్హులు.

అడ్వాన్స్‌డ్ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. మేథమెటిక్స్, ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్, బయోఇన్ఫర్మాటిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, డేటా సైన్స్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఆంగ్ల మాధ్యమంలో చదవాలి. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు. బయోఇన్ఫర్మాటిక్స్‌కు మాత్రం కనీసం 50 శాతం మార్కులతో బీఎస్సీ/ బీఎస్సీ అగ్రికల్చర్/ బీఫార్మసీ/ బీవీఎస్సీ/ ఎమ్మెస్సీ/ ఎంబీబీఎస్/ బీడీఎస్/ బీఏఎంఎస్/ బీయూఎంఎస్/ బీహెచ్ఎంఎస్/బీఈ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవాలి.

అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా: ఇందులో ప్రధాన స్పెషలైజేషన్ వేదిక్ ఆస్ట్రాలజీ. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. తెలుగు మాధ్యమంలో చదవాలి. వేదిక్ ఆస్ట్రాలజీ విభాగంలో డిప్లొమా/అడ్వాన్స్‌డ్ డిప్లొమా/పీజీ డిప్లొమా ఉత్తీర్ణులు అర్హులు.

డిప్లొమా: ప్రోగ్రామ్ స్పెషలైజేషన్ వేదిక్ ఆస్ట్రాలజీ. ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. తెలుగు మాధ్యమంలో చదవాలి. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు.

సర్టిఫికెట్ కోర్సు: స్పెషలైజేషన్ యోగ. ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. ఆంగ్ల మాధ్యమంలో చదవాలి. పదోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అర్హులు.

- **అడ్మిషన్స్‌కు చివరి తేదీ:** మార్చి 31
- **వెబ్‌సైట్:** osmania.ac.in




టక్కరి దొంగ.. నక్క!



అనగనగా ఓ జిత్తులమారి నక్క. టక్కరి దొంగ. దాని చేష్టలు మిగతా నక్కలకంటే విచిత్రం ఉండటంతో మిగతా నక్కలన్నీ కలసి తరిమేశాయి. అది తలదాచుకోవటానికి స్థలం వెతుక్కుంటూ ఓ వెర్రి వెంగళప్ప ఇంటికి వెళ్లింది. నక్క వాలకం, నటన చూసి దానితో స్నేహం చేశాడు వెంగళప్ప. ఇద్దరూ మంచి మిత్రులయ్యారు. ఎంతో గొప్ప స్నేహితుడు దొరికాడని వెంగళప్ప ఊహించుకున్నాడు. ఎంతో మంచి బకరా దొరికాడనుకుంది నక్క.

మరుసటి రోజు ఉదయాన్నే నక్క వచ్చి తన స్నేహితుడితో ఇలా అన్నది. నీ వృత్తి గడ్డం తీయటం, జుట్టు కత్తిరించటం. ఇంకో పని చేసుకోకపోతే ఎలా? అన్నది. నాకేం తెలుసన్నాడు వెంగళప్ప. దోసకాయ, టమోటా, ద్రాక్ష, గుమ్మడికాయ.. ఇలా పండించు. నీకు ఆహారానికి ఉంటాయి. అమ్మవచ్చు కూడా అన్నది. మరి పండ్లను రక్షించుకోవటం కష్టమే అన్నాడు. 'నాలాంటి సావాసం దొరకటమే నీ అదృష్టం' అన్నది. దీంతో వెంగళప్ప ఆలోచించకుండా తన భార్యను తీసుకుని పోయి.. ఇన్ని బీర, దోసకాయల విత్తనాలు చల్లాడు. అరటి, ద్రాక్ష చెట్లు నాటాడు. టమోటాలు, గుమ్మడికాయ పంట వేశాడు. నక్క కాపలా ఉంది. అయితే ఎప్పటికప్పుడు పిందెలను తినేది. పైగా ఏవీ రాకుండా కర్రపెత్తనం చేసేది.



ద్రాక్ష కాయటం మొదలెట్టాక రాత్రికి రాత్రి పాడుచేసేది. తన ఇతర నక్కలను విందుకు పిలిచి పండగ చేసుకునేది. ఇవన్నీ వెంగళప్పకు తెలీదు. 'స్నేహితుడా.. ద్రాక్షలే కనపడలేదు' అనేవాడు వెంగళప్ప. ఇప్పుడు వానాకాలం రాలిపోయాయి అనేది. ఆ తర్వాత చలికాలం అయితే కాయలు ఉంటాయనేది. తీరా చలికాలం వచ్చాక ఎండాకాలంలో కాయలు కాస్తాయి అనేది నక్క. నాలుగైదు ద్రాక్ష చెట్లను మాత్రం అలానే వదిలేసింది ఏమీ చేయకుండా. ఒక రోజు మళ్లీ తనతో కొట్లాడిన నక్కల గుంపును పిలిచి తన గొప్పతనం చూపించింది. ద్రాక్షనంతా ఇష్టం వచ్చినట్టు కొరికేశాయి. బైటపడేసాయి. ఆ మరుసటి ఉదయాన వెంగళప్ప తోటకెళ్లాడు. నక్క మోసం అర్థమైంది. పంటను చూసి కన్నీళ్లు కార్చాడు.

దొంగ స్నేహితుడికి బుద్ధి చెప్పాలనుకున్నాడు. పక్క ఊరిలో జుట్టు కత్తిరించటానికి వెళ్లే వెంగళప్పకు ఓ ఆలోచన వచ్చింది. తోటంతా తేరిపార చూశాడు. అక్కడ ఓ గుమ్మడికాయ కనపడింది. ఆకుల మధ్య ఆ గుమ్మడికాయ ఉన్నది. దాని పక్కన తన చేతుల్లోని కత్తులను నాటాడు. రాత్రికి నక్కబావ వచ్చింది. తోటంతా కలియదిరిగింది. గుమ్మడికాయ కనపడ్డది. ఆశతో ఎగిరి దూకింది. కత్తులు గుచ్చుకున్నాయి. ఒకటే రక్తం. తన స్నేహితుడిని విపరీతంగా తిట్టింది. శాపనార్థాలు పెట్టింది. వీడు వెర్రి వెంగళప్ప కాదని గట్టిగా అరిచింది. తోటలోనే ప్రాణం విడిచింది ఆ టక్కరి దొంగ.



జేఎన్‌టీయూహెచ్‌లో పీహెచ్‌డీ


హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూహెచ్)- పీహెచ్‌డీ రీసెర్చ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఫుల్ టైం, పార్ట్ టైం(ఎక్స్‌టర్నల్/ఇండస్ట్రియల్ ఎగ్జిక్యూటివ్స్) కేటగిరీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. యూజీసీ, సీఎస్ఐఆర్, డీఎస్‌టీ ఇన్‌స్పైర్, ఇతర ప్రభుత్వ సంస్థల నుంచి జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ అర్హత పొందినవారు; నెట్/జీప్యాట్/గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు ఫుల్ టైం ప్రోగ్రామ్‌నకు అప్లయ్ చేసుకోవచ్చు. ఇంటర్వ్యూ, రీసెర్చ్ పబ్లికేషన్స్ వెయిటేజీ, ప్రపోజ్డ్ రీసెర్చ్ వర్క్ ప్రజంటేషన్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. జేఆర్ఎఫ్ అర్హత/జాతీయ పరీక్ష స్కోర్ లేనప్పటికీ యూనివర్సిటీ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్ రాసి ఎక్స్‌టర్నల్ ప్రోగ్రామ్‌లో చేరవచ్చు.

విభాగాలు-స్పెషలైజేషన్‌లు

- **ఇంజనీరింగ్:** సివిల్, మెకానికల్, మెటలర్జికల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్
- **సైన్స్ అండ్ టెక్నాలజీ:** బయోటెక్నాలజీ, కెమికల్ సైన్సెస్-కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, నానో సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్ సైన్సెస్, వాటర్ రిసోర్సెస్ & ఎర్త్ అండ్ అట్మాస్ఫిరిక్ సైన్సెస్
- **మేనేజ్‌మెంట్ సైన్స్:** మేనేజ్‌మెంట్
- ఇండస్ట్రియల్ ఎగ్జిక్యూటివ్స్ కేటగిరీలో మేథమెటిక్స్, ఫిజిక్స్, ఫైనాన్స్ స్పెషలైజేషన్‌లు కూడా ఉన్నాయి.

అర్హత వివరాలు: ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌లకు సంబంధిత బ్రాంచ్‌లో బీఈ/బీటెక్/ఏఎంఐఈతో పాటు ఎంఈ/ఎంటెక్/ఎంఎస్ పూర్తిచేసి ఉండాలి. సైన్స్ అండ్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌లకు సంబంధిత సబ్జెక్టులతో ఎమ్మెస్సీ/ఎంటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. ఫార్మాస్యూటికల్ సైన్సెస్ స్పెషలైజేషన్‌కు బీఫార్మసీతోపాటు ఎంఫార్మసీ/ఫార్మాడీ పూర్తి చేసి ఉండాలి. మేనేజ్‌మెంట్ విభాగానికి ఎంబీఏ ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులందరికీ పీజీ స్థాయిలో కనీసం 55 శాతం మార్కులు తప్పనిసరి. దివ్యాంగులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం మార్కులు చాలు. ఇండస్ట్రియల్ ఎగ్జిక్యూటివ్స్ ప్రోగ్రామ్‌లో చేరాలంటే కనీసం అయిదేళ్ల రీసెర్చ్ అనుభవం ఉండాలి. ఎక్స్‌టర్నల్ ప్రోగ్రామ్‌లో చేరాలంటే అభ్యర్థులు రీసెర్చ్ ఆర్గనైజేషన్స్/ఆర్&డీ యూనిట్స్/ఇండస్ట్రీస్/అకడమిక్ ఇన్‌స్టిట్యూషన్స్/ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తూ ఉండాలి.


ఎక్స్‌టర్నల్ ప్రోగ్రామ్ ఎంట్రెన్స్ టెస్ట్: ఇందులో సంబంధిత సబ్జెక్ట్ నుంచి 100 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను బ్లూ/బ్లాక్ బాల్‌పాయింట్ పెన్‌తో ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులకు 50 శాతం; బీసీ అభ్యర్థులకు 45 శాతం; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు రావాలి. స్పెషలైజేషన్‌ల వారీ నిర్దేశించిన పరీక్ష సిలబస్‌ను వెబ్‌సైట్‌లో చూడవచ్చు.



ముఖ్య సమాచారం

- **అడ్మిషన్ ఫీజు:** ఫుల్ టైం, ఎక్స్‌టర్నల్ ప్రోగ్రామ్‌లకు రూ.1500; ఇండస్ట్రియల్ ఎగ్జిక్యూటివ్స్ ప్రోగ్రామ్‌నకు రూ.5000
- **యాన్యువల్ ట్యూషన్ ఫీజు:** ఫుల్ టైం ప్రోగ్రామ్‌నకు రూ.20,000; ఎక్స్‌టర్నల్ ప్రోగ్రామ్‌నకు రూ.30,000; ఇండస్ట్రియల్ ఎగ్జిక్యూటివ్స్ ప్రోగ్రామ్‌నకు రూ.60,000
- **దరఖాస్తు ఫీజు:** ఫుల్ టైం ప్రోగ్రామ్‌నకు రూ.1500; ఎక్స్‌టర్నల్ ప్రోగ్రామ్‌నకు రూ.1000; ఇండస్ట్రియల్ ఎగ్జిక్యూటివ్స్ ప్రోగ్రామ్‌నకు రూ.5000
- **రిజిస్టర్డ్ పోస్ట్/కొరియర్ ద్వారా దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 24
- **చిరునామా:** డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, జేఎన్‌టీయూహెచ్, కూకట్‌పల్లి, హైదరాబాద్-500085
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

7 తేడాలను గుర్తించండి



ఎన్ఆర్ఎస్‌సీలో సైంటిస్టులు

నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్(ఎన్ఆర్ఎస్‌సీ)... కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 41

1. సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సీ'(అగ్రికల్చర్): **2 పోస్టులు**
2. సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సీ'(ఫారెస్ట్రీ ఎకానమీ): **4 పోస్టులు**
3. సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సీ'(జియో ఇన్ఫర్మాటిక్): **7 పోస్టులు**
4. సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సీ'(జియాలజీ): **4 పోస్టులు**
5. సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సీ'(జియో ఫిజిక్స్): **4 పోస్టులు**
6. సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సీ'(సాయిల్ సైన్స్): **4 పోస్టులు**
7. సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సీ'(అర్బన్ స్టడీస్): **3 పోస్టులు**
8. సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సీ'(వాటర్ రిసోర్సెస్): **7 పోస్టులు**
9. మెడికల్ ఆఫీసర్ 'ఎస్‌సీ': **1 పోస్టు**
10. నర్స్ 'బి': **2 పోస్టులు**



అర్హత: పోస్టును అనుసరించి ఎస్ఎస్ఎల్‌సీ/ఎస్ఎస్‌సీ, డిప్లొమా, బీఎస్సీ, బీఈ, బీటెక్, ఎమ్మెస్సీ, ఎంటెక్, ఎంఈ ఉత్తీర్ణులై ఉండాలి.
జీతం: సైంటిస్ట్/ఇంజనీర్ 'ఎస్‌సీ'; మెడికల్ ఆఫీసర్ 'ఎస్‌సీ' పోస్టుకు నెలకు రూ.81,906. నర్స్ 'బి', లైబ్రరీ అసిస్టెంట్ 'ఏ' పోస్టుకు రూ.65,554
వయోపరిమితి: 18-35 ఏళ్లు మించరాదు
దరఖాస్తు ఫీజు: రూ.750
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా
దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 12
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
వెబ్‌సైట్: https://www.nrsc.gov.in/

జాబ్ కార్నర్

రైట్స్‌లో అసిస్టెంట్ మేనేజర్లు

రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్(రైట్స్)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి విడివిడిగా నోటిఫికేషన్లు విడుదల చేసింది.

ఫైనాన్స్ విభాగంలో ఖాళీలు: 16

పోస్టు: అసిస్టెంట్ మేనేజర్(ఫైనాన్స్)
అర్హత: చార్టర్డ్ అకౌంటెంట్/కాస్ట్ అకౌంటెంట్ ఉత్తీర్ణతతో పాటు రెండేళ్ల పని అనుభవం ఉండాలి.
జీతం: నెలకు రూ.40,000 - రూ.1,40,000
వయోపరిమితి: 32 ఏళ్లు మించరాదు
దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.300, ఇతరులకు రూ.600.
ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
ఆన్‌లైన్ ఫీజుకు చివరి తేదీ: జనవరి 29
రాత పరీక్ష తేదీ: ఫిబ్రవరి 4

ఇతర విభాగాల్లో ఖాళీలు: 12

1. అసిస్టెంట్ మేనేజర్(జియో టెక్నికల్): **1 పోస్టు**
2. అసిస్టెంట్ మేనేజర్(స్ట్రక్చరల్ ఇంజనీరింగ్): **4 పోస్టులు**
3. అసిస్టెంట్ మేనేజర్(అర్బన్ ఇంజనీరింగ్): **3 పోస్టులు**
4. అసిస్టెంట్ మేనేజర్(ఎలక్ట్రికల్):**1 పోస్టు**
5. అసిస్టెంట్ మేనేజర్(ఎస్ అండ్ టీ): **1 పోస్టు**
6. అసిస్టెంట్ మేనేజర్(ఎకనామిక్ అండ్ స్టాటిస్టిక్స్): **1 పోస్టు**
7. అసిస్టెంట్ మేనేజర్(సివిల్): **1 పోస్టు**

అర్హత: పోస్టును అనుసరించి డిగ్రీలో సివిల్, ఎన్విరాన్‌మెంటల్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎకనామిక్స్, బిజినెస్ ఎకనామిక్స్, పీజీలో జియో-టెక్నికల్, స్ట్రక్చరల్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, ఎంబీఏ(ఫైనాన్స్)తో పాటు రెండేళ్ల పని అనుభవం ఉండాలి.
జీతం: నెలకు రూ.40,000 - రూ.1,40,000
వయోపరిమితి: 32 ఏళ్లు మించరాదు
దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.300. ఇతరులకు రూ.600.
ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా
ఆన్‌లైన్ ఫీజు చివరి తేదీ: జనవరి 27
రాత పరీక్ష తేదీ: ఫిబ్రవరి 4
పరీక్ష కేంద్రం: ఢిల్లీ - ఎన్‌సీఆర్
వెబ్‌సైట్: https://rites.com/

హిందుస్థాన్ కాపర్‌లో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రెయినీలు

కోల్‌కతాలోని హిందుస్థాన్ కాపర్ లిమిటెడ్... వివిధ విభాగాల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 40

విభాగాలు: మైనింగ్, జియాలజీ, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్, మెకానికల్, సిస్టమ్.
అర్హత: 60 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి. గేట్-2021/2022/2023 స్కోర్ కలిగి ఉండాలి.
వయోపరిమితి: 2024 జనవరి 1 నాటికి 28 సంవత్సరాలు మించకూడదు
ఎంపిక ప్రక్రియ: గేట్ స్కోరు, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా
దరఖాస్తు రుసుము: రూ.500
ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: జనవరి 29
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 19
వెబ్‌సైట్: www.hindustancopper.com/

ఎన్‌సీఈఆర్‌టీలో పోస్టులు

న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెయినింగ్(ఎన్‌సీఈఆర్‌టీ)... కాంట్రాక్ట్ ప్రాతిపదికన కింద పేర్కొన్న వివిధ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

1. **అసిస్టెంట్ ఎడిటర్: 60 పోస్టులు**
2. **ప్రూఫ్ రీడర్: 60 పోస్టులు**
3. **డీటీపీ ఆపరేటర్: 50 పోస్టులు**

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా, డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సు ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
వయోపరిమితి: అసిస్టెంట్ ఎడిటర్‌కు 50 ఏళ్లు; ప్రూఫ్ రీడర్‌కు 42 ఏళ్లు; డీటీపీ ఆపరేటర్‌కు 45 ఏళ్లు మించకూడదు.
వేతనం: నెలకు అసిస్టెంట్ ఎడిటర్‌కు రూ.80,000; ప్రూఫ్ రీడర్‌కు రూ.37,000; డీటీపీ ఆపరేటర్‌కు రూ.50,000.
ఇంటర్వ్యూ తేదీలు: 2024 ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు
వేదిక: పబ్లికేషన్ డివిజన్, ఎన్‌సీఈఆర్‌టీ, శ్రీ అరబిందో మార్గ్, న్యూఢిల్లీ.
వెబ్‌సైట్: https://ncert.nic.in/

డైలీ సుడోకు - 213

	7	1		4		3		
2		3	5				1	9
					3		2	
				7	2	9		
		6	8	5				
	1		4					
3	9				8	5		4
		5		2		1	6	

సుడోకు - 212 సమాధానం

2	5	4	1	8	6	7	3	9
8	3	1	9	7	2	6	4	5
9	6	7	3	4	5	1	8	2
5	2	8	6	3	7	4	9	1
3	4	6	8	9	1	5	2	7
7	1	9	5	2	4	8	6	3
1	7	3	4	6	9	2	5	8
6	8	2	7	5	3	9	1	4
4	9	5	2	1	8	3	7	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.